


'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 93

సోమవారం 24-6-2024



ఎన్‌హెచ్ 65.. యమ డేంజర్

రాష్ట్రంలోనే అత్యంత కీలక రహదారుల్లో ఒకటైన జాతీయ రహదారి (ఎన్‌హెచ్) నం. 65 డేంజర్ మార్గంగా మారిపోయింది. రహదారి పక్కన, సర్వీస్ రోడ్లలో కొందరు విశ్రాంతి తీసుకుంటుంటారు. ఇలాంటి వారితో పాటు లారీ డ్రైవర్లకు ఎర వేసి దోచుకునే ముఠాలతో ఈ రహదారి యమడేంజర్‌గా మారిపోయింది.

7లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 93

సోమవారం 24-6-2024



అఫ్గానిస్తాన్ అద్భుతం | సెమీస్‌లో ఇంగ్లండ్ -16లో



గ్రాట్యుటీ.. ఉద్యోగి సేవలకు గుర్తింపు! ఎంతో్స్తుందన్న దానిపై అవగాహన అవసరం -17లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ఎకరం రూ.4 లక్షలు!

రాష్ట్రంలోని వ్యవసాయ భూముల కనీస రిజిస్ట్రేషన్ విలువ ఇదే

- ఏజెన్సీలు మినహా మిగతా ప్రాంతాల్లో దాదాపుగా ఇదే విలువ నిర్ధారణ!
- హైవేల పక్కన ఉంటే రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పెంపు
- వెంచర్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న భూమి విలువ రూ.కోటి వరకు సవరణ
- నివాస స్థలాల కనీస విలువ ప్రతి చదరపు గజానికి రూ.1,000.. అపార్ట్‌మెంట్ల కంపోజిట్ విలువ చదరపు అడుగుకు రూ.1,500
- మార్కెట్, ప్రభుత్వ విలువల మధ్య బాగా వ్యత్యాసం ఉన్న చోట భారీగా విలువల పెంపు
- నేటి సాయంత్రానికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు క్షేత్రస్థాయి కమిటీల ప్రతిపాదనలు
- 29వ తేదీ నాటికి తుది విలువలు నిర్ధారణ
- ఆగస్టు 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమలు!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువల సవరణ కసరత్తు కొలిక్కి వస్తోంది. ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియలో భాగంగా వ్యవసాయ భూముల కనీస విలువపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఓ అభిప్రాయానికి వచ్చింది. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. రాష్ట్రంలోని ప్రతి ఎకరా వ్యవసాయ భూమి కనీస విలువను రూ.4 లక్షలుగా నిర్ధారించాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. వాస్తవానికి ఈ విలువను రూ.4–5 లక్షలుగా నిర్ణయించాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మౌఖికంగా సూచించింది. అయితే ఏజెన్సీ ఏరియాల్లో ఈ విలువలు సరిపోయే అవకాశం లేనందున భద్రాచలం, ములుగు, ఆసిఫాబాద్ లాంటి ఏజెన్సీ ప్రాంతాలు మినహా రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ భూమి కనీస రిజిస్ట్రేషన్

మిగతా 14వ పేజీలో ▶

న్యూస్‌రీల్

నీట్ అక్రమాలపై సీబీఐ కేసు



నీట్–యూజీ అక్రమాల విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) రంగంలోకి దిగింది. ఈ కేసులో మొదటి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సీబీఐ అధికారులు ఆదివారం వెల్లడించారు. కేంద్ర విద్యాశాఖ సూచన మేరకు గుర్తుతెలియని వ్యక్తులను నిందితులుగా చేర్చామని చెప్పారు.

- వివరాలు 6లో ▶

నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు



పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. 18వ లోక్‌సభకు ఎన్నికైన సభ్యులు సోమవారం, మంగళవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎంపీలతో ప్రొటెం స్పీకర్‌గా నియమితులైన భర్తృహరి మెహతాబ్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఈ మేరకు లోక్‌సభ సచివాలయం ఆదివారం బులెటిన్ విడుదల చేసింది.

- వివరాలు 6లో ▶

నేడు ఢిల్లీకి సీఎం



- ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకానున్న రేవంత్‌రెడ్డి
- పార్టీ పెద్దలను కూడా కలిసే అవకాశం.. నామినేటెడ్ పోస్టులు, కేబినెట్ విస్తరణపై చర్చ?

- 2లో

అమెరికాలో కాల్పులు.. బాపట్ల యువకుడి మృతి

- డాలస్‌లోని సూపర్ మార్కెట్‌లో ఘటన.. చికిత్స పొందుతూ గోపీకృష్ణ మృతి
- ఏపీలోని బాపట్ల జిల్లా యాజలిలో విషాదఛాయలు

- 14లో ▶

పచ్చ సౌధాలు

వాగు పోరంబోకును ఆక్రమించి మంగళగిరిలో 'ఎన్టీఆర్ భవన్'

నాలుగంతస్తులకే అనుమతి.. 8 అంతస్తులతో విలాస భవనం

- ప్రస్తుతం టీడీపీ ప్రధాన కార్యాలయం అదే..ఇప్పటికీ దీనిపై కోర్టులో విచారణ
- రాష్ట్రవ్యాప్తంగా రాజకోటల్లా టీడీపీ ఆఫీసులు.. జీవోలన్నీ బాబు హయాంలోనే
- ఏకంగా ఉండవల్లిలోని అక్రమ కట్టడంలో చంద్రబాబు నివాసం
- కృష్ణా ఒడ్డున నదీ పరిరక్షణ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం
- విజయవాడ ఆటోనగర్‌లో ఇరిగేషన్ స్థలాన్ని లాక్కుని టీడీపీ ఆఫీసు
- విశాఖలో దసపల్లా కొండను తొలిచి కార్యాలయాన్ని కట్టేసిన టీడీపీ
- తన నిర్వాకాలను కప్పిపుచ్చి వైఎస్సార్‌సీపీ కార్యాలయాలపై తప్పుడు ప్రచారాలు

14లో

కాంగ్రెస్‌లోకి మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు కండువా కప్పిన సీఎం రేవంత్

14లో

గోశాలలో గోవుల గోస



ఎండ, వానలోనూ ఆరుబయటే రాజన్న దేవాలయ కోడెలు

- బురదలోనే తిరుగుతూ రోగాలబారిన పడుతున్న గోవులు
- ఆదాయం ఉన్నా వసతులు శూన్యం
- పట్టించుకోని వేములవాడ ఆలయ అధికారులు

వేములవాడ అర్బన్: వేములవాడ రాజన్న గోశాలలో వసతులు కరువయ్యాయి. భక్తుల విశ్వాసంగా నిలిచే కోడెమొక్కుల కోడెలకు కనీస సౌకర్యాలు లేవు. వానకు తడుస్తూ.. ఎండకు ఇబ్బందిపడుతూ ఆరుబయటే ఉంటున్నాయి. చిన్నపాటి వర్షానికే బురదమయమవుతున్న నేలపైనే పడుకుంటున్నాయి. కనీస వసతులు లేక భక్తులు అందించే కోడెలు గోశాలలో ఇబ్బంది పడుతున్నాయి. కనీసం గోవులు నిల్చోలేని పరిస్థితులు అక్కడ ఉన్నాయి. కోడెమొక్కుల ద్వారా అత్యధిక ఆదాయం వస్తున్నా గోశాలలో మాత్రం వసతుల కల్పనపై ఆలయ అధికారులు దృష్టి పెట్టడం లేదు.

రూ.కోట్లు వస్తున్నా..

వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు కోడెమొక్కులు చెల్లిస్తుంటారు. కోడె మొక్కు టికెట్ ధర రూ.200 ఉంది. అలాగే కోడెమొక్కుల ద్వారా స్వామికి వచ్చే ఆదాయం ఏడాదికి దాదాపు రూ.22 కోట్ల వరకు ఉంటుంది. ఇంత ఆదాయం వస్తున్నా గోశాలలో మాత్రం సౌకర్యాలు లేవు. గోశాలల్లోని కోడెల సంరక్షణకు ఏటా రూ.2 కోట్ల వరకు వెచ్చిస్తున్నా, ఈ నిధులతో ఎలాంటి సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు.

వసతికి మించిన కోడెలు..

రాజన్న ఆలయానికి రెండు గోశాలలు ఉన్నాయి. గుడి చెరువు కట్ట కింద ఉన్న గోశాలలో 150 కోడెలు, 20 ఆవులు ఉన్నాయి. రాజన్నకు మొక్కులు చెల్లించే కోడెలను, ఆవులను ఉంచుతారు. తిప్పాపూర్‌లో రెండో గోశాల ఉంది. ఇక్కడ 300 కోడెల కోసం రేకులషెడ్డు వేశారు. కానీ ఆరు నెలల క్రితం కోడెలను రిజిస్ట్రేషన్ ఉన్న గోశాలకు ఇవ్వకుండా..అధికారులను తప్పుదోవ పట్టించి తీసుకెళ్లడంతో అప్పటి నుంచి ఇతర గోశాలలకు రాజన్న కోడెలు, ఆవులను ఇవ్వడం లేదు. కోడెలను తిప్పాపూర్ గోశాలలోనే సంరక్షిస్తున్నారు. ఇక్కడ 300 కోడెలకు వసతి ఉండగా..ప్రస్తుతం 1,600 కోడెలు ఉన్నాయి. దీంతో చిన్నపాటి వర్షానికే గోశాల బురదమయం కావడంతో కోడెలు కనీసం పడుకునే పరిస్థితి లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక చోట, రాత్రి నుంచి తెల్లారేవరకు మరో చోట కోడెలను ఉంచుతున్నారు.

తడిస్తే వ్యాధుల బారినపడే అవకాశం ఉంది

వర్షాకాలంలో పశువులు, ఆవులతో జాగ్రత్తగా ఉండాలి. వర్షంలో తడిస్తే బలహీనమై వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. కాళ్ల మెత్తబడి డెక్కల్లో పుండ్లు అవుతాయి. సరిగా తినలేకపోతాయి. ఎప్పటికప్పుడు పేడ తియ్యకపోతే ఏదైనా ఒక్క ఆవుకు రోగం వస్తే అన్ని ఆవులకు సంక్రమించే అవకాశం ఉంది. బురద ఎక్కువైతే కాలు జారి కిందపడే అవకాశాలు ఉన్నాయి.

- ప్రశాంత్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి, వేములవాడ

త్వరలోనే అందిస్తాం

భక్తులు అందించిన కోడెలను తిప్పాపూర్ గోశాలలో సంరక్షిస్తున్నాము. గోశాలలో పరిమితికి మించి కోడెలు ఉన్నాయి. ఆలయ అధికారులతో కమిటీ నియామకానికి కలెక్టర్‌కు ఫైల్ పంపించాం. కమిటీ ఆదేశాలతో కోడెలను రైతులకు, రిజిస్ట్రేషన్ ఉన్న గోశాలలకు అందిస్తాం. వారం రోజుల్లోగా ఆదేశాలు వస్తాయని అనుకుంటున్నాం.

- శ్రీనివాస్, రాజన్న ఆలయ ఏఈవో

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా రవిచంద్ర

విప్‌గా దామోదర్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాజ్యసభలో బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా ఎంపీ వద్దిరాజు రవిచంద్రను నియమించారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు ఆదివారం లేఖ రాశారు. సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ విప్‌గా ఎంపీ దివకొండ దామోదర్‌రావును నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

'ఏపీతో సమానంగా' వ్యాఖ్య రేవంత్ అజ్ఞానాన్ని సూచిస్తోంది

'ఎక్స్'లో బీఆర్‌ఎస్ నాయకుడు దాసోజు



సాక్షి, హైదరాబాద్: 'ఏపీతో సమానంగా పని చేస్తాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం ఆయన అజ్ఞానానికి నిదర్శనం అని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రతి అభివృద్ధి సూచీలో, ముఖ్యంగా ఆరోగ్యరంగంలో ఎంతో ముందుందని, ఆ విషయాన్ని విస్మరించి మాట్లాడటం ఆయనకున్న హ్రస్వదృష్టిని బయటపెడుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రభుత్వ రంగంలో బలమైన గ్రామీణ ఆరోగ్య సంరక్షణ అవసరం రాష్ట్రంలో ఉందని, ప్రజలకు ఆరోగ్య సేవలను పూర్తిగా అందుబాటులోకి తేవాలని సూచించారు. ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రుల లైసెన్స్ దోపిడీని నియంత్రించకుండా.. సీఎం ఆరోగ్య పర్యాటకత పేరుతో మరిన్ని ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులను ప్రోత్సహించే చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు విలువైన భూములు కేటాయించడం కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం మాత్రమేనని, ప్రజల సంక్షేమం కోసం ఏమాత్రం కాదని దాసోజు విమర్శించారు.

కౌశిక్‌రెడ్డికి పొన్నం లీగల్ నోటీసులు



సాక్షి, హైదరాబాద్: హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ లీగల్ నోటీసులు పంపారు. ఎన్టీపీసీ నుంచి ఉత్పత్తి అయ్యే ఫ్లైయాష్ రవాణా విషయంలో తనపై నిరాధార ఆరోపణలు చేసినందుకు అడ్వొకేట్ ఈటూరు పూర్ణచందర్‌రావు ద్వారా కౌశిక్‌రెడ్డికి లీగల్ నోటీసులు పంపినట్టు మంత్రి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఎన్టీపీసీ నుంచి ఉత్పత్తి అయ్యే ఫ్లైయాష్‌ను టెండర్ ప్రక్రియ ద్వారా రవాణా చేస్తారని తెలిపాయి. రామగుండం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రతి ఫ్లైయాష్ లారీకి మంత్రి పొన్నం డబ్బు తీసుకుంటున్నారంటూ.. ఆయన పరువుకు భంగం కలిగేలా నిరాధార ఆరోపణలు చేశారని పేర్కొన్నాయి. రాజకీయంగా ఎదుర్కొన లేక మంత్రిపై వ్యక్తిగత కక్షతో ఆరోపణలు చేసినందుకు ఈ నోటీసులు పంపినట్టు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించాయి.

ఇదంజగత్



పాలనను అక్కడి నుండే నడిపిస్తారు!

రాష్ట్ర బీజేపీలో 'అధ్యక్ష' పోరు

పాత, కొత్త నేతలంటూ వివాదం

- ఈటల రాజేందర్‌ను రాష్ట్ర చీఫ్‌గా ప్రకటిస్తారంటూ వార్తలు
- అమిత్‌షా హామీ ఇచ్చారంటూ ప్రచారం
- అగ్రెసివ్ నేతకే పగ్గాలు అప్పగించాలన్న రాజాసింగ్
- ఘాటుగా స్పందించిన ఈటల
- అధ్యక్ష పదవి ఆశిస్తున్న పలువురు నేతలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీలో ఆధిపత్యపోరు మరోసారి తెరపైకి వచ్చింది. త్వరలోనే రాష్ట్ర పార్టీకి కొత్త అధ్యక్షుడి నియామకం జరగొచ్చుననే అంచనాల మధ్య అది తీవ్ర రూపం దాల్చింది. ప్రధానంగా కొంతకాలం క్రితం కొత్తగా పార్టీలో చేరి ఎంపీ, ఎమ్మెల్యే ఇతర పదవుల్లో ఉన్న వారు, ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న వారి మధ్య తీవ్రపోటీ నెలకొంది. పార్టీ సిద్ధాంతాలు, విధానాలపై పూర్తి అంకితభావంతో ఉన్న పాత నాయకులకే ఈ పదవి దక్కాలంటూ బీజేపీలో ఓ వర్గం నాయకులు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. అయితే పార్టీ విస్తరించాలంటే కొత్తవారు చేరడం ముఖ్యమని, కొత్త, పాత తేడాలు రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు అడ్డంకిగా మారకూడదని మరికొందరు వాదిస్తున్నారు.

రాజాసింగ్ వర్సెస్ ఈటల

దాదాపు రెండేళ్ల క్రితం పార్టీలో చేరి హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో గెలిచి, ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి దాదాపు 4 లక్షల భారీ మెజారిటీతో విజయం సాధించిన ఈటల రాజేందర్ పేరు పార్టీ అధిష్టానం పరిగణనలోకి తీసుకుంటున్నట్టుగా పార్టీలోని ఓ వర్గం గట్టిగా నమ్ముతోంది. కేంద్ర కేబినెట్‌లో మంత్రి పదవిని కోరుకున్న ఈటలకు.. రాష్ట్ర అధ్యక్ష పదవి ఇస్తామని, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ కచ్చితంగా అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని బీజేపీ అగ్రనేత అమిత్‌షా చెప్పినట్టు సమాచారం. మరోవైపు కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి వీలైనంత త్వరగా తనను తప్పించాలని కోరడంతో.. త్వరలోనే అంటే వారం, పది రోజుల్లోనే కొత్త అధ్యక్షుడిని ప్రకటించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ దేశభక్తి కలిగి దూకుడుగా వ్యవహరించే (అగ్రెసివ్) నేతకే రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగించాలంటూ అధిష్టానానికి విజ్ఞప్తి చేయడం పార్టీలో సంచలనం సృష్టించింది. రాజాసింగ్ విడుదల చేసిన వీడియోపై ఈటల ఘాటుగా స్పందించారు.

గల్లీల్లో ఉన్నవారు కాదు కావాల్సింది

'ఫైటర్‌కు పదవిని ఇవ్వాలంటూ కొందరు మాట్లాడుతున్నారు.. ఎవరికి ఇవ్వాలి.. స్ట్రీట్‌ఫైటర్‌కు ఇవ్వాలా..'అంటూ నేతల పేరును ప్రస్తావించకుండా ఈటల వ్యాఖ్యానించారు. సందర్భం వచ్చినపుడు కుంభస్థలాన్ని కొట్టే దమ్మున్న వాడు కావాలని, గల్లీల్లో ఉన్న వారు కాదని రాజ్యాన్ని, అధికారంలో ఉన్న వారిని నిగ్గదీసి నిలదీయగలిగే వాడే ఫైటర్ అవుతాడని అన్నారు. తన లాంటి వారు ఊరికే మాట్లాడరని సందర్భం వచ్చినపుడు జేజమ్మతో కొట్లాడే సత్తా ఉన్న వారిమని ఓ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఈటల వ్యాఖ్యానించారు. కొత్త, పాత నాయకులు అనే తేడాలు లేకుండా అందరినీ సమన్వయం చేసుకుని బీజేపీ ముందుకు వెళుతుందన్నారు. ఒక పార్టీ కొత్తగా ఎదిగి, అధికారంలోకి రావాలంటే కొత్త శక్తి, కొత్త నీరు జత కావాల్సిందేనన్నారు.

కొత్త, పాత ఏమీ లేదన్న రఘునందన్

తాజాగా మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్‌రావు వద్ద ఓ విలేకరి ఈ విషయాలు ప్రస్తావించగా.. 'కొత్తగా వచ్చిన నేతలకు పదవి రాదు అనేది ఏమీ లేదు. అలా అయితే హిమంత బిశ్వ శర్మ అసోం సీఎం అయ్యేవారు కాదు. ఒక పార్టీని వీడి మరో పార్టీలో చేరి కండువా కప్పుకున్న రోజునుంచే ఆ పార్టీ నాయకుడిగా సదరు వ్యక్తి చెలామణి అవుతారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా అభిప్రాయాలు చెప్పవచ్చు.. రాజాసింగ్ తన అభిప్రాయం చెప్పారు'అంటూ స్పందించడం గమనార్హం.

పోటీలో పలువురు నేతలు

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు ఎంపీలు డీకే అరుణ, అర్వింద్ ధర్మపురి, ఎం.రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, సీనియర్ నేతలు చింతా సాంబమూర్తి, చింతల రామచంద్రారెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, జి.మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు అధ్యక్షుడి రేసులో ఉన్నట్టు సమాచారం. వీరిలో కొందరు ఇప్పటికే ఢిల్లీ స్థాయిలో తమ వంతు లాబీయింగ్ కూడా మొదలుపెట్టినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల చివరి నాటికి బీజేపీ రాష్ట్ర కొత్త సారథిపై క్లారిటీ వచ్చే అవకాశాలున్నాయని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. మంగళవారం కొత్త ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఉదయం ఆయన ఢిల్లీ వెళతారని సీఎం కార్యాలయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ కార్యక్రమానికి హాజరుకావడంతో పాటు పార్టీ పెద్దలను కూడా రేవంత్ కలిసే అవకాశాలున్నాయి. నామినేటెడ్ పోస్టులు, టీపీసీసీ అధ్యక్షుడి ఎంపిక, కేబినెట్ విస్తరణ లాంటి అంశాలపై పార్టీ అధిష్టానం పెద్దలతో వీలును బట్టి ఆయన చర్చించే అవకాశముందని తెలుస్తోంది. ఇక, జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు.

ఆరు లేన్లుగా హైదరాబాద్-విజయవాడ హైవే

మంత్రి కోమటిరెడ్డి



చిట్యాల: రెండు తెలుగు రాష్ట్రాల ప్రధాన నగరాలైన హైదరాబాద్ నుంచి విజయవాడకు రెండు గంటల్లోనే చేరుకునేలా 65వ నంబర్ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా మార్చేందుకు రూ.16 వేల కోట్లు మంజూరు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించినట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో 65వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్ నిర్మాణానికి ఆదివారం ఆయన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 65వ నంబర్ జాతీయ రహదారిని ఆరులేన్లుగా మార్చేందుకు త్వరలోనే కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశం కానున్నట్లు తెలిపారు. 65వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణతో పాటు సమయం వృథా కాకుండా ప్రయాణించేందుకు వీలుగా రహదారిని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే హైదరాబాద్ నుంచి మార్కాపురం వరకు ఆరు లేన్ల రహదారి విస్తరణ పనులు పూర్తి కావొచ్చాయని ఆయన చెప్పారు. రూ.35 వేల కోట్లతో హైదరాబాద్ చుటూ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించేందుకు తగిన ప్రతిపాదనలు చేసినట్లు వెల్లడించారు. చిట్యాల నుంచి భువనగిరి వరకు నాలుగులేన్ల రోడ్డుగా విస్తరించేందుకు కూడా ప్రతిపాదనలు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి గారూ..! సీఎం అంటే 'కటింగ్ మాస్టరా'?

- 'ఎక్స్'వేదికగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్న
- రైతు రుణమాఫీపై కోతలు పెడితే సహించేది లేదని హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: 'ముఖ్యమంత్రి గారూ.. సీఎం అంటే కటింగ్ మాస్టరా?'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు 'ఎక్స్'వేదికగా వ్యంగ్యంగా ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాలన్నింటిలో లబ్ధిదారుల సంఖ్యకు కోత పెడుతోందని, సీఎం అనే పదానికి కటింగ్ మాస్టర్ అనే సరికొత్త నిర్వచనం తెచ్చారని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయా పథకాల్లో కోతల గురించి కేటీఆర్ పోస్ట్ చేశారు. 'నాడు.. పరుగు పరుగున వెళ్లి రైతులను లోన్ తెచ్చుకోమన్నారు. నేడు రూ. 2 లక్షల రుణ మాఫీకి సవాలక్ష కొర్రీలు పెడుతున్నారు. మొదట రూ.39 వేల కోట్లు అని ఇప్పుడు రూ. 31 వేల కోట్లకు కటింగ్ పెట్టి కుదించారు'అని పేర్కొన్నారు. పాసుబుక్కులు లేవనే నెపంతో.. లక్షల మందికి కోత పెట్టే కుటిల ప్రయత్నం చేస్తే సహించమని హెచ్చరించారు. అలాగే రేషన్ కార్డు సాకు చూపి.. లక్షల మందికి మొండిచెయ్యిచ్చే కుతంత్రం చేస్తే ఊరుకోమని పేర్కొన్నారు. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారని కొంతమందికి.. చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారని ఇంకొంతమందికి.. శూన్యహస్తం చూపే చీకటి పన్నాగాన్ని చూస్తూ వదిలేయమని స్పష్టం చేశారు. ఇప్పటికే రూ. 500 సిలిండర్, రూ. 200 యూనిట్ల విద్యుత్ పథకాలకు కూడా కోతలు విధించారని విమర్శించారు. ఇదే విధంగా రూ. 2 లక్షల రుణమాఫీని కూడా ఎగ్గొట్టి, లక్షలాది మంది రైతులకు ఎగనామం పెడతామంటే కుదరదని అన్నారు. 'నాట్ల నాడు ఇవ్వాల్సిన రైతుబంధుకు ఇప్పటికీ దిక్కులేదు. ఓట్ల పండుగ ముగిసినా.. ఎకరానికి రూ.7,500 రైతుభరోసాకు అడ్రస్సే లేదు. కాంగ్రెస్ ప్రచారంలో "అందరికీ అన్నీ"అన్నారు. అధికారంలోకి రాగానే "కొందరికే కొన్ని"అని కోతపెడుతున్నారు'అని ఎద్దేవా చేశారు. 'రుణమాఫీపై మాట తప్పినా.. మడమ తిప్పినా.. లక్షలాది రైతు కుటుంబాల తరఫున ప్రశ్నిస్తాం, పోరాడుతాం'అని హెచ్చరించారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

మంత్రి పొంగులేటి




మంత్రి పొంగులేటికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

ఖమ్మం రూరల్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం సాయి గణేశ్ నగర్, నాయుడుపేట, సాయిప్రభాత్ నగర్, కైకొండాయిగూడెం, ఆరెంపుల గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాలేరు నియోజకవర్గంలోని సమస్యలన్నిటినీ ఏడాది లోపే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రైతును రారాజు చేయాలనే సంకల్పంతో రాబోయే రెండు నెలల్లోనే రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని తెలిపారు. అనంతరం షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కాగా, రుణమాఫీ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసిన పలువురు నాయకులు, రైతులు మంత్రి పొంగులేటికి పాలాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో యువతకు ప్రాధాన్యం

మహేశ్ కుమార్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో యువత, విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి.మహేశ్ కుమార్‌గౌడ్ చెప్పారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డి అధ్యక్షతన ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో శివసేనారెడ్డి నేతృత్వంలో యువజన కాంగ్రెస్ రాజీలేని పోరాటం చేసిందని ప్రశంసించారు. శివసేనారెడ్డి మాట్లాడుతూ నీట్ పరీక్ష పత్రాల లీకేజీ విషయంలో న్యాయం జరిగేంత వరకు పోరాడతామన్నారు. దీనిపై పార్లమెంటులో కూడా కాంగ్రెస్ పార్టీ పక్షాన కేంద్రాన్ని ప్రశ్నిస్తామని చెప్పారు. సమావేశంలో భాగంగా నీట్ పరీక్ష పత్రాల లీకేజీ, కార్యాచరణపై యువజన కాంగ్రెస్ నేతలు చర్చించారు. అనంతరం నాంపల్లిలోని బీజేపీ కార్యాలయ ముట్టడికి వెళుండగా..వారిని గాంధీభవన్ ప్రధాన గేటు వద్దే పోలీసులు అడ్డుకున్నారు.

దేశ సమైక్యతకు బీజేపీ పనిచేస్తుంది

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- పార్టీ కార్యాలయంలో శ్యామప్రసాద్ ముఖర్జీకి నివాళి



శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: దేశంలో సమగ్రత, సమైక్యత కోసం భారతీయ జనతా పార్టీ పనిచేస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన ప్రమాదకరమైన ఆర్టికల్ 370ని విభేదించిన డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ అప్పట్లో కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేశారని, తర్వాత భారతీయ జనసంఘ్ పేరుతో రాజకీయ పార్టీ పెట్టి ఆర్టికల్ 370కి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టారని వివరించారు. దేశ సార్వభౌమాధికారాన్ని పరిరక్షించుకునేందుకు బలిదానం చేసిన చరిత్ర జనసంఘ్‌దన్నారు. శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద కిషన్‌రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జాతీయ చిహ్నాలు ఉండకూడదనే నినాదంతో ఆర్టికల్ 370 రద్దు కోసం ముఖర్జీ ఉద్యమించారని, అప్పట్లో దేశంలో జాతీయ జెండాగా త్రివర్ణ పతాకం ఉంటే, జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక జెండా ఉండేదన్నారు. 75 ఏళ్ల తర్వాత దేశంలో ప్రధాని మోదీ నాయకత్వంలో ముఖర్జీ లక్ష్యం నెరవేరిందన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్మూకశ్మీర్‌లో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నామన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఇతర నేతలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, డాక్టర్ విజయ రామారావు, యెండల లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్ తివారీ, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, ఆకుల విజయ తదితరులు ఈ కార్యక్రమంలో శ్యామప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పించారు.

మనమంతా బతుకుదెరువుకు వచ్చిన వాళ్లమే

- మల్కాజిగిరితో నాకేం సంబంధమని రేవంత్ ఎలా అంటారు?
- అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటా: ఎంపీ ఈటల రాజేందర్



కంటోన్మెంట్ పరిధిలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

కంటోన్మెంట్: తనతో సహా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలంతా ఇక్కడకు బతికేందుకు వచ్చినవారేనని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ పరిధిలోని మహేంద్రాహిల్స్, మారేడుపల్లి, పీఅండ్‌టీ కాలనీ, పికెట్, బోయిన్‌పల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభల్లో ఈటల పాల్గొని ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కొడంగల్‌లో ఓడిపోయి మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి, గత ఎన్నికల్లో తనకు మల్కాజిగిరితో సంబంధం ఏంటని ప్రశ్నించారన్నారు. ఆయనకు తెలియనిదేమిటంటే మల్కాజిగిరిలో మెజారిటీ ప్రజలు వివిధ ప్రాంతాల నుంచి బతడానికి వచ్చిన వారేనని చెప్పారు. 12 ఏళ్ల పాటు స్థిర నివాసమున్న వారికి గత ప్రభుత్వాలు పట్టాలిచ్చాయని, అయితే జీఓ నంబర్ 58, 59 కింద కంటోన్మెంట్‌వాసులకు పట్టాలు దక్కలేదని తెలిపారు. ఇక్కడి పేదలకు పట్టాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటానన్నారు. రామన్న కుంట ముంపు సమస్యకు పరిష్కారం చూపుతానని చెప్పారు.

అవి ప్రజల సొమ్ముతో కట్టిన ఇళ్లు

మారేడుపల్లిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత ఉండాలన్నారు. ప్రజల డబ్బుతోనే ఈ ఇళ్లు నిర్మించారని, ఎలాంటి అవినీతి లేకుండా అర్హులైన వారికి మాత్రమే ఇళ్లు దక్కేలా చూసే బాధ్యత తనదని చెప్పారు.పదిరోజుల్లోనే తాను లబ్ధిదారుల ఎంపికపై దృష్టిపెడతానని, ఈ ఇళ్లు ఏ పార్టీకో చెందిన వారివి కావని గుర్తుంచుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, కార్పొరేటర్ కొంతం దీపిక, బీజేపీ నేతలు డాక్టర్ వంశ తిలక్, సాద కేశవరెడ్డి, బాణాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చడంలో రేవంత్ సర్కార్ విఫలం

- రైతుభరోసా ఇస్తామని చెప్పి మంత్రివర్గ ఉపసంఘం ఎందుకు వేశారు?
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం అయిందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. వానాకాలం మొదలైనా రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన పార్టీ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. రైతుబంధు సాయాన్ని ఆపడానికి వీల్లేదని హెచ్చరించారు. రైతు భరోసా పేరుతో రూ. 15 వేలు ఇస్తామని మాట తప్పారని, తాజాగా రైతు భరోసాపై కేబినెట్ సబ్ కమిటీ అని కొత్త మోసానికి తెరదీశారని విమర్శించారు. మంత్రివర్గ ఉపసంఘం వెనుక వున్న మతలబు ఏంటని ప్రశ్నించారు. రైతు రుణమాఫీతో సంబంధం లేకుండా రైతు బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాసంగిలో ఏ విధంగా రైతుబంధు ఇచ్చారో ఇప్పుడు కూడా అట్లాగే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ శాంతిభద్రతలు బాగాలేవని విమర్శించారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా నదులను తోడేస్తోందని ఆరోపించారు.

విద్యుత్ కమిషన్ ముందు హాజరవుతా

విద్యుత్ కమిషన్ నుంచి తనకు లేఖ వచ్చిందని జగదీశ్‌రెడ్డి తెలిపారు. లేఖ అందిన వారం రోజుల్లో కమిషన్‌కు వాంగ్మూలం ఇచ్చిన వారిపై మీ అభిప్రాయం చెప్పాలని లెటర్ పంపించారని, విద్యుత్ కమిషన్‌కు తనకున్న సమాచారాన్ని ఇస్తానని తెలిపారు. కమిషన్‌కు వాంగ్మూలం ఇచ్చిన వారి తప్పులను బయటపెడతానని అన్నారు. అందరినీ విచారిస్తేనే కమిషన్‌కు సమాచారం వస్తుందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్, విద్యుత్ అధికారుల నుంచి కమిషన్ సమాచారం తీసుకోవాలన్నారు. కమిషన్ చైర్మన్ నరసింహారెడ్డి మీడియాతో మాట్లాడిన తర్వాత ఆరు వేల కోట్ల రూపాయల నష్టం జరిగినట్లు ప్రజలకు తెలిపారని, ఆ సమాచారాన్ని ఇచ్చిన వారిని కూడా చైర్మన్ విచారణకు పిలవాలని జగదీశ్‌రెడ్డి కోరారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలున్న చోట ప్రొటోకాల్‌కు పాతర

- అధికారుల కోసం బ్లాక్‌బుక్ రెడీ చేశా
- పాడి కౌశిక్‌రెడ్డి ధ్వజం



సమావేశంలో బ్లాక్‌బుక్ చూపుతున్న కౌశిక్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో ప్రొటోకాల్ పాటించడం లేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, పార్టీ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డితో కలసి మీడియాతో మాట్లాడారు. కల్యాణలక్ష్మి చెక్కులను కూడా తమకు తెలియకుండా పంపిణీ చేస్తున్నారని మండిపడ్డారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఎమ్మార్వోలకు లెటర్ రాసినా, మంత్రి పొన్నం ప్రభాకర్ వచ్చేంత వరకు చెక్కులు ఇవ్వకుండా ఆపుతున్నారని ధ్వజమెత్తారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అధికారుల కోసం బ్లాక్‌బుక్ రెడీ చేశానని కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చాక అధికారులకు బ్లాక్ డేస్ ఉంటాయని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న చోట వారే కల్యాణలక్ష్మి చెక్కులను ఇస్తున్నారని, అధికారులు ప్రొటోకాల్ ప్రకారం చెక్కులు పంచకపోతే హైకోర్టుకు వెళ్తానని చెప్పారు. ఫ్లైయాష్ రవాణాలో తనకు పొన్నం ప్రభాకర్ లీగల్ నోటీసులు పంపించారని, ఆ నోటీసులకు తమ లీగల్ టీమ్ సమాధానం చెపుతుందని స్పష్టం చేశారు. ఫ్లైయాష్ రవాణాలో మంత్రి పొన్నం డబ్బులు తీసుకోకపోతే వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రమాణానికి సిద్ధమా? అని సవాల్ విసిరారు.

క్లుప్తంగా...

నేడు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం విడుదలవుతాయి. మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి శ్రుతి ఓజా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మే, జూన్ నెలల్లో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. ఫస్టియర్, సెకండియర్, ఒకేషనల్ కోర్సుల ఫలితాలు ఒకేసారి ఇవ్వనున్నారు.

సీఎంకు ఉపాధ్యాయ సంఘాల కృతజ్ఞతలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించినందుకు వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆదివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పదిహేనేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భాషా పండితులు, పీఈటీల అప్‌గ్రేడేషన్ సమస్యను పరిష్కరిస్తూ వారికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తుండటంపై ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ సంఘాల నేతలు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

టీఆర్‌టీఎఫ్ ప్రధాన కార్యదర్శిగా అంజిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) ప్రధాన కార్యదర్శిగా మారెడ్డి అంజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ప్రతినిధులు ఆదివారం సమావేశమై కొత్త ప్రధాన కార్యదర్శిని ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల ఎన్నిక కోసం తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా అంజిరెడ్డి తెలిపారు. ఎన్నికల అధికారిగా వచ్చిన మానేటి ప్రతాపరెడ్డి సెలవుల నిబంధనపై అవగాహన సదస్సు నిర్వహించారు.

గురుకుల టీచర్లకూ అవే సౌకర్యాలివ్వాలి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న గురుకుల జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: గురుకుల ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో.. విద్యాశాఖ పరిధిలోని ఉపాధ్యాయులకు ఇస్తున్న సౌకర్యాలను కల్పించాలని గురుకుల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. గురుకుల ఉపాధ్యాయ బదిలీల సమయంలో స్పౌజ్ పాయింట్ల అంశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులే కాకుండా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, జ్యుడీషియల్, రైల్వే, బ్యాంకింగ్, ఇతర పీఎస్‌యూల పరిధిలోని వారిని కూడా పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక పాయింట్లు ఇవ్వాలని కోరింది. ప్రధానంగా జీవో 317 ద్వారా జరుగుతున్న ఉద్యోగ కేటాయింపుల్లో స్పౌజ్ అంశాన్ని తప్పకుండా పరిగణించాలని విన్నవించింది. ఈమేరకు ఆదివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని గురుకుల జేఏసీ నేతలు మామిడి నారాయణ, డాక్టర్ మధుసూదన్, కె.జనార్దన్, ఎ.నర్సింహులు, ఎ.గణేశ్ తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ శాఖాపరమైన ఆదేశాలను త్వరలో జారీ చేస్తానని, ఈమేరకు సంబంధిత ఉన్నతాధికారులకు సూచనలు ఇవ్వనున్నట్లు వారికి హామీ ఇచ్చారు.

'శానిటరీ సిబ్బందిని నియమించాలి'

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో శానిటరీ సిబ్బందిని నియమించాలని తెలంగాణ గెజిటెడ్ హెచ్ఎంల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. సంఘం అధ్యక్షుడు గుండమళ్ళ హేమచంద్రుడు, ప్రధాన కార్యదర్శి తిరుపతి సచ్చిదానందరెడ్డి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. పాఠశాలలకు ఉచిత విద్యుత్, ఇంటర్‌నెట్ అందించాలని, సర్వీస్ రూల్స్ అమలు పరిచేందుకు ఎంఈవోల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని వారు కోరారు.

నీట్‌పై ఉచిత అవగాహన సదస్సు

సాక్షి, హైదరాబాద్: 'నీట్' కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఈ నెల 25 నుంచి 27 వరకూ మూడు రోజుల పాటు ప్రత్యేక ఉచిత అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు హైదరాబాద్‌లోని మెటామైండ్ అకాడమీ చైర్మన్ ఎ.మనోజ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి కూడా కల్పిస్తున్నట్టు తెలిపారు. నీట్‌లో ఎదురయ్యే సవాళ్లు, మెదటి విడతలోనే నీట్ ర్యాంకు పొందడం, మెంటార్‌షిప్, నోట్స్ ప్రిపరేషన్ అంశాలపై మెడికోలు, సీనియర్ అధ్యాపకులు సమగ్ర అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 8919926339 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కరెన్సీ తరలింపులో మరికొందరు ఖాకీలు!

అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో వెలుగులోకి

- ఎన్నికల సమయాల్లో నగదు తరలించిన టాస్క్‌ఫోర్స్ బృందాలు
- ఆ మొత్తాల్ని గమ్యం చేర్చిన వారిలో ఆయా జిల్లాల పోలీసులు
- ఇప్పటికే ఓ ఎస్పీ స్థాయి అధికారి పాత్రపై ఆధారాలు లభ్యం
- మరికొందరు నాన్ క్యాడర్ అధికారుల ప్రమేయం!



సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన 'పోలీసు వాహనాల్లో ఎలక్షన్ ఫండ్ రవాణా' వ్యవహారంలో మరికొందరు ఖాకీల పాత్ర ఉన్నట్లు సిట్ అధికారులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) పి.రాధాకిషన్‌రావు, ఓ మాజీ ఎస్పీ పేర్లు వెలుగులోకి వచ్చాయి. ఒకరు ఇప్పటికే అరెస్టు కాగా మరొకరిని పోలీసులు విచారించారు. తెరవెనుక స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు పాత్ర ఉన్నట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. హైదరాబాద్ నుంచి టాస్క్‌ఫోర్స్, ఎస్ఐబీ వాహనాల్లో ఇతర జిల్లాలకు నగదు తరలినట్లు నిర్ధారించారు. ఈ మొత్తాలను ఆయా జిల్లాల్లో రిసీవ్ చేసుకున్నది ఎవరు? అక్కడ నుంచి ఎవరి వద్దకు చేరాయి? అనే అంశాలపై దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో ఓ ఎస్పీ, మరికొందరు నాన్-క్యాడర్ ఎస్పీ స్థాయి అధికారుల పాత్రపై కొన్ని ఆధారాలు లభ్యమైనట్లు తెలిసింది.

ప్రధానంగా ఎన్నికల సమయంలోనే..

టాస్క్‌ఫోర్స్, ఎస్ఐబీ అధికారులు ప్రధానంగా గతంలో జరిగిన ఎన్నికలు, ఉప ఎన్నికల సమయాల్లోనే నగదు అక్రమ రవాణా చేసినట్లు అధికారులు నిర్ధారిస్తున్నారు. ఈ మొత్తం వివిధ జిల్లాల్లో ఉన్న కొందరు నేతలకు చేరినట్లు అనుమానిస్తున్నారు. సిట్ అధికారులు ఇప్పటికే ఆయా నగదు అక్రమ రవాణా వాహనాల్లో ప్రయాణించిన ఎస్సైలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులతో పాటు డ్రైవర్లను ప్రశ్నించి వాంగ్మూలాలు నమోదు చేశారు. 2018 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయం నుంచి వీటిని వాడటం మొదలెట్టారు. 2020లో జరిగిన దుబ్బాక, 2021 అక్టోబర్‌లో జరిగిన హుజూరాబాద్, 2022 అక్టోబర్ రెండో వారంలో జరిగిన మునుగోడు ఉప ఎన్నికలతో పాటు గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన సాధారణ ఎన్నికల సందర్భాల్లో ఈ నగదు అక్రమ రవాణా ఎక్కువ జరిగినట్లు అంచనాకు వచ్చారు. హైదరాబాద్‌లోని వ్యక్తుల నుంచి ఆ మొత్తాలను తరలించే బాధ్యతల్ని అప్పటి రాధాకిషన్‌రావు నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ పోలీసులు, జిల్లాలకు తీసుకువెళ్లే అంశాన్ని ఎస్ఐబీలోని కొందరు అధికారులు చేపట్టినట్లు సమాచారం. అయితే ఈ మొత్తాలను సురక్షితంగా వివిధ ప్రాంతాల్లోని వ్యక్తుల వద్దకు చేర్చాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు చెందిన స్థానిక అధికారుల సహకారం తీసుకుని ఉంటారని అనుమానించారు. ప్రభాకర్‌రావు లేదా రాధాకిషన్‌రావుల్లో ఎవరో ఒకరు వారితో మాట్లాడి, నగదు తరలింపులో సహకరించేలా ఒప్పించి ఉంటారనే కోణంలో దర్యాప్తు చేశారు. ఈ కోణంలో లోతుగా ఆరా తీసిన ఉన్నతాధికారులు ఓ ఎస్పీ స్థాయి అధికారి పాత్రను గుర్తించినట్లు సమాచారం. మరికొందరు నాన్-క్యాడర్ ఎస్పీ స్థాయి అధికారుల పాత్రపై కొన్ని ఆధారాలు లభ్యమైనట్లు తెలిసింది. కొందరికి నోటీసులు ఇచ్చి విచారించిన సిట్... అన్ని అంశాలు పూర్తిస్థాయిలో వెలుగులోకి వచ్చాక మిగిలిన వారికీ నోటీసులు జారీ చేసి విచారించాలని, వాంగ్మూలాలు నమోదు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

సంప్రదింపులు ఆపేసిన ప్రభాకర్‌రావు

సుదీర్ఘకాలం ఎస్ఐబీ చీఫ్‌గా వ్యవహరించిన టి.ప్రభాకర్‌రావు గత ఏడాది డిసెంబర్ 4న రాజీనామా చేశారు. ఆపై ఎస్ఐబీలో జరుగుతున్న పరిణామాలు, ఎస్ఐబీ మాజీ డీఎస్పీ డి.ప్రణీత్‌రావుపై కేసు నేపథ్యంలో అమెరికా వెళ్లిపోయారు. పోలీసు అధికారులు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్నలతో పాటు మాజీ ఓఎస్డీ రాధాకిషన్‌రావు అరెస్టుల తర్వాత తిరిగి రావాలని భావించారు. అప్పటి నుంచి కొన్నాళ్లు కొందరు పోలీసు అధికారులు, తన సన్నిహితులతో సంప్రదింపులు జరిపారు. అయితే ప్రస్తుతం ఆయన ఇక్కడ ఉన్న వారితో సంప్రదింపులు పూర్తిగా ఆపేశారని తెలిసింది. ఈ నేపథ్యంలో పోలీసులు రెడ్ కార్నర్ నోటీసుల ద్వారా ఆయన్ను రప్పించాలని నిర్ణయించారు.

బొగ్గు గనుల వేలాన్ని వెంటనే ఆపండి

ప్రధాని మోదీకి ఎంపీ ఆర్.కృష్ణయ్య వినతి



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా బొగ్గు గనుల వేలాన్ని తక్షణమే ఆపాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కోరారు. గనుల వేలంపై రాజ్యసభలో ప్రత్యేక చర్చ జరపాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ అంశంపై జోక్యం చేసుకుంటున్నాయని, ప్రతి పార్టీ అభిప్రాయాన్ని తీసుకోవాలన్నారు. గనుల వేలం ద్వారా జాతి సంపద ప్రైవేటు వ్యక్తుల పాలవుతుందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం చేస్తుందని చెప్పారు. ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వకుండా ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించే అంశాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలన్నారు. దీనివల్ల దళితులు, గిరిజనులు, బీసీలు, పేదలకు ఉద్యోగాలు దక్కుతాయని పేర్కొన్నారు. వేలం ప్రక్రియను నిలిపివేయకుంటే ఆందోళన కార్యక్రమాలను జాతీయ స్థాయిలో చేపడతామని కృష్ణయ్య హెచ్చరించారు.

నేటి నుంచి జూడాల నిరవధిక సమ్మె

ఓపీ సేవలు, వార్డు డ్యూటీల బహిష్కరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జూనియర్ డాక్టర్లు (జూడా) సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నారు. ఈ మేరకు జూడాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్‌జీ సాయిశ్రీ హర్ష, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.ఐజాక్ న్యూటన్, చైర్‌పర్సన్ డాక్టర్ డి.శ్రీనాథ్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు అంతా ఈ సమ్మెలో పాల్గొంటారని వారు ప్రకటించారు. ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలు, ఎలక్టివ్ సర్జరీలు, వార్డ్ డ్యూటీలను పూర్తిగా బహిష్కరిస్తామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో అనేక చర్చలు జరిగినప్పటికీ, తమ డిమాండ్లకు తగిన పరిష్కారం దొరకలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తప్పని పరిస్థితుల్లోనే ఈ సమ్మెకు దిగాల్సి వస్తోందని, తమ సమస్యలు సమగ్రంగా పరిష్కరించేవరకు సమ్మె కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. రోగులు, సాధారణ ప్రజలకు కలిగే అసౌకర్యం పట్ల తాము చింతిస్తున్నామని, అత్యవసర సేవలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. స్టైపెండ్‌లను సకాలంలో విడుదల చేసేందుకు గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలని, ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి కొత్త భవనం, వైద్యుల కోసం కొత్త హాస్టల్ భవనాలు నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్స్ కోసం సవరించిన గౌరవ వేతనం ఇవ్వాలన్నారు.

నీట్ అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో
విచారణ జరిపించాలి

- నీట్ నిర్వహణ బాధ్యతల్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలి
- పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): కేంద్ర ప్రభుత్వం నీట్ అవకతవకలపై సీబీఐతో కాకుండా సుప్రీం కోర్టు జ్యుడీషియల్ కమిటీతో విచారణ జరిపించాలని పౌరహక్కుల నేత, తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జి.హరగోపాల్ డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం లోపభూయిష్టంగా ఉందని నీట్‌లో జరిగిన అక్రమాలకు ఈ విద్యా విధానమే కారణమని ఆయన ఆరోపించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు కె.నారాయణలతో కలిసి హరగోపాల్ మాట్లాడారు. నీట్ అక్రమాల వల్ల 24 లక్షలమంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, నీట్ పరీక్షలను పూర్తిగా రద్దు చేసి గతంలో మాదిరిగా వీటి నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆగస్టు 15లోగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, టీచర్ల కొరత వంటి సమస్యలను పరిష్కరించి విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య, ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి పీజీ ప్రవేశ పరీక్షల హాల్‌టికెట్లు

6 నుంచి పరీక్షలు

- పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలి
- టీఎస్ సీపీజీఈటీ–2024 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి




ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీఎస్ సీపీజీఈటీ–2024 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి ఆదివారం తెలిపారు. జంటనగరాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓయూతో పాటు కాకతీయ, జేఎన్‌టీయూ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు, తెలంగాణ మహిళా యూనివర్సిటీలలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఈడీ, ఇతర పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి జూలై 6 నుంచి 15 వరకు 45 సబ్జెక్టులకు ప్రవేశ పరీక్ష జరగనున్నట్లు కన్వీనర్ వివరించారు. ప్రవేశ పరీక్షల టైంటేబుల్‌ను వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. సీపీజీఈటీ–2024 దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జూలై 3 నుంచి హాల్‌టిక్కెట్లను www.osmania.ac.in, httpr://cpfet.trche.ac.in, www.o uadmirrionr.com ఈ వెబ్‌సైట్స్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూలై 6 నుంచి ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి 2.30 వరకు, సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు మూడు విడతలుగా జరిగే కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)కు పరీక్ష కేంద్రానికి అభ్యర్థులు గంట ముందుగా చేరుకోవాలన్నారు. అనంతరం పరీక్ష హాల్‌లో 30 నిమిషాల ముందు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఇంత వరకు సీపీజీఈటీ–2024 దరఖాస్తు చేయని అభ్యర్థులు జూన్ 25 వరకు రూ.500 అపరాధ రుసముతో, ఈ నెల 30 వరకు రూ.2000 అపరాధ రుసముతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంజనీరింగ్, ఫార్మసీ, బీఎస్సీ డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులు ఎంఏ, ఎంకాం కోర్సులకు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నట్లు ప్రొ.పాండురంగారెడ్డి వివరించారు.

నేడు గురుకుల కొలువుల
దివ్యాంగ అభ్యర్థుల జాబితా విడుదల

టీఆర్ఈఐఆర్‌బీ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో వివిధ కేటగిరీల్లో ఉద్యోగాలకు అర్హత సాధించిన దివ్యాంగ(పీడబ్ల్యూడీ) అభ్యర్థుల జాబితాను తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) సోమవారం సాయంత్రం విడుదల చేయనుంది. ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థుల మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలనకు సంబంధించి సరోజినీదేవి కంటి ఆస్పత్రి, కోఠిలోని ఈఎన్‌టీ ఆస్పత్రుల నుంచి నిర్ధారణ వచ్చినట్లు టీఆర్ఈఐఆర్‌బీ చైర్‌పర్సన్ ఆయేషా మస్రత్ ఖానమ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించిన దివ్యాంగ అభ్యర్థుల జాబితాను సోమవారం ప్రకటిస్తామని, నిర్దేశించిన సొసైటీలు ఈ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన తదుపరి చర్యలు తీసుకుంటుందని వివరించారు.



మీకు బాగా నచ్చినదాన్ని అత్యంత క్రమశిక్షణా రాహిత్యంతో, సందర్భశుద్ధి లేకుండా, అసలైన పద్ధతిలో కష్టపడి చదవండి.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 24 జూన్ 2024

సంపూర్ణ జీవితం

భట్టి విక్రమార్క కథలో, విక్రమార్కుడి బుద్ధి కుశలతను మెచ్చి, వెయ్యేళ్లు పరిపాలించే సింహాసనాన్ని బహూకరిస్తాడు ఇంద్రుడు. అంటే వెయ్యేళ్ల ఆయువు. మరి నా సంగతేమిటని విక్రమార్కుడిని అడుగుతాడు సోదరుడు భట్టి. అన్నింటికీ వెన్నంటి ఉండే భట్టి సంగతి మరిచేపోయాడు విక్రమార్కుడు. దాంతో భట్టి ఆవేశంతో కాళికాదేవి తపస్సు చేసి, రెండు వేల ఏళ్లు బతికే వరం పొందుతాడు. మరి నా సంగతేమిటని అడుగుతాడు విక్రమార్కుడు. ఇద్దరు కలిసి కదా బతకాలి! అప్పుడు ఆలోచన చేస్తారు. సింహాసనం మీద వెయ్యేళ్లు కూర్చుని కదా పాలించమన్నది... అంటే అది ఆయువు పరిమితి కాదు, రాజ్యపాలన పరిమితి. అందుకే ఆరు నెలలు రాజ్య పాలన, ఆరు నెలలు అరణ్యవాస పథకం వేస్తారు. అలా భట్టి విక్రమార్కులు ఇద్దరూ రెండు వేల ఏళ్లు బతుకుతారు. ఒక్క భట్టి విక్రమార్కులేనా? రామాయణంలో దశరథుడు వేల ఏళ్లు బతికాడు. ఎందరో మునులు, రుషులు వేల ఏళ్లు తపస్సులోనే గడిపి ఎన్నో శక్తులు సాధించిన కథలున్నాయి. ఎప్పటికీ చనిపోని వరాలు పొందిన రాక్షసులు ఎందరో మన పురాణాల్లో ఉన్నారు. ఎప్పటికీ బతికివుండేలా దేవతలు అమృతాన్ని సేవించారు. చనిపోయినవాళ్లను అట్టే మళ్లీ పునర్జీవింపజేసే సంజీవని కథలు, గాయాలన్నీ మానిపోయి దృఢకాయులయ్యే లేపనాల గాథలు మనకున్నాయి. వేల ఏళ్లు బతకడం అంటే దాదాపుగా చావు లేకపోవడమనే! జీవితానికి అంతం పలికే చావు అనేదాన్ని తప్పించే అన్ని ప్రయత్నాలనూ మనిషి కనీసం కథల్లోనైనా, కలల్లోనైనా చేశాడనుకోవచ్చు.

ఎప్పటికైనా చచ్చిపోతామనే వాస్తవం మనిషిని కలవరపెడుతుంది. సమస్త మానవాళి గురించి కాకపోయినా, కనీసం తన అయినవారు తనకు కాకుండాపోతారన్న చింత ఉండటంతోపాటు తానూ ఒకరోజు ఈ భూమ్మీద శూన్యంగా మిగిలిపోతాడన్నది జీర్ణం చేసుకోలేని చేదుమాత్ర. అన్ని మతాలూ మరణానంతర జీవితాలను వాగ్దానం చేయడంలో అందుకే విజయం సాధించి ఉంటాయి. చచ్చాక ఏమీ లేదు అనుకోవడం కంటే, ఆ పైనెక్కడో మళ్లీ బతుకుతాం అనేది ఒక ఊరట. అదే సమయంలో చిట్టచివర చావు అనేది ఉంటుందని తెలియడం కొంతమందికి ఒక రిలీఫ్ కూడా. లేకపోతే ఎంతకాలం ఈ రోజువారీ సంకెళ్ల లాంటి వ్యవహారాలను లాక్కురావడం? అందుకే మన పెద్దలు మళ్లీ పుట్టుక లేని ముక్తిని కోరుకున్నారు కాబోలు.

సృష్టిలోని ప్రతి జీవికీ ఒక ఆయుఃప్రమాణాన్ని నిర్దేశించిన ప్రకృతి, మనిషికి 120 ఏళ్లు ఇచ్చింది. శతమానం భవతి అని పెద్దలు దీవిస్తుంటారుగానీ, దాన్ని నూరేళ్లు అనికాక, పూర్ణాయువుతో బతకమని దీవించడంగా అర్థం చేసుకోవచ్చు. అర్ధంతరంగా మరణించడం ఆ ప్రకృతి వరాన్ని పాడుచేసుకోవడమే. అర్ధంతర మరణం ఆధునిక మానవుడికి సంభవించడానికి కర్ణుడి చావుకు ఉన్నన్ని కారణాలు ఉన్నాయి. మృత్యువును, రోగాలను మోసం చేసి దీర్ఘకాలం బతగ్గలమా? మన ఆయుఃప్రమాణం కంటే చాలా ఏళ్ల పాటు బతకడాన్ని నూతన శాస్త్రీయ ఆవిష్కరణలు సాధ్యం చేయనున్నాయా? మనిషి శాశ్వతత్వాన్ని సాధించగలడా? మన ఫిజియాలజీని మార్పు చేయడం ద్వారా జీవితకాలాన్ని పొడిగించవచ్చా? ఇలాంటి ప్రశ్నలను నోబెల్ పురస్కారం అందుకున్న వెంకీ రామకృష్ణన్ తన 'వై వి డై: ద న్యూ సైన్స్ ఆఫ్ ఏజింగ్ అండ్ ద క్వెస్ట్ ఫర్ ఇమ్మోర్టాలిటీ' పుస్తకంలో చర్చించారు. మనిషి శరీరం కోటానుకోట్ల కణాల నిర్మితం. ప్రతి కణంలో ఉండే డీఎన్ఏ ప్రతిరోజూ లక్ష మార్పులకు గురవుతుంది. డీఎన్ఏను నాలుగక్షరాల వర్ణమాలలో రాసిన సుదీర్ఘమైన కోడ్ అనుకుంటే, నెమ్మదిగా దాని కార్యకలాపంలో అంతరాయం రావడమే ముదిమి రావడం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 700 బయోటెక్ కంపెనీలు ముదిమి, జీవితకాల పొడిగింపు మీద పని చేస్తున్నాయి. 'యవ్వనంలో ఉన్నప్పుడు ధనికులం కావాలనుకుంటాం; ధనికులం అయ్యాక యవ్వనాన్ని కోరుకుంటాం. యవ్వనాన్ని కొనలేకపోయినా, కనీసం దానిమీద పరిశోధనలనైనా (ఏజింగ్ రీసెర్చ్) ధనికులు కొంటున్నా'రంటారు వెంకీ రామకృష్ణన్. ఒకవేళ శాస్త్ర పరిశోధనలు ముదిమిని ఆపడంలో విజయం సాధించినా ఆ ఫలితాలు సంపన్నులకు తప్ప పేదవాళ్లకు తేలిగ్గా అందుబాటులోకి రావని చెబుతారు.

ఈ శాస్త్రాలు, పరిశోధనలతో నిమిత్తం లేకుండా; ధనిక, పేద అనే తేడా లేకుండా జీవితాన్నే ఒక సాధనగా మలుచుకున్న కొన్ని ప్రాంతాల్లో మనుషులు సంపూర్ణ ఆయువును అనుభవిస్తున్నారు. ఒకినావా (జపాన్), సార్డీనియా (ఇటలీ), నికోయా (కోస్టా రికా), ఇకారియా (గ్రీస్), లోమ లిండా (కాలిఫోర్నియా, అమెరికా)... లాంటి ప్రదేశాల్లో ఎక్కువమంది వందేళ్లు బతకడమో, దీర్ఘకాలం బతకడమో కనబడుతుంది. ఇలాంటి ప్రదేశాలు ప్రపంచంలో 'బ్లూ జోన్స్'గా నిలుస్తున్నాయి. 'లివ్ టు 100: సీక్రెట్స్ ఆఫ్ ద బ్లూ జోన్స్' డాక్యుమెంటరీ ప్రయోక్త డాన్ బ్యూట్నర్... ఈ బ్లూ జోన్స్ అని నామకరణం చేయడమే కాకుండా, వాళ్ల దీర్ఘాయువు రహస్యాలను పరిశోధించారు. శారీరక కార్యకలాపాలు, తక్కువ ఒత్తిడి, స్థానికంగా దొరికే ఆహారాన్ని వినియోగించడం, బలమైన కుటుంబ, సామాజిక సంబంధాలు వీరిని ఆరోగ్యవంతులుగా ఉంచుతున్నాయని బ్యూట్నర్ చెబుతారు. రసాయనిక ఎరువులు వేయని పంటలు, 95 శాతం మొక్క ఆధారిత ఆహారం, ఎనభై శాతం మాత్రమే తిని కడుపులో కొంత ఖాళీ ఉంచుకోవడంతోపాటు, జీవితానికి ఒక ఉద్దేశం ఉంచుకోవడం వారిని ఉత్సాహవంతులుగా ఉంచే అదనపు విషయాలు. వెంకీ రామకృష్ణన్ అయినా, బ్లూ జోన్స్ శతాధికులైనా మనిషి ఆరోగ్యానికి కీలకమని చెప్పేవి మూడు: ఆహారం, వ్యాయామం, నిద్ర. ఇవైతే మన చేతిలోనే ఉన్నాయి.

వాక్ స్వాతంత్ర్యంపై విచారణా?

కామెంట్



కరణ్ థాపర్

కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమా అని ప్రశ్నించటం ద్వారా వేర్పాటువాదాన్ని సమర్థించినట్లు ఆరోపణలు వచ్చిన పద్నాలుగేళ్ల తర్వాత 'ఉపా' చట్టం కింద అరుంధతీ రాయ్‌ని విచారించేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి మంజూరు చేశారు. భారత్‌లో విలీనాన్ని ప్రశ్నించటం, లేదా విడిపోవాలని కోరటం ఇదే మొదటిసారి కాదు. 1962 మే 1న తన తొలి రాజ్యసభ ప్రసంగంలో సి.ఎన్. అన్నాదురై సరిగ్గా ఇలాంటి ఉద్దేశాలనే వ్యక్తం చేశారు. అందుకు నెహ్రూ తెల్లబోయి ఉండవచ్చు కానీ, అన్నాదురై మీద చట్టపరమైన విచారణ జరగలేదు. నేడు మనం విశ్వ గురువులమని చెప్పుకొంటున్నప్పుడు అరుంధతీ రాయ్ పట్ల ఈ నిర్దయాపూరితమైన వ్యవహారశైలి మన గురించిన బాధాకరమైన సత్యాన్ని ప్రపంచానికి వెల్లడించదా?

మహాత్మా గాంధీ, అందునా మన జాతి పిత... ఆయన చెప్పిన విషయాలను మనం ఎంత తరచుగా గుర్తు చేసుకుంటున్నాం? అంతకన్నా కూడా ఎంత తరచుగా మన ప్రభుత్వాలు ఆయన ఆకాంక్షలకు కట్టుబడి ఉంటున్నాయి? ఇదేమీ అలంకారిక ప్రశ్న కాదని మీరు తొందరలోనే గ్రహిస్తారు. నిజానికి, మనకింకా మనస్సాక్షి అన్నది మిగిలి ఉంటే బహుశా అదొక ఇబ్బందికరమైన మనోస్థితి కావచ్చు!

1922 మార్చి 18న 'యంగ్ ఇండియా' పత్రికలో... ప్రభుత్వాలకు, మన పైన అధికారం కలిగి ఉన్న వారికి తన వైఖరి ఏమిటో గాంధీ వివరించారు. ''ప్రభుత్వం పట్ల అసంతృప్తిగా ఉండటాన్ని ఒక ధర్మంగా నేను భావిస్తున్నాను'' అని రాశారు. ''ఒక వ్యక్తికి – ఆ వ్యక్తి హింసను తలవనంత వరకు, హింసను ప్రోత్సహించనంత వరకు, లేదా హింసను ప్రేరేపించనంత వరకు – తన అయిష్టతను పూర్తిగా వ్యక్తీకరించటానికి స్వేచ్ఛ ఉండాలి'' అన్నారు. మన ప్రభుత్వం శిలాక్షరాలుగా చెక్కించి ప్రతి ఒక్క మంత్రి కార్యాలయంలో ప్రముఖంగా కనిపించేలా ఉంచాల్సిన మాటలివి.

ఆ మాటలు ఈ కాలానికీ ఎందుకు సరిపోతాయో వివరిస్తాను. కశ్మీర్ అన్నది భారతదేశంలో 'అంతర్భాగమా' అని ప్రశ్నించటం ద్వారా వేర్పాటువాదాన్ని సమర్థించినట్లు పద్నాలుగేళ్ల క్రితం వచ్చిన ఆరోపణలపై 'ఉపా' (చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక) చట్టం కింద అరుంధతీ రాయ్‌ని విచారించేందుకు తాజాగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి మంజూరు చేశారు. దాదాపు ఒకటిన్నర దశాబ్దం పాటు – ఇందులో సుదీర్ఘమైన పదేళ్ల కాలం మోదీ ప్రభుత్వంలోనిది – ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవటం, లేదా తీసుకోవటం అవసరమని భావించకపోవటం అనే వాస్తవం ఎన్నో విషయాలను చెబుతోంది. 'ఇప్పుడు ఎందుకు?' అనే ప్రశ్నను కూడా లేవనెత్తుతోంది.

భారతదేశంలో ప్రముఖులు ఒకరు రాష్ట్ర విలీనాన్ని ప్రశ్నించటం, లేదా విడిపోవాలని కోరటం ఇదే మొదటిసారి కాదు. 1962 మే 1న తన తొలి రాజ్యసభ ప్రసంగంలో సి.ఎన్. అన్నాదురై సరిగ్గా ఇలాంటి ఉద్దేశాలనే వ్యక్తం చేశారు. ''ద్రవిడియన్లు స్వయం నిర్ణయాధికారం కోసం డిమాండ్ చేస్తున్నారు... దక్షిణాది రాష్ట్రాలకు మాకు ప్రత్యేక దేశం కావాలి'' అన్నారు. ఆ మాటకు నెహ్రూ తెల్లబోయి ఉండవచ్చు కానీ అన్నాదురై మీద చట్టపరమైన విచారణ జరగలేదు. ఆయన మాటల్ని దేశ వ్యతిరేకమైనవిగా పరిగణించలేదు. నిజమే, అన్నాదురై అలా కోరటం అభ్యంతరకరం, అవాంఛనీయం కావచ్చు. కానీ ఆరు దశాబ్దాల క్రితమే భారతదేశం అన్నాదురై మాటల్ని ఆయన వాక్ స్వాతంత్ర్యంలో భాగంగా అంగీకరించింది. ఆ కాలంలోనే వివాదాస్పద ఉద్దేశాన్ని వ్యక్తం చేయటాన్ని సైతం వాక్ స్వాతంత్ర్యంలోని ఒక హక్కుగా మనం గుర్తించాం. ''ప్రభుత్వం పట్ల అసంతృప్తిగా ఉండటాన్ని ఒక ధర్మంగా నేను భావిస్తున్నాను'' అనే గాంధీజీ ప్రసిద్ధ ప్రకటనను గౌరవించాం.



అరుంధతీ రాయ్

ప్రపంచం మనకు ఏదైనా నేర్పించిందీ అంటే అది నేడు మరింత సహనాన్ని, సర్దుబాటును కలిగి ఉండమనే. బ్రిటన్‌లోని స్కాటిష్ జాతీయవాదులు, కెనడాలోని పార్టీ కెబెక్వాలు, లేదా స్పెయిన్‌లోని కెటలాన్‌లు ఆయా దేశాల నుంచి విడిపోవటం కోసం చేసిన వేర్పాటు ఉద్యమాలు గౌరవనీయమైనవిగా, దేశ వ్యతిరేకమైనవి కానివిగా పరిగణన పొందటం అంటే... పరిణతి చెందిన వివేకవంతమైన ప్రజాస్వామ్యాలు అలాంటి వేర్పాటువాద ఉద్యమ పిలుపులను దేశ వ్యతిరేకమైనవిగా చూడకూడదని సూచించటమే కదా? ఎలా మనం వివేచన గల సహనశీలత నుండి అనాలోచితమైన, ఆమోదయోగ్యం కాని అసహనంలోకి జారిపోయాం?

అందుకు కారణం... వేర్పాటు గురించి మాట్లాడి, మనల్ని కలవరానికి గురి చేసినవారు అరుంధతీ రాయ్ కావటమేనా? అందుకు కారణం... మోదీ ప్రభుత్వంపై పదునైన విమర్శ చేస్తున్న ఆమె గొంతుక ఎదురులేనిదిగా, నమ్మదగినదిగా ఉండటమేనా? అందుకు కారణం... ఎదుర్కోడానికి మనం ఇష్టపడని సందేహాలను లేవనెత్తటం ద్వారా ఆమె మన మనసు లోతుల్లో లేని పైపై మనశ్శాంతిని హరించటమేనా?

అరుంధతీ రాయ్‌ని మన అలెగ్జాండర్ సోల్జెనిట్సిన్ (రష్యా రచయిత)లా భావించాలి కానీ, విస్మృత సోవియెట్ యూనియన్ ఆయన పట్ల ప్రవర్తించిన రీతిలో ఆమె పట్ల మనం ఉండకూడదు. ఆమె మన ఉత్తమ రచయితలలో ఒకరు. ప్రపంచానికి కూడా ఆమె ఇలాగే తెలుసు. మనం నిస్సిగ్గుగా మర్చిపోయిన సల్మాన్ రష్దీ తర్వాత అంతటి ప్రసిద్ధురాలైన, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన బుకర్ ప్రైజ్ విజేత అరుంధతీ రాయ్. ఆమె పట్ల ఈ అనాగరిక, అధికార దర్ప, అనాలోచిత ప్రవర్తన... ప్రపంచంలోని అతి పెద్దదైన ప్రజాస్వామ్యానికి, అంతకుమించి ప్రజాస్వామ్యాలకే మాతృమూర్తి అయిన ఇండియాకు చెడ్డ పేరు తెస్తుంది. నిజాయితీగా, ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడాలంటే అంతే.

నేడు మనం విశ్వ గురువులమని, దక్షిణార్ధ గోళానికి నాయకులమని, ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి తగిన వాళ్లమని చెప్పుకొంటున్నాం. ఇటీవల ప్రధానమంత్రి తను తిరిగి ఎన్నికవటం 'యావత్ ప్రపంచ ప్రజాస్వామ్య విజయం' అని అన్నారు. అలాంటప్పుడు అరుంధతీ రాయ్ అభిప్రాయం పట్ల నిర్దయాపూరితమైన వ్యవహార శైలి మన గురించిన బాధాకరమైన, తప్పించుకోలేని సత్యాన్ని ప్రపంచానికి వెల్లడించదా? ఈ ప్రశ్నకు సమాధానాన్ని మీకై మీరే చెప్పుకొమ్మని వదిలేస్తున్నాను.

బదులుగా, నాకు ఎలా అనిపిస్తోందో చెబుతాను. మన ప్రజాస్వామ్యం, రాజ్యాంగం మనకు ప్రసాదించిన స్వేచ్ఛలు, పౌరహక్కుల పట్ల జీవితకాలం గర్వంగా గడిపాను. వాటినెవరూ మన నుంచి తస్కరించలేరన్నది సత్యం. ఇందిరాగాంధీ ప్రయత్నించారు కానీ విఫలమయ్యారు. కానీ ఇప్పుడు, ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకున్న ఉపశమనంలో ఉన్నప్పుడు అవి మన చేతుల్లోంచి జారిపోతాయా? అవును, అరుంధతీ రాయ్‌పై విచారణ తప్పుడు ఫలితంతో ముగిస్తే!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పడాల్సిన అడుగు



అక్టోబర్ 7 (ఇజ్రాయెలీల మీద హమాస్ దాడి చేసిన రోజు) నుంచి నేను యూదు, ఇజ్రాయెలీ స్నేహితులతో ఏర్పరుచుకున్న స్నేహాలకు కృతజ్ఞుడిగా ఉంటాను. పాలస్తీనా ప్రజలకు న్యాయం జరగాలనీ, ఆక్రమణ ముగిసిపోయి చారిత్రక ఘర్షణ అంతం కావాలనీ వాళ్లు నిజంగా కోరుకుంటున్నారు. ఈ క్షణాన మనం యుద్ధం ముగిసిపోవాలనీ, బంధితులు విడుదల కావాలనీ కోరుకుందాం. ఇరుపక్షాల ప్రజల మెరుగైన భవిష్యత్తుకు ఇది మొదటి అడుగు అవుతుంది.
– ఇహాబ్ హసన్, పాలస్తీనా యాక్టివిస్ట్

ధనికుల న్యాయం



జెనీవా (స్విట్జర్లాండ్) విల్లాలో తమ పనివాళ్లను (భారతీయులు) అన్యాయంగా వాడుకున్నందుకు కోటీశ్వరులైన హిందూజా కుటుంబ సభ్యులకు జైలుశిక్ష పడింది. కనీస వేతనం రోజుకు 28 పౌండ్లు ఉన్నచోట వాళ్లు 7 పౌండ్లు చెల్లించారు. వాళ్లతో 18 గంటలు పని చేయించుకున్నారు. వాళ్ల పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్నారు. అత్యంత ధనికుల్లో చాలామంది అమానవీయంగా ఉంటారు. సంపద వాళ్లను మరింత అత్యాశపరులను చేస్తుంది.
– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది-యాక్టివిస్ట్

స్థిరత్వం తేవాలంటే...



పాకిస్తాన్‌కు చైనా సందేశం స్పష్టంగా ఉంది: మీకు పెట్టుబడులు కావాలంటే, రాజకీయ స్థిరత్వం తెండి. ఇమ్రాన్ ఖాన్, ఇతర పీటీఐ రాజకీయ ఖైదీలను విడుదల చేయడం ఆ స్థిరత్వం దిశగా మొదటి అడుగు అవుతుంది.
– చౌధురీ ఫవాద్ హుస్సేన్, పాక్ రాజకీయ నేత

శాకాహార రోజులు



మన మతాలు వేరుకావొచ్చుగానీ నాగరికత ప్రకారం మనమంతా భారతీయులం. మన సంస్కృతిని సజీవంగా ఉంచే బాధ్యత మన మీద ఉంది. నేను నా ఎంపికతో సోమవారాలు, గురువారాల్లో శాకాహారిని. విపరీతంగా నాన్-వెజ్ తినే నా సోదరులు కూడా మా ఇంట్లో నేను మొదలుపెట్టిన ఈ సంప్రదాయాన్ని పాటిస్తుంటారు. – యానా మీర్, యాంకర్

కఠిన వాస్తవం



వయసు పెరుగుతున్నకొద్దీ, జనాలు నిజంగా మంచివాళ్లు, దయార్ద్ర హృదయులు కాదని గమనిస్తున్నాను. వాళ్లు సరదాగా ఉండొచ్చు, ఫ్రెండ్లీగా ఉండొచ్చు, తెలివిగా ఉండొచ్చు. కానీ చాలామందిలో కనీస సభ్యత, అణకువ ఉండట్లేదు.
– బి.అంజలి, కవయిత్రి

బలవంతం



ఈమధ్య ఇన్‌స్టాగ్రామ్ చూపిస్తున్న రీల్స్ ఎంతమాత్రమూ నేను సాధారణంగా చూసే కంటెంట్‌కు దగ్గరగా లేవు. మీ గొంతులోకి ఒక రకం కంటెంటును ఎలా బలవంతంగా జొప్పించాలనుకుంటున్నారో ఇది తెలియజేస్తోంది.
– ఐశ్వర్య ముద్గిల్, న్యాయవాది

ఇన్ బాక్స్

ప్రమాద రహిత రైల్వేలు కలేనా?

పశ్చిమ బెంగాల్‌లోని రంగపాణి రైల్వే స్టేషన్ సమీపంలో మరో ఘోర రైలు ప్రమాదం జరిగింది. డౌన్ కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్‌ను గూడ్స్ రైలు వెనుక నుండి ఢీకొట్టడంతో చాలా మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. రైల్వేవారు భద్రతా ప్రమాణాల పట్ల సరియైన శ్రద్ధ, చిత్త శుద్ధి కనపరచడం లేదనటానికి ఈ ప్రమాదం ఒక నిదర్శనం. ఈ ప్రమాదం అనేక ప్రశ్నలు రేకెత్తిస్తోంది. గూడ్స్ రైలు నిర్దేశించిన వేగం కంటే అధిక వేగంతో నడపడానికి ఎందుకు అనుమతించారు? అసలు రెండు రైళ్లు ఒకే ట్రాక్‌పై వెళ్ళటానికి బాధ్యులు ఎవరు?

ఈ సంఘటన మానవ తప్పిదమని, దుర్ఘటనకు గూడ్స్‌రైలు డ్రైవర్ కారణమని రైల్వే వర్గాలు తెలుపుతున్నాయి. ఈ సందర్భంగా మానవ వనరుల కొరత సంగతీ వెలుగులోకి వస్తోంది. లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్ ఉద్యోగాలను దాదాపు ఇరవై వేలు ఏళ్లతరబడి నింపకుండా వదిలేశారు. ఈ మానవ వనరుల కొరత... రైలు డ్రైవర్లు ఎక్కువ షిఫ్టులలో పనిచేయడానికి దారితీస్తోంది. ఫలితంగా ఘోరమైన ప్రమాదాలు జరుగుతున్నాయి.

2016లో ప్రారంభించిన ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ (కవచ్)ను ఫీల్డ్ ట్రయల్స్ కోసం కేవలం 1,500 కిలోమీటర్ల కంటే తక్కువ రైల్వే ట్రాక్‌లలో మాత్రమే ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. భారతీయ రైల్వేల మొత్తం ట్రాక్ దాదాపు 70 వేల కిలోమీటర్లు. కాలానుగుణంగా అవసరాలకు తగ్గట్టు కవచ్ వంటి భద్రతా వ్యవస్థల ఏర్పాటుతోపాటు, మౌలిక సదుపాయాల ఆధునికీకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. నాణ్యతతో కూడిన భద్రతా పరికరాలు ఏర్పాటు చేయాలి. ఈ దుర్ఘటనపై న్యాయవిచారణ జరిపి బాధ్యులైన వారిని గుర్తించి శిక్షించాలి. అదేవిధంగా ఇటువంటి దుర్ఘటనలు మునుముందు ఎట్టి పరిస్థితుల్లో జరగకుండా ప్రభుత్వం, రైల్వే బోర్డు వారు, రైల్వే శాఖలోని అన్ని విభాగాల ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, సాంకేతిక నిపుణులు, మేధావులు, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కూడిన ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి; దాని సూచనలతో కఠినమైన భద్రతా నియమ నిబంధనలు రూపొందించాలి. వీటిని కఠినంగా అమలుపరచడానికి అవసరమైతే పార్లమెంట్‌లో ఒక చట్టం చేయాలి. రైల్వేలోని అన్ని విభాగాలలో ఖాళీలను వెనువెంటనే భర్తీ చేయాలి. ఆధునిక అత్యంత సాంకేతికతతో వేగంగా నడిచే 'వందే భారత్' రైళ్ళతో సమానంగా అదే స్థాయిలో భద్రతతో కూడిన సురక్షితమైన ప్రయాణ పరిస్థితులు కల్పించినప్పుడే భారత రైల్వే పట్ల ప్రయాణికులకు ఒక భరోసా కలుగుతుంది.

– దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

కాలుష్య జలాలతో సాగు ఆరోగ్యానికి కీడు

విశ్లేషణ



డా॥ శ్రీదరాల రాము

హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాల్లో ఒకప్పుడు వ్యవసాయానికి ఉపయోగపడిన మంచినీటి చెరువులు జల కాలుష్యం వలన ప్రస్తుతం మురికి నీటి కూపాలుగా మారిపోయాయి. ఈ మురికినీటితో కూర కాయల సాగు అనేది విరివిగా జరుగుతోంది. ఈ విధంగా కూరగాయల సాగు చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన 11 చెరువులను పునరుద్ధరించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కలుషితం అయిన చెరువు నీటితో కూరగాయలను సాగు చేయడం వలన కూరగాయల లోనికి రసాయన కాలుష్య కారకాలు ప్రవేశించి ఆహారపు గొలుసు ద్వారా 'బయో మాగ్నిఫికేషన్' చెందడం వలన అనేక అనారోగ్య, పర్యావరణం సమస్యలు తలెత్తుతాయి.



భారతదేశం అంతటా... ముఖ్యంగా దేశంలోని పెద్ద మెట్రోపాలిటన్ నగరాలలో, లెక్కలేనన్ని సంఖ్యలో రైతులు తమ పంటలను శుద్ధి చేయని మురుగునీటితో పెంచుతున్నారు. ఉపరితల నీటికి శుద్ధి చేయని వ్యర్థపదార్థాలు వచ్చి కలిసినట్లయితే ఆ నీరు కలుషితం అవుతుంది. ఈ కలుషితమైన నీటిని రైతులు వ్యవసాయం కోసం ఉపయోగిస్తున్నారు. దీని వలన డయేరియా, చర్మవ్యాధులు, కంటి వ్యాధులు వంటివి రైతులకు సంక్రమించే అవకాశం ఉంది. కలుషిత నీటితో వ్యవసాయం చేయడం వలన వ్యవసాయ భూములను సారవంతం చేసే విలువైన సూక్ష్మజీవులు, డీకంపోజర్స్, వానపాములు వంటివి నశించిపోయి సారవంతమైన వ్యవసాయ భూమి నిస్సత్తువ వ్యవసాయ భూమిగా మారిపోతుంది.

శుద్ధి చేయని వ్యర్థ జలాల వలన వ్యర్థ జలాలలోని భారీ లోహాలు మొక్కలను విషపూరితం చేస్తాయి. అలాగే ఇది ఆహార కాలుష్యానికి దారితీస్తుంది. అదే విధంగా ఈ కూరగాయలలో విటమిన్లు లోపిస్తాయి. శరీరంలో రసాయన కాలుష్యకారకాలు పేరుకుపోతాయి. దీని ఫలితంగా క్యాన్సర్లు, జన్యు ఉత్పరివర్తనలు, పోషకాహార లోపం ఏర్పడవచ్చు.

2000 నుండి 2003 వరకు పరిశోధన ప్రాజెక్ట్‌లో భాగంగా యూకే డిపార్ట్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఢిల్లీలోని వివిధ మార్కెట్‌ల నుండి ఆజాద్‌పూర్‌లోని హోల్‌సేల్ మార్కెట్‌నుండి సేకరించిన బచ్చలికూరలో భార లోహాల కాలుష్యాన్ని గుర్తించింది.

2015 అధ్యయనంలో, భారతీయ పరిశోధకుల బృందం ఢిల్లీలోని ఐదు మార్కెట్లలో కూరగాయలలో కాడ్మియం, సీసం, జింక్, రాగి అవశేషాలను అంచనా వేసింది. విషపూరిత కలుషితాలకు గురైన కూరగాయలు, పండ్లు వంటి ప్రాథమిక ఉత్పత్తులను పరీక్షించడానికి ఈ రోజు వరకు నియంత్రణ ఫ్రేమ్‌వర్క్ ఇండియాకు లేదు. ఆహార రంగంలో నియంత్రణాపరమైన పర్యవేక్షణ లేకపోవడం, అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలను అందుకోవడంలో నిరంతర వైఫల్యం భారతదేశ రైతులు, ఆహార కంపెనీలకు ఇబ్బందిగా మారింది.

రైతులు తమ పంటలను పెంచడానికి మురుగునీటిని ఉపయోగించటానికి కారణాలు అనేకం: వేగవంతమైన జనాభా పెరుగుదల, పట్టణీకరణ, ఆహారం కోసం పెరుగుతున్న డిమాండ్, తీవ్రంగా క్షీణిస్తున్న స్వచ్ఛమైన నీటి నిల్వలు. భూగర్భ జలాలు పడిపోవడం వలన బోర్లు పడక రైతులు కలుషితమైన నీటితో వ్యవసాయం చేస్తున్నారు.


నీరు కాలుష్యమయం కాకుండా ఉండటానికి కొన్ని చర్యలు తీసుకోవాలి. పండగల సందర్భాల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన విగ్రహాలను మంచినీటి చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల ఆ నీరు కలుషితం అవుతోంది. దీనికి మంచి ఉదాహరణ హుస్సేన్ సాగర్. అందువల్ల మట్టి బొమ్మలనే నిమజ్జనం చేయాలి. గృహ వ్యర్థాలను, పారిశ్రామిక వ్యర్థాలను మంచి నీటి చెరువులలోనికి విడుదల చేయకూడదు. చెరువులను కబ్జా చేసి నివాస స్థలాలుగా మార్చడాన్ని నిరోధించాలి. డ్రిప్ ఇరిగేషన్ పద్ధతులను అవలంబించాలి. కలుషితమైన చెరువులను పునరుద్ధరించి తిరిగి మంచినీటి చెరువులుగా మార్చాలి. కలుషితమైన నీటితో వ్యవసాయ చేసే ప్రదేశాలను గుర్తించి అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

మంచి నీటి చెరువులు విలువైన సహజ సంపద కాబట్టి ప్రభుత్వం, ప్రజలు సమష్టి కృషితో వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నది.

వ్యాసకర్త ఫ్యాకల్టీ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఎన్విరాన్మెంటల్ సైన్సెస్, శ్రీ ఇందు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ । 9441184667

గురువు ప్రాశస్త్యం

గురువుని సాక్షాత్తు త్రిమూర్తుల రూపంగా భావించి పూజించే సంస్కృతి భారతీయులది. తల్లిదండ్రులు జన్మనిస్తారు. కానీ ఈ జన్మకి సార్థకత, సాఫల్యం అందించే వ్యక్తి గురువు. మన అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. అందుకే తల్లితండ్రుల తర్వాత గురువుకి ప్రముఖ స్థానమిచ్చింది మన సంస్కృతి. మనిషిని మనిషిగా తీర్చిదిద్దే శిల్పి గురువు. అందుకే మన విద్యాలయాల్లో, మన మందిరాలలో గురువుని స్మరిస్తూ ఈ శ్లోకాన్ని నిత్యమూ పఠిస్తున్నాము:



గురుర్బ్రహ్మ గురుర్విష్ణు గురుర్దేవో మహేశ్వరః!
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురువేనమః!!

మనకు విజ్ఞానశాస్త్రం ఎంత తెలిసినా, జీవన విలువలు అందించేది గురువు మాత్రమే. అయితే నేర్చుకోవాలనే జిజ్ఞాస శిష్యునికి ఉండాలి. గురువు జ్ఞానాన్ని ఒసగినప్పుడు దానిని గ్రహించి ప్రయోజకుడు కావాల్సిన బాధ్యత ప్రధానంగా శిష్యునిదే. భారతీయ గురుపరంపర సమస్తం త్యాగం ద్వారానే నిర్మాణం అయ్యింది. త్యాగం, సమర్పణ అనే ఉన్నత భావాలతో సమాజాన్ని నిర్మించే పనిని భారతీయ ఋషులు చేశారు. వ్యాస, వాల్మీకి, వశిష్ఠ వంటివారు మొదలుకొని ఆది శంకరాచార్య, సమర్థ రామదాసు, రామకృష్ణ పరమహంస వరుసలో అబ్దుల్ కలాం వరకు సేవ, త్యాగం అనేవే ఆదర్శాలుగా జీవించారు. నేడు ఆ ఆదర్శాలతో కోట్లాది మంది జీవిస్తున్నారు. 'నేను మాత్రమే బాగుండాలి' అని కాకుండా 'నాతో పాటు సమాజం బాగుండాలి', అవసరం అయితే సమాజం కొరకు కష్టపడాలి అనే జీవనవిలువ మన సమాజాన్ని నేటికీ రక్షిస్తోంది. ఇదే ఈ దేశ సహజ గుణం. ఈ జీవన విలువను అందించేది గురువు.

ఆహారం, నిద్ర, భయం, సంతానోత్పత్తి విషయాల్లో మనుషులకు, పశువులకు తేడా లేదు. ధర్మం మాత్రమే మానవులకు అధికమైన విశేషణం. ధర్మంగా బతకాలి అనే జీవన విలువను కూడా మన గురువులు అందించారు. ఈ ధర్మం అనేది భారతీయ సమాజంలో మాత్రమే కనపడేది. ప్రకృతిలోని పంచభూతాలు వాటి సహజగుణాన్ని వదిలిపెట్టవు. కానీ మనిషి తన స్వభావాన్ని వదిలిపెడుతున్నాడు. జంతువు జంతువులాగానే, పక్షి పక్షిలాగానే జీవిస్తుంది. కానీ మనిషి మనిషిలా బతకడం లేదు. మనిషికి మాత్రమే మనిషిలా జీవించు అని చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. అలా చెప్పి సన్మార్గంలో నడిపే వ్యక్తి గురువు మాత్రమే.

– సాక్షి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.తదియ తె.3.00 వరకు(తెల్లవారితే మంగళవారం), తదుపరి చవితి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ సా.5.48 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** రా.9.38 నుండి 11.10 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.28 నుండి 1.20 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.57 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.31 నుండి 1.07 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం :** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం:** 5.30 ; **సూర్యాస్తమయం:** 6.33.

కేజీబీవీలో విద్యార్థిని ఆత్మహత్య?

- ఇష్టం లేకుండా పాఠశాలలో చేర్పించారని మనస్తాపం
- పాఠశాలలో చేరిన రోజే బలవన్మరణానికి యత్నం
- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో కన్నుమూత


వర్షిణి (ఫైల్)

చిల్పూరు: జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరం సమీపంలోని కేజీబీవీలో 9వ తరగతి విద్యార్థిని ఇస్లావత్ వర్షిణి (14) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. అయితే బాలిక ఆత్మహత్య చేసుకుందని భావిస్తున్నారు. కుటుంబ సభ్యులు, పాఠశాల వర్గాలు, ఎస్సై ముత్యం రాజేందర్ కథనం ప్రకారం.. రాజవరం జీపీ పరిధి ఫకీర్‌తండాకు చెందిన ఇస్లావత్ తీరమ్మ, కిషన్ దంపతుల కూతురు వర్షిణిని శుక్రవారం కేజీబీవీలో 9వ తరగతిలో చేర్పించారు. అదే రోజు సాయంత్రం భోజనం పెట్టే సమయంలో వర్షిణి రాకపోవడంతో ఎస్‌ఓ పిలవగా.. ఆకలిగా లేదని సమాధానం చెప్పింది. ఆ రాత్రి భోజనం చేయకుండానే నిద్రపోయిన వర్షిణి, శనివారం ఉదయం మేల్కొనలేదు. గదులు శుభ్రం చేసేందుకు వచ్చిన సిబ్బంది పలకరించినా సమాధానం రాకపోవడంతో ఆమె కప్పుకున్న దుప్పటి తీయగా వాంతులు చేసుకున్నట్లు గమనించారు. పక్కన కూల్‌డ్రింక్ బాటిల్ కనిపించడంతో అనుమానంతో ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ (ఎస్‌ఓ) సోనికి తెలియజేయగా బాలిక తల్లిదండ్రులతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముందుగా వర్షిణిని స్టేషన్‌ఘన్‌పూర్ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసి వరంగల్ ఎంజీఎంకు పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ వర్షిణి ఆదివారం ఉదయం మృతి చెందింది.

ఇష్టం లేదని చెప్పింది.. : ఎస్‌ఓ

ఈ విషయమై ఇన్‌చార్జి ఎస్‌ఓ సోని మాట్లాడుతూ, శుక్రవారం వర్షిణి విద్యాలయంలో చేరిన సమయంలో తనకు హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేదని చెప్పిందని వెల్లడించారు. ఈ విషయాన్ని బాలిక తల్లి దృష్టికి తీసుకెళ్లామని, ఆమె కూడా అదే విషయాన్ని చెప్పారని అన్నారు. ఒకటి రెండు రోజుల్లో సర్దుకుంటుందని ఆమె అన్నారని తెలిపారు. కాగా, బాలిక వెంట తెచ్చుకున్న కూల్‌డ్రింక్‌లో పురుగు మందు కలిపి తెచ్చుకుని ఉంటుందని అనుమానిస్తున్నారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలిక మరణానికి కారణాలు ఆస్పత్రి వర్గాల పూర్తి నివేదిక వచ్చాక తెలుస్తుందని వారు చెప్పారు. ఇదిలా ఉండగా.. తన తండ్రి మద్యం తాగినప్పుడల్లా తల్లిని కొడుతుంటే అడ్డుగా ఉండేదానినని.. తనను హాస్టల్‌లో చేర్పిస్తే గొడవ జరిగినప్పుడు ఎవరు ఆపుతారని వర్షిణి సిబ్బందితో అన్నట్లు తెలిసింది.

ఆదివారం ఆఫీసులో ఏం పని ?

- బాలానగర్ ఆర్‌ఐపై జడ్చర్ల ఎమ్మెల్యే మండిపాటు

జడ్చర్ల: ప్రభుత్వ కార్యాలయంలో సెలవు రోజున ఏం పనులు వెలగబెడుతున్నారంటూ ఓ ఆర్‌ఐపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మండిపడ్డారు. వివరాల్లోకి వెళితే...మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి గిరప్పతో రెవెన్యూ రికార్డులకు సంబంధించిన నోట్స్ రాయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వెంటనే అక్కడికి వచ్చి ఆర్‌ఐ వెంకట్‌రెడ్డితోపాటు రికార్డులు రాస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. తలుపులు మూసుకొని రికార్డుల ఫైల్స్ రాయడం ఏమిటని ప్రశ్నించారు. జేసీ అనుమతితో సక్సేషన్ రాస్తున్నామని ఆర్‌ఐ సమాధానం ఇవ్వడంతో, జేసీకి ఫోన్ కలపాలని చెప్పారు. ప్రైవేట్ వ్యక్తులను కార్యాలయంలోకి తీసుకొచ్చి రికార్డులు రాయించడం ఏమిటని నిలదీశారు. సంబంధిత ఆర్‌ఐపై చర్యలు తీసుకోకపోతే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫోన్‌లో ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా తాము సెలవు రోజు కూడా కార్యాలయంలో పనులు చేస్తున్నామని ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఘాంసిమియాగూడలో చిరుత కలకలం!

శంషాబాద్ రూరల్ (హైదరాబాద్): మండలంలోని ఘాంసిమియాగూడలో చిరుతపులి ఆనవాళ్లు స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రెండు రోజులుగా పొలాల వద్ద లేగదూడలు, కుక్కలపై దాడి చేసిన చిరుత.. శనివారం రాత్రి ఒక ఇంటి వద్ద తిరగడం సీసీ కెమెరాల్లో కనిపించింది. రెండు రోజుల కిందట.. గ్రామానికి చెందిన నర్సింహ పొలం వద్ద గుర్తు తెలియని జంతువు లేగదూడ, కుక్కపై దాడి చేసింది. దీంతో అవి తీవ్ర గాయాలతో మృతి చెందాయి. ఇదే క్రమంలో గ్రామ శివారులో శంకరాపురం వెళ్లే దారిలో రాజేశ్ ఇంటి వద్ద శనివారం రాత్రి ఒంటి గంట సమయంలో చిరుత సంచరించినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. వెంటనే అటవీశాఖ శాఖాధికారులకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న అటవీ శాఖాధికారులు.. చిరుత సంచరించినట్లు చెబుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న కాలి గుర్తులను పరిశీలించారు. దూడ, కుక్కలపై దాడి చేసిన జంతువు చిరుత పులేనని రైతులు స్పష్టం చేస్తుండగా.. అటవీ శాఖాధికారులు నిర్ధారించడం లేదు. సోమవారం స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదం ఎలా జరిగింది?

స్వయంగా శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలు సేకరించనున్న ఆర్టీసీ

ఆర్టీసీ బస్సు ఢీకొని చనిపోయిన సందర్భాల్లో పోలీసులు కేసు దర్యాప్తు చేయటం సహజం. వారి దర్యాప్తు నివేదిక ఆధారంగానే కోర్టులు తీర్పులు చెబుతాయి. అయితే ఆ ప్రమాదానికి గల కారణాలపై స్వయంగా ఆర్టీసీ కూడా ఆధారాలు సేకరించి కోర్టులకు సమర్పించాలని నిర్ణయించింది. ప్రమాదానికి కారణాలేంటి, అందులో ఆర్టీసీ డ్రైవర్ తప్పు లేనప్పుడు.. ప్రమాదానికి ఎదుటివారు ఎలా కారణమయ్యారు? రెండు వైపులా తప్పు ఉంటే.. ప్రమాద తీవ్రతలో ఆర్టీసీ డ్రైవర్ తప్పిదం ఎంత.. తదితర వివరాలను శాస్త్రీయంగా సేకరించబోతోంది. దీనికోసం పుణె కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ ఆర్టీసీ ఉద్యోగులకు శిక్షణ ప్రారంభించింది.

- ఓ అంతర్జాతీయ సంస్థతో అవగాహన
- ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న పుణెకు చెందిన నిపుణులు
- పరిహార భారం తగ్గించుకునే దిశగా కసరత్తు



కొన్ని నెలల క్రితం నగరంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆర్టీసీ బస్సు ఢీకొని చనిపోయాడు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్నందున అతని సంపాదన పెద్దదే. దీంతో అతని కుటుంబానికి ఆర్టీసీ రూ.కోటిన్నర వరకు పరిహారం చెల్లించాల్సి వచ్చింది. సంపాదనతో ప్రమేయం లేకున్నా, ఓ మనిషి చనిపోతే కనిష్టంగా రూ.20 లక్షల వరకు పరిహారం చెల్లించాల్సిన పరిస్థితి ఉంది.

సాక్షి, హైదరాబాద్: రోడ్లు నెత్తురోడుతున్నాయి. పెరిగిన ట్రాఫిక్, అధునాతన వాహనాల వినియోగం, రోడ్డుభద్రత నియమాల ఉల్లంఘన.. వెరసి ప్రమాదాలకు కారణమవుతోంది. ఈ ప్రమాదాల్లో ఆర్టీసీ బస్సుల వాటా కూడా ఉంటోంది. తెలంగాణ ఆర్టీసీ బస్సులు ఢీకొని సంవత్సరానికి సగటున 250 మంది నుంచి 300 మంది వరకు చనిపోతున్నారు. ప్రమాదం జరగ్గానే బస్సు డ్రైవర్‌దే తప్పు అన్న భావన సగటు వ్యక్తిలో కలుగుతుంది. పోలీసు విభాగంలో కూడా ఇదే తరహా ముందస్తు భావన కలుగుతోంది. దీన్నే 'బిగ్ వెహికిల్ సిండ్రోమ్'గా పరిగణిస్తారు. ద్విచక్రవాహనదారు తప్పిదం వల్లనే ప్రమాదం చోటు చేసుకున్నా.. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదవుతోంది. సరైన ఆధారాలు లేని సందర్భాల్లో ఆర్టీసీ డ్రైవర్‌కు శిక్ష పడటంతోపాటు, చనిపోయిన వ్యక్తి కుటుంబానికి సంస్థ భారీగా పరిహారం చెల్లించాల్సి వస్తోంది.

ఏడాదికి రూ.100 కోట్లు పరిహారం

నాలుగేళ్ల క్రితం నాటి ప్రమాదాల తాలూకు పరిహారాలు ఇప్పుడు (కోర్టు కేసులు ముగిసిన తర్వాత) చెల్లిస్తున్నారు. ప్రస్తుతం ఆ మొత్తం సగటున ఏడాదికి రూ.100 కోట్ల వరకు ఉంటోంది.. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాల్లో మృతి చెందిన వారికి పరిహారం చెల్లించేనాటికి ఆ మొత్తం రూ.150 కోట్ల వరకు చేరుకుంటుందని అంచనా. అసలే నష్టాల్లో కుదేలవుతున్న ఆర్టీసీకి ఇది పెద్ద భారంగా మారబోతోంది. దానిని భారీగా తగ్గించుకోవాలని సంస్థ భావిస్తోంది.

డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నా...

రోడ్డు ప్రమాదాలను నిరోధించేందుకు డ్రైవర్లకు ఆర్టీసీ ప్రత్యేకంగా శిక్షణ ఇస్తోంది. ఎప్పటికప్పుడు వారిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది, డిపో స్థాయిలో గేట్ మీటింగ్స్ ద్వారా డ్రైవర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండేందుకు అవగాహన కల్పిస్తోంది. అయినా.. ప్రమాదాలు తప్పటం లేదు.

ప్రమాదాలకు ఆధారాలు సేకరించడంపైనే..

హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఉన్నందున.. ప్రమాదానికి కారణాలేంటో స్పష్టంగా తెలుస్తుంది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ తప్పులేనప్పుడు సీసీటీవీ ఫుటేజీని కోర్టుల్లో ప్రవేశపెట్టి పరిహారం నుంచి బయటపడొచ్చు. కానీ సీసీటీవీ కెమెరాలు లేని ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో, బస్సు డ్రైవర్ తప్పు లేకున్నా, పెద్ద వాహనం అన్న భావనతో కారణం బస్సు డ్రైవర్ మీదకే వస్తోందని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఎదుటి వాహనదారులు/పాదచారుల తప్పిదంతో ప్రమాదం జరిగి వారు చనిపోతున్నా ఆర్టీసీ డ్రైవర్‌కు శిక్ష పడుతోంది, ఆర్టీసీ పరిహారం చెల్లించాల్సి వస్తోంది. ఇలాంటి సందర్భాల్లో ప్రమాదానికి కారణాల ఆధారాలను శాస్త్రీయంగా సేకరించాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈ విషయంలో మంచి అనుభవం ఉన్న జేపీ రీసెర్చ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో ఆర్టీసీ అవగాహన కుదుర్చుకుంది. కోయంబత్తూరు, పూణె కేంద్రాలుగా ఈ సంస్థ నడుస్తోంది. పుణె కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ నిపుణులు తాజాగా ఆర్టీసీ అధికారులకు ఈ విషయంలో శిక్షణ మొదలుపెట్టారు. సీసీటీవీ కెమెరాలు లాంటివి లేని ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు.. ప్రమాదానికి కారణాలను శాస్త్రీయపద్ధతిలో ఎలా గుర్తించాలి అన్న విషయంలో నిపుణులు శిక్షణ కార్యక్రమాల ద్వారా వెల్లడిస్తున్నారు. దాదాపు 500 అంశాల ఆధారంగా ప్రమాదానికి కారణాలను కచ్చితంగా గుర్తించే వీలుంటుందని, ఆయా అంశాలు ఐదు భాగాలుగా పరిగణించాల్సి ఉంటుందని పేర్కొంటూ వాటిల్లో ముఖ్యమైన అంశాల వారీగా అధికారులకు శిక్షణ ఇస్తున్నారు. డిపో మేనేజర్లు, ట్రాఫిక్ సీఐలను మూడు జట్లుగా విభజించి శిక్షణ ఇస్తున్నారు. ఇందులో తొలిదఫా శిక్షణ మూడు రోజులు కొనసాగింది. శిక్షణలో పాల్గొన్న అధికారులు వారివారి డిపోల్లోని ఇతర సిబ్బంది వాటిపై అవగాహన కల్పించనున్నారు.

'కంచుమేళం' రామచంద్రయ్య ఇక లేరు

2022లో పద్మశ్రీ పురస్కారం

మణుగూరురూరల్ : పద్మశ్రీ పురస్కార గ్రహీత సకిని రామచంద్రయ్య(65) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం బావికూనవరం గ్రామానికి చెందిన రామచంద్రయ్య మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరలో కీలకపాత్ర పోషించేవారు. కంచుమేళం, కంచుతాళంతో అమ్మవార్లను గద్దెలకు చేర్చడంలో ఆయనే కీలకం. మేడారం జాతరకు అనుబంధంగా మణుగూరు మండలం తోగ్గూడెంలో జరిగే సమ్మక్క–సారలమ్మ జాతరలోనూ రామచంద్రయ్య వాయిద్యాలకు విశిష్ట స్థానం ఉండేది. కంచుమేళంలో ఆయన ప్రతిభను గుర్తించి కేంద్రప్రభుత్వం 2022 జనవరి 25న పద్మశ్రీ ప్రకటించగా, అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రూ.కోటి నజరానాతోపాటు కొత్తగూడెం జిల్లా కేంద్రంలో 426 గజాల ఇంటిస్థలం కేటాయిస్తున్నట్టు ప్రకటించినా, ఇంతవరకు ఆయనకు అందలేదు. దీనిపై ఇటీవల ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మణుగూరుకు వచ్చిన మంత్రి సీతక్కను కూడా రామచంద్రయ్య కలిసి విన్నవించారు. అయితే స్వయంగా కొంత ఆర్థికసాయం అందించిన సీతక్క.. ఎన్నికల కోడ్ ముగిశాక తన వద్దకు వస్తే సీఎం రేవంత్‌రెడ్డికి సమస్య వివరిస్తానని హామీ ఇచ్చారు. కానీ అనారోగ్యంతో ఉన్న రామచంద్రయ్య మంత్రి వద్దకు వెళ్లలేకపోయారని కుటుంబసభ్యులు తెలిపారు. రామచంద్రయ్య మృతి పట్ల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంతాపం ప్రకటించారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్‌విపాటిల్ కూనవరంలో రామచంద్రయ్య మృతదేహానికి నివాళులర్పించారు.


రామచంద్రయ్య (ఫైల్)

రామచంద్రయ్య మరణం విషాదకరం

సాక్షి, హైదరాబాద్: కోయ అధ్యయన వేదిక మిత్రుడు, సమ్మక్క–సారమ్మ తదితర కోయవీరుల కథా గాయకుడు రామచంద్రయ్య మరణం విషాదకరమని ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, డాక్టర్ గూడూరు మనోజ, పద్దం అనసూయ అన్నారు. గత ప్రభుత్వం ఇస్తామన్న కోటి రూపాయల ఆర్థికసాయం ఇప్పటికీ అందలేదన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో పద్మశ్రీ పురస్కార గ్రహీతలలో కొందరికి డబ్బులు ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఈ విషయాన్ని మనసు మీదకు తీసుకొని రామచంద్రయ్య బాధపడుతూ ఉండేవారన్నారు. చివరకు అనారోగ్యం పాలై ఆర్థిక ఇబ్బందుల్లో మరణించారన్నారు. ఓ కోయ కళాకారుడు ఇలాంటి స్థితిలో మరణించడం హృదయాన్ని కలచి వేస్తోందని ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు.

మావోయిస్టు కీలకనేత బిచ్చు లొంగుబాటు

- భార్యతో సహా మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ సమక్షంలో..
- గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టు పార్టీకి షాక్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన కీలకనేతల్లో ఒకరైన నంగ్సు తుమ్రెట్టి అలియాస్ గిరిధర్ అలియాస్ బిచ్చుతోపాటు ఆయన భార్య లలితా ఉసెండీ అలియాస్ సంగీత ఆదివారం మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ సమక్షంలో లొంగిపోయారు. గడ్చిరోలి జిల్లా ఎటపల్లి తాలూకాకు చెందిన బిచ్చు 1997లో మావోయిస్టు పార్టీలో చేరి అంచలంచెలుగా ఎదిగారు. దాడులు చేయడంలో దిట్టగా పేరున్న కంపెనీ–4కు కమాండర్‌గా బిచ్చు వ్యవహరించారు. ఆ తర్వాత దక్షిణ గడ్చిరోలి జిల్లా కార్యదర్శి, కమాండర్ హోదాలో బిచ్చు మావోయిస్టు పార్టీలో కొనసాగారు. ఇప్పటి వరకు ఆయనపై 179 కేసులు నమోదు కాగా, అందులో ఎదురుకాల్పులకు సంబంధించినవి 86 వరకు ఉన్నాయి. బిచ్చుపై రూ.25లక్షల రివార్డు ఉంది. బిచ్చు భార్య సంగీతపై 18 కేసులుండగా, రూ.16 లక్షల రివార్డు ఉంది.


గడ్చిరోలిలో లొంగిపోయిన మావోయిస్టులు బిచ్చు, సంగీత

రిక్రూట్‌మెంట్లు తగ్గిపోయాయి : ఫడ్నవిస్

గడిచిన నాలుగేళ్లలో గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టు పార్టీలోకి రిక్రూట్‌మెంట్లు గణనీయంగా తగ్గిపోయాయని డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. గడిచిన నాలుగేళ్లలో పోలీస్ రిక్రూట్‌మెంట్‌లకు ఈ జిల్లా నుంచి 28 వేల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. మావోయిస్టుల కంటే ప్రభుత్వానికే ప్రజల మద్దతు ఎక్కువగా ఉందనేందుకు ఇది ఉదాహరణ అన్నారు. డీజీపీ అంకిత్‌గోయల్ మాట్లాడుతూ 2021 నుంచి జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో గడ్చిరోలి జిల్లాలో 65 మంది మావోయిస్టులు మృతి చెందారని, వీరిలో ఆ పార్టీకి చెందిన అగ్రనేతలు ఉన్నారన్నారు.

ఈశ్వరమ్మ చిన్నమామ మృతిపై అనుమానాలు

- భూముల కోసం ముందస్తు ప్లాన్‌తోనే చెంచు కుటుంబీకులపై దాడులు


కాట్రాజు నాగన్న (ఫైల్)

సాక్షి, నాగర్‌కర్నూల్: చెంచు మహిళ ఈశ్వరమ్మపై జరిగిన అమానుష దాడి ఘటనలో మరిన్ని విషయాలు ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి. చెంచుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వారి భూమిని దక్కించుకునేందుకు కొందరు హత్య చేసేందుకు కూడా వెనుకాడలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లికి చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మపై ఆమె భూమిని కౌలుకు తీసుకున్న వ్యక్తులు పాశవికంగా దాడి చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ నెల 3న ఈశ్వరమ్మ చిన్నమామ కాట్రాజు నాగన్న(56) అనుమానాస్పదస్థితిలో మరణించాడు. భూతగాదా నేపథ్యంలోనే ఆయన్ను హత్య చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చెంచుల భూములపై కన్ను..

చెంచుల భూములపై ఇతరులు కన్నేశారు. ఈ క్రమంలో ఎదురుతిరిగిన వారిని మట్టుబెట్టేందుకు సైతం వెనుకాడలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొలచింతలపల్లిలో సర్వే నంబర్ 171లో నాగన్నకు 2.5 ఎకరాల భూమి ఉంది. నాగన్న అన్న వీరస్వామికి చెందిన భూమిని బండి వెంకటేశ్ కౌలు చేస్తున్నాడు. ఎకరా రూ.20 లక్షల వరకు ధర ఉన్నా, రూ.4.50 లక్షల చొప్పున ఇవ్వాలని వెంకటేశ్ ఒత్తిడి చేస్తుండగా, అందుకు నాగన్న ఒప్పుకోలేదని తెలిసింది. ఈ క్రమంలోనే నాగన్న గ్రామ శివారులోని రాయరాసులపెంట సమీపంలో ఓ బండరాయి వద్ద అనుమానాస్పద స్థితిలో మరణించాడు. నాగన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించకుండానే అంత్యక్రియలు నిర్వహించారు. తాజాగా ఈశ్వరమ్మపై దాడి నేపథ్యంలో నాగన్నను హత్య చేశారన్న అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఆమెపై దాడితోపాటు నాగన్న మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ కోరారు.

నిమ్స్‌కు ఈశ్వరమ్మ

- క్షీణించిన చెంచు మహిళ ఆరోగ్యం

సాక్షి, హైదరాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతపల్లిలో దాడికి గురైన చెంచు మహిళ ఈశ్వరమ్మ ఆరోగ్యం క్షీణించడంతో ఆదివారం అర్ధరాత్రి నిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. నాగర్‌కర్నూల్ ఆస్పత్రిలో కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్న ఆమెకు ఫిట్స్ రావడంతో మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తీసుకొచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఆమె ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, న్యూరాలజీ, జనరల్ వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేశామని ఆస్పత్రి డైరెక్టర్ బీరప్ప తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకుందాం

- జలవనరుల నిపుణుడు వి.ప్రకాశ్

కరీంనగర్: కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకోవడం ద్వారానే తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని జలవనరుల నిపుణుడు వి.ప్రకాశ్ అన్నారు. ఆదివారం కరీంనగర్ ఫిలింభవన్‌లో డాక్టర్ బీఎస్.రావు ఫౌండేషన్ అధ్యక్షుడు బీఎస్.రావు ఆధ్వర్యంలో 'కాళేశ్వరాన్ని కాపాడుకుందాం' అనే అంశంపై జరిగిన చర్చావేదికలో ప్రకాశ్ ప్రసంగించారు. మానవాళి మనుగడకు జీవనాధారం నీరు అని, నీటిని సంరక్షించుకోవడం ద్వారానే అన్నిరకాల జీవరాశులు వృద్ధి చెందుతాయన్నారు. తెలంగాణ ప్రాంతం వెనుకబడటానికి కారణం ఆంధ్రపాలకుల కుట్రలేనని చెప్పారు. రాష్ట్ర సాధనే లక్ష్యంగా జరిగిన ఉద్యమాలు నిధులు, నీళ్లు, నియామకాల కోసమేనని, 57 ఏళ్లుగా స్వరాష్ట్ర సాధన కోసం తెలంగాణలో పోరాటాలు సాగాయని గుర్తు చేశారు. 1969లో రాష్ట్రం వస్తే మన వనరులు మనకు దక్కేవని, అప్పటి ఆంధ్ర పాలకులు ఉద్యమాన్ని అణచివేసి తెలంగాణను దోచుకోవడంపైనే శ్రద్ధ చూపారని ఆరోపించారు. కేసీఆర్ 2001లో ఉద్యమాన్ని ఉధృతం చేసి 14 ఏళ్లపాటు రాజీలేని పోరాటం చేశారని, చివరకు 2014లో రాష్ట్రాన్ని సాధించారని పేర్కొన్నారు. పదేళ్లుగా కేసీఆర్ తెలంగాణ వనరులను పెంచడమే లక్ష్యంగా పనిచేశారని, మిషన్ కాకతీయ ద్వారా చెరువులు, కుంటలు తవ్వించారన్నారు. గోదావరి నుంచి నీరు వృథాగా పోతుంటే.. కాళేశ్వరం వద్ద ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మించారని, హరితతెలంగాణగా మార్చారని తెలిపారు. పదేళ్లలో పండిన పంటలే కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితాలన్నారు. ప్రాజెక్టులు నిర్మించే సమయంలో బ్యారేజీలు ఇసుకలోనే కడతారని, సీపేజీలు తప్పనిసరిగా ఉంటాయని జలవనరుల నిపుణులు, ఇంజనీర్లే ఎన్నోసార్లు చెప్పారని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్మించిన బ్యారేజీల్లో రెండు పిల్లర్లు కుంగితే మంచి చేయాల్సిన పాలకులు గగ్గోలు పెట్టి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే తహతహలాడారని, ప్రాజెక్టు రిపేర్‌పై దృష్టిసారించలేదన్నారు. ఎన్నికలు అయిపోగానే అదే కాంట్రాక్టు సంస్థ పనులు మొదలుపెట్టిందని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రిటైర్డు చీఫ్ ఇంజనీర్ కృష్ణమూర్తి, భీమనాథుని సత్యనారాయణ, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చర్చావేదికలో మాట్లాడుతున్న వి.ప్రకాశ్



పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న సాక్షి మీడియా గ్రూప్ ఎడిటర్ వర్ధెల్లి మురళి

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

- సాక్షి మీడియా గ్రూప్ ఎడిటర్ వర్ధెల్లి మురళి
- తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మల్లూర్ జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరణ

నూతనకల్: సమాజంలో నాటి నుంచి నేటి వరకు హక్కుల సాధనకు ఉద్యమాలు తప్పడంలేదని సాక్షి మీడియా గ్రూప్ ఎడిటర్ వర్ధెల్లి మురళి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తొట్ల మల్లూర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై ప్రపంచవ్యాప్తంగా అనేక పోరాటాలు జరిగాయని, వాటి ద్వారానే ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకున్నారని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాటానికి పూర్వం సమాజంలోని అసమానతలు, అంటరానితనం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఎంతో మంది వీరులు తమ పోరాటాన్ని కొనసాగించారని, ఇందులో తొట్ల మల్లూర్ ముఖ్య భూమిక పోషించారని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రజలకు లభించే హక్కులను భూస్వాములు, పెత్తందార్లు కాలరాసినప్పుడు వారి అసంతృప్తిని గ్రహించి పోరాట పంథా వైపు నడిపించి, సమస్యలను పరిష్కరించిన ఎంతో మంది వీరులు తెలంగాణ ప్రాంతంలో ఉన్నారని చెప్పారు. న్యాయమైన సమాజ నిర్మాణం కోసం పార్టీలకు అతీతంగా నేటి యువత ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తొట్ల మల్లూర్ స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ మాట్లాడుతూ.. అన్యాయానికి గురవుతున్న పీడిత ప్రజలను ఏకతాటిపై నడిపించి, సాయుధ పోరాటం చేసిన ఘనత మల్లూర్‌దేనని అని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్గూరి గోవిందు, జెడ్పీటీసీ సభ్యుడు కందాల దామోదర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తాడూరి లింగయ్య, ఎక్సైజ్ డీఎస్పీ బిక్కి గుర్వయ్య తదితరులు పాల్గొన్నారు.


కోడె మొక్కు చెల్లించుకుంటున్న హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద

రాజన్న సేవలో హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద

పూర్ణకుంభ స్వాగతం పలికిన ఆలయ అర్చకులు

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో ఆమెకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కోడెమొక్కు చెల్లించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అద్దాల మండపంలో స్వామి వారి ప్రసాదాలు అందించి, సత్కరించారు. జిల్లా జడ్జి ప్రేమలత, వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి సుజన, ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీ నాగేంద్రచారి, ఆలయ ఈవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాస్‌రావు పూజలు


హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాస్‌రావుకు ప్రసాదం ఇస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా..ఈఓ భాస్కర్ రావు లడ్డూ ప్రసాదం అందజేశారు. కాగా, యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం సెలవురోజు కావడంతో భక్తుల రద్దీ నెలకొంది. శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. శ్రీస్వామివారిని ఆదివారం ఒక్కరోజే 45వేల మందికిపైగా భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.64,43,032 వచ్చినట్లు ఆలయ ఈఓ వెల్లడించారు.

సుప్రీంకోర్టుకు కేజ్రీవాల్

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తనకు ఇచ్చిన బెయిల్‌పై మధ్యంతర స్టే విధిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు ఈ నెల 20న బెయిల్ మంజూరు చేసింది. దీనిపై ఈ నెల 21న ఢిల్లీ హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. దీంతో కేజ్రీవాల్ తీహార్ జైల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. మనీ లాండరింగ్ కేసులో మార్చి 21న ఈడీ ఆయనను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

భారత జాలర్ల అరెస్టు

కొలంబో: తమ జలాల్లో అక్రమంగా చేపల వేటకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై 18 మంది భారత మత్స్యకారులను శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. మూడు నౌకలను స్వాధీనం చేసుకుంది. శనివారం రాత్రి నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్‌లో డెల్ఫ్ట్ దీవులకు సమీపంలోని ఉత్తర సముద్రంలో మత్స్యకారులను అరెస్టు చేసినట్లు, తదుపరి చట్టపరమైన చర్యల కోసం అరెస్టయిన మత్స్యకారులను కంకేసంతురై ఫిషింగ్ హార్బర్‌కు తరలించనున్నట్లు శ్రీలంక నేవీ అధికార ప్రతినిధి కెప్టెన్ గయాన్ విక్రమసూర్య తెలిపారు. ఈ ఏడాదిలో శ్రీలంక జలాల్లో అక్రమంగా చేపల వేటకు పాల్పడినందుకు 180 మందికి పైగా భారత మత్స్యకారులను శ్రీలంక అరెస్టు చేసింది.

ఎలాన్ మస్క్‌కు 11వ బిడ్డ



న్యూయార్క్: ప్రపంచ కుబేరుడు, టెస్లా, స్పేస్ ఎక్స్, న్యూరాలింక్ సంస్థల సీఈఓ ఎలాన్ మస్క్ మరోసారి తండ్రయ్యారు. న్యూరాలింక్ స్పెషల్ ప్రాజెక్ట్స్ హెడ్ శివోన్ జిలిస్ ద్వారా ఆయనకు కొన్ని రోజుల క్రితం మూడో బిడ్డ జన్మించినట్లు బ్లూమ్‌బర్గ్ సంస్థ వెల్లడించింది. దీంతో మస్క్ పిల్లల సంఖ్య ఇప్పటిదాకా 11కు చేరుకున్నట్లు తెలియజేసింది. మస్క్‌కు మొదటి భార్య, రచయిత్రి జస్టిన్ మస్క్ ద్వారా ఐదుగురు బిడ్డలు కలిగారు. సంగీత కళాకారిణి గ్రిమ్స్ ద్వారా ముగ్గురు పిల్లలు, శివోన్ జిలిస్ ద్వారా మరో ముగ్గురు పిల్లలు జన్మించారు. ఎలాన్ మస్క్, శివోన్ జిలిస్‌కు 2021లో కవలలు పుట్టారు. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో జననాల రేటు పడిపోతుండడంతో జనాభా తగ్గిపోతోందని మస్క్ 2021లో ఆందోళన వ్యక్తంచేశారు. అందుకే జనాభాను పెంచాలని, వీలైనంత ఎక్కువ మంది పిల్లలను కనాలని సూచించారు. పిల్లలను కనకపోతే నాగరికత అంతమైపోతుందని చెప్పారు. అత్యధికంగా తెలివితేటలు, మేధాశక్తి ఉన్న వ్యక్తులు పిల్లలను ఎక్కువగా కనాలన్నది మస్క్ అభిప్రాయం. ఆయనకు తన సంస్థల్లో పనిచేసే మహిళలతో వివాహేతర సంబంధాలున్నాయని ఆరోపణలున్నాయి.



సునాక్ ఎదురీత!

14 ఏళ్ల కన్జర్వేటివ్ పాలనకు తెర? ● లేబర్ పార్టీదే గెలుపు అంటున్న సర్వేలు ● బ్రిటన్‌లో జూలై 4న సార్వత్రిక ఎన్నికలు

బ్రిటన్‌లో పద్నాలుగేళ్ల కన్జర్వేటివ్ పాలనకు తెరపడనుందా? భారత మూలాలున్న తొలి ప్రధానిగా చరిత్ర సృష్టించిన రిషి సునాక్ గద్దె దిగాల్సి వస్తుందా? అవుననే అంటున్నాయి ఒపీనియన్ పోల్స్. షెడ్యూల్ ప్రకారం ఏడాది చివరిదాకా ఆగితే తన ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి తారస్థాయికి చేరి ఓటమి ఖాయమనే భావనతో రిషి అనూహ్యంగా జూలై 4న ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. అయినా పెద్దగా ప్రయోజనమేమీ ఉండకపోవచ్చని సర్వేలంటున్నాయి. విపక్ష లేబర్ పార్టీ భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని పేర్కొంటున్నాయి. స్వయానా రిషీ కూడా ఎదురీదుతున్నారని, సొంత పార్లమెంట్ స్థానాన్ని కూడా కోల్పోవచ్చని సావంత పోల్ పేర్కొంది! అదే జరిగితే సొంత పార్లమెంటు స్థానంలో ఓడిన తొలి సిట్టింగ్ ప్రధానిగా బ్రిటన్ చరిత్రలో రిషి నిలిచిపోతారు...

ముందస్తు ఎన్నికలకు వెళ్లడంతోనే కన్జర్వేటివ్ పార్టీ ఓటమి సగం ఖాయమైందన్నది రాజకీయ నిపుణుల అభిప్రాయం. బ్రిటన్‌లో కన్జర్వేటివ్ పార్టీది 190 ఏళ్ల చరిత్ర. ఇంత సుదీర్ఘ చరిత్రలో 1906లో వచ్చిన 131 సీట్లే అత్యల్పం. ఈసారి ఆ రికార్డును అధిగమించవచ్చని సర్వేలంటున్నాయి. ''సునాక్ ఉత్తర ఇంగ్లాండ్‌లోని కన్జర్వేటివ్‌ల కంచుకోటైన తన సొంత పార్లమెంటరీ స్థానాన్ని కూడా కోల్పోవచ్చు. ఆర్థిక మంత్రి జెరెమీ హంట్‌తో సహా పలువురు సీనియర్ మంత్రులకు ఓటమి తప్పదు'' అని సావంత పోల్ పేర్కొంది. కన్జర్వేటివ్ పార్టీ చరిత్రలోనే అత్యంత ఘోర పరాజయం తప్పక పోవచ్చని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత సంతతికి చెందిన వారు ఈసారి కన్జర్వేటివ్ పార్టీకి ఓటేయకపోవచ్చనేది పోల్‌స్టర్ల అంచనా.

లేబర్ పార్టీకి 425కు పైగా సీట్లు...!

హౌజ్ ఆఫ్ కామన్స్‌లో 650 సీట్లకు గాను లేబర్ పార్టీ 425కు పైగా సాధించి భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని సర్వేలు చెబుతున్నాయి. కన్జర్వేటివ్ పార్టీ 108 స్థానాలకు పరిమితమవుతుందని యూగవ్, కేవలం 53 స్థానాలకే పరిమితమవుతారని సావంత పోల్ పేర్కొన్నాయి. సావంత అయితే లేబర్ పార్టీకి దాని చరిత్రలోనే అత్యధికంగా 516 సీట్లు రావచ్చని అంచనా వేయడం విశేషం! కన్జర్వేటివ్‌లకు 72కు మించబోవని, లేబర్ పార్టీ 456 సీట్లు దాటుతుందని బెస్ట్ ఫర్ బ్రిటన్ సర్వే అంచనా వేసింది. 2019 ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ 43.6 శాతం ఓట్లతో 365 సీట్లు సాధించగా లేబర్ పార్టీకి 32.1 శాతం ఓట్లతో 202 స్థానాలు దక్కాయి.

ఆకట్టుకుంటున్న కైర్ స్టార్మర్

'లెఫ్టీ లండన్ లాయర్'గా పేరు తెచ్చుకున్న కైర్ స్టార్మర్ లేబర్ పార్టీకి నాయకత్వం వహిస్తున్నారు. 14 ఏళ్లుగా విపక్షంలో ఉంటూ కుంగిపోయిన పార్టీలో ఆయన జోష్ నింపుతున్నారు. ఇళ్ల సంక్షోభాన్ని పరిష్కరిస్తామని, పన్ను పెంపుదల లేకుండా మెరుగైన ప్రజా సేవలను అందిస్తామనే హామీలతో ఓటర్లను ఆకర్షిస్తున్నారు. కన్జర్వేటివ్ పార్టీ ప్రధాన దాత అయిన బిలియనీర్ జాన్ కాడ్వెల్ కూడా ఈసారి లేబర్ పార్టీకి మద్దతిస్తున్నారు. తాను లేబర్ పార్టీకే ఓటేస్తానని బాహాటంగా చెబుతున్నారు. అందరూ అదే చేయాలని పిలుపునిస్తున్నారు.

ప్రజల్లో వ్యతిరేకతకు కారణాలెన్నో...

బ్రెగ్జిట్ పరిణామాల నేపథ్యంలో డేవిడ్ కామెరాన్ రాజీనామా అనంతరం చీటికీమాటికీ ప్రధానులు మారడం కన్జర్వేటివ్ పార్టీకి చేటు చేసింది. థెరిసా మే, బోరిస్ జాన్సన్, లిజ్ ట్రస్, రిషి రూపంలో ఏకంగా నలుగురు ప్రధానులు మారారు. వీరిలో 45 రోజులే కొనసాగిన ట్రస్ పార్టీకి గట్టి నష్టాన్ని కలిగించారని, దాన్ని సునాక్ పూడ్చలేకపోయారని అంటున్నారు.

- ఐదేళ్లలో బ్రిటన్ వాసుల జీవన ప్రమాణాలు బాగా పడిపోయాయి. వారిపై పన్ను భారమైతే గత 70 ఏళ్లలో అత్యధిక స్థాయిలో ఉంది. అక్రమ వలసలు పెరిగాయి. ప్రధానిగా సునాక్ నిర్ణయాలపై సొంత పార్టీ నేతల నుంచే విమర్శలొచ్చాయి.
- వీటికి తోడు 14 ఏళ్లుగా అధికారంలో ఉండటంతో సహజంగానే ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉంది.
- 2022 అక్టోబర్లో రిషి ప్రధాని అవుతూనే ద్రవ్యోల్బణాన్ని సగానికి తగ్గిస్తానని, ఆర్థిక వ్యవస్థను గాడిన పెడతానని, రుణ భారాన్ని, నేషనల్ హెల్త్ సర్వీస్ వెయిటింగ్ జాబితాను తగ్గిస్తానని, అక్రమ వలసలను అడ్డుకుంటానని హామీ ఇచ్చారు. ఇవేవీ చేయలేకపోగా సంప్రదాయ ఓటర్లనూ మెప్పించలేకపోయారని విమర్శ ఉంది.
- రిఫార్మ్ యూకే పార్టీ పుంజుకోవడం కూడా కన్జర్వేటివ్‌లను దెబ్బ తీయనుంది. ఈ పార్టీకి 15 శాతం ఓట్ల వాటా ఉంది. ఈసారి చాలా స్థానాల్లో కన్జర్వేటివ్ ఓటు బ్యాంకుకు భారీగా గండి పెడుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

నేటి నుంచి పార్లమెంట్

- నేడు, రేపు లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారం
- బుధవారం స్పీకర్ ఎన్నిక, ఉభయ సభలను ఉద్దేశించి గురువారం రాష్ట్రపతి ప్రసంగం

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. 18వ లోక్‌సభకు ఎన్నికైన సభ్యులు సోమవారం, మంగళవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రొటెం స్పీకర్ భర్తృహరి వారితో మెహతాబ్ ప్రమాణం చేయిస్తారు. తొలుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరితో ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం తొలుత ప్రధాని నరేంద్ర మోదీ, ఆ తర్వాత సీనియారిటీ ఆధారంగా మంత్రులు, ఎంపీలు ప్రమాణం చేస్తారు. ఆంగ్ల వర్ణక్రమంలో రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారు. బుధవారం లోక్‌సభ సభ్యులందరూ కలిసి నూతన స్పీకర్‌ను ఎన్నుకుంటారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ అనంతరం వచ్చే నెల 3వ తేదీన పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ముగియనున్నాయి. వర్షాకాల సమావేశాలు జూలై 22వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి.

స్పీకర్‌గా మళ్లీ ఓం బిర్లా!

ప్రొటెం స్పీకర్ ప్యానెల్‌లో ఉండడానికి విపక్ష నేతలు విముఖత చూపడంతో స్పీకర్ ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈసారి స్పీకర్ పదవిని ఎన్డీయేలో బీజేపీయేతర పక్షాలకు కేటాయిస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. మరోవైపు మిత్రపక్షాలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో బీజేపీ నాయకత్వం స్పీకర్ పదవిని ఇతరులకు ఇచ్చే అవకాశం తక్కువేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. స్పీకర్ పదవిని మహిళలకు కేటాయించే పక్షంలో గుజరాత్‌కు చెందిన పూనంబెన్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దగ్గుబాటి పురందేశ్వరి పేర్లు వినిపిస్తున్నాయి. గత లోక్‌సభను తనదైన రీతిలో ముందుకు నడిపించిన ఓం బిర్లా పేరు కూడా తెరపైకి వచ్చింది. గత లోక్‌సభలో విపక్ష సభ్యులు తక్కువైనప్పటికీ వారు వినిపించిన ప్రభుత్వ వ్యతిరేక గళం అధికార పక్షంపై ప్రభావం చూపకుండా సభను నడిపించడంలో ఓం బిర్లా చాతుర్యం చూపించారు.

అమెరికాలో భారీ వర్షాలు

వాషింగ్టన్: ఎడతెరిపి కురుస్తున్న భారీ వర్షాలతో అమెరికాలో అయోవా రాష్ట్రం అతలాకుతలమైంది. వర్షపు నీటిలో మునిగి రహదారులు కనిపించకుండాపోయాయి. ఇళ్లు నీట మునగడంతో జనం సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. జలదిగ్బంధంలో చిక్కుకుపోయిన వారిని హెలికాప్టర్ సాయంతో రక్షించేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. పడవల్లో జనాలను వేరే చోట్లకు తరలిస్తున్నారు. అయోవా రాష్ట్రంలోని సియాక్స్ కౌంటీలోని రాక్‌వ్యాలీ జనావాసం మొత్తం జలమయమైంది. 21 కౌంటీల్లో అత్యవసర పరిస్థితి విధించారు.



సౌత్ డకోటాలో వరద బీభత్సం

45.72 సెంటీమీటర్ల వర్షపాతం

సౌత్ డకోటాలోనూ భీకర వర్షాలు కురుస్తున్నాయి. ఆగ్నేయ సియాక్స్ ఫాల్స్ సమీపంలోని కాన్‌టన్ పట్టణంలో ఏకంగా 45.72 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జాతీయ రహదారులపైనా వర్షపు నీరు నిలిచింది. దీంతో హైవేలపై రాకపోకలను పోలీసులు ఆపేశారు. మిన్నెసోటాలోనూ రాష్ట్ర రహదారులను మూసేశారు.

మిగతా రాష్ట్రాలు అతి ఎండలు

అమెరికాలో ఓవైపు వర్షాలు వణికిస్తుంటే మిగతా రాష్ట్రాల్లో భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. 1.5 కోట్ల జనాభాను వడగాల్పులు వేధిస్తున్నాయని, మరో 9 కోట్ల మంది భయంకర ఎండల బారిన పడ్డారని జాతీయ వాతావరణ సంస్థ ఆదివారం ప్రకటించింది. 1936 తర్వాత ఎన్నడూలేనంతగా గత ఏడాది అత్యధిక వడగాల్పులు అమెరికాకు ముచ్చెమటలు పట్టించాయి. దీంతో గత 45 ఏళ్లలో ఎప్పుడూలేనంతగా 2,300 మంది ఎండ సంబంధ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయారు. సోమవారం వాషింగ్టన్, కాలిఫోర్నియాలోని సెంట్రల్ వ్యాలీల్లో అధిక ఉష్ణోగ్రత నమోదుకావచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

పునర్వినియోగ ప్రయోగ వాహన పరీక్ష సక్సెస్

మూడోసారి విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా)/సాక్షి, బెంగళూరు: గతంతో పోలిస్తే అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ పునర్వినియోగ ప్రయోగ వాహనాన్ని వరసగా మూడోసారీ విజయవంతంగా పరీక్షించినట్లు ఇస్రో ఆదివారం ప్రకటించింది. రీ యూజబుల్ లాంచ్ వెహికల్(ఆర్‌ఎల్‌వీ) అభివృద్ధిలో సంక్లిష్టమైన సాంకేతికతను ఇస్రో సముపార్జించిందని ఈ ప్రయోగం మరోసారి నిరూపించింది. ఆకాశం నుంచి కిందకు విడిచిపెట్టాక గమ్యం దిశగా రావడం, ల్యాండింగ్ ప్రాంతాన్ని ఖచ్చితంగా ఎంచుకోవడం, వేగంగా ల్యాండ్ అవడం వంటి పరామితులను పుష్పక్‌గా పిలుచుకునే ఈ ఆర్‌ఎల్‌వీ ఖచ్చితత్వంతో సాధించిందని ఇస్రో ఆదివారం పేర్కొంది. ల్యాండింగ్ ఎక్స్‌పరిమెంట్(ఎల్‌ఈఎక్స్-03) సిరీస్‌లో మూడోది, చివరిదైన ఈ ప్రయోగాన్ని ఆదివారం ఉదయం 7.10 గంటలకు కర్ణాటకలోని చిత్రదుర్గలో ఉన్న ఇస్రో వారి ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్‌లో జరిపారు. మొదట పుష్పక్‌ను భారత వాయుసేనకు చెందిన చినూక్ హెలికాప్టర్‌లో రన్‌వేకు 4.5 కిలోమీటర్ల దూరంలో 4.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి విడిచిపెట్టారు. అది సరిగ్గా రన్‌వే వైపు ఖచ్చితత్వంతో దూసుకొచ్చి అతి గాలులున్న ప్రతికూల వాతావరణంలోనూ సురక్షితంగా ల్యాండ్ అయింది. తక్కువ ఎత్తుకు తీసుకెళ్లి విడిచిపెట్టడం వల్ల ల్యాండింగ్ సమయంలో దాని వేగం గంటకు 320 కి.మీ.లు పెరిగింది. సాధారణంగా ల్యాండింగ్ జరుగుతున్నపుడు వాణిజ్య విమానం గంటకు 260 కి.మీ.లు, యుద్ధవిమానమైతే గంటకు 280 కి.మీ.ల వేగంతో ల్యాండ్ అవుతాయి. ల్యాండ్ కాగానే బ్రేక్ పారాచూట్ విచ్చుకోవడంతో పుష్పక్ వేగం గంటకు 100 కి.మీ.లకు తగ్గిపోయింది. ల్యాండింగ్ గేర్ బ్రేకులు వేయడంతో పుష్పక్ ఎట్టకేలకు స్థిరంగా ఆగింది. పుష్పక్ స్వయంచాలిత రడ్డర్, నోస్ వీల్ స్టీరింగ్ వ్యవస్థలను సరిగా వాడుకుందని ఇస్రో పేర్కొంది.



మరణశయ్యపై ఖలీదా జియా!

మాజీ ప్రధానిని ప్రభుత్వం చంపజూస్తోందన్న బంగ్లా విపక్షం



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియాకు సరైన వైద్య అందించకుండా ఆమెపై ప్రధాని షేక్ హసీనా పగ తీర్చుకుంటున్నారని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ ఆరోపించింది. ఖలీదా 'మరణశయ్య'పై ఉన్నారని, ఆమెకు సరైన వైద్య చికిత్స అందడం లేదని ఆ పార్టీ సెక్రటరీ జేనరల్ ఫక్రుల్ ఇస్లామ్ అలంగీర్ ఆదివారం తెలిపారు. గృహ నిర్బంధంలో ఉన్న 78 ఏళ్ల ఖలీదా జియా శనివారం రాత్రి తన నివాసంలో అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారని, వెంటనే అంబులెన్స్‌లో ఎవర్‌కేర్ ఆస్పత్రికి తరలించారని తెలిపారు. 1991 నుంచి 96 వరకు, 2001 నుంచి 2006 రెండు పర్యాయాలు ప్రధానిగా పనిచేసిన ఖలీదా ఓ అవినీతి కేసులో జైలుపాలయ్యారు. అయితే జియా ఓల్డ్ ఢాకా సెంట్రల్ జైల్లోనే అనారోగ్యానికి గురయ్యారు. ఆ సమయంలోనే ఆమెకు సరైన వైద్యం అందలేదని అలంగీర్ ఆరోపించారు. ఆ తరువాత ఆమె ఇంట్లో ఉండటానికి అనుమతించినప్పటికీ పూర్తి నిర్బంధంలో జైలులాంటి జీవితాన్నే అనుభవిస్తున్నారని చెప్పారు. ఇప్పుడు తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఖలీదాకు విదేశాల్లో చికిత్స అవసరమని మెడికల్ బోర్డు చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, సరైన వైద్యం అందకుండా చంపేసి, రాజకీయంగా అడ్డు తొలగించుకోవాలని ప్రధాని షేక్ హసీనా చూస్తున్నారని అలంగీర్ ఆరోపించారు.

మేనల్లుడే వారసుడు: మాయావతి

లక్నో: బీఎస్పీ అధినేత్రి మాయావతి మేనల్లుడు ఆకాశ్ ఆనంద్ తన వారసుడని మరోసారి ప్రకటించారు. పార్టీ కీలక బాధ్యతల నుంచి తప్పిస్తూ నెల రోజుల కిందటి నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. ఆనంద్‌ను పార్టీ జాతీయ కో-ఆర్డినేటర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశం అనంతరం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఆకాశ్‌ను మాయా గత డిసెంబర్‌లోనే తన వారసుడిగా ప్రకటించారు. అయితే లోక్‌సభ ఎన్నికల సమయంలో సీతాపూర్‌లో ర్యాలీలో చేసిన ప్రసంగంలో ఆనంద్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ కేసు నమోదైంది. దీంతో ఆయన ఇంకా పరిణితి చెందాల్సి ఉందంటూ మూడో దశ ఎన్నికలు ముగిసిన వెంటనే పార్టీ బాధ్యతలనుంచి తప్పించారు.

బిహార్‌లో కూలిన మూడో వంతెన

మోతీహారి: బిహార్‌లో వంతెనలు వరుసగా కూలిపోతున్నాయి. ఇప్పటికే రెండు బ్రిడ్జిలు కూలిపోగా, తాజాగా ఆదివారం తూర్పు చంపారన్ జిల్లాలోని మోతీహారిలోని ఘోరాసహన్ బ్లాక్‌లో నిర్మాణంలో ఉన్న వంతెన మరొకటి కూలిపోయింది. కాలువపై నిర్మిస్తున్న ఈ వంతెన అమ్వా గ్రామాన్ని బ్లాక్‌లోని ఇతర ప్రాంతాలకు కలుపుతుంది. 16 మీటర్ల పొడవైన వంతెనను రూరల్ వర్క్స్ విభాగం రూ.1.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తోంది. ఘటనపై విచారణకు ఆదేశించామని, అయితే కారణాలేమీ తెలియ రాలేదని ప్రభుత్వ అదనపు కార్యదర్శి దీపక్ కుమార్ సింగ్ తెలిపారు.

ఉక్రెయిన్ దాడుల్లో ఆరుగురి మృతి

కీవ్: రష్యా భూభాగాలపై ఉక్రెయిన్ ఆదివారం డ్రోన్లు, క్షిపణులతో ప్రతీకార దాడులకు దిగింది. వాటిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. క్రిమియా ద్వీపకల్పంలోని సెవస్టోపోల్ తీరపట్టణంపై ఉక్రెయిన్ ఐదు క్షిపణులను ప్రయోగించింది. రష్యాను ఎదుర్కొనేందుకు అమెరికా, పాశ్చాత్య దేశాలు తమకు మరిన్ని ఆయుధాలివ్వాలని అధ్యక్షుడు జెలెన్‌స్కీ మరోసారి కోరారు.

నీట్ అక్రమాలపై సీబీఐ కేసు నమోదు

బిహార్‌లో సీబీఐ బృందంపై దాడి

న్యూఢిల్లీ: నీట్-యూజీ అక్రమాలపై దర్యాప్తు కోసం సీబీఐ రంగంలోకి దిగింది. కేసులో మొదటి ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు ఆదివారం వెల్లడించింది. గుర్తుతెలియని వ్యక్తులను నిందితులుగా చేరుస్తూ పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నీట్ అవకతవకలపై పలు రాష్ట్రాల్లో నమోదైన కేసులను సీబీఐకి బదిలీ చేసేలా చర్యలు చేపట్టారు. యూజీసీ-నెట్ పరీక్ష అక్రమాలపై దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారుల బృందంపై బిహార్‌లోని నవదా జిల్లా కాసియాదీ గ్రామంలో శనివారం సాయంత్రం దాడి జరిగింది. సీబీఐ అధికారుల వాహనాలపై స్థానికులు దాడికి దిగారు. పోలీసులు వారిని చెదరగొట్టారు. మరోవైపు గ్రేస్ మార్కులు సంపాదించిన 1,563 మంది అభ్యర్థుల్లో 813 మంది మళ్లీ నీట్-యూజీ పరీక్ష రాశారు.

నీట్ కుంభకోణంలో ప్రభుత్వ పెద్దలు: ఖర్గే

విద్యా వ్యవస్థలోకి పేపర్ లీకేజీలు, అవినీతి, అక్రమాలు, విద్యా మాఫియా చొరబడ్డాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. నీట్-యూజీ అభ్యర్థులకు జరిగిన అన్యాయానికి మోదీ ప్రభుత్వం బాధ్యత వహించాలంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. నీట్ కుంభకోణంలో ప్రభుత్వ పెద్దల హస్తముందని, వారిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తుకు పెద్ద ముప్పుగా మారిందనేందుకు ఇదొక ఉదాహరణ అని రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ వద్రా అన్నారు. విద్యావ్యవస్థను మోదీ ప్రభుత్వం మాఫియాకు, అవినీతి పరులకు అప్పగించిందని దుయ్యబట్టారు.

మీ అవధుల్లేని ప్రేమే నన్ను రక్షించింది

వయనాడ్ ప్రజలకు రాహుల్ భావోద్వేగ లేఖ

వయనాడ్: రాయ్‌బరేలీలోనూ నెగ్గడంతో వయనాడ్ లోక్‌సభ స్థానానికి రాజీనామా చేసిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆ నియోజకవర్గ ప్రజలకు ఆదివారం భావోద్వేగ లేఖ రాశారు. '' మీకు నేను పెద్దగా పరిచయం లేకున్నా నన్ను నమ్మారు. అవ్యాజమైన ప్రేమాభిమానాలు కురిపించారు. మీ రాజకీయ నేపథ్యం, వర్గం, మతం, భాషతో నిమిత్తం లేకుండా ఆదరించారు. ఎన్డీఏ శ్రేణులు నన్ను రోజూ అనవసరంగా తిట్టిపోస్తున్నా, వ్యక్తిగత దూషణకు బరితెగించినా మీ అవధుల్లేని ప్రేమే నన్ను కాపాడింది. మీరే నా సొంతిల్లు, నా కుటుంబం. మీకెలా కృతజ్ఞతలు తెలపాలో అర్థం కావడం లేదు. కష్టకాలంలో మీరు చూపిన ప్రేమ, ఇచ్చిన ధైర్యం అపూర్వం. మీరంతా నా కుటుంబంలో భాగం. మీ ఆశీస్సులతో ప్రియాంక వయనాడ్‌లో గెలిచి పార్లమెంట్‌లో మీ గళం వినిపిస్తారు'' అని రాహుల్ అన్నారు.

డీఎస్పీ నుంచి కానిస్టేబుల్‌గా డిమోషన్

లక్నో: ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు పదోన్నతి లభించడం సాధారణం. అయితే కానిస్టేబుల్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి డీఎస్పీ స్థాయికి చేరుకున్న ఒక పోలీసు అధికారి మళ్లీ కానిస్టేబుల్‌గా డిమోట్ అయిన ఘటన ఉత్తరప్రదేశ్‌లో తాజాగా చోటుచేసుకుంది. మూడేళ్ల క్రితం ఉన్నావ్ పరిధిలోని బిఘావ్ సర్కిల్ ఆఫీసర్ కృపాశంకర్ కనౌజియా సెలవు మీద వెళ్లి ఆచూకీ లేకుండా పోయారు. భార్య ఫిర్యాదుతో గాలించి కాన్పూర్ సమీపంలోని ఒక హోటల్ గదిలో ఉన్నట్టు కనిపెట్టారు. అందులో ఓ మహిళా కానిస్టేబుల్‌తో అక్రమ సంబంధం కొనసాగిస్తున్న కృపాశంకర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయనపై కఠిన చర్యలకు లక్నో రేంజ్ ఐజీ సిఫార్సు చేశారు. బాధ్యత మరచిన వ్యక్తి ఉన్నత పదవికి అనర్హుడంటూ విచారణ కమిటీ తాజాగా నివేదిక ఇచ్చింది. దాంతో కానిస్టేబుల్‌గా ప్రభుత్వం డిమోట్ చేసింది. దాంతో కానిస్టేబుల్ నుంచి మొదలైన ఆయన వృత్తి జీవితం మళ్లీ అక్కడికే వచ్చి చేరింది!

జేడీఎస్ ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ అరెస్ట్

అసహజ లైంగిక వేధింపులపై కేసు నమోదు

బనశంకరి: మహిళలపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ సోదరుడు, జేడీ(ఎస్) ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ అరెస్టయ్యారు. 'అసహజ నేరాల' కింద ఆయన్ను అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ పెద్ద కుమారుడైన సూరజ్ జూన్ 16న తనను లైంగికంగా వేధించాడని చేతన్ అనే 27 ఏళ్ల వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతనికి ఆదివారం వైద్యపరీక్షలు నిర్వహించారు. కేసు దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది.

రూ.5 కోట్ల కోసం బ్లాక్‌మెయిల్

జేడీఎస్ కార్యకర్త అయిన చేతన్ డబ్బుల కోసం సూరజ్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆయన సన్నిహితుడు శివకుమార్ ఫిర్యాదు చేశారు. రూ.5 కోట్లు ఇవ్వకపోతే తప్పుడు కేసు పెడతానని బెదిరించాడన్నారు. ప్రజ్వల్ రేవణ్ణ ఇప్పటికే జైలులో ఉన్న విషయం తెలిసిందే.



అగ్ని, జలశక్తులను గౌరవిస్తూ ఏటా జరుపుకునే ఇవాన్ కుపాలా నైట్ జానపద ఉత్సవంలో భోగి మంట చుట్టూ గుమికూడిన ఉక్రెయిన్ జాతీయులు. పోలండ్ రాజధాని వార్సా పట్టణంలో తీసిందీ ఫొటో.

ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ ఘాతుకం

సుక్మా జిల్లాలో ఐఈడీతో వాహనం పేల్చివేత ● ఇద్దరు సీఆర్‌పీఎఫ్ 'కోబ్రా' జవాన్లు మృతి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో నక్సలైట్ల ఘాతుకానికి సీఆర్‌పీఎఫ్ కోబ్రా దళానికి చెందిన ఇద్దరు జవాన్లు మృతిచెందారు. జేగురుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిల్గేర్ దగ్గర ఇటీవల సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో క్యాంపు ఏర్పాటైంది. దీనికి సమీపంలో ఉన్న టేకులగూడ క్యాంపు నుంచి సిల్గేర్‌కు సరుకులు తీసుకెళ్తున్న వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నక్సలైట్లు శక్తివంతమైన ఐఈడీ (ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్) పేల్చారు. పేలుడు తీవ్రతకు వాహనం తునాతునకలైంది. ఇంజన్‌తో పాటు డ్రైవర్ క్యాబిన్‌లోని సీట్లు వాహనం నుంచి విడిపోయి గాల్లోకి ఎగిరి ఘటనా స్థలిలో చెల్లాచెదురుగా పడ్డాయి. కానిస్టేబుల్ శైలేంద్ర(29), వాహనం డ్రైవర్ విష్ణు ఆర్(35) ప్రాణాలు కోల్పోయారు.

తప్పిన భారీ నష్టం

ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులపై భద్రతా దళాలు విరుచుకుపడుతున్నాయి. గడిచిన ఆరు నెలల్లో 131 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. మావోయిస్టుల అడ్డాగా పేరొందిన సిల్గేర్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఇటీవల క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపునకు సమీపంలోనే మావోయిస్టు అగ్రనేత హిడ్మా స్వగ్రామం పువ్వర్తి ఉంది. తమకు పట్టున్న ప్రాంతాల్లోకి చొచ్చుకొస్తున్న భద్రతా దళాలకు బ్రేక్ వేసేందుకు మావోయిస్టులు వల పన్ని ఐఈడీ పేల్చారు. అది సరుకుల వాహనం కావడంతో ఇద్దరు సిబ్బందే ఉన్నారు. పూర్తిగా భద్రతా దళాలు ప్రయాణించి ఉంటే ప్రాణనష్టం భారీగా ఉండేదని అధికారులన్నారు.



మందుపాతర పేల్చడంతో ఎగిరిపడిన ట్రక్కు

NH 65

యమ డేంజర్



విశ్రాంతి తీసుకుంటున్న ప్రయాణికులే టార్గెట్

వరుస దోపిడీలు, దొంగతనాలతో జనం బెంబేలు

గడిచిన నెలలో 4 ఉదంతాలు నమోదు

అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

గత నెలలో కట్టంగూర్ పరిధిలో

- హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిలోని కట్టంగూర్ సమీపంలో సర్వీస్ రోడ్డులో వాహనం ఆపి విశ్రాంతి తీసుకుంటున్న ఓ వ్యక్తిపై దుండగులు దాడి చేసి దోచుకున్నారు.
- హైవేపై ఉన్న మరో ప్రాంతంలో సెల్‌ఫోన్ తస్కరణకు గురైంది. నిద్రిస్తున్న వ్యక్తికి ఏమాత్రం తెలియకుండా కారు డోర్ తెరిచి ఫోన్ దొంగిలించారు.

ఈ నెలలో నార్కట్‌పల్లి, చిట్యాలలో

- ఏపీ లింగోటం దగ్గర టార్చ్‌లైట్లు వేసి నిల్చున్న ఇద్దరు మహిళల్ని చూసి ఆకర్షితుడైన లారీ డ్రైవర్ ఎల్లేష్ వాహనం ఆపి వారితో మాటలు కలిపాడు. అప్పటివరకు చీకటిలో మాటు వేసిన ఇద్దరు వ్యక్తులు అదును చూసుకుని అతడిపై విరుచుకు పడ్డారు. కాళ్లు, చేతులు కట్టేసి లారీలోని టూల్ బాక్సులో ఉన్న రూ.22 వేల నగదు తీసుకుని నలుగురూ ఉడాయించారు.
- తూర్పుగోదావరి జిల్లా అమలాపురం నుంచి హైదరాబాద్ బయల్దేరిన ఓ కుటుంబం అర్ధరాత్రి 2.30 గంటల ప్రాంతంలో చిట్యాల మండలం పెద్ద కాపర్తి వద్ద విశ్రాంతి కోసం ఆగింది. ముసుగులు ధరించి వచ్చిన ఇద్దరు వ్యక్తులు రాళ్లతో కారు అద్దాలు పగలకొట్టారు. ఆ శబ్దానికి నిద్రలేచిన బాధితులను బెదిరించి బంగారు ఆభరణాలు దోచుకుపోయారు.

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలోనే అత్యంత కీలక రహదారుల్లో ఒకటైన జాతీయ రహదారి (ఎన్‌హెచ్) నం. 65 డేంజర్ మార్గ్‌గా మారిపోయింది. హైదరాబాద్-విజయవాడ మధ్య ఉన్న దీనిపై అనునిత్యం వాహనాలు పరుగులు పెడుతుంటాయి. ప్రయాణంలో అలసిపోయిన కొందరు రహదారి పక్కన, సర్వీస్ రోడ్లలో విశ్రాంతి తీసుకుంటుంటారు. ఇలాంటి వారితో పాటు లారీ డ్రైవర్లకు ఎర వేసి దోచుకునే ముఠాలతో ఈ రహదారి యమడేంజర్‌గా మారిపోయింది. గడిచిన నెల రోజుల్లో ఈ తరహాకు చెందిన నాలుగు ఉదంతాలు చోటుచేసుకోగా... నిందితులు ఇప్పటివరకు చిక్కలేదు. వీరి కోసం నల్లగొండ జిల్లా, రాచకొండ పోలీసు కమిషనరేట్లకు చెందిన ప్రత్యేక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్ 65పై ఆగే ప్రయాణికులకు పోలీసులు పలు కీలక సూచనలు చేస్తున్నారు.



ఈ జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాల్లో అత్యధికం వ్యక్తిగత వాహనాలైన కార్లు, జీపులు వంటి తేలికపాటివే ఉంటాయి. అటు విజయవాడ, ఇటు హైదరాబాద్‌తోపాటు మధ్యలో ఉన్న కోదాడ, సూర్యాపేట, నల్లగొండ తదితర ప్రాంతాలకు వెళ్లే వారి కోసం ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. పగటిపూట కంటే రాత్రి వేళల్లోనే ఈ బస్సులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే సమయాభావం, లాస్ట్ మైల్ కనెక్టివిటీ లేకపోవడంతోపాటు అనివార్య కారణాల నేపథ్యంలో ఇప్పటికీ అనేక మంది వ్యక్తిగత వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రెండు నగరాల మధ్య దూరం 277 కిలోమీటర్లే కావడంతో వాహనం నడిపే వాళ్లు అలసిపోవడం అనేది చాలా తక్కువ. హైదరాబాద్, విజయవాడల కంటే దూరమైన ప్రాంతాల నుంచి వీటి మీదుగా ప్రయాణించే వాళ్లు రాత్రి వేళల్లో అలసిపోయి విశ్రాంతి తీసుకుంటారు. ఇలా రహదారి పక్కన, ట్రక్ లే బైలో, సర్వీస్ రోడ్లపై నిద్రిస్తున్న వారే దొంగలకు టార్గెట్‌గా మారుతున్నారు.

ఎక్కువగా వ్యక్తిగత వాహనాలే...

లైట్ వేశారంటే స్కెచ్ వేసినట్లే..

వాణిజ్య వాహనాలైన లారీలు, ట్రక్కులు తదితరాలు నడిపే వారూ బాధితులుగా మారిన సందర్భాలున్నాయి. అనునిత్యం హైవేలపై సంచరించే వీరికి ఏయే రూట్లలో, ఏయే ప్రాంతాలు సురక్షితం? ఎక్కడ వాహనాలు ఆపుకోవాలి? ఎక్కడ విశ్రాంతి తీసుకోవాలి? తదితర అంశాలపై పూర్తి అవగాహన ఉంటుంది. అయితే ఈ కమర్షియల్ వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు వారి బలహీనతల కారణంగా దొంగల బారినపడుతున్నారు. కమర్షియల్ వాహనాల డ్రైవర్లు ఉద్యోగనిమిత్తం దీర్ఘకాలం ఇంటికి, కుటుంబానికి దూరంగా ఉంటారు. ఇలాంటి వారిని ఆకర్షించడానికే అనేక ప్రాంతాల్లో హైవే వ్యభిచారం జోరుగా సాగుతోంది. తాజాగా ఈ తరహా బలహీనతలను సొమ్ము చేసుకుంటూ వారిని దోచుకునే ముఠాలు ఎన్‌హెచ్ 65లో రంగంలోకి దిగాయి. రాత్రివేళల్లో రోడ్డు పక్కన నిర్మానుష్య ప్రాంతాల్లో నక్కి ఉండే దొంగలు... తమ భాగస్వాములైన మహిళలు టార్చిలైట్లు లేదా సెల్‌ఫోన్ లైట్లు వెలిగించేలా పథకం వేస్తారు. వీటిని చూసి ఆకర్షితులై వచ్చే వాణిజ్య వాహనాల డ్రైవర్లపై దాడి చేసి దోచుకుంటున్నారు.

ఈ లోపాలే ప్రధాన కారణం..

హైవేపై జరుగుతున్న ఉదంతాల్లో అనేకం పోలీసుల వరకు రావట్లేదు. భారీ సొత్తు పోగొట్టుకోవడమో, గాయపడటమో జరిగితేనే ఫిర్యాదులు, కేసుల వరకు వెళ్తున్నారు. చిన్న చిన్న ఉదంతాలు, బలహీనతల కారణంగా చోటు చేసుకున్నవి బయటకు రావట్లేదు. కొన్నేళ్ల క్రితం వరకు ఈ హైవేపై గస్తీ కోసం ప్రత్యేకంగా వాహనాలు ఉండేవి. ఆపై తేలికపాటి వాహనాల స్థానంలో ద్విచక్ర వాహనాలను ప్రవేశపెట్టారు. ప్రతి 25 కిలోమీటర్లకు ఒక బృందం చొప్పున విధులు నిర్వర్తించేది. కొన్నాళ్లు ఈ గస్తీ బృందాలు కనుమరుగయ్యాయి. జాతీయ రహదారి వెంట ఉన్న శాంతిభద్రతల విభాగం ఠాణాలకు చెందిన అధికారులు, సిబ్బందే గస్తీ నిర్వహిస్తున్నారు. ఆ పోలీసుస్టేషన్లలో పని ఒత్తిడి, సిబ్బంది కొరత నేపథ్యంలో క్రమం తప్పకుండా పెట్రోలింగ్ సాధ్యం కావట్లేదు. ఈ హైవేపై వెలిమినేడు వద్ద ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని, పర్యవేక్షణ, గస్తీ బాధ్యతల్ని వీరికే అప్పగించాలనే ప్రతిపాదన ఏళ్లుగా ఫైళ్లకే పరిమితమైంది. బస్ బేలు, ట్రక్ లే బైలో ఎక్కడా సరైన వెలుతురు, నిఘా లేకపోవడమూ దుండగులకు కలిసొస్తోంది.

ఈ చర్యలు తీసుకోవాలి...


- వాహనచోదకులు కేవలం టోల్ ప్లాజాల వద్ద, దాబాలు, హోటళ్ల సమీపంలో మాత్రమే తమ వాహనాలను నిలిపి విశ్రాంతి తీసుకోవాలి.
- నిర్మానుష్య ప్రాంతాలు, ట్రక్ లే బైల్లో నిలపాల్సి వస్తే నిర్ణీత సంఖ్యలో వాహనాలున్న చోటనే ఆపుకోవాలి.
- ప్రస్తుతం ఉన్న గస్తీ వాహనాలను రాత్రి వేళల్లో హైవేలపై మోహరించాలి. ఒక్కో వాహనానికి నిర్ణీత ప్రాంతం కేటాయించి పెట్రోలింగ్ చేయించాలి.
- మఫ్టీ పోలీసులను కార్లలో ఉంచడం ద్వారా ఆపరేషన్లు చేపట్టాలి. ఇలా వీళ్లు ప్రయాణికుల్లా వ్యవహరిస్తే దొంగలు దొరికే అవకాశం ఉంది.
- జాతీయ రహదారుల వెంట ఉన్న బస్ బేలు, ట్రక్ లే బైల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాల నిఘా ఉంచాలి.
- ఎన్‌హెచ్ 65లో అనేక చోట్ల సీసీ కెమెరాలు ఉన్నాయి. అయితే వీటిలో అత్యధికం మరమ్మతులకు గురయ్యాయి. వీటిని తక్షణం వినియోగంలోకి తేవాలి.

నిఘా ఉన్న చోటే పార్క్ చేసుకోండి



ఎన్‌హెచ్ 65పై చోరీలతోపాటు స్నాచింగ్స్ కూడా నమోదయ్యాయి. వీటిని పరిగణనలోకి తీసుకుని ప్రధాన జంక్షన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. రాత్రి వేళల్లో గస్తీ విస్తృతం చేయడంతోపాటు ఎక్కడికక్కడ వాహనాలు తనిఖీ చేస్తున్నాం. ప్రయాణికులు సైతం తమ వాహనాలను సీసీ కెమెరాలున్న ప్రాంతాల్లోనే పార్క్ చేసుకుని విశ్రాంతి తీసుకోవాలి. ఆథరైజ్డ్ హోటళ్లలోనే బస చేయాలి. కొత్త వారు ఎవరైనా సమీపంలోకి వస్తున్నా, మాట్లాడాలని ప్రయత్నిస్తున్నా అప్రమత్తం కావాలి. ఏదైనా నేరం బారినపడితే వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇవ్వాలి. బాధితులు భయాందోళనలకు లోనై గందరగోళానికి గురికాకూడదు. నేరం చేసిన వ్యక్తి ధరించిన దుస్తులు, అతడి వేషభాషలతోపాటు అతడు ఏదైనా వాహనంపై వస్తే దాని నంబర్ తదితరాలు గమనించి నోట్ చేసుకోవాలి. ఎంత త్వరగా పోలీసులకు సమాచారమిస్తే అంత మెరుగైన ఫలితాలు ఉంటాయి.

-ఎం.రాజేశ్ చంద్ర, డీసీపీ, యాదాద్రి



చల్ మోహన రంగ

చూసేద్దాం రండి

సిడ్నీ, స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని తలపించే ట్యాంక్ బండ్.

అద్భుత అందాలతో పాటు చరిత్రాత్మక వైభవాలకు ప్రతీక

వివరాలు 13లో

నగరానికి మణిహారం సాగర తీరం..


చెప్పుకుంటూ పోతే మరెన్నో..

గురి తప్పింది..!

బైక్ టైర్‌ను కాల్చబోతే స్నాచర్ కాలిలోకి తూటా..

- సికింద్రాబాద్ ఫైరింగ్‌పై టాస్క్‌ఫోర్స్ వివరణ
- ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ప్రకటన
- ఇరువురిలో ఒకరిపై గతంలో మూడు కేసులు

వివరాలు 9లో



ఫ్రూట్ ఫుల్

సాక్షి, రంగారెడ్డిజిల్లా

నగరాన్ని ఆనుకొని ఉన్న రంగారెడ్డి జిల్లాలో పండ్ల తోటల సాగు క్రమేపీ పెరుగుతోంది. అన్ని రకాల పండ్లతోటలు సాగు చేసి రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. భౌగోళిక, వాతావరణ పరిస్థితు లు భిన్నంగా ఉన్నా..వివిధ రకాల పండ్ల తోటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తూ యువరైతులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్, కర్జూర, అవకాడో, యాపిల్ ఇలా వివిధ పండ్ల తోటలు జిల్లాలో సాగవుతున్నాయి.

పులిమామిడిలో 'యాపిల్'

➤ యాపిల్ అనగానే హిమాచల్‌ప్రదేశ్, కశ్మీర్ మాత్రమే గుర్తొస్తాయి. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలోనూ యాపిల్ తోటలు ఉన్నాయి. కందుకూరు మండలం పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనాకేంద్రం ఆశ్రమ నిర్వాహకులు 2021 డిసెంబర్‌లో హిమాచల్‌ప్రదేశ్



నుంచి హరిమన్-99 రకానికి చెందిన 170 మొక్కలు తెప్పించి, 30 గుంటల్లో నాటారు. మరో నాలుగు అన్నారకం మొక్కలు కూడా నాటారు. ప్రస్తుతం ఒక్కో మొక్క నుంచి వంద నుంచి రెండు వందల పండ్ల వరకు దిగుబడి వచ్చింది. సాధారణంగా మంచు, చలి ఎక్కువగా ఉండే ప్రదేశంలోనే ఈ యాపిల్ పంట పండుతుంది. కానీ జిల్లాలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతను కూడా తట్టుకొని దిగుబడి వస్తుండటం విశేషం.

దెబ్బగూడలో 'అవకాడో'

➤ సాధారణంగా 25 డిగ్రీల వాతావరణంలో మాత్రమే పెరిగే అవకాడో 40 డిగ్రీలకుపైగా నమోదైన ఉష్ణోగ్రతలను సైతం తట్టుకొని నిలబడింది. కందుకూరు మండలం దెబ్బ గూడకు చెందిన రమావత్ జైపాల్ జిల్లాలోనే తొలిసారిగా అవకాడో పండ్ల తోట సాగుచేశారు.



ఆయన మూడేళ్ల క్రితం ప్రయోగాత్మకంగా ఎకరం పది గుంటల్లో 220 అవకాడో మొక్కలు నాటారు. మొక్క నాటే సమయంలో గుంతలో యాప పిండి, గులికల మందు వాడాడు. ఆ తర్వాత డ్రిప్ సాయంతో మొక్కలకు నీరు అందించాడు. చీడపీడల సమస్యే కాదు పెట్టుబడికి పైసా ఖర్చు కూడా లేకపోవడం ఆ యువ రైతుకు కలిసి వచ్చింది. ప్రస్తుతం ఆ మొక్కలు ఏపుగా పెరిగి కాపు కొచ్చాయి. ఒక్కో చెట్టు నుంచి 150 నుంచి 200 కాయలు దిగుబడి వచ్చింది.

తుక్కుగూడలో ద్రాక్ష సాగు..

నిజాం నవాబుల బ్యాక్‌యార్డ్(ఇంటి వెనుక గార్డెన్)ల్లో ద్రాక్ష తోటలు సాగయ్యేవి. ధనవంతుల పెరట్లో మాత్రమే ఈ తోటలు కనిపిస్తుండటంతో వీటికి 'రిచ్‌మెన్ క్రాప్'గా పేరొచ్చింది. ఆ తర్వాత టోలిచౌకిలో గద్దె రామకోటేశ్వరరావు తొలిసారి ద్రాక్షపంటను సాగు చేశారు. అప్పట్లో ఎకరానికి ఆరు నుంచి ఏడు టన్నుల దిగుబడి వచ్చింది. సాధారణంగా సమ శీతోష్ణ మండలంలో పండే పంటను హైదరాబాద్ పరిసరాల్లో పండించి చరిత్ర సృష్టించారు. 1991లో హైదరాబాద్ వేదికగా గ్రేప్స్ పంటపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. నగరం గ్రేప్స్ రాజధానిగా గుర్తింపు పొందింది. ఇక్కడి రైతులను ఆదర్శంగా తీసుకొని మహారాష్ట్రలో కూడా సాగు ప్రారంభించారు. పంట భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలుస్తుండటంతో 2005 నుంచి ద్రాక్ష పంట క్రమంగా కనుమరుగవుతూ వస్తోంది. ప్రస్తుతం ఒక్క తుక్కుగూడ వేదికగా మాత్రమే ద్రాక్ష సాగవుతోంది.

ఈ ప్రాంతాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు..


జిల్లాలోని యాచారం, కందుకూరు, అబ్దుల్లాపూర్ మెట్, శంషాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి తదితర ప్రాంతాల్లో 'డ్రాగన్ ఫ్రూట్' సాగవుతోంది.



15 ఏళ్లుగా ద్రాక్ష సాగు చేస్తున్నా

పదిహేను ఏళ్లుగా ద్రాక్ష పంటను సాగు చేస్తున్నా. ఒక్కసారి మొక్క నాటితే 20 ఏళ్ల పాటు దిగుమతి వస్తుంది. మొదట్లో 'థాంసన్' వెరైటీ సాగు చేశాను. తాజాగా 'మాణిక్ చమాన్' వెరైటీ ఎంచుకున్నా. ఎకరాకు వెయ్యి మొక్కలు నాటాను. మొక్కల ఎంపిక సహా సస్యరక్షణలో చిన్నచిన్న మెళకువలు పాటించి నాటిన రెండేళ్లకే అనూహ్యంగా దిగుబడిని సాధించాను. ప్రస్తుతం ఒక్కో చెట్టు నుంచి 25 కేజీల వరకు దిగుమతి వస్తుంది. ఎకరా పంటకు కనీసం ఆరు లక్షల ఆదాయం వస్తుంది. ఖర్చుపోను రూ.3 లక్షలు మిగులుతుంది.

– కొమ్మిరెడ్డి అంజిరెడ్డి, తుక్కుగూడ



విదేశాల నుంచి తిరిగొచ్చి..



మేం ముగ్గురం అన్నదమ్ములం. మాకు 47 ఎకరాల భూమి ఉంది. మాది మొదటి నుంచి వ్యవసాయ ఆధారిత కుటుంబం. నేను బీటెక్ పూర్తి చేసి, ఎంబీఏ కోసం పదేళ్ల క్రితం లండన్ వెళ్లాను. అక్కడ సరైన ఉపాధి అవకాశాలు లేక మళ్లీ వెనక్కి తిరిగొచ్చా. అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న అవకాడో సాగు చేయాలనుకున్నా. ఉన్నత చదువులు చదివి విదేశాల్లో ఉద్యోగం చేసుకోకుండా..వ్యవసాయం చేస్తున్నాడేంటి? అని అంతా నవ్వుకున్నారు. ఏదో ఒక పండ్లతోట సాగు చేయాలని భావించి మొక్కల కొనుగోలుకు జడ్చర్ల నర్సరీకి వెళ్లాను. అక్కడ అవకాడో మొక్కలు చూశా. అప్పటికే ఆ పండు గురించి తెలుసు కాబట్టి..ఆ పంటను సాగుచేశా. మొక్క నాటిన తర్వాత పైసా ఖర్చు చేయలేదు. ఆశించిన దానికంటే ఎక్కువ దిగుబడి వచ్చింది. ఆన్‌లైన్‌లో చూసి, స్వయంగా తోట వద్దకే వచ్చి పండ్లు కొనుగోలు చేశారు.

– రమావత్ జైపాల్, యువరైతు

అమెరికాకు డైరెక్ట్ ఫ్లైట్ ఏదీ?

యూఎస్ ప్రయాణికుల్లో హైదరాబాద్‌ది మూడోస్థానం

ఏటా 10 లక్షల మంది రాకపోకలు

గతంలో షికాగో వరకు వారానికి రెండు సర్వీసులు

కోవిడ్ నుంచి నిలిపివేసిన ఎయిర్ ఇండియా

ఏటా 10 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నా, శంషాబాద్ నుంచి అమెరికా వెళ్లడానికి డైరెక్ట్ ఫ్లైట్ లేదు. దీంతో ప్రయాణికులు అమెరికాలో ఎక్కడికి వెళ్లాలన్నా రెండు, మూడు విమాన సర్వీసులు మారాల్సి వస్తోంది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరే అంతర్జాతీయ ప్రయాణికుల్లో 60శాతం మంది అమెరికాకు వెళ్లేవారే ఉంటారు. గతంలో ఎయిర్‌ఇండియా చికాగో వరకు వారానికి రెండు సర్వీసుల చొప్పున నడిపింది. 350 సీట్లు ఉండే ఆ ఫ్లైట్‌కు ప్రయాణికుల నుంచి అనూహ్యమైన ఆదరణ లభించింది. 90శాతం ఆక్యుపెన్సీతో నడిచాయి. కోవిడ్‌కాలం నుంచి ఆ సర్వీసులను నిలిపివేశారు. ఆ తర్వాత పునరుద్ధరిస్తామని, ఎయిర్ పోర్టువర్గాలు చెప్పినా, ఇప్పటివరకు షికాగో ఫ్లైట్‌లు తిరిగి ప్రారంభం కాలేదు.

..:: సాక్షి, హైదరాబాద్ ::..



ఏటేటా పెరుగుతున్న ప్రయాణికులు..

3వ స్థానంలో హైదరాబాద్

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతిరోజు సుమారు 55,000 మంది డొమెస్టిక్ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా, మరో 10 వేల మందికి పైగా అంతర్జాతీయ ప్రయాణికులు వివిధ దేశాలకు ప్రయాణం చేస్తున్నారు. దుబాయ్, సింగపూర్, మలేసియా, బ్రిటన్, దోహా, జెడ్డా, మాలే, థాయ్‌లాండ్, జర్మనీ తదితర దేశాలకు నేరుగా విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. కానీ అమెరికాకు మాత్రం అలాంటి సదుపాయం లేదు. అమెరికా ప్రయా ణికుల్లో ఢిల్లీ, ముంబై తర్వాత హైదరాబాద్ మూడోస్థానంలో ఉన్నట్టు ఇంటర్నేషనల్ ఎయిర్‌ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వెల్లడించింది. ఏటా సుమారు 10లక్షల మంది హైదరాబాద్ నుంచి అమెరికాకు రాకపోకలు సాగిస్తున్నారు. తెలుగురాష్ట్రాల నుంచి లక్షలాది మంది విద్యార్థులతోపాటు ఉద్యోగులు, వారి బంధువులు కూడా పెద్ద సంఖ్యలో ప్రయాణం చేస్తున్నారు. అమెరికాలో స్థిరపడిన పిల్లల దగ్గరకు వెళ్లేందుకు తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల ప్రయాణాలు కూడా అత్యధికంగా ఉన్నాయి. ఢిల్లీ, ముంబై నుంచి మాత్రమే అమెరికాకు డైరెక్ట్‌గా విమాన సర్వీసులు ఉన్నాయి.

హైదరాబాద్ నుంచి అమెరికాకు వెళుతున్న ప్రయాణికుల్లో ఎక్కువశాతం న్యూయార్క్, చికాగో, శాన్‌ఫ్రాన్సిస్కో నగరాలకు వెళుతున్నారు. ప్రయాణికుల సంఖ్య కూడా ప్రతి సంవత్సరం పెరుగుతోంది. కోవిడ్ అనంతరం రాకపోకలు మరింత ఎక్కువయ్యాయి. ఐఏటీఏ లెక్కల ప్రకారం కోవిడ్‌కు ముందు 2019లో 8.5 లక్షల మంది ప్రయాణం చేయగా, కోవిడ్ కాలంలో రాకపోకలు నిలిచిపోయేనాటికి 2020లో 3 లక్షల మంది ప్రయాణం చేశారు. ఆ మరుసటి సంవత్సరం పూర్తిగా నిలిచిపోయాయి.ఆంక్షలు తొలగించి అంతర్జాతీయ రాకపోకలు పునరుద్ధరించిన తర్వాత ప్రయాణికుల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. యూఎస్ నుంచి కొత్తగా వీసాలు లభించకపోయినా, అప్పటికే వీసాలు కలిగిఉన్న ప్రయాణికులంతా కోవిడ్ అనంతరం ఇరువైపులా పెద్దసంఖ్యలో ప్రయాణం చేశారు. ప్రస్తుతం ప్రయాణికుల సంఖ్య 10 లక్షలకు చేరినట్టు అంచనా. హైదరాబాద్ నుంచి చికాగో వరకు నడిచిన ఎయిర్‌ఇండియా సర్వీసులు పునరుద్ధరించినా ప్రయాణికులకు ఊరట లభిస్తుంది. శంషాబాద్‌లో ఫ్లైట్ ఎక్కేసి నేరుగా షికాగోలో దిగిపోవచ్చు.

సాక్షి హైదరాబాద్

సోమవారం ı 24 ı జూన్ ı 2024

ఔటర్‌పై ట్రావెల్స్ బస్సు బోల్తా



ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఔటర్ రింగ్ రోడ్డుపై ఆదివారం రాత్రి అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది.

-10లో



'కారుణ్యం'పై కాఠిన్యం!

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో కారుణ్య నియామకాల ప్రక్రియ చాలాఏళ్లుగా నిలిచిపోయింది. ఈ నియామకాలపై రక్షణ శాఖ సీలింగ్ విధించింది.

-12లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/23.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గరిష్ట ఉష్ణోగ్రత 32 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 23 ఉండే అవకాశం ఉంది. ఉపరితల గాలులు గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో వీస్తాయి.

అలలపై అలా..!



హుస్సేన్ సాగర్ తీరంలో కొలువుదీరిన అమరవీరుల స్మారకం.. ఇటువైపు ధ్యానముద్రలో తథాగతుడు.. మధ్యలో రాష్ట్ర సచివాలయ సౌధం.. మరోవైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం విద్యుత్ కాంతులతో తళుక్కున మెరిశాయి. నగరంలో వర్షం కురిసిన అనంతరం ఆదివారం రాత్రి వీటి ప్రతిబింబాలు సాగర్ జలాల అలలపై అందంగా కనిపించి కనువిందు చేశాయి.

గోల్డ్ ట్రేడింగ్ పేరిట రూ.150 కోట్లు కొట్టేశాడు

ప్రహణేశ్వరి ట్రేడింగ్ సంస్థ ఎండీ రాజేష్ అరెస్ట్





నిందితుడు రాజేష్

హిమాయత్‌నగర్: కేవలం అయిదు నెలల్లో డబ్బులు రెట్టింపు చేస్తామని నమ్మించి, గోల్డ్ ట్రేడింగ్ పేరుతో మోసాలకు పాల్పడిన నిందితుడిని నగర సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. హబ్సిగూడలో ప్రహణేశ్వరి ట్రేడింగ్ పేరుతో రాజేష్ అనే వ్యక్తి ఓ సంస్థను స్థాపించాడు. తాను సంస్థ ఎండీగా ఉంటూ గోల్డ్ ట్రేడింగ్ చేస్తున్నానని పలువురిని నమ్మించాడు. అధిక లాభాల ఆశ చూపి సుమారు 500 మంది నుంచి రూ.150 కోట్లకు పైగా కాజేసి పరారయ్యాడు. అధిక లాభాలకు ఆశపడి తమ ఇళ్లను, బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రూ. 5 లక్షల నుంచి రూ.కోటి వరకు బాధితులు పెట్టుబడులు పెట్టారు. రెండు నెలలుగా డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చి అడిగితే అప్పుడు ఇప్పుడు అంటూ దాటవేశాడు. అనంతరం రాజేష్ పరారయ్యాడు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2 నెలలుగా తప్పించుకుని తిరుగుతున్న రాజేష్‌ను సీసీఎస్ పోలీసులు ఆదివారం రిమాండ్‌కు తరలించారు. తమకు న్యాయం చేయాలంటూ బాధితులు బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

గురి తప్పింది!

బైక్ టైర్‌ను కాల్చబోతే స్నాచర్ కాలిలోకి తూటా

- సికింద్రాబాద్ ఫైరింగ్‌పై టాస్క్‌ఫోర్స్ వివరణ
- ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ప్రకటన
- ఇరువురిలో ఒకరిపై గతంలో మూడు కేసులు

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌లోని సిటీలైట్ హోటల్ వద్ద యాంటీ స్నాచింగ్ టీమ్ పోలీసులు.. పారిపోతున్న స్నాచర్ల బైక్ టైర్‌ను కాల్చాలని ప్రయత్నించినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ ప్రకటించారు. ఆ తూటా బైక్ వెనుక కూర్చున్న నేరగాడి కాలులోకి దూసుకుపోయినట్లు వివరణ ఇచ్చారు. గురువారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఉదంతంలో తప్పించుకున్న ఇద్దరు స్నాచర్లను పట్టుకున్నట్లు ఆదివారం టాస్క్‌ఫోర్స్ డీసీపీ పేర్కొన్నారు.

రెండు 'పనులు' చేస్తున్నా చాలక..

ఫలక్‌నుమాలోని అన్సారీ రోడ్ ప్రాంతానికి చెందిన మసూద్ ఉర్ రెహ్మాన్ పదో తరగతితో చదువుకు స్వస్తి చెప్పాడు. బతుకుతెరువు కోసం వెల్డర్‌గా, క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ రెండు పనుల్లోనూ వచ్చే ఆదాయం విలాసాలకు సరిపోకపోవడంతో తేలిగ్గా డబ్బు సంపాదించడంపై దృష్టి పెట్టాడు. దీనికోసం దోపిడీలు, చోరీలు చేయాలని పథకం వేశాడు. నాచారం, మైలార్‌దేవ్‌పల్లిల్లో మూడు నేరాలు చేసి జైలుకు వెళ్లాడు. ఈ కేసుల్లో బెయిల్‌పై బయటకు వచ్చిన ఇతడి వ్యవహార శైలి మారలేదు. మసూద్ తరచూ ముషీరాబాద్‌లో ఉండే తన బంధువు ఇంటికి వెళ్లేవాడు. అక్కడే ఇతడికి స్క్రాప్ వ్యాపారం చేసే ఫజల్ ఉర్ రెహ్మాన్‌తో పరిచయం ఏర్పడింది.

వాహనంపై తిరుగుతూ వరుస నేరాలు..

సెల్‌ఫోన్ స్నాచింగ్స్ చేయాలని నిర్ణయించుకున్న మసూద్ తనకు సహకరించాల్సిందిగా ఫజల్‌ను కోరాడు. దీనికి అతడు అంగీకరించడంతో ఇద్దరూ రెండు కత్తుల్ని దగ్గర పెట్టుకుని బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై బయటకు వచ్చారు. తొలుత చాదర్‌ఘాట్‌లోని ఓ బార్ వద్ద ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశారు. ఈ వాహనాన్ని అదును చూసుకుని విక్రయించాలని భావించారు. అప్పటి వరకు భద్రంగా ఉంచడం కోసం భోలక్‌పూర్ వరకు తీసుకువెళ్లి ఓ ప్రాంతంలో దాచారు. అదే రాత్రి అట్నుంచి వీరిద్దరు సికింద్రాబాద్ వైపు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో రైల్వే స్టేషన్ సమీపంలోని గణేష్ టెంపుల్ వద్ద ఓ వ్యక్తి వీరికి కనిపించాడు.

కత్తులతో బెదిరించి సెల్‌ఫోన్ దోపిడీ..

అతడిని అడ్డుకున్న వీరిద్దరు సెల్‌ఫోన్ గుంజుకోవడానికి ప్రయత్నించారు. బాధితుడు ఎదురు తిరగడంతో వాహనం దిగిన ఇరువురూ కత్తులతో బెదిరించి ఫోన్ లాక్కున్నారు. అక్కడి నుంచి తమ వాహనంపై క్లాక్ టవర్ వైపు వెళ్తూ తమ చేతిలో ఉన్న కత్తుల్ని చూపిస్తూ పాదచారులకు భయభ్రాంతులకు గురి చేశారు. ఇటీవల నగరంలో చోటు చేసుకున్న నేరాల నేపథ్యంలో యాంటీ స్నాచింగ్ టీమ్స్ రాత్రి వేళ గస్తీ నిర్వహిస్తున్నాయి. పాదచారుల అరుపులు సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్న బృందం చెవిన పడ్డాయి. అప్రమత్తమైన పోలీసులు ఆ ఇద్దరి వద్దకు చేరుకుని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. అయితే.. మసూద్, ఫజల్ కత్తులు చూపిస్తూ పోలీసులను కూడా బెదిరించారు.



పట్టుకునే ప్రయత్నాల్లో కాల్పులు..

అక్కడి నుంచి పారిపోతున్న ఇద్దరు నిందితులను యాంటీ స్నాచింగ్ టీమ్ వెంబడిస్తూ పోయింది. బాటా షోరూమ్ వద్ద మరో పాదచారి నుంచి ఫోన్ స్నాచింగ్ చేయడానికి వీళ్లు ప్రయత్నించి సిటీ లైట్ హోటల్ వద్దకు చేరుకున్నారు. వీరి వ్యవహారశైలిని గమనించిన ఇద్దరు పోలీసులూ పట్టుకోవడానికి చేసిన ప్రయత్నాల్లో భాగంగా వారి వాహనం ఆపాలని నిర్ణయించుకున్నారు. దీనికోసం తమ వద్ద ఉన్న తుపాకీతో దాని టైర్‌పై గురిచూసి



కాల్చారు. ఈ తూటా వాహనం వెనుక కూర్చున్న నేరగాడి కాలిలోకి దూసుకుపోయింది. మరో తూటా పేల్చినా ఫలితం లేకపోవడంతో ఇద్దరూ వాహనంపై పారిపోయారు. టాస్క్‌ఫోర్స్, నార్త్‌జోన్ పోలీసులు ముమ్మరంగా గాలించి ఇద్దరినీ పట్టుకున్నారు. వీరి నుంచి చోరీ సొత్తు, కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

సృజనాత్మక సాహిత్యాన్ని సృష్టించాలి



చంద్రమోహన్‌గౌడ్‌ను సత్కరిస్తున్న నందిని సిధారెడ్డి తదితరులు

లిబర్టీ: సృజనాత్మక సాహిత్యాన్ని రచయితలు, కవులు సృష్టించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ రచయిత, కవి నందిని సిధారెడ్డి అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న జీవన గాథలను, స్థితిగతులను వస్తువుగా ఎంపిక చేసుకుని సాహిత్యాన్ని ఆవిష్కరించాలని సూచించారు. అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటు చేసిన సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిత్య నూతన సాహిత్యం అందిస్తున్న అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డమీది చంద్రమోహన్ గౌడ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా సిధారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, ప్రజల ఆకాంక్షలను, సమస్యలను ప్రతిబింబించేలా నూతన సాహిత్యాన్ని తీసుకురావాల్సిన అవసరముందన్నారు. ప్రజల జీవన స్థితిగతులను సాహిత్యం ద్వారా ఆవిష్కరిస్తే గొప్ప మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి, ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఒలింపిక్ రన్



చార్మినార్ వద్ద ఒలింపిక్ రన్‌ను ప్రారంభిస్తున్న మహేష్

చార్మినార్: ఒలింపిక్ దినోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం చార్మినార్ నుంచి ఎల్‌బీ స్టేడియం వరకు ఒలింపిక్ రన్ నిర్వహించారు. 1894 జూన్ 23న అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ఏర్పడిన రోజును పురస్కరించుకుని ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది ఒలింపిక్ రన్‌ను నిర్వహిస్తున్నారని.. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం చార్మినార్ నుంచి ఎల్బీ స్టేడియం వరకు కాగడాతో ఒలింపిక్ రన్ నిర్వహించినట్లు హైదరాబాద్ టగ్ ఆఫ్ వార్ అధ్యక్షుడు ఆదర్ల మహేష్ తెలిపారు. కార్యక్రమంలో గౌలిపురా మిత్రా క్లబ్ బాక్సింగ్ కోచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి కేసులో నిర్లక్ష్యం..

నాగోలు ఇన్‌స్పెక్టర్‌పై బదిలీ వేటు



నాగోలు ఇన్‌స్పెక్టర్ పరశురాం

నాగోలు: దళిత యువకుడిపై దాడి కేసులో పోలీసులు స్పందించలేదు. బాధితుడు తీవ్ర గాయాలపాలై హాస్పిటల్‌లో చికిత్స పొందిన అనంతరం ఠాణాను ఆశ్రయించినా నిర్లక్ష్యం వహించిన నాగోలు ఇన్‌స్పెక్టర్ పరశురాంపై రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోసి బదిలీ వేటు వేశారు. ఇదే కేసులో నాగోలు ఎస్ఐ మధు, ఏఎస్ఐ అంజయ్యపై అధికారులు చర్య తీసుకునే అవకాశం ఉందని సమాచారం. కాగా.. నాగోలు ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా ఎల్‌బీనగర్ డీఐ సుధాకర్‌ను నియమించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎల్‌బీనగర్‌లోని భరత్‌నగర్ కాలనీకి చెందిన దాసరి గౌతమ్ అలియాస్ బద్దు (20) ప్రైవేట్ ఉద్యోగి. నాగోలు సాయినగర్ కాలనీలో నివాసం ఉండే వేముల మల్లేష్, అతని కుమారుడు (16), గౌతమ్‌ల మధ్య గతంలో గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో గౌతమ్‌ను అంతం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 6న నాగోలు సాయినగర్ కాలనీలో స్నేహితుడి ఇంట్లో నిద్రిస్తున్న గౌతమ్‌పై మల్లేష్, నరేష్, అనిల్, జ్యోతి, నాగరాజు, పవన్‌కుమార్, మరో ఇద్దరు మైనర్లు దాడి చేశారు. భవనం పైఅంతస్తు నుంచి కిందకు లాక్కు వచ్చి రాయి, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో గౌతమ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం టెలిఫోన్ స్తంభానికి కట్టేసి కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. గౌతమ్ మృతి చెందినట్లు భావించి నిందితులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం గాయపడిన గౌతమ్‌ను కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. చికిత్స నిమిత్తం ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. బాధితుడు గౌతమ్ తనపై జరిగిన దాడిపై ఈ నెల 21న నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కానీ.. ఇన్‌స్పెక్టర్ పరశురాం స్పందించలేదు. దీంతో బాధితుడు తగిన ఆధారాలతో ఉన్నతాధికారులను ఆశ్రయించాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ నెల 22న ఏడుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు జువైనల్ అఫెండర్లను హోంకు తరలించారు.

ఉప్పల్ ఎస్ఐపై కూడా..



ఉప్పల్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, పోకిరీలతో అంటకాగుతున్నాడనే ఆరోపణలను ఎదుర్కొంటున్న ఉప్పల్ ఎస్ఐ సీహెచ్ శంకర్‌పై రాచకొండ సీపీ సస్పెన్షన్ వేటు వేశారు. ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డిని సీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆదివారం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో ప్రేమ జంట ఇచ్చిన ఫిర్యాదుపై ఉప్పల్ ఎస్ఐ కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహించాడని, ఇందుకోసం భారీగా ముడుపులు తీసుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు శనివారం ఉప్పల్ ఎస్ఐ శంకర్‌పై విచారణకు ఆదేశించి, ఆదివారం శంకర్‌ను సస్పెండ్ చేస్తూ రాచకొండ సీపీ ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఐతో పాటు ఈ కేసు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డిని రాచకొండ సీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా డీఐ మన్మథరావును నియమించారు.

- తెల్లవారితే పెళ్లి చూపులు..

అంతలోనే మృత్యు ఒడికి..

- జూబ్లీహిల్స్‌లో రోడ్డు ప్రమాదం
- టిప్పర్ ఢీకొని యువకుడి మృతి



శివశంకర్ (ఫైల్)

బంజారాహిల్స్: మరుసటి రోజే ఆ యువకుడికి పెళ్లి చూపులు.. ఉదయంలోగా ఇంటికి వెళ్లేందుకు బైక్‌పై బయలుదేరాడు. అతివేగంతో వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. వనపర్తి జిల్లా పీపనగండ్ల మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన కృష్ణమ్మ, సుధాకర్ దంపతుల కుమారుడు శివశంకర్ (30) రాయదుర్గం సమీపంలోని అడాప్ట్ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. దుర్గం చెరువు సమీపంలోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆదివారం పెళ్లి చూపులు ఉండటంతో శనివారం అర్ధరాత్రి మాదాపూర్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. రెండు నెలల క్రితమే ఎంతో ముచ్చటపడి కొనుక్కున్న బుల్లెట్ బైక్‌పై హెల్మెట్ ధరించి జూబ్లీహిల్స్ అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో వెళ్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి అతివేగంతో వచ్చిన టిప్పర్ శివశంకర్ బైక్‌ను ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను పోలీసులు గుర్తించారు. డ్రైవర్ పరారయ్యాడు. మరికొన్ని గంటల్లో స్వగ్రామంలో ఉండాల్సిన శివశంకర్ విగతజీవిగా మారడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధుమిత్రులు పోలీస్‌స్టేషన్ ఆవరణలో కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇంటికి బాధ్యతలను మోస్తున్న శివశంకరే కన్నుమూయడంతో కన్నవారు గుండెలవిసేలా రోదించారు. పెళ్లి చూపుల కోసం ఏర్పాట్లు చేసుకునే క్రమంలో ఈ దుర్ఘటన జరగడంతో శివశంకర్ పని చేస్తున్న సంస్థలో, స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదివాసీలపై హత్యాకాండను ఆపేయాలి

ఛత్తీస్‌గఢ్ పీసీసీ అధ్యక్షుడు దీపక్ బైజు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కేంద్ర బలగాలు ఆదివాసీలను అమానుషంగా చంపివేస్తున్నాయని ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ దీపక్ బైజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఆదివాసీలపై దమనకాండను కాంగ్రెస్ పార్టీ సైతం ఖండించిందని, నిజ నిర్ధారణ కోసం వెళ్తున్న తనతో పాటు పౌర హక్కుల సంఘం నేతలను పోలీసులు నిలువరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇది అన్యాయమని మాట్లాడిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని సైతం అర్బన్ నక్సలైట్‌గా ముద్ర వేశారని విమర్శించారు. తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీలపై హత్యాకాండను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి తేజావత్ బెల్లయ్య నాయక్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు, ప్రముఖ రచయిత కె.శివారెడ్డి, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, విరసం నేత పాణి, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలను కాపాడండి

- నగర పోలీసులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ఆదేశాలు

హిమాయత్‌నగర్: నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటలు జరగకుండా, శాంతి భద్రతలకు భంగం కలగకుండా పోలీసులు లా అండ్ ఆర్డర్‌ను కఠినంగా అమలు చేయాలని పోలీస్ శాఖకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. దీంతో నగర ప్రజలకు పోలీసు శాఖ పలు హెచ్చరికలు, సూచనలు చేసింది. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగవద్దని, రోడ్లపై అల్లర్లు సృష్టించవద్దని, అనుమానాస్పద వ్యక్తులకు వాహనంపై లిఫ్ట్ ఇవ్వవద్దని పోలీసులు తెలిపారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, దుకాణాలు రాత్రి 11 గంటల్లోపు మూసేయాలని సూచించారు. ఎక్కడైనా గొడవలు, అల్లర్లు జరిగితే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలన్నారు. అర్ధరాత్రులు జులాయిగా తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కలిగించవద్దని పోలీసులు హెచ్చరించారు.

వరదెత్తిన వాన

రాత్రి 7 గంటల వరకు వర్షపాతం సెం.మీలలో..	దబీర్‌పురా	సర్దార్‌మహల్	జియాగూడ	బేగంబజార్	నాంపల్లి	లంగర్‌హౌస్	దూద్‌బౌలి	మలక్‌పేట	హస్తినాపురం	గన్‌ఫౌండ్రీ
	7.1	7.0	6.9	6.3	5.8	5.7	5.6	5.1	4.9	4.2



పీవీఆర్ ఎక్స్‌ప్రెస్ వే వద్ద..



మలక్‌పేట్‌లో..



కోఠి- చాదర్‌ఘాట్ రోడ్డులో..



సీబీఎస్ సర్కిల్ వద్ద..



మెహిదీపట్నంలో ట్రాఫిక్‌జామ్



అత్తాపూర్ శివనగర్‌లో..



బాగ్‌లింగంపల్లిలో..

నగరంలో వాన దంచికొట్టింది. ఈదురు గాలులతో కుండపోతగా కురిసింది. సగటున 4 నుంచి 7 సెంటీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది. ప్రధాన రోడ్లతోపాటు సర్వీస్ రహదారులు సైతం పూర్తిగా జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. పలు రైల్వే బ్రిడ్జిల కింద భారీగా వరద నీరు వచ్చిచేరింది. డ్రైనేజీల మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లాయి. పలు ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. ద్విచక్ర వాహన దారులు ఇబ్బందులకు గురయ్యారు. రహదారులపై వరద నీరు సాఫీగా వెళ్లేలా జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ బృందాలు చర్యలు చేపట్టాయి. – సాక్షి, సిటీబ్యూరో

ఔటర్‌పై ప్రైవేటు బస్సు బోల్తా

మహిళ మృతి • పలువురికి గాయాలు



ఔటర్‌పై అదుపు తప్పి మరో ట్రాక్‌లో పడిపోయిన ట్రావెల్స్ బస్సు

మణికొండ: హైదరాబాద్ నుంచి చెన్నై వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఔటర్ రింగ్ రోడ్డుపై ఆదివారం రాత్రి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందగా పలువురికి గాయాలయ్యాయి. నార్సింగి ఏసీపీ జీవీ రమణగౌడ్ తెలిపిన మేరకు.. మార్నింగ్‌స్టార్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు (పీవై 05 ఎ 1999) గచ్చిబౌలి నుంచి ఔటర్ రింగ్ రోడ్డుపై శంషాబాద్ వైపు వెళుతోంది. నార్సింగి వద్ద అదుపు తప్పి ఔటర్ రింగ్ రోడ్డుపై డివైడర్‌ను ఢీ కొని పల్టీ కొట్టి పక్కకు పడిపోయింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ బస్సు కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందగా పలువురు గాయపడ్డారు. మృతురాలు ఒంగోలుకు చెందిన మమత(33) అని, ఆమె ఉప్పల్‌లో ఉంటుందని తెలిసిందన్నారు. బస్సులో 18 మంది ప్రయాణికులున్నారు. బస్సు బోల్తా కొట్టడంతో గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్‌లు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని బస్సులో చిక్కుకుపోయిన వారిని బయటకు తీశారు. ఇదిలా ఉండగా బస్సు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్టు అనుమానం రావటంతో అతన్ని అదుపులోకి తీసుకుని పరీక్షలు నిర్వహిస్తున్నామని పోలీసులు తెలిపారు. మరి కొందరికి స్వల్ప గాయాలు కావటంతో వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించామన్నారు. ఔటర్‌రింగ్ రోడ్డుపై బోల్తా కొట్టిన బస్సును రెండు క్రేన్‌ల సహాయంతో పక్కకు తప్పించి రెండు గంటల అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న పోలీసులు



బస్సు కింద నలిగిపోయిన మృతురాలి కాలు

దేశాభివృద్ధిలో నేటి పౌరులే కీలకం

హిమాయత్‌నగర్: దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని గురజాడ చెప్పిన విధంగా దేశాభివృద్ధిలో నేటి పౌరులే కీలకమని సినీరచయిత, దర్శకులు, రాజ్యసభ సభ్యులు విజయేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో స్వదేశీ స్వావలంబన రాష్ట్ర సభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అఖిలభారత స్వదేశీ జాగరణ మంచ్ కన్వీనర్ ఆర్ సుందరంజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మన దేశవృద్ధి చిన్న పిల్లల ద్వారానే ప్రారంభం కావాలని, చిన్న పిల్లలుగా ఉన్నప్పటినుండే వారికి దేశభక్తి భావాలు నేర్పించాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఆర్థిక ప్రగతి సరిపోదని, ఉపాధి కల్పిస్తూ ఉంటే నిరుద్యోగ సమస్య తీరుతుందని తెలిపారు.



సభలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు విజయేంద్రప్రసాద్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు

పరామర్శ



అల్వాల్: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి నాలుగు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకోవడంతో ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్ అల్వాల్‌లోని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నివాసానికి చేరుకొని పరామర్శించారు.

ఏపీలో విధ్వంస పాలనకు చంద్రబాబు శ్రీకారం

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

లిబర్టీ: ఏపీలో కక్ష సాధింపు, విధ్వంస పాలనకు చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చివేయటాన్ని ప్రజాస్వామిక వ్యతిరేక చర్యగా ఆయన అభివర్ణించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూల్చి వేసిన స్థానంలోని తిరిగి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రభుత్వం తిరిగి నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం 33 ఏళ్ల కాలానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లీజుకు తీసుకొని పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తోందన్నారు. పార్టీ కార్యాలయాన్ని కూల్చి వేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్, రాష్ట్ర హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. కోర్టు తీర్పునకు విరుద్ధంగా పార్టీ కార్యాలయాన్ని ఎలా కూల్చివేస్తారని ఆయన నిలదీశారు.

చైతన్యపురిలో హెరాయిన్ పట్టివేత

చైతన్యపురి: హెరాయిన్ విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ, చైతన్యపురి పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు...చైతన్యపురి మెట్రో స్టేషన్ వద్ద నిషేధిత మత్తుపదార్థం హెరాయిన్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌ఓటి బృందం చైతన్యపురి పోలీసులతో కలిసి దాడి చేశారు. హెరాయిన్ విక్రయిస్తున్న రాజస్థాన్‌కు చెందిన విమరాం (24)ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 30 గ్రాముల హెరాయిన్, ఒక మొబైల్ ఫోన్, మొబైల్ స్కీన్ ఖాళీ బాక్సులు పది, వేయింగ్ మిషన్ మొత్తం రూ. 4 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడ్డ విమరాం సులువుగా డబ్బు సంపాదించేందుకు రాజస్థాన్‌కు చెందిన హెరాయిన్ సరఫరా చేసే దినేష్ కళ్యాణ్‌తో పరిచయం చేసుకున్నాడు. అక్కడ నుంచి తీసుకొచ్చి అవసరమైన వారికి అందజేసి డబ్బు సంపాదిస్తున్నాడు. చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు విమరాంను రిమాండ్‌కు తరలించారు. దినేష్ కళ్యాణ్, మరో నిందితుడు హీరారాంలు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



నిందితుడు విమరాం



ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్ట్ చేసిన ఆకాష్, వెంకటేష్

రెండు గ్రాముల హెచ్‌డీఎంఏ డ్రగ్ స్వాధీనం

ఎల్‌బీనగర్ డిమార్ట్ మాల్ వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్, వనస్థలిపురం ఎస్‌ఓటీ పోలీసులు ఎల్‌బీనగర్ పోలీసులతో కలిసి దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నంచి లక్ష రూపాయల విలువైన రెండు గ్రాముల హెచ్‌డీఎంఏ డ్రగ్, ఒక బైక్, రెండు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ ధర్మారానికి చెందిన జర్రు ఆకాష్ (20), మొగిలి వెంకటేశ్ (23)లు ఇద్దరు స్నేహితులు. మత్తుపదార్థాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించేందుకు నేరేడ్‌మెట్‌కు చెందిన హెచ్‌డీఎంఏ డ్రగ్ సరఫరా చేసే శ్రీకాంత్ ను పరిచయం చేసుకున్నారు. అతని నుంచి డ్రగ్ తీసుకొచ్చి విక్రయించటం మొదలు పెట్టారు. ఎల్‌బీనగర్ పోలీసులు నిందితులు జర్రు ఆకాష్, మొగిలి వెంకటేశ్‌లను రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు శ్రీకాంత్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అడుగడుగునా పోలీసు పహారా

మియాపూర్‌లో పరిస్థితులను పరిశీలించిన సీపీ

మియాపూర్: మియాపూర్‌లోని 100, 101 సర్వేనంబర్ హెచ్‌ఎండీఏ భూమిలో హైడ్రామాకు తెరపడింది. ఇళ్లస్థలాల కోసం హెచ్‌ఎండీఏ భూమిని ఆక్రమించి గుడిసెలు వేసేందుకు యత్నించడంతో ఆందోళన, ఉద్రిక్తతకు దారి తీసింది. నాలుగు రోజులుగా వేలాది మంది ఇక్కడికి వచ్చి చేరడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శనివారం సాయంత్రం ఆక్రమణదారులను చెదరగొట్టే ప్రయత్నంలో పోలీసులపై ఆక్రమణదారులు రాళ్లు విసరడంతో పోలీస్ సీనియర్ అధికారులు సీరియస్‌గా తీసుకుని పెద్ద ఎత్తున పోలీస్ బలగాలను మోహరించి ఆక్రమణదారులను తరిమివేశారు. సుమారు 300 మంది పోలీసులు, దీప్తీశ్రీనగర్, స్టాలిన్‌నగర్, ఎంఏనగర్, పీఏనగర్, ప్రశాంత్‌నగర్, మక్తకాలనీల సమీప ప్రాంతాలలో బారికేడ్లు ఏర్పాటు చేసి అక్కడే ఉన్నారు. మరి కొంతమంది టెంట్ ఏర్పాటు చేసుకుని పర్యవేక్షిస్తున్నారు. డ్రోన్ కెమెరాలను కూడా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, మాదాపూర్ డీసీపీ వినీత్‌తో కలిసి పర్యటించి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎవ్వరూ సర్వేనంబర్ 100, 101లోకి రావద్దని తెలిపారు. మియాపూర్, చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 29వ తేదీ వరకు 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నామన్నారు. ఎవరైనా ఇక్కడికి వచ్చి గుమిగూడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎంబీ భూపాల్ రెడ్డి కూడా పర్యటించారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



భూములను పరిశీలిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి



టెంట్‌వేసి పర్యవేక్షిస్తున్న పోలీసులు

21 మంది ఆందోళనకారుల అరెస్ట్


మియాపూర్: ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని మాయమాటలు చెప్పి ఆందోళనచేసి పోలీస్, అధికారులపై రాళ్లదాడి చేసిన 21 మందిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో మాదాపూర్ డీసీపీ వినీత్ వివరాలను వెల్లడించారు. ఆందోళనకు కారకులైన, రాళ్ల దాడికి పాల్పడిన 50 మందిని గుర్తించామని తెలిపారు. గుడిసెలు వేసి కబ్జాచేసి ఆందోళన చేసిన 21 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో మియాపూర్‌కు చెందిన ఓ రోడ్డు సైడ్ హోటల్ నిర్వాహకులు సంగీత(33)తో పాటు మునీర్, లక్ష్మీభాయ్, శ్రీనివాస్‌నాయక్, లక్ష్మీ, లావణ్య, గౌరమ్మ, చంద్రమ్మ, పోలే లక్ష్మీ, అశోక్, నర్సింగ్‌రావు, గోపాలకృష్ణ, బాలకోటి, గోపాల్, సునీల్, గోవింద్, ర మేష్, ప్రేమ్‌కుమార్, మహేష్, ఆంబోతు స్వామి, మూడవత్ మున్యాలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. వీరి వెనుక ఉన్నవారిని కూడా గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

పుట్టిన రోజు వేడుకల్లో హుక్కా

ఘట్‌కేసర్: పుట్టిన రోజు వేడుకల పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారిపై ఘట్‌కేసర్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన మేరకు.. అవుషాపూర్‌కు చెందిన సౌరబ్‌గుప్త, అతడి తల్లి శశిగుప్త (68) పుట్టిన రోజు సందర్భంగా అవుషాపూర్ శ్రీ చైతన్య కళాశాల సమీపంలోని' ది కాంటినెంట్'' ఫామ్ హౌజ్‌లో విందు ఏర్పాటు చేసి ముంబాయిలోని ఆమె సోదరులను ఆహ్వానించారు. విందులో ఎక్సైజ్ పోలీసుల అనుమతితో మద్యం తాగడానికి అనుమతి తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా హుక్కా ఏర్పాటు చేశారు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఫామ్ హౌజ్‌పై దాడి నిర్వహించి విందు ఏర్పాటు చేసిన సౌరబ్‌గుప్త (36)తో పాటు నాగరాజు రాజ(28), కాంటినెంట్ ఫామ్ హౌజ్ మేనేజర్ సరోజ, యజమాని ఆకాశ్‌గుప్తపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి 14 హుక్కా పోట్స్ పాత్రలు, 14 హుక్కా పైపులు, ఒక హుక్కా ఫిల్టర్ ప్యాకెట్, ఒక బొగ్గు ప్యాకెట్, హీటర్‌ను పంచానామా అనంతరం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థి అదృశ్యం

శంషాబాద్: స్కూల్‌లో జరుగుతున్న గొడవపై తండ్రి మందలించడంతో విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ బాలరాజు తెలిపిన మేరకు.. పట్టణంలోని నక్షత్ర కాలనీలో నివాసముండే డాక్టర్ రాజేష్ కుమారుడు ప్రతీక్ (13) జీఎంఆర్ చిన్మయ విద్యాలయంలో 8 తరగతి చదువుతున్నాడు. స్కూల్‌లో గొడవ పడుతున్నాడని తరగతి ఉపాధ్యాయుడు ప్రతీక్ తండ్రిని శనివారం స్కూల్‌కు పిలిపించి చెప్పాడు. ప్రతీక్‌ను ఇంటికి వచ్చిన తర్వాత తండ్రి మందలించాడు. సాయంత్రం కరాటే క్లాస్‌కు వెళుతున్నాని చెప్పి బయలుదేరిన అతడు రాత్రి వరకు తిరిగి రాలేదు. అన్ని చోట్లా వెతికినా ఆచూకి లభించకపోవడంతో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రతీక్

మాజీ భర్త వేధిస్తున్నాడని మహిళ ఫిర్యాదు

వెంగళరావునగర్: మాజీ భర్త వేధిస్తున్నాడని ఓ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన మేరకు.. యూసుఫ్‌గూడకు చెందిన ఓ మహిళకు శ్రీకృష్ణానగర్‌లో నివసించే వెంకటరమణతో 2010లో వివాహమైంది. వివిధ కారణాల వల్ల 2015లో అతనితో విడాకులు తీసుకుంది. అయితే అతను ఫేస్‌బుక్‌లో ఆమె పర్సనల్ ఫోటోలను పెట్టాడు. అంతేగాకుండా ఆమె వాట్సప్‌కు అసభ్య పదజాలంతో మెసేజ్‌లు పంపుతున్నాడు. దీంతో ఆవేదనకు గురైన బాధితురాలు మాజీ భర్తపై మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో నిద్రమాత్రలు మింగిన దంపతులు

భర్త మృతి, భార్య పరిస్థితి విషమం

రాంగోపాల్‌పేట్: ఆర్థిక ఇబ్బందులతో దంపతులు నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా భర్త మరణించాడు, భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ ఘటన సెక్రటరియేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎల్‌బీ నగర్‌కు చెందిన రవీందర్‌కుమార్ (56) రాఖీ (49) భార్యాభర్తలు. రవీందర్‌కుమార్ ప్రైవేటు సంస్థలో పనిచేస్తుండగా కొద్ది రోజుల నుంచి ఖాళీగా ఉంటున్నారు. గత కొద్ది రోజుల నుంచి ఈ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నెల 20న రాణిగంజ్‌లోని వసుంధర లాడ్జిలో భార్యాభర్తలు బస చేశారు. ఈ నెల 21వ తేదీన రాత్రి ఇద్దరూ లాడ్జీలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. 22వ తేదీ ఉదయం రూంబాయ్ వచ్చి తలుపు కొట్టగా ఎలాంటి స్పందన కనిపించ లేదు. లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రవీందర్ కుమార్ ఆదివారం మధ్యాహ్నం మరణించాడు. భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

కులం పేరుతో దూషించిన ఉన్నతాధికారిపై చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర సచివాలయంలో దళిత మహిళా అధికారిని కులం పేరుతో దూషించిన ఉన్నతాధికారిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ హైదరాబాద్ జిల్లా సభ్యుడు బత్తుల రాంప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆర్థిక శాఖ విభాగంలో జాయింట్ సెక్రటరీ హోదాలో పని చేస్తున్న మహిళా అధికారిని అదే శాఖలో పని చేస్తున్న డిప్యూటీ సెక్రటరీ హోదాలో ఉన్న ఎం.పద్మావతి అకారణంగా కులం పేరుతో దూషించిందని మండిపడ్డారు. బాధిత మహిళా అధికారి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినప్పటికి చర్యలు తీసుకోలేదన్నారు. ఉన్నతాధికారి పద్మావతిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బత్తుల రాంప్రసాద్ డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కారు ఢీకొనడంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. దూలపల్లి గ్రామానికి చెంది నానిబాయి(60) సోమవారం మధ్యాహ్నం వ్యక్తిగత పని మీద బయటకు వెళ్లింది. దూలపల్లి చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా బహదూర్‌పల్లి నుండి కొంపల్లి వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నానిబాయి తలకు తీవ్రగాయాలు కావడంతో కారు డ్రైవర్ ఆమెను ఆర్క్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఎన్ఎఫ్‌సీనగర్‌లో చోరీ

ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్‌లోని కాటన్ బాక్స్ హోల్‌సేల్ కార్యాలయంలో చోరీ జరిగింది. ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ క్రైం ఎస్ఐ అశోక్ కుమార్ తెలిపిన మేరకు.. ఎన్ఎఫ్‌సీనగర్ సీ-2 కాలనీలో రాజు మిశ్రాకు చెందిన కాటన్ బాక్స్ హోల్‌సేల్ కార్యాలయం ఉంది. శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు మెయిన్ డోర్ తాళం పగుల గొట్టి ఆఫీస్‌లో ఉన్న రూ. 10 వేల నగదుతో పాటు ఇతర వస్తువులను చోరీ చేశారు. ఆదివారం ఉదయం మెయిన్ డోర్ తెరిచి ఉండటం చూసిన స్థానికులు యజమాని రాజు మిశ్రాకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు, క్లూస్ టీం చేరుకొని ఆధారాలు సేకరించి, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

సుభాష్‌నగర్: భర్తతో గొడవపడిన ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించింది. సూరారం పోలీసులు తెలిపిన మేరకు.. సాయిబాబానగర్ ముత్యాల బస్తికి చెందిన తన్నీరు పద్మ భర్త శ్రీనివాస్‌తో గొడవపడి ఆదివారం ఉదయం కట్టమైసమ్మ ఆలయం ఎదురుగా ఉన్న లింగయ్య చెరువులో దూకింది. రోడ్డు పక్కన ఉన్న జనాలు చూస్తూ వీడియోలు తీయడం సరిపోయింది, అప్పుడే అటుగా వెళుతున్న సూరారం ప్రాంతానికి చెందిన పల్నాటి శివకుమార్ చెరువులో దూకి తాడు సాయంతో పద్మను ఒడ్డుకు చేర్చాడు. అనంతరం మహిళ కుటుంబ సభ్యులను పిలిపించి, సూరారం పోలీస్ స్టేషన్‌లో అప్పచెప్పాడు. పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

ప్రభుత్వాసుపత్రుల కార్మికులను పట్టించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు ఎండి యూసుఫ్

హిమాయత్‌నగర్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు అందవలసిన జీతాలు సక్రమంగా ఇవ్వకుండా కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై కార్మికుల్ని దోచుకుంటున్నారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి యూసుఫ్, ఎం నరసింహలు విమర్శించారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాసుపత్రుల కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం రూ.15600 కాగా పీఎఫ్, ఈఎస్ఐ పోను రూ.13,600 రావాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ.11000 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఇంకొన్ని ఆస్పత్రుల్లో పదివేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. అధికారులు జీవో ప్రకారం టెండర్ పిలిచి కార్మికుల జీతాలు సక్రమంగా అందకున్నప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు జూలై 3న డీఎంఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు లక్ష్మీబాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, రాష్ట్ర కార్యదర్శులు పి సురేష్, సిగ్రా దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ట్యాక్సీ నడుపుతూ చైన్ స్నాచింగ్

ఆ సొత్తు తీసుకువెళ్లి తన స్వస్థలంలో విక్రయం

- ఇద్దరిని అరెస్టు చేసిన సౌత్-ఈస్ట్ టాస్క్‌ఫోర్స్
- రూ.3.5 లక్షల విలువైన బంగారం స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: బైక్ ట్యాక్సీ నడుపుతూ చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడిని సౌత్-ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఇతడితో పాటు ఆ చోరీ సొత్తు ఖరీదు చేసిన రిసీవర్‌ని సైతం అరెస్టు చేసినట్లు డీసీపీ సాధన రష్మి పెరుమాల్ ఆదివారం ప్రకటించారు. వీరి నుంచి రూ.3.5 లక్షల విలువైన బంగారం, వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన జి.సాయి కుమార్ సరూర్‌నగర్‌లోని శ్రీనగర్‌లో స్థిరపడ్డాడు. మహిళల కేశాలు సుందరీకరించే పని చేసే ఇతగాడు అప్పుడప్పుడు బైక్ ట్యాక్సీ డ్రైవర్‌గానూ వ్యవహరిస్తున్నాడు. ఈ రకంగా వచ్చే ఆదాయం తన విలాసాలకు సరిపోకపోవడంతో తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం మార్గాలు అన్వేషించాడు. చైన్ స్నాచింగ్స్ చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు వస్తుందని భావించాడు. దీంతో బైక్ ట్యాక్సీ డ్రైవర్‌గా తిరుగుతున్న సందర్భాల్లో స్నాచింగ్స్ చేయడానికి అనువైన ప్రాంతాలకు రెక్కీ చేశాడు. మలక్‌పేటలోని ముంతాజ్ కాలనీ రోడ్ అనువుగా ఉందని నిర్ధారించుకున్నాడు. కొన్నాళ్లుగా తరచూ ఆ మార్గంలో తిరుగుతూ టార్గెట్ కోసం వెతికాడు. గత మంగళవారం రాత్రి బైక్ ట్యాక్సీ డ్రైవర్‌గా ఓ వినియోగదారుడిని దింపిన ఇతగాడు ఈ మార్గంలో తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో ఓ మహిళ ఒంటరిగా నడుచుకుంటూ రావడాన్ని గమనించాడు. సాయి కుమార్ ఆమె సమీపంలోకి వెళ్లి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తెల తాడు తస్కరించి ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదుతో మలక్‌పేట ఠాణాలో కేసు నమోదైంది. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస్‌రావు ఆదేశాలు మేరకు దీన్ని ఛేదించడం కోసం సౌత్-ఈస్ట్ జోన్ బృందం రంగంలోకి దిగింది. ఇన్‌స్పెక్టర్ డి.వెంకట్‌రెడ్డి నేతృత్వంలో ఎస్సైలు పి.సాయిరామ్, షేక్ కవియుద్దీన్ ముమ్మరంగా గాలించి సాయి కుమార్‌ను పట్టుకున్నారు. విచారణ నేపథ్యంలో చోరీ సొత్తును ఆర్మూర్‌కు చెందిన బాలాజీ జ్యువెలర్స్ యజమాని శ్రీరామ్ శ్రీనివాస్‌కు రూ.1.3 లక్షలకు విక్రయించానని చెప్పాడు. దీంతో అతడినీ పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను మలక్‌పేట పోలీసులకు అప్పగించారు.

త్వరలో బాపూజీనగర్ బస్తీ ఎన్నికలు


మాట్లాడుతున్న బస్తీవాసులు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ పరిధిలోని బాపూజీనగర్ బస్తీకి ఎన్నికలు నిర్వహించేందుకు బస్తీవాసులు సిద్ధమయ్యారు. ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసి ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు ఆనంద్, భాస్కర్, రవివర్మ, శ్రీనివాస్, పవన్, ఐ.వి.రాజు, బ్రహ్మం, ఫాతీమా మాట్లాడుతూ... తమ బస్తీకి అభివృద్ధి కమిటీ లేక సంవత్సరాలు గడిచిపోయిందన్నారు. దీంతో బస్తీ అభివృద్ధి చెందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బస్తీ వాసుల ఆమోదంతో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించామని వెల్లడించారు. ఎన్నికల తేదీని తరువాత జరుగబోయే సమావేశంలో ప్రకటించనున్నట్లు తెలిపారు.

ఎన్‌ఆర్‌ఆర్ పురం హెచ్‌ఎస్ ఎన్నికల్లో సెక్యులర్ ప్యానల్ విజయం


విజేతలకు ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న ఎన్నికల అధికారి

రహమత్‌నగర్: బోరబండ ఎన్‌ఆర్‌ఆర్‌పురం హౌసింగ్ సొసైటీకి ఆదివారం జరిగిన ఎన్నికల్లో సెక్యులర్ ప్యానల్ అభ్యర్థులు విజయం సాధించారు. ప్యానల్ నుంచి ఎనిమిది పోటీ చేయగా అందులో ఏడుగురు అభ్యర్థులు విజయం సాధించారు. మరో ప్యానలైన యునైటెడ్ ప్యానల్‌లో నలుగురు విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఎన్నికల్లో విజయం సాధించిన సెక్యులర్ ప్యానల్ అభ్యర్థులను సొసైటీ సభ్యులు, బస్తీవాసులు ఘనంగా సన్మానించారు. అనంతరం బస్తీల్లో విజయయాత్ర నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరుగకుండ బోరబండ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్‌లో నివసించే వి.వెంకటేష్ శనివారం రాత్రి తన వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి తాళాలు మరచిపోయి ఇంటికి వెళ్ళాడు. ఉదయం వచ్చి చూడగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. దాంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఇద్దరు మహిళలకు గాయాలు

వెంగళరావునగర్: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన సంఘటనలో ఇరువురు మహిళలు గాయపడిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం అమీర్‌పేట ధరంకరం రోడ్డులో నివసించే వి.గంగాధర్ సతీమణి విజయలక్ష్మి, ఆమె సోదరి చంద్రకళ ఆదివారం ద్విచక్ర వాహనంపై ఎర్రగడ్డకు వెళుతున్నారు. మైత్రీవనం వద్దకు రాగానే గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఇరువురు మహిళలు కింద పడటంతో వారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా గంగాధర్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టళ్లలో నేరపూరిత వ్యక్తులకు... వసతి కల్పిస్తే చర్యలు తథ్యం

- విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- ప్రతి హాస్టళ్లకూ పార్కింగ్ సౌకర్యం కచ్చితంగా ఉండాల్సిందే
- హాస్టల్‌లో ఉంటున్న అందరి వివరాలూ తప్పనిసరిగా తీసుకోవాలి
- హాస్టల్ నిర్వాహకులకు పబ్లిక్ సేఫ్టీ నోటీసులు అందజేసిన పోలీసులు


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్


పాల్గొన్న ప్రైవేట్ హాస్టళ్ల నిర్వాహకులు

బంజారాహిల్స్: కొంతమంది హాస్టళ్లలో ఉంటూ బయట నేరాలు చేయడంతో పాటు హాస్టళ్లలో సైతం చాలా దొంగతనాలు, క్రైం జరుగుతున్నాయని వాటిపై హాస్టల్ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని పంజగుట్ట ఏసీపీ మోహన్ కుమార్ హాస్టల్ నిర్వాహకులకు సూచించారు. ఆదివారం పంజగుట్ట, మధురానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో హాస్టళ్లు నిర్వహిస్తున్న నిర్వాహకులు, యజమానులకు సోమాజిగూడలోని జయగార్డెన్‌లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్‌కు అనుగుణంగా హాస్టళ్లు నిర్వహించాలని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు ఉంటాయని ఏసీపీ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఈ యాక్ట్ గురించి హాస్టల్ నిర్వాహకులకు అవగాహన కల్పించారు. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 130, పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో 115 హాస్టళ్లు నిర్వహిస్తుండగా వారంతా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ నోటీసులను అందరు నిర్వాహకులకు పోలీసులు అందించారు.

నాణ్యమైన సీసీ కెమెరాలు తప్పనిసరి...

ప్రతి హాస్టల్‌లో నాసిరకం సీసీ కెమెరాలు కాకుండా నాణ్యమైన సీసీ కెమెరాలను, ఇంటర్‌నెట్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యే డాటా కనీసం 30 రోజులకు తగ్గకుండా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. హాస్టళ్లలో బస చేస్తున్న విద్యార్థులు కావొచ్చు, వర్కింగ్ ఉమెన్ ఆర్ మెన్ ఎవరైనా సరే వారి పూర్తి వివరాలు నిర్వాహకుల వద్ద ఉండాలని పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ సూచించారు.

- చాలా హాస్టళ్లు సమయపాలన లేకుండా కొనసాగుతున్న విషయాన్ని తాముము గుర్తించామని అలా కాకుండా ప్రతీ హాస్టల్ నిర్దీత సమయవేళలను పాటించాలని దాని వల్ల ఎవరు వస్తున్నారు ఎవరు పోతున్నారనే దానిపై క్లారిటీ ఉంటుందని స్పష్టం చేశారు.
- పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో 23 దొంగతనం కేసులు నమోదు అయితే అందులో అన్నీ కూడా హాస్టళ్లలో ల్యాప్‌టాప్‌లు, సెల్ ఫోన్లు దొంగతనం జరిగినవే ఉన్నాయని అన్నారు. ఎవరి వస్తువులకు వారిదే బాధ్యత అన్నది కొంత వరకు నిజమే.. అయితే హాస్టళ్లపై నిర్వాహకుల నిఘా కూడా తప్పక ఉండాలన్నారు. భద్రత ఉండాలన్నది కూడా అంతే వాస్తవమని అన్నారు.

అనుమానిత వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలి

ఎవరైనా హాస్టల్‌లో ఉంటున్న వారి వ్యవహార శైలి, కదలికల్లో ఏదైనా అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చాలామంది హాస్టల్‌కు వచ్చినవారి వివరాలు ఏమి కనుక్కోకుండా వసతి కల్పిస్తున్నారని క్రైం చేసిన వారికి వసతి కల్పించడం కూడా నేరమేనని వారి పూర్తి వివరాలు కనుక్కున్న తర్వాతనే వారికి వసతి కల్పించాలని సూచించారు. చాలా హాస్టళ్ల నిర్వాహకులు పార్కింగ్ వసతి లేకుండా ఉండటంతో స్థానికంగా ఉండే బస్తీ, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రతి హాస్టల్ నిర్వాహకుడు విధిగా పార్కింగ్ వసతిని ఏర్పాటు చేసుకోవడంతో పాటు సెక్యూరిటీ గార్డ్‌ను కచ్చితంగా నియమించుకోవాలని సూచించారు. వ్యభిచార ముఠాలను నిర్వహించేవారు కొంత మంది కొన్ని హాస్టళ్లలో ఇతర రాష్ట్రాలకు చెందిన యువతను పెట్టుకొని వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని తమ విచారణలో అలాంటివి బయటికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రతి హాస్టల్‌నూ తనిఖీ చేస్తాం

15 రోజుల తర్వాత ప్రతి హాస్టల్‌ను తనిఖీ చేస్తాం. తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్‌కు అనుగుణంగా నిర్వహిస్తున్న హాస్టళ్ల నిర్వాహకులపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తప్పవు. కచ్చితంగా ప్రతి నిర్వాహకుడూ నిబంధనలు పాటించాల్సిందే. ప్రతి హాస్టల్‌లో రిజిష్టర్ తప్పనిసరిగా మెయింటెయిన్ చేయాలి.

– మోహన్‌కుమార్, ఏసీపీ పంజగుట్ట

యాదగిరినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం


నూతన కార్యవర్గ సభ్యులు

వెంగళరావునగర్: యాదగిరినగర్ నూతన అసోసియేషన్ అధ్యక్షుడిగా టి.గోపాల్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని యాదగిరినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పలువురు అసోసియేషన్ నూతన కమిటీ, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ వ్యవస్థాపక చైర్మన్‌గా వి.చిన్న శ్రీశైలం యాదవ్, సలహాదారులుగా వి.నవీన్‌యాదవ్‌లను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జి.వి.వి.రామారావు, ప్రధాన కార్యదర్శులుగా కె.మహేంద్ర, వి.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలుగా యు.హెచ్.కె.వర్మ, టి.చిరంజీవి, లీగల్ ఎడ్వైజర్‌గా వి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నరసయ్య, సురేష్ ముదిరాజ్, సత్యనారాయణ, నర్సింగ్ ముదిరాజ్, కోశాధికారులుగా గిరిధర్‌రెడ్డి, మధు, శ్రీనివాస్‌లతో పాటుగా పలువురు కరస్పాండెంట్స్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడు అజయ్ మృతి


ఖైరతాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ ఖైరతాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు గజ్జల అజయ్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. గజ్జల అజయ్ బీఆర్‌ఎస్ పార్టీ ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా పనిచేశారు. కోవిడ్ తరువాత ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న అజయ్ నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జల నాగేష్ తెలిపారు.

కేటాయించిన స్థలంలోనే కమ్యూనిటీ హాల్ నిర్మించాలి

రహమత్‌నగర్: ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని వదిలి తమ బస్తీలోని ప్రభుత్వ స్థలాన్ని నాయీ బ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించారనడంపై నందునగర్ బస్తీవాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్పీఆర్‌హిల్స్ వారు ఆదివారం మాట్లాడుతూ... నాయీ బ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ కోసం గతంలో 300 చదరపు గజాల స్థలాన్ని మేరీమాత ఆలయం వద్ద కేటాయించి ఆమోదించారన్నారు. అయితే ప్రస్తుతం నందునగర్ బస్తీలో కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించారని నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కలెక్టర్ జారీ చేసిన ధ్రువీకరణ పత్రం ప్రకారం కేటాయించిన స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేసుకోవాలని నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులకు నందునగర్ బస్తీవాసులు సూచించారు.

నీట్ అవకతవకలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలి

- బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి


మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

లిబర్టీ: నీట్ అవకతవకలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తిచే సమగ్ర విచారణ జరిపించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి కోరారు. జాతీయస్థాయిలో జరిగిన జాతీయ అర్హత పరీక్ష నీట్ అక్రమాలు అవకతవకలు జరిగాయని సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపిస్తే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. దళ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించకపోతే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సారథ్యంలోని ధర్మాసనం నీట్ అవకతవక అంశాన్ని సుమోటుగా స్వీకరించి విచారించాలని విన్నవించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతానికి చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆయన స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో జరిగిన అర్హత పరీక్షలో 24 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఆయన అన్నారు. 67 మందికి జాతీయ స్థాయిలో ఒకొక్కరికి 720 మార్కులు ఎలా వస్తాయని సూటిగా ప్రశ్నించారు. ప్రవేశ పరీక్షలో అక్రమాలు అవకతవకలు జరిగాయని పేపరు లీకేజీ అయిందని అందు వల్లనే 67 మందికి 720 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆరోపించారు. నిరంతరం కోచింగ్ తీసుకోని అహర్నిశలు కష్టపడి ఆర్థికంగా చితికిపోయినప్పటికి జాతీయ స్థాయిలో సాధిదంచారని బీసీ విద్యార్థులు లక్షలాది మంది పనరీక్షల హాజరై రాస్తే అర్హత కూడా సాధించలేని పరిస్థితి నెలకొందని ప్రశ్నాపత్రం లీకేజీ వల్లనే బీసీ బిడ్డలు నష్టపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమాలు ప్రశ్నాపత్రాలు లీకేజీ జరిగిన కూడా కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి మౌనంగా ఉండటం వల్ల అనుమానాలు ఉన్నాయన్నారు. పరీక్షను వెంటనే రద్దు చేసి తిరిగి నిర్వహించి అర్హత కలిగిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పర్సనల్ ఫొటోలు వైరల్ చేస్తానంటూ బెదిరిస్తున్న భర్తపై ఫిర్యాదు

వెంగళరావునగర్: భార్య నగ్న ఫొటోలను వైరల్ చేస్తానంటూ బెదిరిస్తున్న భర్తపై ఓ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల సమాచారం మేరకు... యూసుఫ్‌గూడలో నివసించే మహిళకు రామాంతపూర్‌కు చెందిన వి.రాజేష్‌తో షాదీ డాట్ కామ్‌లో పరిచయమైంది. ఈ క్రమంలో గత ఏడాది మార్చి 11న వివాహమైంది. రాజేష్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. వారి పెళ్లికి అతని తల్లి మినహా బంధువర్గం ఎవరూ హాజరుకాలేదు. వాస్తవానికి అతనికి రెండు పెళ్లిళ్లు అయ్యాయి. నిత్యం డేటింగ్ యాప్‌లో యాక్టివ్‌గా ఉంటూ లింగ బేధం లేకుండా అనేక వ్యవహారాలు కొనసాగించాడు. ఆమె అనుమతి లేకుండా అసహజ సెక్స్‌లో పాల్గొనేవాడు. అత్త కట్నం కోసం వేధించేది. అతనిపై వెస్ట్‌జోన్‌లో కేసు కూడా పెట్టింది. తాను చివరిసారిగా కోర్టుకు హాజరైనప్పుడు తన ఫోన్‌లో భార్య న్యూడ్ ఫొటోలు, వీడియోలు ఉన్నాయని, కేసు ఉపసంహరించుకోకపోతే వాటిని వైరల్ చేస్తానని బెదిరించాడు. కేసు ఉపసంహరించుకోవాలని, లేకపోతే చనిపోవాలని హెచ్చరిస్తున్నాడు. దాంతో మధురానగర్ పీఎస్‌లో రాజేష్ మీద అతని భార్య ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలకు ప్రభుత్వాలు ప్రాధాన్యమివ్వాలి



ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభిస్తున్న నవీన్‌యాదవ్

వెంగళరావునగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు మరింతగా ప్రాధాన్యత ఇచ్చి క్రీడాకారులను ప్రోత్సహించాలని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ కన్వీనర్ వి.నవీన్‌యాదవ్ తెలిపారు. యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఆదివారం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియం ఒలింపిక్ రన్ కమిటీ ఆధ్వర్యంలో 38వ ఒలింపిక్ డే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నవీన్‌యాదవ్ మాట్లాడుతూ... యువతకు స్టేడియంలో అనేక క్రీడలపై శిక్షణ ఇస్తున్నారన్నారు. శిక్షణ పొందిన వారు వివిధ పోటీల్లో పాల్గొంటూ తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. ఒలింపిక్ వేదిక ధ్యేయంగా యువతీ యువకులు తమకు నచ్చిన రంగాల్లో ఎదగాలని... ఈ మేరకు కఠోర శిక్షణ తీసుకోవాలలని సూచించారు. కేవీబీఆర్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ అలెగ్జాండర్ ఫ్రాన్సిస్, ఇంటర్నేషనల్ మాజీ హ్యాండ్ బాలర్ కె.నర్సింహా, మాజీ నేషనల్ ఫుట్‌బాల్ ప్లేయర్ కైసర్, కన్వీనర్ జగన్‌మోహన్ గౌడ్, కేవీబీఆర్ కోచ్‌లు ఇమ్రోజ్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

స్థలం కబ్జా చేస్తున్నారని కలెక్టర్‌కు అంధురాలి వినతి

రహమత్‌నగర్: ప్రభుత్వం తనకు కేటాయించిన స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకుని, తన స్థలాన్ని కాపాడాలని ఓ దివ్యాంగురాలు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది. వివరాలివీ... ఎస్పీఆర్‌హిల్స్ రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన చంద్రమ్మ అలియాస్ కృష్ణవేణి చిన్నపటి నుంచే అంధురాలు. ఆమెకు 1993లో అప్పటి ప్రభుత్వం 50 గజాల ఇంటి పట్టా (ఎఫ్.4477.93)ను మంజూరు చేసి, ప్లాట్ 89లో స్థలంలో కేటాయించింది. అయితే ఇదే బస్తీకి చెందిన వడ్డె ఎల్లయ్య తన స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. గతంలో కూడా పలుమార్లు తన స్థలం ఆక్రమించేందుకు కొంత మంది ప్రయత్నం చేశారన్న విషయం ఆమె గుర్తు చేసింది. తన స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న ఎల్లయ్యపై చర్యలు తీసుకుని తన స్థలాన్ని కాపాడాలని చంద్రమ్మ హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించింది.

స్ఫూర్తిప్రదాత శ్యామాప్రసాద్ ముఖర్జీ


ఇంద్రానగర్‌లో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న నేతలు


హిమాయత్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న నేతలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ ఇంద్రానగర్‌లో ఆదివారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జోన్ బీజేపీ కార్యవర్గ సభ్యుడు దండుగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ కౌన్సిల్ మెంబర్ భోజిరెడ్డి, ఖైరతాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, హైదరాబాద్ సెంట్రల్ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త నీరజలు అతిథులుగా పాల్గొని శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ముద్దంగుల శ్రీనివాస్, కస్తూరి మైపాల్‌రెడ్డి, శీతల అనిల్‌కుమార్, బోయ రామాంజనేయులు, గణేష్‌యాదవ్, రాజుకళ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లో...

హిమాయత్‌నగర్: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా బీజేపీ నేతలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం హిమాయత్‌నగర్ డివిజన్‌లో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కె.నర్సింగ్ ముదిరాజ్, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు పందిళ్ల ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు నవీన్, కేశబోయిన శ్రీధర్, నరహరి, మాధవి, మనీలా శాంతి పాల్గొన్నారు.

ప్రాణాలనే త్యాగం చేసిన గొప్ప వ్యక్తి...

రహమత్‌నగర్: దేశం కోసం, ధర్మం కోసం శ్యామాప్రసాద్ ముఖర్జీ తన ప్రాణాలనే త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని బీజేపీ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి కొలన్ సత్యానారాయణ అన్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆదివారం ఎస్పీఆర్‌హిల్స్‌లో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ... జనసంఘ్ వ్యవస్థాపకుడిగా హిందూ ధర్మం కోసం ముఖర్జీ ఎనలేని సేవలు.. అందించారని కొనియాడారు. ఆయన బాటలో దేశం కోసం పనిచేయాల్సిన అవసరం ప్రస్తుత సమాజంపై ఉందన్నారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కనకరాజు, నేతలు విశాల్ సింగ్, నాందేడ్ కాశీ పాల్గొన్నారు.


ఎస్పీఆర్‌హిల్స్‌లో కొలన్ సత్యనారాయణ

భారీ వర్షం.. స్తంభించిన పౌరజీవనం

- వాహనాల రాకపోకలకు అంతరాయం
- రంగంలోకి దిగిన డీవీడీఎఫ్ డీఆర్‌ఎఫ్


కేసీపీ జంక్షన్‌లో...


రాజ్‌భవన్ రోడ్డులో వరదనీటి మార్గంలో...


రాజ్‌భవన్ రోడ్డులో వరద నీరు


కేసీపీ జంక్షన్‌లో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్


కేసీపీ జంక్షన్‌లో...

బంజారాహిల్స్: దంచికొట్టిన వానతో రహదారులన్నీ అతలాకుతలం కాగా జీహెచ్‌ఎంసీ, ఈవీడీఎఫ్ డీఆర్‌ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి ఎక్కడికక్కడ వాటర్ లాగింగ్ పాయింట్లలో అప్రమత్తమై వరదనీరు వెళ్లే మార్గాలను శుభ్రం చేశారు. ఆదివారం సాయంత్రం రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షంతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, శ్రీకృష్ణానగర్, శ్రీనగర్‌కాలనీ, పంజగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, చింతల్‌బస్తీ, సోమాజిగూడ, రాజ్‌భవన్ ప్రాంతాల్లో రహదారులు జలదిగ్బంధమయ్యాయి. వరదనీరు భారీగా నిలిచిపోయి రాకపోకలు స్తంభించిపోయి డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో వరదనీటి కాలువల మార్గాల్లో చిక్కుకున్న వ్యర్థాలు, చెత్తా చెదారం, బురద తొలగించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. చాలా ప్రాంతాల్లో డీఆర్‌ఎఫ్ సిబ్బంది వరదనీరు వెళ్లే మార్గాల్లో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పరిస్థితిని పర్యవేక్షించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ ట్రాఫిక్ సిబ్బంది, జీహెచ్‌ఎంసీ మాన్సూన్ యాక్షన్ టీమ్‌తో కలిసి పంజగుట్ట కేసీపీ జంక్షన్‌లో వరదనీరు వెళ్లే మార్గాలను శుభ్రం చేయించారు. పెద్ద ఎత్తున వరదనీరు నిలిచిపోగా సిబ్బంది వ్యర్థాలను తొలగించి వరదనీరు వెళ్లేలా చేశారు. పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గౌస్‌ఖాన్ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పంజగుట్ట ఫ్లైఓవర్, నాగార్జున సర్కిల్ ప్రాంతాల్లో వరదనీరు వెళ్లే మార్గాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్తీల్లో ఇళ్లల్లోకి నీరు చేరి జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మహిళల భద్రత, సాధికారతే లక్ష్యం



చెక్కు అందజేసే కార్యక్రమంలో డీసీపీ సృజన కర్ణం

బంజారాహిల్స్: మహిళల భద్రత, సాధికారతే లక్ష్యంగా శంషాబాద్‌లో భరోసా కేంద్రం ఏర్పాటుకు బిల్డింగ్ బ్లాక్ గ్రూప్(బీబీజీ) ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర పోలీస్ శాఖలోని మహిళా, శిశు భద్రతా విభాగం డీసీపీ సృజన కర్ణం అన్నారు. బీబీజీ 449వ టాలెంట్ ఫ్యాక్టరీ కార్యక్రమం ఆదివారం జరిగింది. బంగారు తల్లి సాధికారత కోసం బీబీజీ నుంచి బీబీజీ ఫౌండేషన్‌కు డీసీపీ చేతుల మీదుగా రూ.15 లక్షల చెక్కు అందజేశారు. ఆమె మాట్లాడుతూ బీబీజీ ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. బీబీజీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ బాలికలు, మహిళల కోసం సురక్షితమైన కమ్యూనిటీలను రూపొందించడం బీబీజీ నిబద్ధతకు నిదర్శనమన్నారు.

ఆరోగ్య తెలంగాణకు ప్రభుత్వం కృషి

రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు


ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

అమీర్‌పేట: ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి ఆరోగ్య తెలంగాణగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఎస్‌ఆర్ నగర్‌లో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శరత్‌చంద్ర ఏర్పాటు చేసిన జయంతి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య తెలంగాణ కోసం ప్రైవేటు ఆసుపత్రులు కూడా సహకరించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని అన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షల వరకు పెంచామని చెప్పారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ పేదలకు అందుబాటు ధరల్లో వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ శరత్‌చంద్ర, అమీర్‌పేట కార్పొరేటర్ సరళ, మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రావు, గోదాస్ నవీన్, చౌదరిగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

29న మేయర్‌పై అవిశ్వాస తీర్మానం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్‌పై ఈ నెల 29న అవిశ్వాస తీర్మానం షెడ్యూల్ ప్రకటిస్తూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 11 గంటలకు మేయర్ సామల బుచ్చిరెడ్డి, 11.30 గంటలకు డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మిరవిగౌడ్‌పై తీర్మానం ప్రవేశపెడతారు. మే 21న కాంగ్రెస్ పార్టీకి చెందిన 21 మంది కార్పొరేటర్లు జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేయగా జూన్ 6న దానికి సంబంధించిన షెడ్యూల్ ప్రకటించారు. అయితే నిబంధనలు పాటించలేదంటూ మేయర్, డిప్యూటీ మేయర్ హైకోర్టును ఆశ్రయించడంతో స్టే విధించింది. కాంగ్రెస్ కార్పొరేటర్లు, జిల్లా కలెక్టర్ కోర్టుకు వెళ్లి స్టేను రద్దు చేయించారు. కాగా, కాంగ్రెస్ కార్పొరేటర్లు వైజాగ్ క్యాంప్‌లో ఉన్నారు.

టీటీ సింగిల్స్ విజేతలు రీతూ, ఆకాశ్



సాక్షి, హైదరాబాద్: పవర్‌గ్రిడ్ ఇంటర్ రీజినల్ టేబుల్ టెన్నిస్(టీటీ) టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్‌లో ఆకాశ్(ఎన్‌ఆర్–2), మహిళల సింగిల్స్‌లో రీతూ యాదవ్(సీసీ) విజేతలుగా నిలిచారు. మూడు రోజులపాటు లాల్‌బహదూర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ టోర్నీ ఆదివారం ముగిసింది. ఫైనల్స్‌లో రోనిల్ సింగ్(డబ్ల్యూఆర్–2)పై ఆకాశ్, ప్రాంతిక శ్రీవాస్తవ(ఎస్‌ఆర్–2)పై రీతూ యాదవ్ విజయం సాధించారు. పురుషుల డబుల్స్ ఫైనల్లో రోనిల్ సింగ్–సోహమ్ దే (డబ్ల్యూఆర్–2) ద్వయం జగన్నాథ్–రవి (సీసీ) జోడీపై గెలిచి టైటిల్ దక్కించుకుంది. పవర్‌గ్రిడ్ ఎస్‌ఆర్‌టీఎస్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేశ్ శ్రీవాస్తవ ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టాన్లీ మాథ్యూస్ (ఈడీ, హెచ్‌ఆర్‌డీ–మానెసర్), అఖిలేశ్ పాఠక్ చీఫ్ జీఎం(ఎస్‌ఆర్‌టీసీ–1), తెలంగాణ టీటీ సంఘం జనరల్ సెక్రటరీ, కోశాధికారి నాగేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్ చీఫ్ జీఎం (హెచ్‌ఆర్–హెచ్‌ఓపీ) పాల్గొన్నారు.

బస్తీపిల్లల కోసం 'రీయూజ్'



లక్డీకాపూల్ : బస్తీ పిల్లల్లో ఆనందం కోసం కలెక్షన్, కమ్యూనిటీ డ్రైవ్ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా జరిగింది. కోకాపేట్ రోటరీ క్లబ్ ప్రభుత్వ, ప్రభుత్వేతర స్కూళ్ల విద్యార్థులతో కలిసి ఆదివారం రీయూజ్ పేరిట వినూత్న కార్యక్రమం నిర్వహించింది. క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ ప్రణీత, సభ్యులు డాక్టర్ మధులిక, చంద్రశేఖర్, రాజశేఖర్, డాక్టర్ మంజు, హైమంతిలు.. ఉపయోగించిన బట్టలు, బొమ్మలు, బ్యాగులు, బూట్లు, బెడ్‌షీట్లను సేకరించి దాదాపు 200 మంది గండిపేట్ బస్తీలోని చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రణీత మాట్లాడుతూ ప్రకృతికి, పర్యావరణ పరిరక్షణకు, రీసైకిల్ ప్రక్రియకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. రీయూజ్ కార్యక్రమంలో పాల్గొన్న పల్లవి ఇంటర్నేషనల్, కోకాపేట్ ప్రభుత్వ పాఠశాల, మాదాపూర్‌లోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు, అందమైన క్షణాలు, జ్ఞాపకాలు మిగిలాయని అన్నారు.

కారుణ్యంపై కాఠిన్యం!

కంటోన్మెంట్‌లో నియామకాలపై సీలింగ్ ఎత్తివేతకు కేంద్రం నో

- సర్వీసులో ఉండగా చనిపోయిన ఉద్యోగులు 122 మంది
- 5 శాతం బాధిత కుటుంబాలకే ఉద్యోగాలివ్వాలంటున్న రక్షణ శాఖ
- దీనిపై నేటి కంటోన్మెంట్ బోర్డు భేటీలో చర్చించే అవకాశం



సికింద్రాబాద్ కంటోన్మెంట్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న స్థానిక మిలటరీ స్టేషన్ కమాండర్, బ్రిగేడియర్ సోమశంకర్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం

అధ్యక్షుడికి ఆఖరు..ఆహ్వానితులకు తొలిసారి..

నిర్వహించే బోర్డు సమావేశం ఆయనకు చివరిది కానుంది. ఇక ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే శ్రీగణేశ్ తొలిసారి బోర్డు సమావేశంలో పాల్గొననున్నారు.

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో కారుణ్య నియామకాల ప్రక్రియ చాలాఏళ్లుగా నిలిచిపోయింది. మరోవైపు ఈ నియామకాలపై రక్షణ శాఖ సీలింగ్ విధించింది. చనిపోయిన ఉద్యోగుల్లోని కొన్ని కుటుంబాలవారికే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని స్పష్టం చేస్తోంది. సీలింగ్ ఎత్తివేతకు ససేమిరా అంటోంది. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం సోమవారం జరగనుంది. కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు, బ్రిగేడియర్ సోమశంకర్ ఆధ్వర్యంలో బోర్డు కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధుకర్ నాయక్, సివీలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు అధికారులు పాల్గొననున్నారు. కంటోన్మెంట్ పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు, పరిపాలన అనుమతులు, పలు టెండర్లు, సర్క్యులర్ ఎజెండాకు ఆమోదం, భవన నిర్మాణ అనుమతులు వంటి అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. ముఖ్యంగా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలపై మరోసారి బోర్డు సుదీర్ఘంగా చర్చించే అవకాశముంది.

2010 నుంచి పెండింగ్

2010 నుంచి కంటోన్మెంట్ బోర్డులో మొత్తం 122 మంది ఉద్యోగులు సర్వీసులో ఉండగానే చనిపోయారు. వీరిస్థానంలో కారుణ్య నియామకాల కింద మృతుల కుటుంబాల్లో ఒకరికి చొప్పున ఉద్యోగం ఇవ్వాల్సి ఉంది. అయితే రక్షణ శాఖ ఉత్తర్వుల ప్రకారం మొత్తం ఖాళీల్లో 5 శాతం మందికి మాత్రమే కారుణ్య నియామకాలు చేపట్టే అవకాశముంది. దీని ప్రకారం గత పద్నాలుగేళ్ల ఖాళీల్లో కేవలం 22 మందికి మాత్రమే ఉద్యోగ అవకాశం ఇవ్వడం సాధ్యం అవుతుంది.

సీలింగ్ ఎత్తివేత కుదరదు!

కంటోన్మెంట్ శానిటేషన్ సిబ్బంది దుర్భర పరిస్థితుల్లో పనిచేస్తూ అనారోగ్యానికి గురై, అర్ధంతరంగానే తనువు చాలించాల్సి వస్తోందని ఉద్యోగ సంఘం నేతలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సర్వీసులో ఉండగానే మరణించిన ఉద్యోగుల కుటుంబసభ్యులతో కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. 122 మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు అడ్డంకిగా ఉన్న 5 శాతం సీలింగ్‌ను సడలించాలని కొన్నేళ్లుగా కోరుతున్నారు. దీనికి సంబంధించి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ద్వారా సిఫారసు చేయించినప్పటికీ రక్షణ శాఖ ఉన్నతాధికారులు ఆమోదం తెలపలేదు. దీంతో కారుణ్య నియామకాల ప్రక్రియ ఆగిపోయింది. ఈ పరిస్థితుల్లో సోమవారం నాటి సమావేశంలో ఏ మేరకు నిర్ణయం తీసుకుంటారోనని ఉద్యోగులు, బాధిత కుటుంబాల సభ్యులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

పీఈటీల పదోన్నతులపై హర్షం


సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

గన్‌ఫౌండ్రీ: వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)లుగా పదోన్నతులు కల్పించడంపై వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, కార్యదర్శి పి.కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 1,849 మందికి స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పించి వారి కుటుంబాలలో వెలుగునిలిపారని కొనియాడారు. అయితే కొన్ని జిల్లాలలో సాంకేతిక కారణాలతో పదోన్నతుల ప్రక్రియ జరగలేదని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. త్వరలోనే జూనియర్ కళాశాలల్లో సైతం ఫిజికల్ డైరెక్టర్లకు పదోన్నతులు కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు ఉపాధ్యాయ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, రవి, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

866 మంది టీచర్లకు పదోన్నతులు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా పరిధిలో పనిచేస్తున్న 866 మంది సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ)కు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. తెలుగు మీడియంలో 49 మంది ఎస్జీటీలు, ఉర్దూ మీడియంలో 28 మంది ఎస్జీటీలు ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారు. వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు లభించాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలో చాలాకాలానికి ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించడంపట్ల పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్కంఠభరితంగా రైఫిల్ షూటింగ్...

వివిధ విభాగాల్లో 300 మంది షూటర్ల ప్రతిభ



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ పోటీల్లో భాగంగా 10 మీ రైఫిల్ (ఎస్ఆర్) ఛాంపియన్‌షిప్‌లో విక్రాంత్ రాజ్ దుర్గల్ల 4 పతకాలను (3 స్వర్ణాలు, ఒక రజతం) కైవసం చేసుకున్నాడు. గచ్చిబౌలిలోని సాట్స్ షూటింగ్ రేంజ్ వేదికగా జరుగుతున్న ఈ పోటీల్లో 300 మందికి పైగా షూటర్లు పాల్గొంటున్నారు. 10మీ ఎయిర్ రైఫిల్, 10మీ ఓపెన్ సైట్ రైఫిల్, ట్రాప్ ఈవెంట్‌లలో పలువురు విజేతలకు ఆదివారం రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అంజనీ కుమార్ అవార్డులు, మెడల్స్‌తో సత్కరించారు. ఈ అవార్డుల ప్రదానోత్సవంలో మహిళలు, పురుషుల విభాగాల్లో మెడల్స్ గెలిచిన విజేతలు పాల్గొన్నారు.

ఆలయంలో వందేళ్ల చెట్టు నరికివేత


శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయంలో నరికివేసిన చెట్టు వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

వనస్థలిపురం: వనస్థలిపురం ఫేజ్–1లోని శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో వందేళ్లనాటి రావిచెట్టు నరికివేత వివాదాస్పదమైంది. భక్తులు పూజించే రావిచెట్టును ఎలా నరికివేస్తారంటూ స్థానికులు, వందేళ్లుగా ప్రజలకు, భక్తులకు నీడ, ఆక్సిజన్ ఇస్తున్న చెట్టును ఎలా కూల్చివేస్తారంటూ పర్యావరణ కార్యకర్త గ్రీన్ జ్ఞానేశ్వర్ ఆదివారం దేవాలయంలో ఆందోళనకు దిగారు. రావిచెట్టు శిథిలావస్థకు చేరుకోవడం, గుడి ప్రాంగణంలో భక్తుల నీడ కోసం వేయాలనుకున్న షెడ్డుకు అడ్డుగా వస్తుండటంతో పాలకవర్గం చైర్మన్ మఠం శాంత్‌కుమార్ ఫారెస్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి కొమ్మలు నరకడానికి అనుమతి తీసుకున్నారు. ఈ క్రమంలో వారం క్రితం చెట్టు కొమ్మలతో పాటు, మొదలు భాగాన్ని 12 అడుగుల వరకు నరికివేయించారు. దీనిని గమనించిన స్థానిక మహిళా సంఘం నేత ఆశాజ్యోతి, స్థానికులు ఫారెస్ట్ అధికారులకు, కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. 'చెట్టు శిథిలమై పోవడతో భక్తుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వైపులా కొమ్మలను నరికివేయించాం' అని ఆలయం చైర్మన్ మఠం శాంత్‌కుమార్ అన్నారు. 'చెట్టు పెలుసుగా మారి కూలిపోయే ప్రమాదం ఉంది. ఒకవేళ అది కూలి ఏదైనా ప్రమాదం జరిగితే అప్పుడు ఎవరు బాధ్యత వహిస్తారు' అని ఇబ్రహీంపట్నం డీఆర్‌ఓ ఇంద్రసేనారెడ్డి ప్రశ్నించారు.

నిమ్స్‌లో స్కిల్ ల్యాబ్!

వైద్యవృత్తి నైపుణ్యాల మెరుగే లక్ష్యం


ల్యాబ్ ఇలా..

లక్డీకాపూల్: నిమ్స్‌లో స్కిల్ ల్యాబ్ అందుబాటులోకి వచ్చింది. వైద్యవృత్తిలో నైపుణ్యాల మెరుగే దీని లక్ష్యం. శిక్షణలో సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు రూ.10 కోట్లు వెచ్చించి ఈ ఏడాది మార్చిలో ఈ ల్యాబ్‌ను సిద్ధ చేశారు. ఊపిరితిత్తుల్లోంచి గుండెలోకి దూసుకుపోయిన బాణాన్ని సునాయాసంగా తొలగించి ఓ ఆదివాసీ యువకుడికి పునఃజన్మనిచ్చి నిమ్స్ వైద్యులు అందరి దృష్టిని ఆకర్షించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిమ్స్ మరో అడుగు ముందుకేస్తూ వైద్యవిద్యలో తమ సామర్థ్యానికి మరింత మెరుగులుదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఈ క్రమంలో పోస్ట్ గ్రాడ్యుయేట్లు, నర్సులు, ఇతర పారా మెడికల్ సిబ్బందికి అత్యవసర, క్లిష్ట పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో మెళకువలు నేర్పేందుకు ల్యాబ్ దోహదపడుతుంది. ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లో వచ్చినా సరే రోగుల ప్రాణపాయస్థితిని తప్పించేందుకు ల్యాబ్ దోహపడుతుందని నిమ్స్ వైద్య విద్యార్థులు పేర్కొంటున్నారు. నిమ్స్ మిలీనియం బ్లాక్ ఆరో అంతస్తులో 4,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో అధునాతన బొమ్మలు, హై ఫిడిలిటీ పరికరాలను ల్యాబ్‌లో సమకూర్చారు. సిమ్యులేషన్ సెంటర్ ఆధారిత కోర్సులను కూడా నిమ్స్ అభివృద్ధి చేస్తోంది. శిక్షకులకు సైతం ఈ స్కిల్ ల్యాబ్ శిక్షణ ఇవ్వనుంది. డిజిటల్ శిక్ష ఫర్ అడ్వాన్స్‌డ్ క్లినికల్ కెపాసిటీ బిల్డింగ్(డీఐఎస్‌హెచ్‌ఏ)గా దీన్ని పిలుస్తారు. 'ట్రామా కేర్‌లో నిమ్స్ పాత్ర ప్రత్యేకం. వైద్యసేవలపై విదేశీ వైద్య బృందాలు సైతం అబ్బురపడిన సందర్భాలున్నాయి. ఈ సెంటర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా సమర్థ, ఆత్మవిశ్వాసంతో కూడిన ఆరోగ్య సంరక్షణ ప్రదాతలను అభివృద్ధి చేయడమే నిమ్స్ లక్ష్యం' అని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

చెంచు మహిళపై దాడిని ఖండించిన మాలమహానాడు


మాట్లాడుతున్న శ్రీకృష్ణ తదితరులు

సుల్తాన్‌బజార్: చెంచు మహిళపై జరిగిన దాడి సభ్యసమాజానికి తలవంపులు వంటిందని, ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో కమిషన్ వేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పి. శ్రీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొల్లాపూర్ నియోజకవర్గం మొలచింతపల్లిలో రెండు చెంచు కుటుంబాలను ఇసుక మాఫియా గూండాలు చిత్రవధ చేశాయని ఆరోపించారు. చెంచు మహిళ ఈశ్వరమ్మపై అత్యాచారం, హత్య చేసి చంపాలని ప్రయత్నించడం, ఆమెతో వెట్టిచాకిరి చేయించాలని వేధించడం గర్హనీయమని అన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాల మహానాడు ప్రతినిధులు ప్రసాద్, సుధాకర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.




ఆకట్టుకున్న ఎగ్జిబిషన్


వనస్థలిపురం: మారుతున్న కాలానికి ఫ్యాషన్, వివిధ రంగాల్లో వస్తున్న మార్పులు, యువత ఆధునిక పోకడలకు అలవాటు పడుతున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హస్తినాపురంలోని జీఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఫ్యాషన్ ఎన్ ఫ్యూషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బిగ్గెస్ట్ ఫ్లీ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తాతో కలిసి సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో వివిధ కంపెనీలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. షాపింగ్, ఫుడ్, మ్యూజిక్, కిడ్స్ ప్లే ఏరియా సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కమలా సుధీర్‌రెడ్డి, గజ్జల మధుసూదన్‌రెడ్డి, నిర్వాహకులు ప్రణతి, హరిణి, స్వేత, దీప్తి, ప్రియా, ప్రణతి పాల్గొన్నారు.

తెలుగు భాషను కాపాడుకుందాం


పురస్కార గ్రహీతలతో ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు కవిత వైభవం ఆధ్వర్యంలో 'తెలుగు భాషాభివృద్ధి – మన కృషి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరభాష మోజులో పడి మాతృభాషను విస్మరించవద్దని యువతకు సూచించారు. అనంతరం తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న పలువురికి తెలుగుబంధు బిరుదులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ టి.గౌరీశంకర్, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, తెలుగు భాషా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి.బడేసాబ్, తెలుగు అభివృద్ధి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.24 లక్షల విలువైన గంజాయి పట్టివేత


ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడిన గంజాయి, నలుగురు విక్రయదారులు

కుత్బుల్లాపూర్: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసుల దాడుల్లో రూ.24 లక్షల విలువ చేసే గంజాయి పట్టుబడింది.. వివరాల్లోకి వెళితే.. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం బాచుపల్లి చౌరస్తాలో సీఐ సుభాష్‌చందర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అటుగా బైక్‌పై వచ్చిన బొల్లారం ప్రాంతానికి చెందిన తుకారం, వికాస్‌ల వద్ద రూ.4.5 కిలోల గంజాయి లభించింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బొల్లారంలోని వారి ఇంట్లో మరో 76 కిలోల గంజాయి వెలుగు చూసింది. సదరు గంజాయి విలువ మార్కెట ధరలో రూ.24 లక్షలు ఉంటుందని, నిందితుల నుంచి రెండు ఆటోలు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ సుభాష్‌చందర్ తెలిపారు. వారితోపాటు గంజాయి విక్రయాల్లో పాలుపంచుకుంటున్న అంకుష్, పుష్పలను సైతం అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు వెంకట్, అనిల్ పాల్గొన్నారు. పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్, ఏఈఎస్ జీవన్ కిరణ్ అభినందించారు.

మీ ధైర్యం యువతకు ఆదర్శం

గోవుల రవాణాను అడ్డుకున్న మహిళలకు కేంద్రమంత్రి సంజయ్ అభినందన


మైథిలీ, సునీతలను సన్మానించిన కేంద్రమంత్రి బండి సంజయ్

చాదర్‌ఘాట్: గోవులను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకొని పోలీసులకు పట్టించిన మహిళలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అభినందించారు. ఈ నెల 15న ఓల్డ్‌మలక్‌పేటలో రెండు వాహనాలలో గోవులను తరలిస్తుండగా మైథిలీ, సునీత అడ్డుకున్నారు. వాహనాలపైకి ఎక్కి అవి ముందుకు కదలకుండా ధైర్యంగా ప్రతిఘటించారు. 200 మందికిపైగా మూకలు వారిని అడ్డు తప్పించేందుకు ప్రయత్నించినా, బెదరకుండా పోలీసులు వచ్చే వరకు వారు వాహనాలను నిలువరించారు. ఈ ఘటనను కొందరు ఫోన్‌లలో చిత్రీకరించి ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. విషయం తెలుసుకున్న బండి సంజయ్ వారికి ఫోన్ చేసి కుటుంబసభ్యులతో కలిసి హిమాయత్‌నగర్‌లోని తన ఇంటికి పిలిపించుకున్నారు. వారికి శాలువాలు కప్పి సన్మానించారు. వారితో కలిసి భోజనం చేశారు. 'మీ ధైర్య సాహసాలు నేటి యువతకు ఆదర్శం' అని కితాబు ఇచ్చారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా, చట్టపరిధిలో గోమాతలను రక్షించడం అభినందనీయమని బండి సంజయ్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం హరిపురం గ్రామంలోని ఓ వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈ మహిళలు ప్రస్తుతం కుటుంబ సభ్యులతో కలిసి మలక్‌పేటలో ఉంటున్నారు. గోమాతలకు హాని చేస్తే మానవాళికి చెడు చేసుకున్నట్లే అని భావించి, కబేళాకు తరలిస్తున్న గోవులను రక్షించాలని వాహనాలను అడ్డుకున్నామని మహిళలు తెలిపారు.

బాధ్యత పెరిగింది

గోమాతలను కబేళాకు తరలిస్తున్న సమయంలో అడ్డుకొని వాటిని కాపాడటంతో మా బాధ్యత మరింత పెరిగింది. 2012 నుంచి గోమాతలను ప్రేమిస్తున్నాం. మాకు బండి సంజయ్ అన్ననే స్ఫూర్తి. మాదీ కరీంనగర్ జిల్లా అని తెలుసుకొని ఈ రోజు మంత్రి సన్మానించారు. మహిళలే కాకుండా పురుషులు కూడా విధిగా గోవధను అడ్డుకోవడానికి ముందుకు రావాలి. గోమాతను కాపాడుకుంటే ప్రకృతి ప్రశాంతంగా ఉంటుంది.

-మైథిలీ




క్రికెట్ టోర్నమెంట్..

శంషాబాద్‌లోని జేఆర్ఎస్ క్రికెట్ గ్రౌండ్‌లో సోడెక్సో కంపెనీ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఎస్‌పీఎల్–2024 పేరిట క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఎంప్లాయీస్ ఆర్గనైజేషన్ తరఫున విజయ్, రమేశ్, నరేశ్ తదితరులు పోటీలను పర్యవేక్షించారు. ముఖ్యఅతిథిగా డెలాయింట్ కంపెనీ అడ్మిన్ డైరెక్టర్ ఎం.సంతోష్ హాజరయ్యారు.

– సాక్షి, సిటీబ్యూరో

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్,
సోమవారం, 24, జూన్, 2024





సిడ్నీ, స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని తలపించే ట్యాంక్ బండ్.. | అద్భుత అందాలతో పాటు చారిత్రాత్మక వైభవాలకు ప్రతీక | నగరానికి మణిహారం సాగర తీరం.. | చెప్పుకుంటూ పోతే మరెన్నో..

చలో మోహన రంగ

చూసేద్దాం రండి

టూరిస్టు సర్కిల్‌గా ట్యాంక్‌బండ్

రింజిమ్..రింజిమ్..హైదరాబాద్..
రిక్షావాలా జిందాబాద్..
మూడు చక్రములు గిరగిర తిరిగితే
మోటరు కారు బలాదూర్..
అటు చూస్తే చార్మినారు..
ఇటు చూస్తే జుమ్మా మసీదు
అటు చూస్తే చార్మినారు..
ఇటు చూస్తే జుమ్మా మసీదు
ఆ వంకా అసెంబ్లీ హాలు..
ఈ వంకా జూబిలి హాలూ
తళతళ మెరిసే హుస్సేనుసాగరు..
దాటితే సికింద్రబాదూ...


ఇలా చెప్పుకుంటూ పోతే.. పర్యాటక ప్రాంతాలకు కొదవేలేదు.. ఎటుచూసినా ఏదో ఒక విశేషమైన ప్రాంతం చూపరులను అబ్బురపరుస్తూనే ఉంటాయి... వాటిల్లో ముఖ్య ఆకర్షణగా నిలిచేది.. ట్యాంక్ బండ్. నగరాన్ని సందర్శించిన ప్రతి ఒక్కరికీ ట్యాంక్ బండ్‌తో అవినాభావ సంబంధం ఉంటుంది. ట్యాంక్ బండ్ ప్రారంభంలోనే 'నగర రెజిమెంట్‌కు చెందిన ఆర్మీ జవాన్ల పోరాట స్ఫూర్తికి నిదర్శనం'గా ఏర్పాటు చేసిన యుద్ధనౌక స్వాగతం పలుకగా, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ పార్క్ అందాలు, మహనీయుల విగ్రహాల పలకరింపుతో సాగర్‌లోని నీటి ఫౌంటేన్ల తుంపరల మధ్య శాంతిమయుడు గౌతమ బుద్ధుడిని తిలకిస్తూ అక్కడి అందాలను ఆస్వాదించడం భలే అనుభూతిని కలిగిస్తుంది. దీంతో పాటు మరికొన్ని ప్రాంతాల గురించి తెలుసుకుందాం...

సాక్షి, సిటీబ్యూరో

భాగ్యనగర చరిత్రకు తలమానికమైన చార్మినార్, గోల్కొండ కోట వంటి ప్రాంతాలే కాకుండా..దేశానికే తలమానికంగా నిర్మితమైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. పార్లమెంట్‌ను పోలిన నిర్మాణం పైన భారీ ఎత్తులో నిర్మితమైన ఈ విగ్రహం ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడి నుంచి తిలకించినా సగర్వంగా కనిపిస్తుంది. బుద్ధుడిని స్ఫూర్తిగా తీసుకుని దేశం గర్వించదగ్గ వ్యక్తిగా ఎదిగిన అంబేద్కర్., హుస్సేన్ సాగర్‌లోని బుద్ధుని వెనుకనే నిర్మించడంతో సింబాలిక్‌గా నిలుస్తుంది. నగర వైభవాన్ని ప్రతిబింబించే నిర్మాణాలైన చార్మినార్, అసెంబ్లీ భవనాల సరసన నిలిచేలా నూతనంగా నిర్మితమైన బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం, కేబుల్ బ్రిడ్జి వంటివి చూపు తిప్పుకోనివ్వవు అంటే అతిశయోక్తి కాదేమో..!

అమరవీరుల స్మారక కేంద్రం...

తెలంగాణ అమరవీరుల త్యాగాలకు శాశ్వత శ్రద్ధాంజలిగా దీపం రూపంలో నిర్మించిన స్మారక కేంద్రం కొత్త శోభను తీసుకొచ్చింది. ఇందులో ప్రత్యేకంగా ఫొటో గ్యాలరీని ఏర్పాటు చేయడం అదనపు ఆకర్షణ.



ఎన్.టి.ఆర్ గార్డెన్...

అరుదైన బొన్సాయ్ మొక్కలు, ఆర్టిఫీషియల్ మర్రిచెట్టులోంచి రైలు ప్రయాణం, భయపెట్టించే హంటర్ హౌస్, అబ్బురపరిచే పూల వనాలు, వింటేజ్ కార్లలో స్నాక్స్, అత్యంత ఎత్తులో నెక్లెస్ రోడ్ అందాలను చూపించే జేయింట్ వీల్, అండర్ గ్రౌండ్‌లో ఆటలు, ఆకట్టుకునే బొమ్మలు, ఆశ్చర్యపరిచే ఎడారి మొక్కలు, కళ్లముందు మ్యాజిక్ చేసే త్రీడి షో.. వెరసి అందరినీ అలరించే ఎన్.టీ. ఆర్ గార్డెన్. ఇక్కడే దివంగత ముఖ్యమంత్రి, ప్రముఖ సినీ హీరో ఎన్.టీ.రామారావు సమాధిని సందర్శించవచ్చు.



ప్రసాద్ ఐమాక్స్..

సినిమా, షాపింగ్, గేమింగ్, ఈటింగ్ ఇలా అన్ని రకాల నగర జీవన శైలికి అద్దం పట్టే వేదిక ఐమాక్స్. ఇందులో సినిమా చూస్తే అదో క్రేజీలా మారేంతలా గుర్తింపు పొందింది. కొత్త సినిమాల విడుదలతో ప్రతీ శుక్రవారం ఇక్కడ సెలబ్రిటీలు, మీడియా ఛానల్స్ ఇంటర్వ్యూలతో సందడిగా ఉంటుంది.

జల్ విహార్...

కేవలం నీళ్లలో ఆడే ఆటలతో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరినీ అలరిస్తుంది నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్. రేయిన్ డ్యాన్స్, వాటర్‌పూల్స్‌లో ఎత్తునుంచి జారవిడిచే ఆటలతో పాటు ఇతర వాటర్ గేమ్స్ ప్రేక్షకులను బయటకు రానివ్వవు.

థ్రిల్ సిటీ...

ఈ మధ్యనే ప్రారంభమైన థ్రిల్ సిటీ ప్రమాదకరమైన ఆటలతో భయానకమైన వాతావరణంతో థ్రిల్లింగ్ అనుభూతిని పంచుతుంది. రోమాలను నిక్కబొడుచుకునేలా చేసే థ్రిల్లింగ్ గేమ్స్ విశేషంగా ఆకట్టుకుంటాయి.

పీవీ జ్ఞాన భూమి...

ఇంతకు ముందు ఎరుగని ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి దిశలో నడిపించిన ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు సమాధి ఈ జ్ఞాన భూమిలో కొలువుదీరింది. దేశానికి పనిచేసిన ఏ ప్రధాన మంత్రి సమాధిని చూడాలన్నా ఢిల్లీ వెళ్లాల్సిందే. కానీ దక్షిణాది ప్రధానిగా చక్రంతిప్పిన పీవీ సమాధి మాత్రం నెక్లెస్ రోడ్‌లో చూడవచ్చు.

సంజీవయ్య పార్క్...

అనేక రంగులతో అలరించే రోస్ గార్డెన్, రంగురంగుల సీతాకోకచిలుకలను కలుసుకునే బటర్‌ఫ్లవర్ పార్క్, ఎత్తులో దేశంలో రెండో అతిపెద్ద జాతీయ జెండాలను ప్రత్యక్షంగా చూడాలంటే సంజీవయ్య పార్క్ వెళ్లాల్సిందే. ఎత్తులో రెండో స్థానం అయినప్పటికీ త్రివర్ణ పతాకం సైజులో మాత్రం దేశంలోనే అతిపెద్దది.

ఈట్ స్ట్రీట్–ఆర్ట్ స్ట్రీట్..

ఆహార ప్రియులకు అనువైన చోటు నెక్లెస్ రోడ్‌లోని ఈట్ స్ట్రీట్., సాగర్ నీటి అలల అంచున కూర్చొని వివిధ డిష్‌లను ఆస్వాదించవచ్చు. దీని ఎదురుగానే ఉన్న వీధుల్లోని ఇళ్లను మొత్తం విభిన్న చిత్రాలతో కళాకారులు తయారు చేశారు.

డాగ్ పార్క్..

ప్రతీ ఆదివారం ఉదయం నగరంలోని అన్ని రకాల కుక్కలతో వారి యజమానులు ఈ డాగ్ పార్క్‌కు వస్తారు. జంతు ప్రేమికులను ఇది విశేషంగా అలరిస్తుంది.

సైక్లింగ్ క్లబ్..

థ్రిల్ సిటీకి ఎదురుగా ఉన్న సైక్లింగ్ క్లబ్ ఫిట్‌నెస్‌కు మంచి మార్గం. ఇందులో మెంబర్‌షిప్ తీసుకుని ఎవరైనా సైక్లింగ్ చేయవచ్చు.

సాగర్‌లోని బుద్ధ విగ్రహం..

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని గుర్తుచేసేలా సాగర్ మధ్యలో ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహం నగరానికే తలమానికం. చూట్టూ ఆవరించి ఉన్న నీటి మధ్యలో ఈ బుద్ధ విగ్రహాన్ని చూడటం అద్భుతమైన అనుభూతి. ఇక్కడి బోటింగ్ సదుపాయాలు అదనపు ఆనందం.

బిర్లా టెంపుల్...



పూర్తిగా పాలరాతి నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభను, హుస్సేన్ సాగర్ మీదుగా వచ్చే చల్లగాలులతో ప్రతి ఒక్కరి మదినీ దోచుకుంటుంది బిర్లా మందిర్. ఇక్కడి నుంచి చూస్తే మొత్తం ట్యాంక్ బండ్ అందాలను ఆస్వాదించవచ్చు.

బిర్లా ప్లానిటోరియం..

విజ్ఞానం, వినూత్నం, వివేకానికి బిర్లా ప్లానిటోరియం మంచి వేదిక. విద్యార్థుల నుంచి పరిశోధకుల వరకూ అవసరమైన శాస్త్ర–సాంకేతిక, పురాతత్వ విషయాలను తెలుసుకొవచ్చు. ఇక్కడే అంతరిక్షానికి చెందిన ప్రత్యేక స్కై షో కూడా చూడవచ్చు.

లుంబినీ పార్క్, బోటింగ్..



ఆటవిడుపుకు, కాలక్షేపానికి అడ్డాగా మాత్రమే కాకుండా హుస్సేన్‌సాగర్ అందాలను తనివి తీరా చూపించే బోటింగ్ సదుపాయం లుంబినీ పార్క్ సొంతం. సాధారణ బోటింగ్, సినిమాల్లో చూపించే వేగంగా ప్రయాణించే స్పీడ్ బోట్లతో పాటు వ్యక్తిగత పార్టీలు సైతం నిర్వహించుకునేలా లగ్జరీ బోట్లు అందుబాటులో ఉండటం ఇక్కడి ప్రత్యేకత.

తెలుగు కామెడీ ఓపెన్ మైక్... నేడు..



నగరంలో స్టాండప్ కామెడీ షోస్‌కు విపరీతమైన ఆదరణ ఉంది. సిటీ కేఫ్స్‌లో స్టాండప్ కామెడీ ప్రదర్శన నిర్వహించని టాప్ కేఫ్ అంటూ ఉండదంటే అతిశయోక్తి లేదు. ఈ హాస్యపు జల్లులో తడిసి ముద్దయే వారిలో అత్యధికులు ఆంగ్ల భాషా పరిజ్ఞానం కలవారే. ఈ నేపథ్యంలో సిటీ కేఫ్స్‌లో అత్యంత అరుదుగా మాత్రమే వినిపించే తెలుగు కామెడీ మరోసారి నగరవాసులకు వీనుల విందు చేయనుంది. కేపీహెచ్‌బీలో ఉన్న ది హ్యాష్‌ట్యాగ్ కేఫ్‌లో సోమవారం నిర్వహిస్తున్న ఓపెన్ మైక్ ఈవెంట్‌లో తెలుగు స్టాండప్ కమెడియన్లు సాయంత్రం నుంచి సందడి చేయనున్నారని నిర్వాహకులు తెలిపారు.

అలరించిన బాలగాన గంధర్వులు

దివికేగిన 'బాలు' స్మృతిలో భువిలోని బాలలు గాన నివాళులర్పించారు. ప్రముఖ సినీ గాయకులు స్వర్గీయ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం నివాళిగా నగరానికి చెందిన మ్యూజిక్ రేడియో స్టేషన్ మ్యాజిక్ 106.4 ఎఫ్ఎమ్ ఆధ్వర్యంలో ఎస్పీబీ జయంతి రోజున బాల గాన గంధర్వులు – సీజన్ 4 ఫైనల్స్ ఆదివారం జరిగాయి. ఈ పోటీలో 15 ఏళ్ల లోపు బాల బాలికలు వందలాదిగా పోటీపడ్డారు. వీరిలో టాప్ 5 కంటెస్టెంట్స్ కూకట్‌పల్లిలోని నెక్సస్ మాల్ వేదికగా ఫైనల్స్‌లో పోటీపడ్డారు. వీరిలో విశ్వదత్త (9) విజేతగా నిలవగా, లిఖిల, శ్రీ వైష్ణవిలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. న్యాయనిర్ణేతలు సంగీత దర్శకులు



అనూప్ రూబెన్స్, హారిణి, సాయి చరణ్ పాటలు పాడి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఆర్జేలు నాని, రవళి, ప్రతీక, సంగీత తమ వ్యాఖ్యానంతో ఆకట్టుకున్నారు. మ్యాజిక్ 106.4 ఎఫ్ఎమ్ ప్రతినిధులు బద్రినాథ్, ధీరజ్, కృష్ణమోహన్, భవానీ పాల్గొన్నారు.



హుషారుగా బ్రదర్ హుడ్ డే...

నగరానికి చెందిన ఫ్రీమేసన్స్ సంస్థ ఆధ్వర్యంలో యూనివర్సల్ బ్రదర్ హుడ్ డే ఆదివారం సందడిగా జరిగింది. ఇందులో భాగంగా మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా వాక్‌థాన్‌ను నిర్వహించారు. హానికారక డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని విన్నవిస్తూ నిర్వహించిన ఈ వాక్‌థాన్ అబిడ్స్ నుంచి మొజంజాహీ మార్కెట్ వరకూ కొనసాగింది. ఫ్రీమేసన్స్‌కు చెందిన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పచ్చ సౌధాలు

రాష్ట్రవ్యాప్తంగా రాజకోటల్లా టీడీపీ ఆఫీసులు.. జీఓలన్నీ బాబు హయాంలోనే

తమకు అనుకూలంగా గతంలోనే పార్టీలకు భూముల కేటాయింపు విధానం తెచ్చిన చంద్రబాబు


మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం


తూర్పు గోదావరి

సాక్షి, అమరావతి: సర్కారు స్థలాలు, పేదల భూములను లాక్కుని పచ్చ భవనాలు నిర్మించుకున్న టీడీపీ పెద్దలు సుద్దులు వల్లించడం గురివింద సామెతను గుర్తు చేస్తోంది. అధికారంలో ఉండగా ఎన్టీఆర్ భవన్‌ల పేరుతో అత్యాధునిక కార్యాలయాలు సమకూర్చుకున్న టీడీపీ రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నట్లు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. వాగు పోరంబోకు, రైతుల భూమిని కబ్జా చేసి మంగళగిరిలో అత్యంత విలాసవంతమైన టీడీపీ జాతీయ కార్యాలయాన్ని నిర్మించుకోగా విశాఖలో దసపల్లా భూముల్లో పాగా వేసి పచ్చ భవనాలు కట్టుకున్నారు. విజయవాడ ఆటోనగర్‌లో ఇరిగేషన్ స్థలం.. శ్రీకాకుళంలో దళితులకు కేటాయించిన భూమి.. కాకినాడలో జడ్పీ స్థలం.. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ లెక్క చాంతాడును తలపిస్తుంది. ఇవన్నీ ఎన్టీఆర్ భవన్‌లే. అధికారం మాటున చంద్రబాబు సమకూర్చుకున్న పార్టీ కార్యాలయాలు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉంటున్న ఉండవల్లి కరకట్ట నివాసమే అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ లాంటిది. నిబంధనలు, చట్టాలకు తూట్లు పొడిచి కృష్ణా నది ఒడ్డున కట్టిన ఆ విలాస రాజ భవనంలోనే చంద్రబాబు ఎనిమిదేళ్లుగా నివాసం ఉంటున్నారు. అక్రమాల బాటలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని చోట్లా ఎన్టీఆర్ భవన్‌ల పేరుతో విలాసవంతమైన కోటలు కట్టేశారు. వీటిని కప్పిపుచ్చి నిస్సిగ్గుగా వైఎస్సార్‌సీపీ కార్యాలయాలపై బురద జల్లడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

పార్టీలకు భూముల జీఓ ఇచ్చిందే బాబు

నిజానికి చంద్రబాబు గతంలో అధికారంలో ఉన్నప్పుడే రాజకీయ పార్టీలకు భూములు కేటాయించే విధానాన్ని తెచ్చారు. ఇందుకోసం 2016 జూలై 21న జీఓ నెంబర్ 826 విడుదల చేశారు. రాజధానిలో మూడు కేటగిరీలుగా పార్టీలకు భూములు కేటాయించాలని అందులో పేర్కొన్నారు. మొదటి కేటగిరీలో జాతీయ రాజకీయ పార్టీ / గుర్తింపు పొందిన రాష్ట్ర రాజకీయ పార్టీకి అసెంబ్లీలో 50 శాతానికి పైగా బలం ఉంటే 4 ఎకరాలు కేటాయించాలి. రెండో కేటగిరీ కింద అసెంబ్లీలో 25 నుంచి 50 శాతం బలం ఉన్న పార్టీలకు అర ఎకరం కేటాయించాలి. మూడో కేటగిరీలో 25 శాతం కంటే తక్కువ ఉన్న పార్టీలకు వెయ్యి గజాల స్థలం కేటాయించాలి. దీని ప్రకారం అప్పట్లో టీడీపీకి 4 ఎకరాలు, నాడు 67 స్థానాలతో ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీకి అర ఎకరం పొందే అర్హత లభించింది. జిల్లా కేంద్రాల్లోనూ ఇదే విధానం ప్రకారం మొదటి కేటగిరీలో ఉన్న పార్టీలకు రెండు ఎకరాలు, రెండో కేటగిరీలో ఉన్న పార్టీలకు వెయ్యి గజాలు, మూడో కేటగిరీలో ఉన్న పార్టీలకు 300 గజాలు ఇవ్వాలన్నది జీవో సారాంశం. ఏడాదికి వెయ్యి రూపాయల చొప్పున 33 ఏళ్ల లీజుకు ఈ విధానంలో భూములు కేటాయించాలని నిర్ణయించారు. నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఇదే విధానం ప్రకారం 30 సెంట్లు కేటాయించాలని 2017 డిసెంబర్ 8న మరో జీఓ 340 జారీ చేశారు.

లీజు నిబంధనలు బేఖాతర్

తాను ఇచ్చిన జీవోకు అనుగుణంగా రాజధానితోపాటు జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో టీడీపీ కార్యాలయాల కోసం చంద్రబాబు వరసగా భూములు కేటాయించుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుల పేరిట ఈ భూములు కేటాయిస్తూ ప్రత్యేకంగా జీవోలు జారీ చేశారు. 175 నియోజకవర్గాల్లోనూ టీడీపీ కార్యాలయాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించి చాలాచోట్ల భూములు కేటాయించి ఆగమేఘాల మీద భవనాలు కూడా కట్టేశారు. నాడు చంద్రబాబు ప్రకటించిన విధానం ప్రకారం 33 ఏళ్ల లీజుకు భూములు కేటాయించాలి. అయితే ఆ నిబంధనను కొన్నిచోట్ల ఉల్లంఘించి ఏకంగా 99 ఏళ్ల పాటు లీజుకు కేటాయించేసుకున్నారు. మంగళగిరి, కాకినాడ, శ్రీకాకుళంలో 99 ఏళ్ల లీజుకు భూములు తీసుకున్నారు. ముఖ్యమైన నగరాలు, పట్టణాల్లో అత్యంత విలువైన భూముల్లో స్థలాలు కేటాయించుకొని కార్యాలయాలు నిర్మించి ఇప్పుడు అక్కడి నుంచే పార్టీ కార్యకలాపాలు నడిపిస్తున్నారు. అదే జీవో ప్రకారం వివిధ జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ 33 ఏళ్లకు లీజుకు తీసుకుంటే అదేదో ఘోరం అనే రీతిలో దుష్ప్రచారానికి తెర తీశారు.

హైదరాబాద్‌లో రాత్రికి రాత్రే

ఉమ్మడి రాష్ట్రంలోనూ చంద్రబాబు అత్యంత విలువైన స్థలాలను టీడీపీ కార్యాలయాల కోసం సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో అత్యంత ఖరీదైన ఎకరం స్థలాన్ని రాత్రికి రాత్రే కేటాయించేసుకున్నారు. వాణిజ్య భూమిగా హైదరాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ (హుడా) చేతిలో ఉన్న ఆ స్థలాన్ని 1997 ఏప్రిల్ 30న జూబ్లీహిల్స్ మున్సిపాలిటీ నుంచి షేక్‌పేట ఎమ్మార్వోకు బదలాయించారు. ఆయన అదేరోజు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టీగా ఉన్న డి.శ్రీనివాసరావు పేరు మీదకు మార్చారు. అదే రోజున ట్రస్టుకు స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం జీవో ఇవ్వటం గమనార్హం. ఈ పనులన్నీ గంటల వ్యవధిలో జరిగిపోయాయి. అంతటి విలువైన స్థలాన్ని నెలకు రూ.7,500 అద్దెకు చంద్రబాబు కేటాయించుకున్నారు. హైటెక్ సిటీ నిర్మాణ బాధ్యతలు దక్కించుకున్న ఎల్ అండ్ టీ సంస్థ ద్వారా అత్యాధునిక హంగులతో ఎన్టీఆర్ భవన్‌ను నిర్మించుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జిల్లాల వారీగా టీడీపీ కార్యాలయాలకు భూములు కేటాయించుకున్న చంద్రబాబు 2014లో అధికారంలోకి వచ్చాక కూడా అదే తీరును కొనసాగించారు.

పోరంబోకు భూమికి మంగళం!

ప్రస్తుతం చంద్రబాబు, టీడీపీ నేతలు సకల విలాసాలతో దర్జాగా మీడియా, పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్న మంగళగిరిలోని టీడీపీ కార్యాలయం స్థలం కోల్‌కతా–చెన్నై హైవేను ఆనుకుని ఉంది. 3.65 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలం విలువ రూ.75 కోట్లకుపైనే ఉంటుంది. ఇందులో వాగు పోరంబోకు, కాలువ భూమి, రైతులకు కేటాయించిన డి పట్టా భూములూ ఉన్నాయి. కాలువను పూడ్చి... పోరంబోకు భూమిని ఆక్రమించి... రైతుల భూములను కబ్జా చేసి మరీ టీడీపీ జాతీయ కార్యాలయం కట్టారు. 99 ఏళ్ల లీజుకు కేటాయించుకున్న ఈ స్థలానికి ఏడాదికి చెల్లించేది ఎకరాకు రూ.1,000 మాత్రమే. నిజానికి ఆ భూమికి సంబంధించి 1974లోనే బొమ్ము రామిరెడ్డి పేర 0.65 సెంట్లు, కొల్లా రాఘవరావు పేరిట 1.75 ఎకరాలు, కొల్లా భాస్కరరావు పేరిట 1.75 ఎకరాలను డి పట్టాలుగా ఇచ్చారు. వారిని బలవంతంగా తరిమేసి సాగు చేస్తున్న పంటలను పొక్లెయిన్లతో దున్నేసి రాత్రికి రాత్రే టీడీపీ నేతలు స్వాధీనం చేసుకున్నారు. బాధిత రైతులు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నా పట్టించుకోకుండా చంద్రబాబు పార్టీ భవనం కట్టేశారు. ఆ రైతుల తరపున మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు ఇప్పుడు సుప్రీంకోర్టు విచారణలో ఉంది. విలాసవంతమైన ఈ ఎన్టీఆర్ భవన్‌కు నాలుగు అంతస్తులకు మాత్రమే అనుమతి ఉండగా 8 అంతస్తులు నిర్మించేశారు. ఉల్లంఘనలు, అక్రమాలకు పర్యాయపదం టీడీపీ జాతీయ కార్యాలయం.

గుంటూరులోనూ గుటకాయ స్వాహా

తొలుత 2015లో గుంటూరు అరండల్‌పేటలోని పిచుకలగుంటలో టీడీపీ రాష్ట్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. వెయ్యి గజాల స్థలాన్ని కార్పొరేషన్ నుంచి లీజుకు తీసుకుని అదనంగా పక్కనే ఉన్న మరో 1,500 గజాల స్థలాన్ని ఆక్రమించి ఈ భవనాన్ని నిర్మించారు. మున్సిపల్ స్థలాలను లీజుకు ఇచ్చే పరిస్థితి లేకపోయినా చంద్రబాబు బలవంతంగా ఈ భూమిని లీజుకు తీసుకున్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి కౌన్సిల్‌లో తీర్మానం చేయించి ఆక్రమించిన స్థలంతో కలిపి 2,500 గజాల స్థలాన్ని క్రమబద్ధీకరించుకుని పార్టీ భవనం కట్టేశారు.

బెజవాడ నడిబొడ్డున రూ.40 కోట్ల స్థలం..

విజయవాడ నడిబొడ్డున ప్రజావసరాలకు ఉపయోగపడే విలువైన భూమిని అప్పటి జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా ఒత్తిడితో టీడీపీ కార్యాలయానికి అప్పగించారు. గుణదల పరిధిలోకి వచ్చే ఆటోనగర్–గురునానక్ కాలనీకి ఆనుకుని ఇరిగేషన్ శాఖకు 95 సెంట్ల భూమి ఉంది. ఇరిగేషన్ విభాగం ఫ్లోరేజి, ఇతర పనుల కోసం దీన్ని వినియోగించేవారు. ఇందులో కార్యాలయం కూడా ఉండేది. అయితే టీడీపీ ఆఫీసు కోసం దీన్ని ఇవ్వాలని అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి కూల్చేశారు. ఇరిగేషన్ మెటీరియల్, యంత్రాలను మరోచోటకు తరలించారు. అన్ని అభ్యంతరాలనూ తోసిరాజని 99 ఏళ్ల లీజుకిచ్చేశారు. ఆటోనగర్ పరిధిలో ఉన్న ఈ స్థలాన్ని పారిశ్రామిక అవసరాలకు మాత్రమే వాడాలనే నిబంధన ఉన్నా ఇలా పాలకవర్గాన్ని బెదిరించి నోరు మూయించారు. వాణిజ్య భూమిగా కన్వర్షన్ చేసి టీడీపీ కార్యాలయం నిర్మించుకున్నారు. దీని విలువ రూ.40 కోట్లకు పైమాటే.

విశాఖలో దసపల్లా కొండను తొలిచి..

విశాఖపట్నంలో దసపల్లా కొండను తొలిచి మరీ టీడీపీ కార్యాలయాన్ని కట్టేశారు. దసపల్లా భూముల్లో 2 వేల గజాల్ని 33 ఏళ్ల పాటు ఏడాదికి రూ.25 వేలు లీజు చొప్పున 2002లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం టీడీపీకి కేటాయించింది. ఆ స్థలంతోపాటు పక్కనే ఉన్న కొండను (మరో వెయ్యి గజాల మేర) కూడా ఆక్రమించి 2016లో టీడీపీ కార్యాలయాన్ని నిర్మించారు. టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండానే జీ+3 భవనం నిర్మించి 2018లో లోకేష్ ప్రారంభించారు.

సిక్కోలులో దళితుల భూమిలో పాగా

శ్రీకాకుళంలో ఎస్సీల ఇళ్ల స్థలాల కోసం సాంఘిక సంక్షేమ శాఖ సేకరించిన భూమిని టీడీపీ కార్యాలయానికి తీసుకున్నారు. ఉడా, కార్పొరేషన్ అధికారుల అనుమతి లేకుండా పార్టీ భవనాన్ని నిర్మించారు. అంతటితో ఆగకుండా పక్కనే ఉన్న మరికొంత స్థలాన్ని ఆక్రమించేశారు. 80 అడుగుల ప్రధాన రోడ్డులో ఉన్న ఈ స్థలం విలువ 2017లోనే అనధికారికంగా రూ.20 కోట్లు ఉంది. ఏడాదికి రూ.25 వేల చొప్పున 99 సంవత్సరాల లీజుకు తీసుకున్న ఈ స్థలంలో టీడీపీ కార్యాలయాన్ని నిర్మించి 2019 ఎన్నికలకు నాలుగు నెలల ముందు స్వయంగా చంద్రబాబే ప్రారంభించారు.

కాకినాడలో జెడ్పీ స్థలంపై కన్నేసి

కాకినాడలో విలువైన జిల్లా పరిషత్ స్థలాన్ని టీడీపీ కార్యాలయానికి కేటాయించుకుని విలాసవంతమైన భవనాన్ని కట్టారు. మేడలైన్ ఆఫ్ కాకినాడ ప్రాంతంలో 2 వేల గజాలను 99 ఏళ్ల లీజుకి జిల్లా పరిషత్ తీర్మానం ద్వారా టీడీపీ పరం చేశారు. ఈమేరకు 2016 నవంబర్ 1న భూమిని కేటాయిస్తూ జీవో జారీ చేశారు. దీని విలువ రూ.10 కోట్లకు పైమాటే.

టీడీపీ కార్యాలయాలకు కేటాయించుకున్న భూములు..

జిల్లా	స్థలం విస్తీర్ణం	సర్వే నెంబర్	కేటాయింపు జీఓ
మంగళగిరి (ప్రధాన కార్యాలయం)	3.65 ఎకరాలు	392-1, 3, 4, 8, 9, 10	జీఓ ఎంఎస్ నంబర్ 228, 22-06-2017
విజయవాడ	95 సెంట్లు	493.-1	జీఓ ఎంఎస్ నంబర్ 513, 11-10-2018
చిలకలూరిపేట	20 సెంట్లు	123/సి-2బి	జీఓ ఎంఎస్ నంబర్ 197, 22-04-2018
కడప (నాగరాజుపల్లె)	1 ఎకరం	295/1ఎ1బి	జీఓ ఎంఎస్ నంబర్ 27, 20-07-2015
విశాఖ (చినవాల్తేరు)	87 సెంట్లు	13	జీఓ ఎంఎస్ నంబర్ 526, 30-12-2016
విజయనగరం (అయ్యన్నపేట)	1 ఎకరం	15/1పి	జీఓ ఎంఎస్ నంబర్ 195, 23-04-2018
ప్రకాశం (ఒంగోలు టౌన్)	1.96 ఎకరాలు	68/8	జీఓ ఎంఎస్ నంబర్ 514, 11-10-2018
శ్రీకాకుళం(టెక్కలి)	2 ఎకరాలు 30 సెంట్లు	106/3	జీఓ ఎంఎస్ నంబర్ 63, 24-01-2019
కాకినాడ	2 వేల గజాలు	-	-
గుంటూరు	1000 గజాలు	-	-

విశాఖపట్నం


శ్రీకాకుళం


తిరుపతి


మరిన్ని ఫొటోలు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

చేసేది చెప్పాం.. చెప్పింది చేశాం

కేడర్ ఎవ్వరూ అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్


పులివెందుల క్యాంపు కార్యాలయం వద్దకు భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

- 40 శాతం మంది నమ్మి ఓటేశారు
- మన వైపు ఉన్న మరో 10 శాతం మంది కూటమి వైపు మొగ్గు చూపారు
- 6 నెలల్లో చంద్రబాబు అసలు స్వరూపం తెలుస్తుంది
- చెప్పిన హామీలు ఏ మేరకు అమలు చేస్తారో వేచి చూద్దాం
- వైఎస్సార్‌సీపీ కేడర్, ఆస్తులపై దాడులతో విధ్వంసకర పాలన
- ప్రజాపక్షంగా వ్యవహరిద్దాం.. 2029లో ప్రజలు మనవైపే చూస్తారు

సాక్షి ప్రతినిధి, కడప: 'చెప్పింది చెప్పినట్లు చేసి చూపెట్టాం. చెప్పనవి కూడా ఆచరణలో చూపెట్టాం. మనం చేయగలిగిందే ఎన్నికల్లో చెప్పాం. 40 శాతం మంది నమ్మి ఓటేశారు. మన వైపు ఉన్న మరో 10 శాతం మంది కూటమి వైపు మొగ్గు చూపారు. చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమాత్రం నిలబెట్టుకుంటారో వేచిచూద్దాం. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు గ్రహించే రోజు రానే వస్తుంది. వైఎస్సార్‌సీపీ కేడర్ లక్ష్యంగా వ్యక్తిగత దాడులు, ఆస్తులు ధ్వంసం చేస్తూ కూటమి ప్రభుత్వం విధ్వంసకర పాలన సాగిస్తోంది. కేడర్ ఆత్మస్థైర్యం కోల్పోవద్దు. అండగా నిలుస్తాం. బాధితులందర్నీ కలుస్తాం' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పులివెందుల క్యాంపు కార్యాలయంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు సర్కార్ ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని, అందుకోసం వైఎస్సార్‌సీపీ ప్రజాపక్షంగా నినదిస్తోందన్నారు. 'మన హామీలను నమ్మి 40 శాతం మంది ఓటు వేశారు. 50 శాతం కూటమి వైపు మొగ్గు చూపారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు, చెప్పిన పథకాలు అమలు చేయలేరు. ఆరు నెలల్లో చంద్రబాబు అసలు స్వరూపం బహిర్గతం అవుతుంది. కూటమికి ఓటేసిన ప్రజలు మరోమారు మోసపోయామని గ్రహిస్తారు' అన్నారు.

మన పట్ల ప్రజలకు విశ్వాసం ఉంది

వైఎస్సార్‌సీపీ పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని వైఎస్ జగన్ అన్నారు. మనం చేసిన మంచి, మేలు ప్రజల గుండెల్లో ఉండిపోయిందని చెప్పారు. శిశుపాలుడు లాగా తప్పులు మొదలయ్యాయని, రాష్ట్రంలో విధ్వంసకర పాలన కొనసాగుతోందన్నారు. 'మనకు ఓటు వేశారని, వారికి ఓటు వేయలేదనే కారణంగా ప్రజలు, వైఎస్సార్‌సీపీ కేడర్, ఆస్తుల పైన దాడులు చేస్తున్నారు. కొన్ని చోట్ల ప్రాణ నష్టం కూడా జరిగింది. శిశుపాలుని లాగా పాపాలు చేస్తున్నారు. ఆ పాపం పండే రోజు వస్తుంది. 2029లో ప్రజలు మన వైపే చూస్తారు. మంచి చేసిన మీ జగన్ వైపే ప్రజలు నిలవనున్నారు. ఎవ్వరూ అధైర్యపడొద్దు. ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా నిలుస్తా. చంద్రబాబు సర్కార్ బాధితులందర్నీ కలుస్తా' అని స్పష్టం చేశారు. టీడీపీ వాళ్లు తన భర్తను టార్గెట్ చేసి దాడి చేశారని ముదిగుబ్బ సర్పంచ్ సతీమణి వాపోయారు. అధైర్య పడొద్దని, తాను అండగా ఉంటానని వైఎస్ జగన్ ఆమెను ఊరడించారు. మనకు మంచిరోజులు రానున్నాయని, అంత వరకు ఓపిగ్గా ఉండాలని సూచించారు.

పోటెత్తిన యువత

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు, ఆయనతో మాట కలిపేందుకు, ఫొటో దిగేందుకు యువత పెద్ద సంఖ్యలో పులివెందులకు వచ్చారు. సుపరిపాలన అందించిన జగన్ యోగ క్షేమాలు తెలుసుకోవాలని మరికొందరు తరలి వచ్చారు. పదవులు ముఖ్యం కాదు.. మీ వెంటే మేమంతా నడుస్తాం.. మీతోనే మాబాట.. అని భరోసా నింపేందుకు ఇంకొందరు విచ్చేయడంతో క్యాంపు కార్యాలయం కిక్కిరిసింది. స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహిస్తూనే, మరోవైపు వచ్చిన వారికి ధైర్యం చెబుతూ వైఎస్ జగన్ రోజంతా బిజీబిజీగా గడిపారు. ఏకధాటిగా నిల్చొని వేలాది మంది ప్రజానీకాన్ని కలిశారు.

అమెరికాలో కాల్పులు.. బాపట్ల యువకుడు మృతి

- సూపర్ మార్కెట్‌లో ఘటన
- గోపీకృష్ణ మృతి పట్ల వైఎస్ జగన్ సంతాపం


గోపీకృష్ణ (ఫైల్)

కర్లపాలెం/సాక్షి, అమరావతి: అమెరికాలో ఓ దుండగుడి తుపాకీ కాల్పుల్లో బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలి గ్రామానికి చెందిన దాసరి గోపీకృష్ణ (32) మృతి చెందాడు. రైతు కూలీ కుటుంబానికి చెందిన దాసరి శ్రీనివాసరావు, లక్ష్మి దంపతుల కుమారుడు గోపీకృష్ణ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ హెచ్–1బి వీసా రావటంతో సుమారు 11 నెలల కిందట అమెరికా వెళ్లాడు. ఓ వైపు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ.. మరో వైపు టెక్సాస్ రాష్ట్రం డల్లస్ సిటీలోని సూపర్ మార్కెట్‌లో పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి ఓ దుండగుడు సూపర్ మార్కెట్‌కు వచ్చి గోపీకృష్ణపై గన్‌తో కాల్పులు జరిపి ఏవో వస్తువులు తీసుకుని పారిపోయాడు. తీవ్రగాయాలైన గోపీకృష్ణ అక్కడే కుప్పకూలిపోగా స్థానికులు ఓ వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గోపీకృష్ణకు రెండున్నరేళ్ల క్రితం ప్రవల్లికతో వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. ప్రజాప్రతినిధులు స్పందించి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తమ బిడ్డ భౌతికకాయాన్ని త్వరగా తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని గోపీకృష్ణ కుటుంబసభ్యులు కోరుతున్నారు.

గోపీకృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

అమెరికాలోని సూపర్ మార్కెట్లో జరిగిన కాల్పుల ఘటనలో దాసరి గోపీకృష్ణ మృతి చెందటం పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోపీకృష్ణ కుటుంబానికి ప్రభుత్వం తోడుగా నిలవాలని, అన్ని రకాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గోపీకృష్ణ కుటుంబానికి తగిన సహాయ సహకారాలు అందించాల్సిందిగా కేంద్ర విదేశాంగ శాఖను కోరారు. మృతుడి కుటుంబానికి వైఎస్ జగన్ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎకరం రూ.4 లక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

విలువను రూ.4 లక్షలు చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. అదే విధంగా నివాస స్థలాల కనీస విలువ ప్రతి చదరపు గజానికి రూ.1,000, అపార్ట్‌మెంట్ల కంపోజిట్ విలువ (చదరపు అడుగు) రూ.1,500గా ప్రతిపాదించాలని నిర్ణయించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చదరపు గజం కనీస విలువ రూ.500గా ప్రతిపాదించనున్నారు. ఈ మేరకు జరుగుతున్న కసరత్తు 90 శాతం పూర్తయిందని, సోమవారం సాయంత్రానికి రిజిస్ట్రేషన్ విలువల సవరణ ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు సమర్పించనున్నాయని తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం ఈ ప్రతిపాదనలపై ఈ నెల 25వ తేదీన ఆ శాఖ ఐజీ సమీక్ష నిర్వహించాల్సి ఉంది. అయితే ఆర్‌సీసీ నిర్మాణాలు, రేకుల షెడ్లకు సంబంధించిన కనీస విలువల నిర్ధారణకు సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా వెలువడాల్సి ఉందని, ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు చెబుతున్నాయి.

మూడు కేటగిరీల్లో వ్యవసాయ భూముల విలువల సవరణ

రాష్ట్రంలోని భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువను సవరించే ప్రక్రియలో భాగంగా వ్యవసాయ భూముల విలువలను మూడు కేటగిరీలుగా నిర్ధారించనున్నారు. గ్రామాల్లోని వ్యవసాయ భూములు (ఎక్కువ సర్వే నంబర్లలో ఇదే విలువ ఉంటుంది), రాష్ట్ర, జాతీయ రహదారుల పక్కన ఉండే వ్యవసాయ భూములు, వ్యవసాయేతర అవసరాలకు (వెంచర్లకు) వినియోగించేందుకు సిద్ధంగాఉన్న భూములు.. ఇలా మూడు కేటగిరీల్లో విలువలను నిర్ణయించనున్నారు. హైవేల పక్కన వ్యవసాయ భూముల విలువను రూ.40–50 లక్షల వరకు సవరించే అవకాశముందని, వ్యవసాయేతర అవసరాలకు సిద్ధంగా ఉన్న (ప్లాట్లుగా చేసేందుకు) భూమి విలువను రూ.కోటి వరకు సవరిస్తారని తెలుస్తోంది. అయితే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సమీపంలో ఉన్న భూములకు, హైవేల పక్కనే ఉన్న నివాస ప్రాంతాలకు దూరంగా ఉండే భూములకు విలువల్లో తేడా ఉంటుందని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు చెబుతున్నారు. సబ్ డివిజన్ సర్వే నంబర్లు, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలు, హెచ్ఎండీఏ, ఇతర నగర అభివృద్ధి సంస్థలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ప్రాతిపదికన వ్యవసాయ భూములు, ఆస్తుల సవరణ ప్రక్రియ సాగుతోందని అంటున్నారు.

వాణిజ్య ప్రాంతాలు మిస్ కాకుండా ప్రత్యేక దృష్టి

తాజాగా జరుగుతున్న రిజిస్ట్రేషన్ విలువల సవరణ ప్రక్రియలో భాగంగా వాణిజ్య ప్రాంతాలపై రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. గతంలో సవరణ జరిగినప్పుడు అప్పటివరకు వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టుగా నిర్ధారణ అయిన డోర్ నంబర్ల విలువలను మాత్రమే వాణిజ్య కేటగిరీలో పరిగణనలోకి తీసుకున్నారు. కానీ ఇప్పుడు వాణిజ్య డోర్ నంబర్లను ముందే ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. నగర, పట్టణ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉండే వాణిజ్య సముదాయాలన్నింటికీ సంబంధించిన విలువల సవరణ ఆటోమేటిక్‌గా జరిగేలా ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలోని ఏ ఒక్క కమర్షియల్ డోర్ నంబర్ తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని క్షేత్రస్థాయి కమిటీలకు వచ్చిన ఆదేశాల మేరకు చాలా పకడ్బందీగా వాణిజ్య ప్రాంతాల్లోని రిజిస్ట్రేషన్ విలువల సవరణ జరుగుతోంది.

తక్కువ ఉన్న చోట భారీగా..

సవరణ ప్రక్రియకు రిజిస్ట్రేషన్ల శాఖ కొన్ని నిబంధనలను రూపొందించుకుంది. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తులు, నివాస స్థలాలకు సంబంధించి బహిరంగ మార్కెట్‌లో ఉన్న విలువను ప్రాతిపదికగా తీసుకుంటోంది. బహిరంగ మార్కెట్ విలువకు, ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రభుత్వ విలువకు భారీగా వ్యత్యాసం ఉన్న చోట (ప్రస్తుతం రిజిస్ట్రేషన్ విలువ తక్కువ ఉన్న ప్రాంతాల్లో) ఈసారి విలువలు భారీగా పెరగనున్నాయి. ఇందుకోసం రియల్ ఎస్టేట్ సంస్థల బ్రోచర్లు, ప్రకటనలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు రెవెన్యూ, మున్సిపల్ వర్గాల నుంచి సమాచారాన్ని తీసుకుంటున్నారు. ఇలాంటి చోట్ల 40 నుంచి 100 శాతం విలువలు పెరగనున్నట్టు తెలుస్తోంది. ఇదే సమయంలో ఇప్పటికే రిజిస్ట్రేషన్ విలువ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాత్రం ఓ మోస్తరు సవరణలుండే అవకాశముంది. ఈ ప్రాంతాల్లో కనిష్ఠంగా 10 నుంచి గరిష్ఠంగా 20 శాతం వరకు మాత్రమే విలువలు సవరించనున్నారు. మొత్తం మీద ఈ విలువల సవరణ ప్రక్రియ ఈ నెల 29వ తేదీతో పూర్తి కానుండగా, అదే రోజు క్షేత్రస్థాయి కమిటీలు ఆ విలువను నిర్ధారించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నాయి. ఆ తర్వాత ఈ విలువలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి ప్రజల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం మరోమారు విలువల్లో మార్పులు, చేర్పులు చేసి ఆగస్టు 1వ తేదీ నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలను అమల్లోకి తెచ్చేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సిద్ధమవుతోంది.

రాష్ట్రీయం

ఇక సమీకృత వసతి గృహాలు

- తొలుత మధిర, కొడంగల్‌లో
- అధికారులతో సమీక్షించిన సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలను అధునాతనంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మరోఅడుగు ముందుకేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల గురుకుల పాఠశాలలను వేర్వేరు చోట్ల కాకుండా ఒకేచోట ఉండే లా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ క్యాంపస్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టనుంది. పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్, మధిర నియోజక వర్గాల్లో ముందుగా వీటిని నిర్మిస్తారు. దశలవారీగా అన్ని నియోజకవర్గాలకు విస్తరిస్తారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుపై ఆదివారం సాయంత్రం ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌ల నిర్మాణానికి ఆర్కిటెక్చర్స్ రూపొందించిన పలు నమూనాలను పరిశీలించారు. నాణ్యమైన విద్యాబోధనకు వీలుగా తరగతి గదులతోపాటు, విద్యార్థులకు అన్ని వసతులుండేలా అధునాతన భవనాలు నిర్మించాలని సూచించారు. అందుబాటులో ఉన్న స్థలాలకు అనుగుణంగా నమూనాలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. దాదాపు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలోని ప్రాంగణంలో ఈ సమీకృత గురుకులాల సముదాయం ఏర్పాటు చేయనున్నారు. ఒకేచోట ఈ భవనాలు నిర్మించి మినీ ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో విద్యార్థుల ప్రతిభా పాటవాలతో పాటు పోటీతత్వం పెరుగుతుందని, కుల, మత వివక్ష తొలగిపోతుందని ప్రభుత్వం సంకల్పించింది. గురుకులాల నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ మరింత సమర్థంగా నిర్వహించే వీలుంటుందని భావిస్తోంది. ఇప్పటికే కొడంగల్ మధిర నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ భవనాల నిర్మాణాలకు 20 ఎకరాల స్థలాలను ప్రభుత్వం గుర్తించింది. వీటితోపాటు స్థలాలు అందుబాటులో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో వెంటనే ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌ల నిర్మాణం చేపట్టాలని సీఎం నిర్ణయించారు.



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్

పార్టీ కండువా కప్పి సీఎం రేవంత్ ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌కు చెందిన మరో ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి రెండురోజుల క్రితం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా, తాజాగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కూడా ఆ పార్టీ గూటికి చేరారు. ఆదివారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయనకు సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నేత, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 24-6-2024

మంచి మాట

అందం అంటే..?



'అందమే ఆనందం' అని ఒక సినిమా కవి అందాన్ని నిర్వచించాడు, ఆనందానికి నిర్వచనం ఇవ్వ బోతూ. ఆనందాన్ని కలిగించ కలిగింది మాత్రమే అందమని కవిహృదయం. ఎవరికి దేని వల్ల ఆనందం కలుగుతుందో చెప్పలేము. అందుకని అందం చూసే వాళ్ళ కళ్లలో ఉంటుందే కానీ వస్తువులో కాదు అనే ఆంగ్ల సామెత వచ్చింది. పైగా అందం వ్యక్తిగతం.''లోకో భిన్న రుచిః'' అన్నట్టు ఒక్కొక్కరి కళ్ళకి అందంగా కనిపించింది వేరొకరికి అందంగా కనిపించక పోవచ్చు. అందం విషయంలో చాలామంది దృష్టి చర్మం దగ్గర ఆగి పోతుంది. కానీ,''నిజమైన అందం శాశ్వతమైన ఆనందాన్ని కలిగిస్తుంది'' అంటాడు ఆంగ్లకవి జాన్ కీట్స్.అందం అన్నది వస్తుగతం కాదు అనే విషయం పాశ్చాత్యులు కూడా బాగా అర్థం చేసుకున్నారు అని అర్థమయింది కదా!

అందానికి సంబంధించి ఒక్కొక్క దేశంలో ప్రమాణాలు ఒక్కొక్క రకంగా ఉంటాయి. చైనా దేశంలో స్త్రీల పాదాలు ఎంత చిన్నవిగా ఉంటే అంతటి అందగత్తెలుగా పరిగణిస్తారు. ముక్కు కొస పైకి ఉండి, ముక్కు రంధ్రాలు కనపడేట్టు ఉండటం అందంగా కొన్ని పాశ్చాత్య దేశాలలో పరిగణించబడుతుంది. భారతీయులు అందంగా పరిగణించే పొడవుగా, కోటేరు వేసినట్టు ముక్కు ఉంటే ఏనుగు ముక్కు అని వేళాకోళం చేస్తారట కూడా.ఆఫ్రికా దేశంలో పెదవులు ఎంత పెద్దగా ఉంటే అంత అందంగా ఉన్నట్టు. అందుకోసం చిన్నతనంలో పెదవులకి చిన్న చిన్న చిడతల వంటి వాటిని తగిలిస్తారట!

భారతీయుల సౌందర్య దృష్టిలో కూడా పారమార్థికత ఉంది. సౌందర్యం పరమాత్ముడి లక్షణాలు, లేక తత్త్వాలలో ఒకటి. సచ్చిదానంద స్వరూపుడైన పరమాత్మ తత్త్వం ''సత్యం, శివం, సుందరం''.సృష్టిలోని అందమంతా మూర్తీభవించిన పురుషరూపం శివుడు.ఆయనే చొక్కనాథుడు, సుందరేశ్వరుడు. అదే స్త్రీ రూపమైతే లలితా త్రిపురసుందరి.

భౌతికమైన అందం శాశ్వతం కాదు. ముద్దుముద్దుగా చూడగానే ముచ్చట గొలిపే పాలబుగ్గల పసివాడు చూస్తూ ఉండగానే పెద్దవాడు అవుతాడు. అప్పుడు పాలబుగ్గలు అందానికి హేతువు కాదు అని అర్థమవుతుంది.ఈ భౌతికరూపాన్ని అధిగమించిన అందాన్ని గురించి మాత్రమే భారతీయ ఋషులు, దార్శనికులు ప్రస్తావించారు. ఆ ప్రమాణాలని అనుసరించే ప్రాచీన కవులు సౌందర్య వర్ణన చేశారు. చేతులని, పాదాలని, ముఖాన్ని, కన్నులని కూడా పద్మాలతో పోల్చుతారు. కారణం వాటి ఆకారం అట్లా ఉందని కాదు. పద్మం అందమైనది.ఆహ్లాదకరమైనది, మృదువైనది, శుభప్రదమైనది, పవిత్రమైనది. కనుక ఆ అవయవాలు అంతటి పవిత్రమైనవి అని సూచించటం.ఇతరమైన ఉపమానాలు కూడా అటువంటివే. పైకి భౌతికరూప వర్ణనలాగా అనిపించినా అంతరార్థం వేరు. బాహ్య సౌందర్యం ఆత్మసౌందర్య వ్యక్తీకరణ మాత్రమే.

భారతీయులకి అందం వస్తువు లేక మనిషికి సంబంధించింది కాదు. మనస్సుకి ఆత్మకి సంబంధించింది. ఆత్మసౌందర్యం మొదలైన పదబంధాలని వింటూనే ఉన్నాము. అంటే అందం వస్తువు లేక మనిషి మూలతత్త్వానికి సంబంధించింది. ఉదాహరణకి బెల్లం చూడటానికి అందంగా కనిపించదు. దాని అందం అంతా దాని రుచిలో ఉంటుంది. మనిషి మనసు స్వచ్ఛంగా ఉంటే అందంగా ఉన్నట్టు అనిపిస్తారు. నిజానికి వారి అవయవాల్లో ఒక్కటి కూడా అందాల పోటీల వాళ్ళ కొలతలకి సరిపోవు. అవయవాల పొందిక వల్ల అందంగా ఉన్నట్టు కనిపిస్తారు. పొందికకి తోడు వారి ప్రేమపూరితమైన మనస్సు. దయ, సుహృద్భావం వంటి సద్భావనలతో మనస్సు నిండి ఉంటే ఆ సానుకూల భావతరంగాలు మనసు నుండి కనుల ద్వారా వెలువడి ముఖాన్ని కాంతిమంతంగా చేస్తాయి. అప్పుడు అందంగా కనిపించదా? దీన్ని వర్చస్సు అని కూడా చెప్పవచ్చు.

– డా.ఎన్.అనంతలక్ష్మి

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

చదువు - లోకహితం కోసమే



రామాయణంలో ఒక చోట ''సర్వే వేద విదః శూరః సర్వే లోకహితే రతః /సర్వే జ్ఞానోపసంపన్నాః సర్వే సముదితా గుణైః'' అని ఉంటుంది. రామలక్ష్మణ భరత శత్రుఘ్నులకు గురువులు ఎన్నో విషయాలు నేర్పారు.ఎన్ని నేర్పినా, వాళ్ళకు నేర్పుతున్నప్పుడే అంతర్లీనంగా ఒక బోధ చేశారు. ''ఈ చదువు మీకు ఒక కొత్త విభూతిని కట్టబెడుతుంది. ఈ చదువు మీకు ఒక కొత్త అధికారాన్ని తీసుకొస్తుంది. మీకున్న ఏ విభూతిని కూడా స్వార్థ ప్రయోజనానికి వాడుకోకుండా కేవలం ప్రజాహితానికి మాత్రమే వాడాలి.''–అని.

చదువు లేనివాడు మోసం చేయడానికి సంతకం కూడా పెట్టలేడు. చదువుకున్నవాడు వాడిని పిలిచి నిలదీస్తే వాడు భయపడి 'ఇంకెప్పుడూ ఇలా చేయనండీ ...' అంటాడు. కానీ బాగా చదువుకున్నవాడు అందరికీ నియమనిష్ఠలు చెప్పగలిగినవాడు తప్పు చేసినప్పుడు.. ... తన తప్పును అంగీకరించకపోగా అదే ఒప్పు అని సమర్థించుకోవడానికి సవాలక్ష వాదనలు ముందు పెడతాడు. రావణాసురుడికి ఏ విద్యలు తెలియవని!!! అయినా ''స్వధర్మో రక్షసాం భీరు సర్వథైవ న సంశయః! గమనం వా పర స్త్రీణాం హరణం సంప్రమథ్య వా!!'' అని వాదించాడు. 'నా తప్పేముంది కనుక. నేను రాక్షసుడిని.నా జాతి ధర్మం ప్రకారం నాకు కావలసిన స్త్రీలను అపహరిస్తాను, అనుభవిస్తాను. నేను చూడు ఎంత ధర్మాత్ముడినో'' అని సమర్థించుకునే ప్రయత్నం చేసాడు. అంత చదువుకున్నవాడు అంత మూర్ఖంగా వాదిస్తే అటువంటివాడిని అభిశంసించగలిగిన వాడెవడుంటాడు!!! చదువు సంస్కారవంతమై ఉండాలి.సామాజిక నిష్ఠతో ఉండాలి. అందరి మేలు కోరేదై ఉండాలి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

విశ్వామిత్రుడుకానీ, వశిష్ఠుడు కానీ రామలక్ష్మణులకు విద్యను నేర్పించేటప్పుడు 'ఇంత ధనుర్వేదాన్ని వీళ్లకు అందచేస్తున్నాం. వీళ్ళు తలచుకుంటే ముల్లోకాలను లయం చేయగలరు. అంత శక్తిమంతులవుతారు..' అన్న ఆలోచనతో దానిని ఎక్కడా దుర్వినియోగపరచకుండా ఉండేవిధంగా విద్యాబోధనలో ఎంతో జాగ్రత్త తీసుకున్నారు. నిజానికి రామచంద్ర మూర్తి నేర్చుకున్న ధనుర్విద్యాపాటవం అటువంటిది. ఆచరణలో ఆయన దానికి పూనుకుంటే ఆపడం ఎవరితరం కాదు. ఆయన బాణ ప్రయోగం చేస్తే అగ్నిహోత్రం కప్పేస్తుంది సమస్త భూమండలాన్ని... అది ప్రళయాన్ని సృష్టించగలదు. కానీ అంత బలాఢ్యుడై ఉండి కూడా రాముడు ఒక్కసారి కూడా స్వార్థం కోసం హద్దుదాటి ఎవరినీ శిక్షించలేదు. అంటే గురువులు ఇచ్చిన విద్య లోకప్రయోజనం కోసం మాత్రమే ఉపయోగపడాలన్న స్పృహతో ఉండడమే కాదు, అందరికీ తన నడవడిక ద్వారా ఒక సందేశం ఇచ్చి ఆదర్శంగా నిలిచాడు.

రుషులు లోకహితం కోరి మనకు అందించిన పురాణాలు మనల్ని వారికి రుణగ్రస్థుల్ని చేసాయి. ఎప్పుడో వయసు మీరిన తరువాత, పదవీవిరమణ తరువాత చదవాల్సినవి కావు అవి. చిన్నప్పటినుంచి వాటిని చదువుకుంటే, అవగాహన చేసుకుంటే మన జీవితాలు చక్కబడతాయి. అదీకాక రుషిరుణం తీరదు కూడా. ఇది తీరడానికి బ్రహ్మచర్య ఆశ్రమం చాలు. బ్రహ్మచారిగా ఉండగా రామాయణ భారత భాగవతాదులు, ఇతర పురాణాలు, వేదాలు ఏవయినా చదువుకోవచ్చు. కానీ మిగిలిన రెండు రుణాలు–పితృరుణం, దేవరుణం మాత్రం గృహస్థాశ్రమ స్వీకారంతోనే తీరతాయి.

బౌద్ధవాణి

అజేయులు



ఆ ఇంట్లో ఇల్లాలు వంటచేస్తూ అందులో నిమగ్నమై పోయింది. ఆ రోజు భిక్షు సంఘాన్ని భిక్ష కోసం ఆహ్వానించారు ఆ గృహస్థులు. ఆమెకు ఒక నెలల బిడ్డ. ఆ బిడ్డడిని ఇంటిముందు దుప్పటి మీద పడుకోబెట్టారు. ఇద్దరు పిల్లలు ఆడిస్తున్నారు. ఆ పసివాడు వెల్లకిలా పడుకుని, కాళ్ళూ చేతులూ ఆడిస్తూ బోసినవ్వులు చిందిస్తున్నాడు. ఆమె వంటగది లోంచి అప్పుడప్పుడూ ఆ పిల్లలకేసి చూస్తూనే ఉంది.

కొంత సమయం గడిచింది. ఇంటి యజమాని కావడితో మంచినీరు తెచ్చి ఇంట్లో విశాలమైన మధ్య గదిలో ఉంచాడు. ఆరుబయట ఆడుకుంటున్న పిల్లల్లో ఒకడు పెద్దగా అరిచాడు.

''అమ్మా! భిక్షువులు వస్తున్నారు'' అంటూ ఆ వీధి చాలా పొడవైంది. ఆ వీధిలోకి అప్పుడే వచ్చారు భిక్షుగణం.

భిక్షగా సమర్పించే ఆహార పదార్థాలన్నీ పూర్తయ్యాయి. వాటిని గిన్నెల్లోకి సర్దుతోంది. ఇంతలో బయట ఏదో శబ్దం వినపడింది. కోడెదూడ ఒకటి చెంగుచెంగున ఎగురుతూ, తోక ఎత్తి అటుకేసి వచ్చింది. పసి పిల్లవాణ్ణి అక్కడే ఉంచి, మిగిలిన ఇద్దరు పిల్లలూ ఇంట్లోకి పరుగు తీశారు. ఇల్లాలికి విషయం అర్థమై, వేగంగా బైటికి పరుగు తీసింది.

కానీ... అప్పటికే ఆ గిత్తదూడ వచ్చేసింది. ఆరుబయట పడుకున్న పిల్లవాడి మీదగా దూకి వెళ్ళిపోయింది. ఆమెకు గుండె ఆగినంత పని అయింది. ఆమె వెళ్ళేసరికి... చిరునవ్వులు చిందిస్తూ బోసి నోటితో ఊ కొడుతున్నాడు ఆ బిడ్డ. కొంతసేపటికి భిక్షువులు వచ్చారు. వారు భిక్ష పూర్తి చేశాక ధర్మోపదేశం చేశారు. అప్పుడు వారికి ప్రమాదం తప్పిన పిల్లవాని గురించి తెలిసింది.

''చేశారా! ఆ బాలుడు స్థిరచిత్తుడు. స్థిత ప్రజ్ఞుడు. చావు ముందు కొస్తున్నా చిరునవ్వు చెదరనివాడు'' అన్నాడు ఆ భిక్షువు.

''అవును. కుశల సంపన్నుడు అజేయుడు'' అన్నాడు మరో భిక్షువు. పాపకర్మలు చేయనివాడు, మోసపు మాటలు ఎరుగని వాడు, పాప సంకల్పాలు తెలియని వాడు. అందుకే స్థిరచిత్తుడు '' అన్నాడు మొదటి భిక్షువు.

వారు అలా వాద సంవాదాలు చేసుకుంటూ ఆరామానికి చేరారు. అక్కడా ఇదే సంఘటన చెప్పి, అదే చర్చ కొనసాగించారు. అలా చర్చించే వారంతా కొత్తగా వచ్చిన వారే.

వారి మధ్య మాటలు జరుగుతూ ఉండగా బుద్ధుడు అక్కడికి వచ్చాడు. భిక్షువులందరూ నిశ్శబ్దం పాటించారు.

''భిక్షువులారా! ఇపుడు మీరు వాదులాడుకుంటున్న విషయం ఏమిటి?' అని అడిగాడు.

విషయమంతా తెలుసుకున్నాడు.

''భిక్షువులారా! శరీరంతో పాప కర్మలు చేయని వారు, పాపపు మాటలు మాట్లాడనివారు, పాప సంకల్పాలు చేయని వారు, పాప జీవనం కొనసాగించనివారు ఈ నాలుగు ధర్మాల్ని పాటించేవారు కుశల సంపన్నులే. అజేయులే! అత్యున్నత స్థితిని పొందినవారే! అయితే పసివారు ఇవేవీ చేయరు కాబట్టి వారు అజేయులు కారు. ఎందుకంటే.... వారు వెల్లకిలా పడుకుని మాత్రమే ఉండగలరు. వారు తమ శరీరంతో ఏ కర్మలూ చేయలేరు. వారికి నోరుంటుంది. నవ్వు, ఏడుపులు ఉంటాయి తప్ప, తప్పు ఒప్పులు మాట్లాడలేరు. అంటే... మాటల ద్వారా కర్మలాచరించలేరు. అలాగే... అది చేయాలి, ఇది చేయాలి, అలా చేయాలి, ఇలా చేయాలి అనే ఆలోచనలు వారికి ఉండవు. కాబట్టి సంకల్పాలూ ఉండవు. ఇక, తాను అది తినాలి ఇది తినాలిఅని ఎలా ఉండదో... ఆ తిండిని ఏదో ఒక మార్గంలో, మంచిగానో చెడుగానో సంపాదించి తినాలి అనే కోరికా ఉండదు. తల్లి పాలు తాగడం తప్ప... మరే విధమైన జీవన కర్మలు చేయరు. పసిపిల్లవాణ్ణి కర్మలతో కొలవకూడదు.


పెరిగి పెద్దయ్యాక కలిగే అనేక వికారాల నుండి, దోషాల నుండి, స్వార్థాల నుండి బైటపడిన వారినే కుశల సంపన్నులుగా, అజేయునిగా భావించాలి. అలాంటి నిస్వార్థ జీవనాన్ని కీర్తించాలి. అ నాలుగు ధర్మాల్ని ధరించిన వారికి అపజయం కలగదు. ప్రమాదం వచ్చి మీద పడుతున్నా చిరునవ్వు చెరగదు. '' అన్నాడు. పాపకర్మలు చేసే అవకాశం ఉన్నా చేయని వారు పాపపు జీవన విధానం ఎదుటే ఉన్నా దాన్ని స్వీకరించని వారు... ఇలాంటి వారు మాత్రమే అజేయులు. ఎందుకంటే వారు తమని తాము జయించుకుంటారు కాబట్టి అనే విషయం వారికి అర్థమైంది.

ఆ కొత్త భిక్షువులు బుద్ధునికి ప్రణమిల్లారు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

ట్రైలర్ రెడీ



కమల్‌హాసన్

హీరో కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబోలో రూపొందిన సినిమా 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు'). 1996లో విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. పాతిక సంవత్సరాల తర్వాత 'ఇండియన్' సినిమాకు సీక్వెల్స్‌గా 'ఇండియన్ 2', 'ఇండియన్ 3' చిత్రాలను తెరకెక్కించారు కమల్‌హాసన్ అండ్ శంకర్. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై సుభాస్కరన్ నిర్మించారు. 'భారతీయుడు 2' తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జూలై 12న విడుదల కానుంది. 'భారతీయుడు 2' మూవీ తెలుగు హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్ఎల్‌పీ, సీడెడ్ హక్కులను శ్రీ లక్ష్మి మూవీస్ సంస్థలు దక్కించుకున్నాయి. తాజాగా 'ఇండియన్ 2' ట్రైలర్‌ను ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ముంబైలో జరగనున్న ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 'ఇండియన్ 2' ట్రైలర్ విడుదలవుతుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. సిద్ధార్థ్, ఎస్‌జే సూర్య, సముద్ర ఖని, బాబీ సింహా, కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, జయరాం, గుల్షన్ గ్రోవర్, బ్రహ్మానందం ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న 'ఇండియన్ 2' సినిమాకు అనిరుధ్ రవిచందర్ స్వరకర్త. కాగా 'ఇండియన్ 3' సినిమా వచ్చే ఏడాది ప్రారంభంలో విడుదల కానుందని కోలీవుడ్ టాక్.

థాయ్‌లాండ్‌లో పాట



బాస్కో మార్టిన్, ఎన్టీఆర్



జాన్వీ కపూర్

హీరో ఎన్టీఆర్, హీరోయిన్ జాన్వీ కపూర్ థాయ్‌లాండ్‌లో చిందేస్తున్నారు. ప్రస్తుతం వీరిద్దరిపై అక్కడ ఓ పాటని చిత్రీకరిస్తున్నారు మేకర్స్. 'జనతా గ్యారేజ్'(2016) వంటి హిట్ మూవీ తర్వాత హీరో ఎన్టీఆర్, డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'దేవర'. ఈ మూవీ ద్వారా జాన్వీ కపూర్ టాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నారు. కల్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ సినిమా నిర్మిస్తున్నారు. 'దేవర' కీలక షెడ్యూల్‌ని థాయ్‌లాండ్‌లో ప్లాన్ చేశారు కొరటాల శివ. ఎన్టీఆర్, జాన్వీ కపూర్‌లపై ఓ సాంగ్‌తో పాటు ప్రధాన తారాగణంపై కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. ఈ షెడ్యూల్‌లో పాల్గొనేందుకు ఈ నెల 17న హైదరాబాద్ నుంచి ఎన్టీఆర్, ఈ నెల 16న ముంబై నుంచి జాన్వీ కపూర్ థాయ్‌లాండ్‌కి బయలుదేరి వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వీరిద్దరిపై ఓ రొమాంటిక్ సాంగ్ చిత్రీకరణ జరుగుతోందని సమాచారం. 'పఠాన్, వార్, ఫైటర్' వంటి చిత్రాల్లో మంచి స్టెప్స్‌ను కంపోజ్ చేసిన ప్రముఖ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిస్ ఈ పాటకి నృత్యరీతులు సమకూర్చుతున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌తో కలిసి దిగిన ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు బాస్కో మార్టిస్. హై యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రెండు భాగాలుగా రూపొందుతోన్న 'దేవర' చిత్రం మొదటి భాగం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో సెప్టెంబర్ 27న విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు, సంగీతం: అనిరుధ్.

కశ్మీర్‌లో మిస్టర్ బచ్చన్



రవితేజ

కశ్మీర్‌లో మెలోడీ డ్యూయెట్ పాడుతున్నాడు మిస్టర్ బచ్చన్. రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. ఇందులో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. హరీష్ శంకర్ దర్శకత్వంలో పనోరమా స్టూడియోస్– టీ సిరీస్ సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. కాగా ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం కశ్మీర్ వ్యాలీలో జరుగుతోంది. రవితేజ, భాగ్యశ్రీ బోర్సేలపై శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో ఓ పాటను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ''నాలుగు రోజులుగా ఈ పాట చిత్రీకరణ జరుగుతోంది. ఆదివారంతో ఈ సాంగ్ షూటింగ్ పూర్తయింది. విజువల్ ఫీస్ట్‌గా ఉంటూనే ఎమోషనల్ ఎలిమెంట్‌తో ఈ సాంగ్ ఉంటుంది. ఈ మూవీ షూటింగ్ తొంభై శాతం పూర్తయింది. మిగతా భాగాన్ని త్వరగా చిత్రీకరించేలా శరవేగంగా పని చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. జగపతి బాబు, సచిన్ ఖేడ్కర్ ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే హిందీ హిట్ ఫిల్మ్ అజయ్ దేవగన్ 'రైడ్ '(2018)కు తెలుగు రీమేక్‌గా 'మిస్టర్ బచ్చన్' చిత్రం తెరకెక్కుతోందనే టాక్ వినిపిస్తోంది.

చిన్న చిన్న కన్‌గళ్!



స్నేహ, విజయ్

తమిళ స్టార్ హీరోల్లో ఒకరైన దళపతి విజయ్ నటిస్తున్న 50వ చిత్రం 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' (ది గోట్). వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రశాంత్, ప్రభుదేవా, కిచ్చా సుదీప్, లైలా, మీనాక్షీ చౌదరి, స్నేహ, యోగిబాబు, జయరాం ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమా సెప్టెంబరు 5న విడుదలకానుంది. ఇదిలా ఉంటే.. జూన్ 22న విజయ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా 'ది గోట్' నుంచి ఓ వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసి, అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు మేకర్స్. ఇందులో డైలాగ్స్ లేకుండా కేవలం ఛేజింగ్ యాక్షన్ సీక్వెన్స్ ఉన్నప్పటికీ మంచి స్పందన వస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ మూవీ నుంచి 'చిన్న చిన్న కన్‌గళ్..'(చిన్న చిన్న కళ్లు) అంటూ సాగే రెండో పాటని ఆదివారం విడుదల చేశారు. ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందించారు. కుటుంబ భావోద్వేగాలతో సాగే ఈ పాటకి కబిలన్ వైరముత్తు సాహిత్యం అందించారు. యువన్ శంకర్ రాజా, రాజా భవతరినిలతో కలిసి విజయ్ ఈ పాట పాడటం విశేషం. సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ సినిమాలో విజయ్ తండ్రీ కొడుకులుగా నటిస్తున్నారు.

మత్స్యకారుల జీవితంతో...



అజయ్, వంశీరామ్

వంశీరామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వం వహించారు. నవీన్ పారుపల్లి సమర్పణలో సంహిత్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డా. మురళీ గింజుపల్లి నిర్మించిన ఈ మూవీ త్వరలో విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ, నటీనటులు అనన్య నాగళ్ల, మురళీ మోహన్, ఉత్తేజ్ అతిథులుగా హాజరయ్యారు. రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ–''నేను విజయవాడలో ఉన్నప్పుడు మచిలీపట్నం రేవుకు వెళ్లేవాడిని. రేవు నేపథ్యంగా సాగే మత్స్యకారుల జీవితాలతో తెరకెక్కించిన ఈ సినిమా హిట్ కావాలి'' అన్నారు. ''వర్మగారు, మురళీ మోహన్‌గారు నా తొలి సినిమా వేడుకకి అతిథులుగా రావడం చాలా సంతోషంగా ఉంది'' అన్నారు డా.మురళి గింజుపల్లి. ఈ చిత్రానికి కెమెరా: రేవంత్ సాగర్, నేపథ్య సంగీతం: వైశాక్ మురళీధరన్.

ఆగస్టులో ఆరంభం



శివ రాజ్‌కుమార్

శివ రాజ్‌కుమార్ హీరోగా నటించనున్న నూతన ద్విభాషా (తెలుగు, కన్నడ) చిత్రం ఖరారైంది. కార్తీక్ అద్వైత్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. పద్మజ ఫిలింస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో భువనేశ్వరి పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, సుధీర్. పి నిర్మించనున్నారు. ''హై బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ ఇది. స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. మ్యూజిక్ వర్క్ జరుగుతోంది. ఆగస్టులో ఈ సినిమా ప్రారంభోత్సవంతో పాటు రెగ్యులర్ షూటింగ్ మొదలయ్యేలా ప్లాన్ చేస్తున్నాం. ఈ సినిమాకు సంబంధించిన ఇతర పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: సామ్ సీఎస్, కెమెరా: ఏజే శెట్టి.

మధురం హిట్ అవుతుంది - నితిన్



నితిన్, ఉదయ్ రాజ్

''మధురం' సినిమా టీజర్ చాలా బాగుంది. చూస్తుంటే ఔట్ అండ్ ఔట్ లవ్ స్టోరీలా అనిపిస్తోంది. ఈ సినిమా మంచి హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. చిత్ర నిర్మాత బంగార్రాజు, దర్శకుడు రాజేష్, హీరో ఉదయ్‌తో పాటు టీమ్‌కి ఆల్ ది బెస్ట్'' అని హీరో నితిన్ అన్నారు. ఉదయ్ రాజ్, వైష్ణవీ సింగ్ జంటగా రాజేష్ చికిలే దర్శకత్వం వహించిన చిత్రం 'మధురం'. 'ఎ మెమొరబుల్ లవ్' అనేది ట్యాగ్‌లైన్. శ్రీ వెంకటేశ్వర ఎంటర్‌టైన్మెంట్‌పై యం. బంగార్రాజు నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను నితిన్ విడుదల చేశారు. రాజేష్ చికిలే మాట్లాడుతూ–''1990 నేపథ్యంలో జరిగే టీనేజ్ లవ్ స్టోరీ ఇది. సినిమా చూసిన ప్రేక్షకులకు వాళ్ల స్కూల్ డేస్, కాలేజ్ డేస్ గుర్తుకొస్తాయి'' అన్నారు. ''క్లీన్ యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ ఇది. ఈ సినిమాతో నా జీవితం మలుపు తిరుగుతుంది'' అన్నారు ఉదయ్ రాజ్. ''రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రస్తుతం సెన్సార్ వర్క్ జరుగుతోంది. అతి త్వరలోనే సినిమా విడుదల చేస్తాం'' అన్నారు యం. బంగార్రాజు. ఈ చిత్రానికి కెమెరా: మనోహర్ కొల్లి, సంగీతం: వెంకీ వీణ.

సోనాక్షి వెడ్స్ జహీర్



జహీర్ ఇక్బాల్, సోనాక్షీ సిన్హా

బాలీవుడ్ నటుడు జహీర్ ఇక్బాల్, నటి సోనాక్షీ సిన్హా వివాహం చేసుకున్నారు. ఏడేళ్లుగా ప్రేమలో ఉన్న వీరిద్దరూ ఆదివారం ముంబైలో సింపుల్‌గా రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. ఇరు కుటుంబ సభ్యులు, సన్నిహితులు, బంధువుల సమక్షంలో వీరి పెళ్లి జరిగింది. ''ఏడు సంవత్సరాల క్రితం మా ఇద్దరి కళ్లలో నిజమైన ప్రేమ ఉన్నట్లుగా మాకు అర్థమైంది. ఈ ప్రేమను ఇలానే కంటిన్యూ చేయాలనుకున్నాం. ఇప్పుడు మా ప్రేమే మా వివాహం జరిపించింది. మా రెండు కుటుంబాలు, బంధువులు, దేవుళ్ల ఆశీర్వాదాలతో మా పెళ్లి జరిగింది'' అంటూ ఇన్‌స్టాలో పెళ్లి ఫోటోలను షేర్ చేశారు సోనాక్షీ సిన్హా. కాగా 2022లో విడుదలైన హిందీ చిత్రం 'డబుల్ ఎక్స్'లో సోనాక్షీ సిన్హా, జహీర్ ఇక్బాల్ స్క్రీన్ షేర్ చేసుకున్న విషయం తెలిసిందే.

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
24-6-2024

జోర్డాన్ హ్యాట్రిక్: సెమీస్‌లో ఇంగ్లండ్



జోర్డాన్

బ్రిడ్జ్‌టౌన్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చెలరేగిపోయిన డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ జట్టు టి20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. అమెరికా జట్టుతో ఆదివారం జరిగిన గ్రూప్–2 'సూపర్–8' మ్యాచ్‌లో ఇంగ్లండ్ 10 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన అమెరికా 18.5 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌటైంది. నితీశ్ (24 బంతుల్లో 30; 1 ఫోర్, 2 సిక్స్‌లు), కోరె అండర్సన్ (28 బంతుల్లో 29; 1 సిక్స్) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్ క్రిస్ జోర్డాన్ 'హ్యాట్రిక్' నమోదు చేశాడు. జోర్డాన్ 2.5 ఓవర్లలో కేవలం 10 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో జోర్డాన్ 5 బంతుల్లో 4 వికెట్లు పడగొట్టాడు. 19వ ఓవర్ తొలి బంతికి అండర్సన్‌ను అవుట్ చేసిన జోర్డాన్... మూడో బంతికి అలీఖాన్‌ను, నాలుగో బంతికి కెంజిగెను, ఐదో బంతికి నేత్రావల్కర్‌ను అవుట్ చేసి 'హ్యాట్రిక్' పూర్తి చేసుకున్నాడు.

బట్లర్ మెరుపులు

116 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 9.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 117 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ జోస్ బట్లర్ (38 బంతుల్లో 83 నాటౌట్; 6 ఫోర్లు, 7 సిక్స్‌లు), ఫిల్ సాల్ట్ (21 బంతుల్లో 25 నాటౌట్; 2 ఫోర్లు) మెరిపించారు. అమెరికా బౌలర్ హర్మీత్ సింగ్ వేసిన తొమ్మిదో ఓవర్లో బట్లర్ ఏకంగా 5 సిక్స్‌లు కొట్టాడు. ఈ గెలుపుతో ఇంగ్లండ్ 4 పాయింట్లతో సెమీఫైనల్ చేరుకుంది. నేడు దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లో నెగ్గిన జట్టు గ్రూప్–2 నుంచి రెండో జట్టుగా సెమీఫైనల్ చేరుకుంటుంది.

గ్రూప్–2 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	ర.రే
ఇంగ్లండ్	3	2	1	4	1.992
దక్షిణాఫ్రికా	2	2	0	4	0.625
వెస్టిండీస్	2	1	1	2	1.814
అమెరికా	3	0	3	0	–3.906

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, ర.రే–రన్‌రేట్

జోరు కొనసాగించాలని...

నేడు ఆస్ట్రేలియాతో భారత్ 'సూపర్–8' మ్యాచ్

- ఆసీస్ గెలిస్తేనే సెమీస్ ఆశలు సజీవం
- మ్యాచ్‌కు పొంచిఉన్న వర్షం ముప్పు
- రాత్రి గం. 8 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



గ్రాస్ ఐలెట్: టి20 ప్రపంచకప్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత జట్టుకు ఆస్ట్రేలియా రూపంలో నేడు అసలు సిసలు పరీక్ష ఎదురుకానుంది. గ్రూప్–1లో టాప్‌లో ఉన్న భారత జట్టు ఆసీస్‌పై నెగ్గితే దర్జాగా సెమీఫైనల్ చేరుకుంటుంది. రోహిత్, కోహ్లి, సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా, రిషభ్ పంత్ రాణిస్తే భారత్ భారీ స్కోరు చేయడం ఖాయం. బుమ్రా, అర్ష్‌దీప్ పేస్‌కు తోడు కుల్దీప్ స్పిన్ తోడైతే ఆస్ట్రేలియాకు కష్టాలు తప్పవు. మరోవైపు భారత్‌పై గెలిచి సెమీఫైనల్ చేరే అవకాశాలను సజీవంగా నిలబెట్టుకోవాలని ఆస్ట్రేలియా పట్టుదలతో ఉంది. అయితే భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశాలు ఉన్నాయి. మ్యాచ్ రద్దయితే మాత్రం భారత్ ఐదు పాయింట్లతో సెమీఫైనల్ చేరుకుంటుంది. ఆస్ట్రేలియా సెమీస్ చేరే అవకాశాలన్నీ అఫ్గానిస్తాన్–బంగ్లాదేశ్ మధ్య మంగళవారం ఉదయం కింగ్స్‌టౌన్‌లో జరిగే మ్యాచ్‌పై ఆధారపడి ఉంటాయి. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ గెలిస్తే ఆస్ట్రేలియా 3 పాయింట్లతో సెమీఫైనల్ చేరుతుంది. అఫ్గానిస్తాన్ గెలిస్తే ఆ జట్టు 4 పాయింట్లతో సెమీఫైనల్ చేరుకొని ఆస్ట్రేలియాను ఇంటిదారి పట్టిస్తుంది. ఒకవేళ భారత జట్టుపై ఆస్ట్రేలియా 41 పరుగుల తేడాతో గెలిచి... అఫ్గానిస్తాన్ జట్టు 81 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడిస్తే మాత్రం రన్‌రేట్‌లో వెనుకబడి టీమిండియా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

గ్రూప్–1 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	ర.రే.
భారత్	2	2	0	4	2.425
ఆస్ట్రేలియా	2	1	1	2	0.223
అఫ్గానిస్తాన్	2	1	1	2	–0.650
బంగ్లాదేశ్	2	0	2	0	–2.489

అఫ్గానిస్తాన్ అద్భుతం

- ఆస్ట్రేలియాపై 21 పరుగులతో సంచలన విజయం
- మెరిసిన గుల్బదిన్, గుర్బాజ్, ఇబ్రహీం
- తొలిసారి అఫ్గానిస్తాన్ చేతిలో ఓడిన ఆసీస్
- కమిన్స్ హ్యాట్రిక్ వృథా



మ్యాక్స్‌వెల్ అవుటయ్యాక అఫ్గానిస్తాన్ ప్లేయర్లు గుల్బదిన్, గుర్బాజ్ సంబరం

సమష్టి ఆటతీరుతో అఫ్గానిస్తాన్ తమ క్రికెట్ చరిత్రలోనే చిరస్మరణీయ విజయం అందుకుంది. ప్రపంచ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) విశ్వవిజేతగా నిలిచిన ఆస్ట్రేలియాను అఫ్గానిస్తాన్ తొలిసారి ఓడించింది. గతంలో ఆస్ట్రేలియాతో ఆడిన నాలుగు వన్డేలలో, ఒక టి20 మ్యాచ్‌లో ఓడిపోయిన అఫ్గానిస్తాన్ ఆరో ప్రయత్నంలో మాత్రం క్రికెట్ అభిమానులందరూ అబ్బురపడే ఫలితాన్ని సాధించింది. ప్రపంచ వ్యాప్తంగా జరిగే టి20 ఫ్రాంచైజీ లీగ్‌లలో ఆడుతున్న అఫ్గాన్ క్రికెటర్లు ఆ అనుభవాన్నంతా రంగరించి పోరాడటంతో ఆస్ట్రేలియా తొలిసారి అఫ్గానిస్తాన్ ముందు తలవంచక తప్పలేదు.

కింగ్స్‌టౌన్: ప్రపంచ క్రికెట్‌లో ఇక నుంచి తమను చిన్న జట్టుగా ఎవరూ పరిగణించకూడదని అఫ్గానిస్తాన్ చాటి చెప్పింది. అగ్రశ్రేణి జట్లపై గెలిచే సత్తా తమలోనూ ఉందని... క్రమం తప్పకుండా తమతో మేటి జట్లు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడితే మరింత రాటుదేలుతామని అఫ్గానిస్తాన్ క్రికెటర్లు నిరూపించారు. టి20 ప్రపంచకప్ 'సూపర్–8' దశలో భాగంగా మాజీ చాంపియన్ ఆస్ట్రేలియాతో ఆదివారం ఉదయం జరిగిన గ్రూప్–1 మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 21 పరుగుల తేడాతో సంచలన విజయం సాధించింది. ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 148 పరుగులు చేసింది. అనంతరం 149 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 19.2 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. మ్యాక్స్‌వెల్ (41 బంతుల్లో 59; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా ఇతర బ్యాటర్లు విఫలమయ్యారు. నవీనుల్ హక్ (3/20), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గుల్బదిన్ నైబ్ (4/20) తమ వైవిధ్యభరిత బౌలింగ్‌తో ఆస్ట్రేలియాను దెబ్బ కొట్టారు. గతంలో ఒక్కసారి కూడా ఆస్ట్రేలియాపై నెగ్గని అఫ్గానిస్తాన్‌కు ఈ మ్యాచ్‌లో ఓపెనర్లు రహ్మానుల్లా గుర్బాజ్ (49 బంతుల్లో 60; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇబ్రహీం జద్రాన్ (48 బంతుల్లో 51; 6 ఫోర్లు) శుభారంభం అందించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 118 పరుగులు జోడించారు. గుర్బాజ్, ఇబ్రహీం అవుటయ్యాక వచ్చిన ఇతర అఫ్గాన్ బ్యాటర్లు మెరిపించలేకపోయారు.

కమిన్స్ హ్యాట్రిక్

ఇన్నింగ్స్ 18వ ఓవర్ వేసిన ఆసీస్ పేసర్ కమిన్స్ చివరి బంతికి అఫ్గానిస్తాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ (2)ను అవుట్ చేశాడు. ఆ తర్వాత 20వ ఓవర్లో తొలి రెండు బంతులకు కరీమ్ జన్నత్ (9 బంతుల్లో 13; 1 సిక్స్), గుల్బదిన్ నైబ్ (0)లను అవుట్ చేసి ఈ టోర్నీలో రెండో 'హ్యాట్రిక్' నమోదు చేశాడు.



కమిన్స్

నవీనుల్, గుల్బదిన్ సూపర్ బౌలింగ్

కష్టసాధ్యంకాని లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు తొలి ఓవర్‌లోనే షాక్ తగిలింది. నవీనుల్ హక్ అద్భుత బంతికి ఓపెనర్ ట్రవిస్ హెడ్ (0) బౌల్డయ్యాడు. ఆ తర్వాత నవీనుల్ తన రెండో ఓవర్లో కెప్టెన్ మిచెల్ మార్ష్ (9 బంతుల్లో 12; 2 ఫోర్లు)ను అవుట్ చేశాడు. ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో వార్నర్ (3)ను నబీ పెవిలియన్‌కు పంపించడంతో ఆసీస్ కష్టాల్లో పడింది. ఈ దశలో మ్యాక్స్‌వెల్, స్టొయినిస్ (17 బంతుల్లో 11; 1 ఫోర్) ఇన్నింగ్స్ చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. అయితే గుల్బదిన్ వైవిధ్యభరిత బంతులతో ముందుగా స్టొయినిస్‌ను, ఆ తర్వాత టిమ్ డేవిడ్‌ను అవుట్ చేశాడు. అనంతరం ప్రమాదకరంగా మారిన మ్యాక్స్‌వెల్‌ను కూడా గుల్బదిన్ పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత మాథ్యూ వేడ్‌ను రషీద్ ఖాన్ అవుట్ చేయడంతో ఆసీస్ 108 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఓటమి వైపు సాగింది. కమిన్స్ ఏమైనా అద్భుతం చేస్తాడా అని ఆశించినా అతడిని గుల్బదిన్ అవుట్ చేయడంతో ఆస్ట్రేలియా పరాజయం ఖాయమైంది.

1 వరుసగా రెండు అంతర్జాతీయ టి20 మ్యాచ్‌ల్లో 'హ్యాట్రిక్' నమోదు చేసిన, టి20 ప్రపంచకప్‌లో రెండు హ్యాట్రిక్‌లు తీసిన తొలి బౌలర్ కమిన్స్. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి సూపర్–8 మ్యాచ్‌లోనూ కమిన్స్ హ్యాట్రిక్ సాధించాడు. అంతేకాకుండా మలింగ (శ్రీలంక), టిమ్ సౌతీ (న్యూజిలాండ్), మార్క్ పావ్‌లోవిచ్ (సెర్బియా), వసీమ్ అబ్బాస్ (మాల్టా) తర్వాత టి20ల్లో రెండు హ్యాట్రిక్‌లు సాధించిన ఐదో క్రికెటర్‌గా కమిన్స్ నిలిచాడు.

టి20 ప్రపంచకప్‌లో నేడు

దక్షిణాఫ్రికా X వెస్టిండీస్
వేదిక: నార్త్‌సౌండ్; ఉదయం గం. 6 నుంచి

భారత్ X ఆస్ట్రేలియా
వేదిక: గ్రాస్ ఐలెట్; రాత్రి గం. 8 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

భారత్ క్లీన్‌స్వీప్


సిరీస్ ట్రోఫీతో హర్మన్‌ప్రీత్

బెంగళూరు: దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ జట్టుతో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత మహిళల జట్టు 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని భారత్ 6 వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 8 వికెట్లకు 215 పరుగులు సాధించింది. ఓపెనర్లు లౌరా వొల్వార్ట్ (57 బంతుల్లో 61; 7 ఫోర్లు), తజ్మీన్ (38; 2 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 102 పరుగులు జోడించారు. భారత బౌలర్లలో అరుంధతి రెడ్డి (2/36), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ (2/27) రాణించారు. 216 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 40.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసి గెలిచింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (83 బంతుల్లో 90; 11 ఫోర్లు), హర్మన్‌ప్రీత్ కౌర్ (48 బంతుల్లో 42; 2 ఫోర్లు) రాణించడంతో భారత్ 56 బంతులు ఉండగానే విజయాన్ని అందుకుంది.

ధీరజ్‌కు రెండు కాంస్యాలు



అంటాల్యా (టర్కీ): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–3 టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్ రెండు కాంస్య పతకాలు సాధించాడు. మిక్స్‌డ్ టీమ్ కాంస్య పతక మ్యాచ్‌లో ధీరజ్–భజన్ కౌర్ (భారత్) ద్వయం 5–3తో మటియాస్–వలెన్సియా (మెక్సికో) జోడీపై గెలిచింది. వ్యక్తిగత విభాగం కాంస్య పతక మ్యాచ్‌లో ధీరజ్ 7–3 తో మౌరో నెస్పోలి (ఇటలీ)పై విజయం సాధించాడు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

భారత తీరరక్షక దళంలో 320 నావిక్, యాంత్రిక్ పోస్టులు

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన భారత తీర రక్షక దళం.. కోస్ట్ గార్డ్ ఎన్‌రోల్డ్ పర్సనల్ టెస్ట్(సీజీఈపీటీ)-01/2025 బ్యాచ్ ద్వారా నావిక్(జనరల్ డ్యూటీ), యాంత్రిక్ పోస్టుల భర్తీకి పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 320

పోస్టుల వివరాలు

» నావిక్(జనరల్ డ్యూటీ): 260 (రీజియన్/జోన్ వారీ ఖాళీలు: నార్త్–77, వెస్ట్–66, నార్త్ ఈస్ట్–68, ఈస్ట్–34, నార్త్ వెస్ట్–12, అండమాన్–నికోబార్–03.
» యాంత్రిక్(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్): 60.
» అర్హత: నావిక్ పోస్టులకు 12వ తరగతి(మ్యాథ్స్/ఫిజిక్స్), యాంత్రిక్ పోస్టులకు పదో తరగతి లేదా 12వ తరగతితో పాటు సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 18 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. 01.03.2003 నుంచి 28.02.2007 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.
» వేతనం: నెలకు నావిక్ పోస్టులకు రూ.21,700; యాంత్రిక్ పోస్టులకు రూ.29,200.
» ఎంపిక విధానం: స్టేజ్–1, స్టేజ్–2, స్టేజ్–3, స్టేజ్–4 పరీక్షలు, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 13.06.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 03.07.2024.
» పరీక్ష తేదీలు/ఈ-అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: స్టేజ్–1: సెప్టెంబర్ 2024; స్టేజ్–2: నవంబర్ 2024; స్టేజ్–3: ఏప్రిల్ 2024.
» వెబ్‌సైట్: https://joinindiancoastguard.cdac.in/cgept

శ్రీ కొండా లక్ష్మణ్ యూనివర్శిటీలో హార్టికల్చర్ డిప్లొమ కోర్సుల్లో ప్రవేశాలు

సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్‌యూనివర్శిటీ 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల హార్టికల్చర్ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ పాలిటెక్నిక్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో 60 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 40 శాతం సీట్లను పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయించారు.

కోర్సు.. డిప్లొమా ఇన్ హార్టికల్చర్ (ఇంగ్లిష్ మీడియం)

» సీట్లు: యూనివర్శిటీ పాలిటెక్నిక్‌లు–120,అనుబంధ పాలిటెక్నిక్‌లు–200.
» అర్హత: పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. లేదా ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ పాలిసెట్–2024 ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 31.12.2024 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: పాలిసెట్–2024 ర్యాంక్, పదో తరగతి మార్కుల ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» దరఖాస్తు ఫీజు: ఇతరులకు రూ.1100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.600.
» దరఖాస్తు ప్రారంభతేది: 15.06.2024.
» దరఖాస్తులకు చివరితేది: 15.07.2024.
» వెబ్‌సైట్: www.skltshu.ac.in

నీట్ కౌన్సెలింగ్.. ఇలా!

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-అండర్ గ్రాడ్యుయేట్.. సంక్షిప్తంగా నీట్-యూజీ! దేశ వ్యాప్తంగా.. ఎంబీబీఎస్, బీడీఎస్‌తోపాటు ఆయుష్ వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష! కొద్దిరోజుల క్రితమే నీట్ యూజీ-2024 ఫలితాలు వెల్లడయ్యాయి. మరోవైపు ఈ పరీక్షపై వివాదం కొనసాగుతున్నా.. నీట్ కౌన్సెలింగ్‌కు సన్నాహాలు మొదలయ్యాయనే వార్తలు! ఈ నేపథ్యంలో నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఎలా ఉంటుంది.. ఆల్ ఇండియా కోటా, స్టేట్ కోటా సీట్ల భర్తీ విధానం.. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి సీట్ల భర్తీ తీరు, నీట్ ర్యాంకర్లు కౌన్సెలింగ్‌కు సిద్ధం చేసుకోవాల్సిన పత్రాలు తదితర అంశాలపై విశ్లేషణ..

» త్వరలో నీట్ యూజీ-2024 కౌన్సెలింగ్
» ర్యాంకు ఆధారంగా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీ
» డీజీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్
» రాష్ట్ర స్థాయిలో హెల్త్ యూనివర్సిటీల నేతృత్వంలో కౌన్సెలింగ్
» ఆయుష్ కోర్సులకు ప్రత్యేక కౌన్సెలింగ్


నీట్ యూజీ 2024

'నీట్ యూజీ–2024 ఫలితాలపై ఆందోళనలు జరుగుతున్నా.. మళ్లీ పరీక్ష నిర్వహించే అవకాశాలు తక్కువే. కాబట్టి నీట్ ఉత్తీర్ణులు ఫలితాలపై వస్తున్న వార్తల జోలికి వెళ్లకుండా.. కౌన్సెలింగ్‌కు సిద్ధమవ్వాలి' అంటున్నారు నిపుణులు.

పెరుగుతున్న సీట్లు

- నేషనల్ మెడికల్ కమిషన్ గణాంకాల ప్రకారం–దేశ వ్యాప్తంగా మొత్తం 783 ఎంబీబీఎస్ కళాశాలల్లో 1,61,220 సీట్లు ఉన్నాయి. వీటిలో 331 ప్రైవేట్ కళాశాలలు, డీమ్డ్ యూనివర్సిటీలు ఉండగా.. అందుబాటులో ఉన్న సీట్ల సంఖ్య 74,703. అదేవిధంగా నీట్ స్కోర్‌తోనే భర్తీ చేసే బీడీఎస్ కోర్సులో 28,088 సీట్లు, ఆయుష్ కోర్సుల్లో 52,720 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో.. ప్రస్తుతం 16 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2,935 ఎంబీబీఎస్ సీట్లు; మరో 16 ప్రైవేట్ కళాశాలల్లో 2,850 సీట్లు ఉన్నాయి. రెండు మైనారిటీ కళాశాలల్లో 300 సీట్లు; స్వయం ప్రతిపత్తి కలిగిన శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో 175 సీట్లు ఉన్నాయి. బీడీఎస్‌కు సంబంధించి.. రెండు ప్రభుత్వ డెంటల్ కళాశాలల్లో 140 సీట్లు; 14 ప్రైవేట్ కళాశాలల్లో 1,300 సీట్లు చొప్పున ఉన్నాయి.
- తెలంగాణ రాష్ట్రంలో.. ఎంబీబీఎస్‌కు సంబంధించి 27 ప్రభుత్వ కళాశాలల్లో 3,790 సీట్లు; 29 ప్రైవేట్, మైనారిటీ కళాశాల్లో 4,700 సీట్లు ఉన్నాయి. బీడీఎస్‌కు సంబంధించి ఒక ప్రభుత్వ కళాశాలలో 100 సీట్లు; పది ప్రైవేట్ కళాశాలల్లో 1,000 సీట్లు; వీటికి అదనంగా సికింద్రాబాద్ ఆర్మీ డెంటల్ కళాశాలలో ఆరు సీట్లు ఉన్నాయి.

పేరున్న కళాశాలలో సీటు

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లను పరిగణనలోకి తీసుకుంటే.. ఆల్ ఇండియా స్థాయిలో రిజర్వ్‌డ్ కేటగిరీలో రెండు లక్షల వరకు ర్యాంకు వరకూ సీట్లు పొందే అవకాశముందని అంచనా. పేరున్న ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు సొంతం చేసుకోవాలంటే మాత్రం జాతీయ స్థాయిలో 40 వేల లోపు ర్యాంకుతోనే సాధ్యమని చెబుతున్నారు.

కౌన్సెలింగ్.. ఏఐక్యూ, స్టేట్ కోటా

నీట్ యూజీ కౌన్సెలింగ్‌ను రెండు విధానాల్లో నిర్వహించి సీట్ల భర్తీ చేపడతారు. అవి.. ఆల్ ఇండియా కోటా, స్టేట్ కోటా. ఆల్ ఇండియా కోటా సీట్ల భర్తీని డీజీహెచ్‌ఎస్‌కు చెందిన మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ నిర్వహిస్తుంది. రాష్ట్ర కోటాకు సంబంధించి.. రాష్ట్రాల వైద్య విశ్వ విద్యాలయాలు కౌన్సెలింగ్ నిర్వహిస్తాయి.

ఆల్ ఇండియా కోటా

జాతీయ స్థాయిలోని మెడికల్ కళాశాలలను నేషనల్ పూల్‌లోకి తీసుకెళ్లినప్పటి నుంచి ఆల్ ఇండియా కోటా పేరుతో కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ విధానం ప్రకారం.. జాతీయ స్థాయిలోని అన్ని మెడికల్, డెంటల్ కళాశాలలు, యూనివర్సిటీల్లోని 15 శాతం సీట్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. దీనిని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని డీజీహెచ్‌ఎస్‌కు చెందిన మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ చేపడుతుంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు తప్పనిసరిగా ఎంసీసీ నిర్వహించే కౌన్సెలింగ్‌కు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. ఆల్ ఇండియా కోటా విధానంలో ఒక రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు ఇతర రాష్ట్రాల్లోని వైద్య కళాశాలలకు కూడా పోటీ పడే అవకాశం లభిస్తుంది.

స్టేట్ కోటా కౌన్సెలింగ్

జాతీయ స్థాయిలో ఎంసీసీ కేవలం 15 శాతం సీట్లకే కౌన్సెలింగ్ నిర్వహిస్తుంది. మిగతా 85 సీట్లను ఆయా రాష్ట్రాలు సొంతంగా కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేస్తాయి. ప్రభుత్వ కళాశాలల్లోని 85 శాతం సీట్లు(ఆల్ ఇండియా కోటాకు కేటాయించాక మిగిలిన సీట్లు), ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటా పేరుతో అందుబాటులో ఉండే 50 శాతం సీట్లను.. అదే విధంగా ప్రైవేట్ కళాశాలల్లో ప్రైవేట్–బి పేరిట ఉండే 35 శాతం సీట్లు, ఎన్ఆర్ఐ కోటాగా పిలిచే 15 శాతం సీట్లను కూడా హెల్త్ యూనివర్సిటీలే కౌన్సెలింగ్ విధానంలో భర్తీ చేస్తాయి. ఇందుకోసం ప్రత్యేకంగా నోటిఫికేషన్ విడుదల చేస్తాయి. మైనారిటీ కళాశాలల్లో అందుబాటులో ఉండే సీట్లను కూడా ఆయా వర్గాలకు చెందిన విద్యార్థులతోనే భర్తీ చేస్తారు. ఈ ప్రక్రియను కూడా హెల్త్ యూనివర్సిటీలే చేపడతాయి.

ఫీజులు ఇలా

- ఏపీలో ప్రభుత్వ కళాశాలలు, ప్రైవేట్ కళాశాలల్లో కేటగిరీ–ఎ పేరిట ఉండే కన్వీనర్ కోటాలో రూ.15 వేలు ఫీజుగా నిర్ధారించారు. ప్రైవేట్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా కేటగిరీ–బి సీటుకు రూ.12 లక్షలు; పైవేట్ కళాశాలల్లో ఎన్ఆర్ఐ కోటా(కేటగిరీ–సి) సీట్లకు: రూ.36 లక్షలుగా పేర్కొన్నారు. బీడీఎస్ కోర్సుకు సంబంధించి ప్రభుత్వ కళాశాలలు, ప్రైవేట్ కళాశాలల్లో కేటగిరీ–ఎ కన్వీనర్ కోటా సీట్లకు ఫీజు రూ.13 వేలు; ప్రైవేట్ కళాశాలల్లోని కేటగిరీ–బి మేనేజ్‌మెంట్ సీట్లకు రూ.4 లక్షలు, ఎన్ఆర్ఐ కోటా సీట్లకు రూ.12 లక్షలు వార్షిక ఫీజుగా ఉంది.
- తెలంగాణలో ప్రభుత్వ కళాశాలల్లో సీటుకు రూ.10 వేలు; ప్రైవేట్ కళాశాలల్లో కన్వీనర్ కోటా సీటుకు రూ.60 వేలు; ప్రైవేట్ కళాశాలల్లో బి–కేటగిరీ(మేనేజ్‌మెంట్ కోటా) సీటుకు రూ.11.55 లక్షలు–రూ.13 లక్షలుగా ఫీజు ఉంది. అదే విధంగా.. ప్రైవేట్ కళాశాలల్లో ఎన్ఆర్ఐ కోటా(సి–కేటగిరీ) సీటు ఫీజు బి కేటగిరీ సీటుకు రెండు రెట్లుగా ఉంది. బీడీఎస్ కోర్సులో.. ప్రభుత్వ కళాశాలల్లో రూ.10 వేలు; ప్రైవేట్ కళాశాలల్లో ఎ–కేటగిరీ(కన్వీనర్ కోటా) సీట్లు: రూ.45 వేలు; ప్రైవేట్ కళాశాలల్లో బి–కేటగిరీ(మేనేజ్‌మెంట్ కోటా) సీట్లు: రూ.4.2 లక్షలు – రూ.5 లక్షలు చొప్పున ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల్లో సి–కేటగిరీ(ఎన్ఆర్ఐ కోటా) సీటుకు బి కేటగిరీ సీటుకు 1.25 రెట్లు సమానమైన మొత్తం ఫీజుగా ఉంది.
- ఈ ఫీజుల వివరాలు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించినవిగా గుర్తించాలి. కౌన్సెలింగ్ సమయానికి వీటిలో మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉంది.

ఏఐక్యూ.. కౌన్సెలింగ్ విధానమిదే

- విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు ఇప్పటి నుంచే సంసిద్ధంగా ఉండాలి. జాతీయ స్థాయిలోని సీట్లకు పోటీ పడాలనుకునే విద్యార్థులు.. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ నిర్వహించే ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. ఇందుకోసం ఎంసీసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండే క్యాండిడేట్ రిజిస్ట్రేషన్ ఆప్షన్‌ను క్లిక్ చేసి.. ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకుని లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. అనంతరం ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఉండే అన్ని వివరాలను నమోదు చేయాలి.
- ఆ తర్వాత అందుబాటులో ఉన్న కళాశాలలు, సీట్ల వివరాలు కనిపిస్తాయి. వాటికి అనుగుణంగా తమ ప్రాథమ్యాలను పేర్కొంటూ.. ఆన్‌లైన్ ఛాయిస్ ఫిల్లింగ్ పూర్తి చేయాలి. ఆ తర్వాత రౌండ్ల వారీగా సీట్ అలాట్‌మెంట్ వివరాలను వెల్లడిస్తారు.
- తొలి రౌండ్‌లో సీట్ అలాట్‌మెంట్ పొందిన అభ్యర్థులు సదరు కళాశాలలో చేరాలనుకుంటే.. నిర్దేశిత మొత్తాన్ని రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది.
- తొలి రౌండ్‌లో సీటు వచ్చిన కళాశాలలో చేరడం ఇష్టం లేకుంటే.. ఫ్రీ ఎగ్జిట్ అవకాశం అందుబాటులో ఉంది. వీరు రెండో రౌండ్ కౌన్సెలింగ్‌కు హాజరవ్వచ్చు.
- తొలి రౌండ్ కౌన్సెలింగ్‌లోనే సీటు లభించి ఫీజు చెల్లించిన అభ్యర్థులు మరింత మెరుగైన సీటు కోసం తదుపరి రౌండ్‌కు హాజరయ్యే అవకాశం కూడా ఉంది.

స్టేట్ కోటాకు ప్రత్యేక కౌన్సెలింగ్

రాష్ట్రాల స్థాయిలో హెల్త్ యూనివర్సిటీలు నిర్వహించే స్టేట్ కోటా సీట్ల కౌన్సెలింగ్‌కు విద్యార్థులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. ఎంసీసీ కౌన్సెలింగ్ తొలి రౌండ్ ముగిసిన తర్వాత హెల్త్ యూనివర్సిటీలు ప్రత్యేకంగా నోటిఫికేషన్ విడుదల చేస్తాయి. ఈ కౌన్సెలింగ్ కూడా పలు రౌండ్లలో జరుగుతుంది. స్టేట్ కోటాకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించి వారికి వచ్చిన ఆల్ ఇండియా ర్యాంకు ఆధారంగా ముందుగా ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను ప్రకటిస్తారు. ఈ మెరిట్ లిస్ట్‌లో చోటు సాధించిన అభ్యర్థులు నిర్దేశిత రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించి.. ఆన్‌లైన్‌లో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది. తదుపరి రౌండ్ల కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అవకాశం కూడా ఉంటుంది.

పూర్తిగా ఆన్‌లైన్

హెల్త్ యూనివర్సిటీలు నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది. అభ్యర్థులు నోటిఫికేషన్ వెలువడిన తర్వాత నిర్దేశించిన వెబ్‌సైట్‌లో లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవడం, ఆ తర్వాత నీట్ ర్యాంకు సహా, ఇంటర్మీడియెట్ వరకూ.. అన్ని అర్హతల వివరాలను పేర్కొనడం, ఆన్‌లైన్ ఛాయిస్ ఫిల్లింగ్ తప్పనిసరి.

ప్రభుత్వ కళాశాలలకే ప్రాధాన్యం

నీట్‌లో ఉత్తీర్ణత సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులు ప్రభుత్వ కళాశాలలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏఎంసీ–విశాఖపట్నం, జీఎంసీ–గుంటూరు, కాకినాడ మెడికల్ కాలేజ్, కర్నూలు మెడికల్ కళాశాలలు ముందు వరుసలో నిలుస్తున్నాయి. తెలంగాణలో.. ర్యాంకర్ల తొలి ప్రాధాన్యం ఉస్మానియా మెడికల్ కళాశాల కాగా ఆ తర్వాత స్థానంలో గాంధీ మెడికల్ కళాశాల, కాకతీయ మెడికల్ కళాశాల, ఈఎస్ఐ మెడికల్ కళాశాల నిలుస్తున్నాయి.

ఈ సర్టిఫికెట్లు సిద్ధంగా

నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియ మరికొద్ది రోజుల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కాబట్టి విద్యార్థులు ఇప్పటి నుంచే కౌన్సెలింగ్‌కు అవసరమైన పత్రాలు, సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోవాలి. అవి.. నీట్ ఎంట్రన్స్ అడ్మిట్ కార్డ్, నీట్ ర్యాంక్ కార్డ్, పుట్టిన తేదీ ధ్రువపత్రం, పదో తరగతి సర్టిఫికెట్, ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు మార్క్స్ షీట్, సర్టిఫికెట్, ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు స్టడీ సర్టిఫికెట్స్(స్థానికతను నిర్ధారించేందుకు), పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోగ్రాఫ్స్ ఎనిమిది. ఇలా కౌన్సెలింగ్ విధానంతోపాటు అవసరమైన అన్ని సర్టిఫికెట్లను సిద్ధంగా ఉంచుకుంటే.. కౌన్సెలింగ్ ఎప్పుడు జరిగినా తడబాటులేకుండా ముందుకు సాగే అవకాశం ఉంటుంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
269	66
77,210	23,501

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	17,689	▽	32
డోజోన్స్	39,150	△	16
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,238	▽	35
డాక్స్	18,164	▽	91
షాంఘై	2,998	▽	7
నికాయ్	38,596	▽	37

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.19	84.21
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.69	107.24
€	యూరో	ఎస్‌బీఐ	88.51	90.89
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.10	53.24
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.83	56.77
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.33	64.02
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.38	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.86	23.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.46

గ్రాట్యుటీ.. ఉద్యోగి సేవలకు గుర్తింపు!



- ఒక సంస్థలో ఐదేళ్ల సర్వీస్‌తో అర్హత
- కొన్ని కేటగిరీలకు భిన్నమైన నిబంధనలు
- సకాలంలో చెల్లించకపోతే వడ్డీ సైతం..
- ఎంతొస్తుందన్న దానిపై అవగాహన అవసరం

ప్రైవేటు రంగంలో ప్రతి ఒక్కరికీ ఉద్యోగ భద్రత ఉంటుందని చెప్పలేం. అదే సమయంలో ఉద్యోగి తన వ్యక్తిగత, వృత్తిపరమైన అవసరాల దృష్ట్యా ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మారిపోవడం సహజంగా చూస్తుంటాం. కారణాలు ఏవైనా కానీ ఉద్యోగం వీడితే వచ్చే ప్రయోజనాల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి. ఉద్యోగం నుంచి వైదొలగినప్పుడు వచ్చే ప్రయోజనాల్లో గ్రాట్యుటీ కీలకమైనది. ఉద్యోగి పనిచేసిన కాలంపై ఇది ఆధారపడి ఉంటుంది. గ్రాట్యుటీ చెల్లింపుల చట్టం 1972 ఇందుకు ప్రామాణికం. చట్టంలోని నిబంధనలపై అవగాహన కల్పించే కథనమే ఇది.




గ్రాట్యుటీ అంటే..?

ఉద్యోగి సేవలను గుర్తిస్తూ సంస్థ అందించే ఆర్థిక ప్రయోజనమే గ్యాట్యుటీ. ఎన్నో ఏళ్లుగా సంస్థ అభ్యున్నతి కోసం సేవలు అందించే ఉద్యోగుల పట్ల చూపించే కృతజ్ఞత. ఇది వేతనంలో భాగం కాదు. ప్రతి ఒక్కరూ దీనికి అర్హులే. కానీ, ఇందుకు అర్హత సాధించాలంటే గ్రాట్యుటీ చెల్లింపుల చట్టం, 1972లో నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగి సేవలు ఉండాలి. కనీసం ఐదేళ్ల సర్వీస్ (పని చేసిన కాలం) పూర్తి చేసుకున్న వారికే దీన్ని పొందే అర్హత లభిస్తుంది. ఎన్నో రంగాలకు ఈ చట్టం అమలవుతోంది. ప్రభుత్వ విభాగాలు, డిఫెన్స్, స్థానిక సంస్థల ఉద్యోగులు, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు దీని పరిధిలోకి వస్తారు.

ఎన్నేళ్లు పనిచేయాలి?

గడిచిన ఏడాది కాలం పాటు కనీసం 10 మంది ఉద్యోగులు కలిగిన సంస్థలకు గ్రాట్యుటీ చెల్లింపుల చట్టం వర్తిస్తుంది. ఆయా సంస్థలు తమ ఉద్యోగులకు నిబంధనలకు అనుగుణంగా గ్రాట్యుటీని అందించాల్సి ఉంటుంది. మైనింగ్ విధుల్లో ఉన్న ఉద్యోగులకు కనీసం 190 పని దినాలు, నాన్ మైనింగ్ విధుల్లోని వారికి 240 పనిదినాలు ఏడాది కింద పరిగణిస్తారు. కనీసం ఐదేళ్ల పాటు అంతరాయం లేకుండా సేవలు అందించిన ఉద్యోగులు అందరూ గ్రాట్యుటీకి అర్హులు. సమ్మెలు, లాకౌట్‌లు, ప్రమాదాలు, సెలవులు, తాత్కాలిక తొలగింపు వల్ల గైర్హాజరుకు మినహాయింపులు ఉంటాయి. ఐదేళ్ల సర్వీస్ పూర్తి కాకముందే సంస్థ తొలగించిన సందర్భంలోనూ ఉద్యోగికి గ్రాట్యుటీ చెల్లించాల్సిందే. వారంలో ఆరు పనిదినాలు అమలు చేసే కంపెనీల్లో 4 ఏళ్ల 240 రోజులు పనిచేసినా గ్రాట్యుటీకి అర్హత లభిస్తుంది. వారంలో ఐదు రోజుల పనిదినాలున్న కంపెనీల్లోని వారు 4 ఏళ్ల 190 రోజులు పనిచేస్తే అర్హులు. కొన్ని రంగాల్లోని వారికి ఈ కనీస పదవీ కాలం భిన్నంగా ఉంటుంది. న్యూస్ పేపర్ ఎంప్లాయీస్ అండ్ మిస్‌లేనియస్ ప్రొవిజన్స్ యాక్ట్ కింద పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులకు పదేళ్ల సర్వీస్ ఉంటేనే గ్రాట్యుటీకి అర్హత లభిస్తుంది. ఉద్యోగి మరణించినా లేదా వైకల్యం కారణంగా విధుల నుంచి తొలగించినప్పుడు పనిచేసిన కాలంతో సంబంధం లేకుండా గ్రాట్యుటీ చెల్లించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. గ్రాట్యుటీ అనేది కేవలం పదవీ విరమణ వయసుకు వచ్చినప్పుడే కాకుండా.. స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నప్పుడు, ఉద్యోగి తప్పిదం లేకుండా తొలగించినప్పుడు, రాజీనామా చేసినప్పుడు ఇవ్వాల్సి ఉంటుందని లెక్స్‌లెవర్ సర్వీసెస్ డైరెక్టర్ హర్షిత అగర్వాల్ శర్మ తెలిపారు.





ఇవి తెలుసుకోవాలి..

- పనిచేసిన కాలం ఆరు నెలలు దాటి ఒక్క రోజు ఉన్నా దాన్ని పూర్తి సంవత్సరం కింద గ్రాట్యుటీ చెల్లింపులకు పరిగణనలోకి తీసుకుంటారు.
- ఉద్యోగి దుష్ప్రవర్తన కారణంగా సంస్థ తొలగించినప్పుడు గ్రాట్యుటీ ఇవ్వక్కర్లేదు.
- ఉద్యోగి మరణించిన సందర్భాల్లో నామినీ లేదా వారసులకు గ్రాట్యుటీ చెల్లిస్తారు.
- సంస్థలు దివాలా తీసినప్పటికీ గ్రాట్యుటీ చెల్లించాల్సిన బాధ్యత వాటిపై ఉంటుంది.
- నోటీస్ పీరియడ్ కూడా గ్రాట్యుటీ లెక్కింపు పరిధిలోకి వస్తుంది.
- మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకుంటే గ్రాట్యుటీకి అర్హత కల్పించాలన్న డిమాండ్ కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో ఉంది.

పరిమితి

గ్రాట్యుటీ గరిష్ట పరిమితి రూ.20 లక్షలు. నిబంధనల ప్రకారం సంస్థలు గరిష్టంగా ఇంతకు మించి ఇవ్వక్కర్లేదు. రూ.20లక్షలు మించితే అది ఎక్స్‌గ్రేషియా కిందకు వస్తుంది. ఎక్స్‌గ్రేషియా ఎంత ఇవ్వాలన్నది సంస్థల అభీష్టమే. ఇంత మేర ఇవ్వాలని నిబంధనలు చెప్పడం లేదు.

గ్రాట్యుటీ లెక్కింపు

చివరి నెల వేతనంలో మూల వేతనం, డీఏ ఎంతో తెలుసుకోవాలి. ఇలా ఒక ఏడాదికి 15 రోజుల వేతనం గ్రాట్యుటీ కింద వస్తుంది. మొత్తం పనిచేసిన సంవత్సరాలు ఇంటూ 15 రోజులు ఇంటూ చివరిగా అందుకున్న మూల వేతనం, డీఏ డివైడ్ 26(నెలలో పనిచేసిన రోజులు) సూత్రం అమలవుతుంది. ఆరు నెలలు దాటిన కాలాన్ని పూర్తి ఏడాదిగా పరిగణిస్తారు. ఉదాహరణకు ఎక్స్ అనే వ్యక్తి 12 సంవత్సరాల పాటు ఒక కంపెనీలో పనిచేసినట్టు అనుకుందాం. చివరిగా అందుకున్న మూల వేతనం, డీఏ కలిపి రూ.75,000. దీంతో ఎక్స్‌కు వచ్చే మొత్తం గ్రాట్యుటీ రూ.5,19,230. గ్రాట్యుటీ చట్టం పరిధిలోకి రాని వారికి ఇచ్చే గ్రాట్యుటీ ఫార్ములా కొంత భిన్నం. ఏడాదిలో 15 రోజులు ఇంటూ చివరి నెలలో మూల వేతనం, డీఏ ఇంటూ పనిచేసిన సంవత్సరాలు డివైడ్ 30(నెలలో పనిచేసిన రోజులు). పూర్తి ఏడాది పాటు పనిచేసిన కాలాన్నే వీరికి ఏడాది కింద పరిగణిస్తారు. దీని ప్రకారం ఎక్స్ అనే వ్యక్తి ఒక సంస్థలో 12 ఏళ్ల పనిచేసి, చివరి నెలలో మూలవేతనం, డీఏ కింద రూ.75,000 తీసుకున్నారని అనుకుంటే.. వచ్చే గ్రాట్యుటీ రూ.4,50,000.

ఆలస్యం అయితే



విధుల నుంచి వైదొలగిన 30 రోజుల్లోపు గ్రాట్యుటీ చెల్లించాలి. ఇంతకుమించి జాప్యం చేస్తే ఆ మొత్తంపై వడ్డీ కూడా చెల్లించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఉద్యోగికి గ్రాట్యుటీ ప్రయోజనం అన్నది పనిచేసిన కాలం ఆధారంగానే అర్హత ఉండాలి కానీ, రిటైర్మెంట్ వయసు ఆధారం కాకూడదని ఇటీవలే అలహాబాద్ హైకోర్టు తీర్పునిచ్చింది. ''60 ఏళ్లకు రిటైర్మెంట్ తీసుకుంటేనే గ్రాట్యుటీ, లేకపోతే అర్హత లేదన్నది సరైనది కాదు. ఒక ఉద్యోగి ఎన్ని సంవత్సరాల పాటు పనిచేశాడన్న దాని ఆధారంగా గ్రాట్యుటీ హక్కు లభిస్తుంది''అని అలహాబాద్ సింగిల్ జడ్జి ధర్మాసనం ఓ కేసులో భాగంగా తీర్పు జారీ చేసింది.

పన్ను బాధ్యత

గ్రాట్యుటీపై పన్ను విషయంలో ప్రభుత్వ లేదా ప్రైవేటు రంగ ఉద్యోగులకు నిబంధనల్లో వ్యత్యాసం ఉంది. ప్రభుత్వ ఉద్యోగి ఎవరికైనా (కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థల) సరే గ్రాట్యుటీ ఎంత అందుకున్నా పన్ను లేదు. ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న వారికి రూ.20 లక్షలు లేదా, చివరి 15 రోజుల వేతనాన్ని పనిచేసిన సంతవ్సరాలతో హెచ్చించినప్పుడు వచ్చే మొత్తం, వాస్తవంగా అందుకున్న గ్రాట్యుటీ.. వీటిల్లో ఏది తక్కువ అయితే ఆ మొత్తానికి పన్ను మినహాయింపు ఉంటుంది. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 10(10) కిందకు గ్రాట్యుటీ వస్తుంది. గతంలో రూ.10 లక్షల వరకు గ్రాట్యుటీపై పన్ను ఉండేది కాదు. ఈ పరిమితిని మోదీ సర్కారు రూ.20 లక్షలకు పెంచింది.



ఎస్‌బీఐ నుంచి 400 కొత్త శాఖలు

బ్యాంక్ చైర్మన్ దినేష్ ఖరా

న్యూఢిల్లీ: దేశంలోనే దిగ్గజ బ్యాంక్ అయిన ఎస్‌బీఐ తన నెట్‌వర్క్ విస్తరణకు ప్రాధాన్యం ఇస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 400 శాఖలు తెరవనున్నట్టు సంస్థ చైర్మన్ దినేష్ ఖరా వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో (2023-24) ఎస్‌బీఐ 137 కొత్త శాఖలను ప్రారంభించడం గమనార్హం. ఇందులో 59 శాఖలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ''89 శాతం డిజిటల్, 98 శాతం లావాదేవీలు శాఖల వెలుపలే జరుగుతున్నప్పుడు ఇకమీదట శాఖల అవసరం ఉంటుందా? అని నన్ను ఒకరు ప్రశ్నించారు. ఇందుకు అవునన్నదే నా సమాధానం. కొత్త విభాగాలు అవతరిస్తున్నప్పుడు శాఖల అవసరం ఉంటుంది''అని దినేష్ ఖరా వివరించారు. అడ్వైజరీ (సలహాలు), పెట్టుబడుల సేవలను శాఖల ద్వారానే అందించగలమన్నారు. అవకాశాలున్న చోట శాఖలు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. 2024 మార్చి నాటికి ఎస్‌బీఐకి దేశవ్యాప్తంగా 22,542 శాఖలున్నాయి.



సరైన సమయంలో సబ్సిడరీల ఐపీవోలు


ఎస్‌బీఐ సబ్సిడరీ కంపెనీల్లో వాటాల విక్రయాన్ని సరైన సమయంలో చేపడతామని దినేష్ ఖరా వెల్లడించారు. సబ్సిడరీల కార్యకలాపాలు మరింత విస్తరించిన తర్వాతే దీన్ని పరిశీలిస్తామన్నారు. దీని వల్ల వాటి విలువ పెరిగి, ఎస్‌బీఐకి మెరుగైన రాబడులు వస్తాయన్నారు. క్యాపిటల్ మార్కెట్ (ఐపీవో) మార్గంలోనే వాటాల విక్రయం ఉంటుందన్నారు. ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ పేమెంట్ సర్వీసెస్ వాటాల విక్రయానికి అర్హత కలిగినవంటూ.. వీటికి సంబంధించి ప్రస్తుతానికి అయితే ఎలాంటి వాటాల విక్రయ ప్రతిపాదన లేదన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
24-6-2024	
విశాఖ	525-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	515-00
హైదరాబాద్	515-00
వరంగల్	517-00

క్వాంట్ ఫండ్ కార్యాలయాల్లో సెబీ సోదాలు

ముంబై: ఫ్రంట్ రన్నింగ్ కేసులను తీవ్రంగా పరిగణిస్తున్న మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా క్వాంట్ మ్యుచువల్ ఫండ్‌పై దృష్టి సారించింది. కంపెనీకి చెందిన హైదరాబాద్, ముంబై కార్యాలయాల్లో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ కేసుతో సంబంధమున్న డీలర్లు, వ్యక్తులను కూడా సెబీ ప్రశ్నించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సందీప్ టాండన్ నెలకొల్పిన క్వాంట్ మ్యుచువల్ ఫండ్ అసెట్లు 2019లో సుమారు రూ. 100 కోట్లుగా ఉండగా.. ప్రస్తుతం రూ. 90,000 కోట్ల పైచిలుకు చేరాయి. 26 స్కీములు, 54 లక్షల ఫోలియోలతో ఈ ఫండ్ ఈ ఏడాది జనవరిలోనే రూ. 50,000 కోట్ల మార్కును దాటింది. సంస్థకి చెందిన స్మాల్ క్యాప్ ఫండ్ గత అయిదేళ్లలో ఏకంగా 45 శాతం రాబడిని అందించింది. మే నెలలో స్మాల్ క్యాప్ ఫండ్ కేటగిరీలోకి వచ్చిన మొత్తం నిధులలో 43 శాతం నిధులు క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్‌లోకే రావడం గమనార్హం. పెద్ద ఆర్డర్లు రాబోతున్న సమాచారం తెలుసుకుని ఫండ్ మేనేజర్లు, డీలర్లు, బ్రోకర్లు ముందుగానే తమ సొంత ఖాతాల ద్వారా ఆయా షేర్లలో ట్రేడింగ్ చేసి లాభపడటాన్ని ఫ్రంట్ రన్నింగ్‌గా వ్యవహరిస్తారు. ఇలాంటి లావాదేవీలన్నీ వేరే వారి పేరిట ఉండే ఖాతాల ద్వారా జరుగుతాయి కాబట్టి అంతిమంగా లబ్ధి పొందే వ్యక్తులను గుర్తించడం కఠినతరంగా ఉంటోంది. దీంతో సెబీ కొన్నాళ్లుగా ఈ తరహా కేసులపై మరింత లోతుగా విచారణ జరుపుతోంది. ఇలాంటి ఆరోపణలపైనే యాక్సిస్ మ్యుచువల్ ఫండ్‌కి చెందిన ఫండ్ మేనేజర్ వీరేశ్ జోషితో పాటు అతనికి సంబంధించిన 20 సంస్థలు, వ్యక్తులపై సెబీ గతంలో చర్యలు తీసుకుంది.

కోటక్ స్పెషల్ ఆపర్చూనిటీస్ ఫండ్



కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కొత్తగా స్పెషల్ ఆపర్చూనిటీస్ ఫండ్‌ను (ఎస్‌వోఎఫ్) ఆవిష్కరించింది. ఈ ఎన్‌ఎఫ్‌వో జూన్ 24తో ముగుస్తుంది. కార్పొరేట్ రీస్ట్రక్చరింగ్, ప్రభుత్వ విధానాల్లో మార్పులు, టెక్నాలజీ మార్పులు వంటి ప్రత్యేక సందర్భాల నుంచి లబ్ధి పొందే కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెరుగైన రాబడులు అందించడం ఈ ఫండ్ లక్ష్యం. పరిశ్రమలో కన్సాలిడేషన్లు, మేనేజ్‌మెంట్ మార్పులు, విలీనాలు.. కొనుగోళ్ల వంటి పరిణామాలతో కంపెనీల పనితీరు ప్రభావితం అవుతుంటుంది. అలాంటి పరిస్థితుల్లో సానుకూల ప్రభావాలు ఉండే కంపెనీల్లో పెట్టే పెట్టుబడులతో మదుపరులకు అధిక లబ్ధి చేకూర్చాలనేది ఈ ఫండ్ లక్ష్యమని ఫండ్ మేనేజర్ సింఘాల్ తెలిపారు.

ఎస్‌జీబీల్లో సిప్ చేయొచ్చా?





ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



ఇన్వెస్టర్ మరణించిన సందర్భాల్లో ఎన్‌పీఎస్ పథకంలోని డబ్బులను వారసులు ఎలా పొందగలరు? ఈ మొత్తంపై పన్ను బాధ్యత ఉంటుందా?

– శరవణన్ గోపాలన్

ఇన్వెస్టర్ మరణించినట్టయితే నిధుల బదలాయింపు ఎలా అన్నది ఎన్‌పీఎస్ చట్టంలోని నిబంధనల్లో స్పష్టంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు అయితే.. ఎన్‌పీఎస్‌లో ఫండ్ (నిధి) రూ.5 లక్షల వరకే ఉంటే నామినీ లేదంటే చట్టబద్ధమైన వారసులు ఒకే విడత ఈ మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. దీనిపై పన్ను ఉండదు. ఒకవేళ మరణించిన ఎన్‌పీఎస్ సభ్యుడు ప్రభుత్వ ఉద్యోగి అయి, ఫండ్ రూ.5లక్షలకు మించి ఉంటే.. అప్పుడు నామినీ లేదంటే చట్టబద్ధమైన వారసులు మొత్తం నిధిలో 80 శాతంతో యాన్యుటీ ప్లాన్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అంటే సభ్యుడి ఎన్‌పీఎస్ ఖాతాలో ఉన్న బ్యాలన్స్ నుంచి 20 శాతాన్నే వెనక్కి తీసుకోగలరు. ఈ మొత్తంపై పన్ను ఉండదు. మిగిలిన 80 శాతం నిధితో బీమా సంస్థ నుంచి యాన్యుటీ ప్లాన్ కొనుగోలు చేస్తే, దానిపై ప్రతి నెలా రాబడి వస్తుంది. ఇది పన్ను పరిధిలోకి వస్తుంది. ఒకవేళ ఎన్‌పీఎస్‌లో ప్రభుత్వ ఉద్యోగి కాని సభ్యుడు/సభ్యురాలు మరణించిన సందర్భంలో ఖాతాలో ఉన్న నిధి మొత్తాన్ని నామినీ లేదంటే వారసులు పూర్తిగా వెనక్కి తీసుకోవడానికి అనుమతిస్తారు. దీనిపై పన్ను కూడా లేదు. ప్రతి నెలా ఆదాయాన్నిచ్చే యాన్యుటీ ప్లాన్ తీసుకోవడం స్వచ్ఛందమే. కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించే 80 శాతం నిధితో యాన్యుటీ ప్లాన్ అన్నది నిర్బంధం. ఒకవేళ ఎన్‌పీఎస్‌లో 60 ఏళ్ల తర్వాత చేరిన సభ్యుడు/ సభ్యురాలు మరణించిన సందర్భాల్లో అందులో ఉన్న మొత్తం నిధిని నామినీ లేదంటే వారసులు వెనక్కి తీసుకోవచ్చు. క్లెయిమ్ కోసం సభ్యుడి డెత్ సర్టిఫికెట్‌ను పాయింట్ ఆఫ్ ప్రెజెన్స్ (పీవోపీ) కేంద్రం లేదా ఎన్‌పీఎస్ ట్రస్ట్‌కు సమర్పించాలి. పీవోపీ నుంచి లేదంటే ఎన్‌పీఎస్ వెబ్‌సైట్ నుంచి క్లెయిమ్ ఫారమ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అందులో వివరాలు నింపి ఇవ్వాల్సి ఉంటుంది. క్లెయిమ్ చేసే వారి సొంత కేవైసీ డాక్యుమెంట్లు సమర్పించాలి. బ్యాంక్ ఖాతా వివరాలు కూడా ఇవ్వాలి. వారసులు అయితే మరణించిన వ్యక్తితో సంబంధాన్ని నిరూపించే లీగల్ హేర్ సర్టిఫికెట్ సమర్పించాలి. నామినీ నమోదు చేయని సందర్భాల్లో వారసులకే నిధిపై హక్కు ఉంటుంది.

మ్యూచువల్ ఫండ్స్ మాదిరే సావరీన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీలు)లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో పెట్టుబడులు పెట్టుకోవచ్చా?

– శ్రీకళ

ఎస్‌జీబీల్లో సిప్‌కు అవకాశం లేదు. కావాలంటే క్రమానుగతంతో స్టాక్ మార్కెట్లో ఈ బాండ్లను (వేరొకరు విక్రయించిన సందర్భాల్లో) కొనుగోలు చేసుకోవచ్చు. అలాగే, ప్రభుత్వం విడుదల చేసిన ప్రతి సిరీస్‌లోనూ ఎస్‌బీబీల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం ఒక మార్గం. ప్రతి ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం నాలుగు పర్యాయాలు ఎస్‌జీబీలను జారీ చేస్తుంటుంది. ఆ సమయంలో నేరుగా వాటిల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ప్రతి నెలా కొనుగోలు చేసుకోవాలనుకునే వారికి స్టాక్ మార్కెట్ ఒక్కటే మార్గం. స్టాక్ మార్కెట్లో కొనుగోలు చేసినప్పటికీ.. కాల వ్యవధి ముగిసే వరకు ఆ పెట్టుబడిని కొనసాగిస్తే లాభంపై పన్ను ఉండదు. అలాగే ఎస్‌జీబీ జారీ ధరపై ఏటా 2.5 శాతం చొప్పున వడ్డీ రాబడిని ఆరు నెలలకు ఒకసారి అందుకోవడానికి అర్హులే.

స్టాక్స్ వ్యూ

యథార్థ్ హాస్పిటల్స్	చాయిస్ బ్రోకింగ్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 419 టార్గెట్: రూ. 525

ఎందుకంటే: ప్రయివేట్ రంగ సంస్థ యథార్థ్ హాస్పిటల్ అండ్ ట్రామా కేర్ సర్వీసెస్ ఆర్థిక ఫలితాలకు సంబంధించి వివిధ కీలక అంశాలలో పటిష్ట పనితీరు చూపుతోంది. గతేడాది(2023-24) చివరి క్వార్టర్‌లో వార్షికంగా కన్సాలిడేటెడ్ ఆదాయంలో దాదాపు 24 శాతం వృద్ధిని అందుకుంది. క్యూ4(జనవరి-మార్చి)లో తొలిసారి రూ. 1,780 కోట్ల ఆదాయం సాధించింది. నిర్వహణ లాభం(ఇబిటా) సైతం 21 శాతం పురోగతిని చూపింది. అయితే మార్జిన్లు స్వల్పంగా 0.58 శాతం క్షీణించి 26.2 శాతానికి చేరాయి. నికర లాభం వార్షికంగా 122 శాతం దూసుకెళ్లగా.. త్రైమాసిక వారీగా సైతం 30 శాతం ఎగసి రూ. 384 కోట్లను తాకింది. ప్రధానంగా పన్ను రేటు తగ్గడం సానుకూల ప్రభావాన్ని చూపింది. ప్రస్తుతం చేపట్టిన స్పెషాలిటీ సర్వీసుల పెంపు(మిక్స్), రానున్న మూడేళ్లలో పడకల సామర్థ్యాన్ని రెట్టింపు చేయనుండటం వంటి అంశాలు భవిష్యత్ వృద్ధికి తోడ్పాడునివ్వనున్నాయి. అంతేకాకుండా ఇతర సంస్థల కొనుగోళ్ల ద్వారా పడకలను(బెడ్స్) పెంచుకునే వ్యూహాలు, అంతర్జాతీయ పేషెంట్ల వాటా పెరుగుతుండటం, నగదు ద్వారా చెల్లింపులకు ప్రాధాన్యత ఇవ్వడం తదితర ప్రణాళికలు అమలు చేస్తోంది. వెరసి రానున్న రెండు, మూడేళ్లలో కనీసం 200 పడకల సామర్థ్యంగల ఒక సంస్థనైనా చేజిక్కించుకునే లక్ష్యంతో ఉంది. ఇందుకు కేంద్రపాలిత ప్రాంతం(ఎన్‌సీఆర్) మినహా ఉత్తరాది మార్కెట్‌పై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా ఒక్కో బెడ్ కొనుగోలుకీ సగటున రూ. 65-70 లక్షల చొప్పున వెచ్చించే అవకాశముంది. 2024-26 కాలంలో ఆదాయం 26 శాతం, ఇబిటా, నికర లాభం 27 శాతం చొప్పున వృద్ధి చెందవచ్చని అంచనా.



జేకే టైర్	ఐసీఐసీఐ డైరెక్ట్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 398 టార్గెట్: రూ. 525

ఎందుకంటే: టైర్ల తయారీ కంపెనీ జేకే టైర్ అండ్ ఇండస్ట్రీస్ బ్యాలన్స్‌షీట్ అధిక రుణాలను కలిగి ఉంది. దేశీయంగా టైర్ల తయారీ రంగంలో రుణ సౌకర్యాలను కంపెనీ అధికంగా వినియోగిస్తోంది. 2019-20 ఆర్థిక సంవత్సరానికల్లా రూ. 5,400 కోట్ల నికర రుణ భారాన్ని మోస్తోంది. దీంతో నికర రుణాలు, ఈక్విటీ నిష్పత్తి 2.2 రెట్లుగా నమోదైంది. అయితే లాభదాయకత పుంజుకోవడం, నగదు ఆర్జన(క్యాష్‌ఫ్లో జనరేషన్)పై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా రుణాల తిరిగి చెల్లింపులను చేపడుతూ వచ్చింది. సమయానుగుణంగా ఈక్విటీ పెట్టుబడులకూ తెరతీసింది. వెరసి గతేడాది(2023-24)కల్లా నికర రుణ భారం రూ. 3,700 కోట్లకు దిగివచ్చింది. టైర్ల తయారీ కంపెనీల ముడిసరుకు వ్యయాలలో ప్రధానంగా రబ్బర్, ముడిచమురు డెరివేటివ్స్ అధిక వాటాను ఆక్రమిస్తాయి. దీంతో గత కొన్నేళ్లుగా దేశీ టైర్ల పరిశ్రమలో మార్జిన్లు హెచ్చుతగ్గులకు లోనవుతూ వచ్చాయి. ఫలితంగా ముడిసరుకుల ధరలు తగ్గినప్పుడు మెరుగుపడటం, ముడి వ్యయాలు పెరిగినప్పుడు మార్జిన్లు నీరసించడం వంటి ఆటుపోట్లను చవిచూస్తున్నాయి. దీనికితోడు సెకండరీ(ఆఫ్టర్) మార్కెట్లో తీవ్ర పోటీ కారణంగా టైర్ల కంపెనీల మార్జిన్లకు సవాళ్లు ఎదురవుతున్నాయి. అయితే ప్రస్తుతం టైర్ల పరిశ్రమ ప్రొడక్టుల ధరల విషయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ప్రస్తుతం జేకే టైర్ నికర రుణాలు, ఈక్విటీ నిష్పత్తి 0.8 రెట్లుకు దిగివచ్చింది. ఇది సానుకూల అంశం. మరోపక్క గతేడాది కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఆదాయాన్ని సాధించింది. ఇబిటా, నికర లాభం దాదాపు 14 శాతం ఎగశాయి. దీంతో ఆర్‌వోఈ, ఆర్‌వోసీఈ రెండంకెలకు అంటే 17 శాతానికి బలపడ్డాయి.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

క్లుప్తంగా...



చిరంజీవిని కలిసిన బండి సంజయ్

- ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని శాలువాతో సత్కరించిన చిరంజీవి
- మర్యాదపూర్వకంగానే కలిశానన్న బండి

సాక్షి, హైదరాబాద్‌: అగ్ర సినీ నటుడు, పద్మ భూ షణ్‌ చిరంజీవిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ కుమార్‌ కలుసుకున్నారు. ఆదివారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా సంజయ్‌ను చిరంజీవి సాదరంగా ఆహ్వానించి, శాలువాతో సన్మానించారు. ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని 'సంజయ్‌... మీరు ఎంతో కష్టపడి పైకొచ్చారు. మీరు మంత్రి కావడం చాలా ఆనందంగా ఉంది. మీ అగ్రెసివ్‌ మెంటాలిటీకి తగిన పోస్ట్‌ లభించింది'అని ప్రశంసించారు. ఇటీవల ప్రధాని మోదీ తమను దగ్గరకు తీసుకుని పలకరించడం మర్చిపోలేని అనుభూతిగా మిగిల్చిందని ఈ సందర్భంగా చిరంజీవి తెలిపారు. బండి స్పందిస్తూ 'నేను విద్యార్థి దశలో మీ సినిమాలకు అభిమానిని' అని పేర్కొన్నారు. ఏపీలో కూటమి మంచి ఫలితాలు సాధించిందని, ప్రజలకు మంచి పాలన అందిస్తారనే ఆశాభావాన్ని సంజయ్‌ వ్యక్తం చేశారు. అనంతరం ఇరువురు దేశ, రాష్ట్ర రాజకీయాలపై కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. దాదాపు అరగంట పాటు చిరంజీవి నివాసంలో సంజయ్‌ గడిపారు. చిరంజీవిని మర్యాదపూర్వకంగానే కలిశానని బండి సంజయ్‌ తెలిపారు.

నేడు శ్రీశైలానికి డిప్యూటీ సీఎం

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం శ్రీశైలం వెళ్లనున్నారు. శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యు త్‌ కేంద్రంలో టీఎస్‌ జెన్‌ కో అధికారులతో సమీక్ష నిర్వహించేందుకు వెళ్తున్న ఆయన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని భట్టి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

ఒలింపిక్స్‌లో సత్తా చాటాలి

- ఒలింపిక్‌ రన్‌లో మంత్రి జూపల్లి




ఒలింపిక్‌ రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్‌): ప్యారిస్‌లో జరగబోయే ఒలింపిక్‌ పోటీల్లో దేశ, రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. అంతర్జాతీయ ఒలింపిక్‌ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియం వద్ద ఆదివారం ఒలింపిక్‌ రన్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తామని హామీఇచ్చారు. ఒలింపిక్‌ క్రీడల్లో రాష్ట్రం నుంచి పాల్గొనే క్రీడాకారులు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎల్బీ స్టేడియం నుంచి ట్యాంక్‌బండ్‌ వరకు నిర్వహించిన ఒలింపిక్‌ రన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్‌ రన్‌ స్టీరింగ్‌ కమిటీ చైర్మన్‌ ఎమ్మెల్సీ మహేశ్‌గౌడ్‌, ఒలింపిక్‌ సంఘం మాజీ కోశాధికారి మహేశ్వర్‌, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌రాజ్‌, బాక్సింగ్‌ సంఘం అధ్యక్షుడు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

'కల్కి 2898 ఏడీ' టికెట్‌ ధరల పెంపు

అనుమతిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్‌: వైజయంతీ మూవీస్‌ పతాకంపై నిర్మించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బెనిఫిట్‌ షోల టికెట్‌ ధరలు పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈనెల 27న విడుదల కానున్న ఈ చిత్రం స్పెషల్‌ షో టికెట్‌ ధరలు, విడుదల రోజు నుంచి ఎనిమిది రోజుల పాటు ఐదు ప్రత్యేక షోల టికెట్‌ ధరలు పెరగనున్నాయి. ఈమేర కు వెసులుబాటు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్‌ జితేందర్‌ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బెనిఫిట్‌ షో టికెట్‌ ధరలు సింగిల్‌ స్క్రీన్‌ థియేటర్లలో రూ.377, మల్టీప్లెక్స్‌లో రూ.495 చొప్పున ఉంటాయి. రెగ్యులర్‌ షోలకు సంబంధించి సింగిల్‌ స్క్రీన్‌ థియేటర్‌లో రూ.265, మల్టీప్లెక్స్‌లో రూ.413 చొప్పున ఉంటాయని సమాచారం.



ఒకేసారి 4 వేరియంట్ల దాడి

ఈ సీజన్‌లో తెలంగాణకు 'డెంగీ' ముప్పు పొంచి ఉందని ప్రపంచ ఆరోగ్యసంస్థ హెచ్చరించింది. కేసుల తీవ్రత ఈసారి ఎక్కువగా ఉంటుందని తెలిపింది. దేశంలో డెంగీ ఎక్కువగా ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ఉన్నట్టు పేర్కొంది. ఈ మేరకు డెంగీ తీవ్రతపై ప్రపంచ ఆరోగ్యసంస్థ ఒక నివేదిక విడుదల చేసింది. డెంగీలోని నాలుగు ప్రధాన వేరియంట్లు తెలంగాణలోనే కనిపిస్తున్నాయని వెల్లడించింది. డీఈఎన్‌వీ1, డీఈఎన్‌వీ2, డీఈఎన్‌వీ3, డీఈఎన్‌వీ4 ప్రభావం ఎక్కువగా ఉంటున్నట్టు డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంది. కొన్నిసార్లు రెండుమూడు వేరియంట్లు కూడా ఒకేసారి దాడి చేసే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించింది. ఫలితంగా డెంగీ బాధితులు తీవ్రమైన ఇబ్బందులు పడతారని తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఆస్పత్రుల్లో అవసరమైన కిట్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించింది. ఈ ఏడాది ఇప్పటివరకు 500కు పైగా డెంగీ కేసులు వెలుగు చూడడం గమనార్హం.

– సాక్షి, హైదరాబాద్‌

తెలంగాణకు 'డెంగీ' ముప్పు

- ప్రపంచ ఆరోగ్యసంస్థ హెచ్చరిక
- పట్టణీకరణ, వాతావరణ మార్పులతో దోమల విజృంభణ
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచన



వైద్య పరీక్షలే కీలకం

- డెంగీ నిర్ధారణలో వైద్య పరీక్షలే కీలకం. కేవలం ప్లేట్‌లెట్‌ కౌంట్‌, డెంగీ స్ట్రిప్‌ టెస్ట్‌, సీరమ్‌ టెస్ట్‌ వంటి వాటితో దీనిని నిర్ధారించడం శాస్త్రీయం కాదని వైద్య,ఆరోగ్యశాఖ చెబుతోంది.
- విధిగా అందుబాటులో ఉండే ఐజీఎం పరీక్ష చేయించాలి.
- ప్లేట్‌లెట్లు 20 వేలలోపు పడిపోతే అది ప్రమాదకరంగా భావిస్తారు. 15 వేల కన్నా తగ్గితే డెంగీ షాక్‌, డెంగీ మరణాలు సంభవిస్తాయి.
- డెంగీ జ్వరం వస్తే తీవ్రతను తగ్గించేందుకు చల్ల నినీటిలో స్పాంజీని ముంచి శరీరాన్ని తుడ వాలి.
- ఎలక్ట్రాల్‌ పౌడర్‌, పండ్ల రసాలు రోగికి ఇవ్వాలి. దీనివల్ల జ్వర తీవ్రత తగ్గి ప్లేట్‌లెట్లు అదుపులోకి వస్తాయి. ఇంకా తగ్గకుంటే వైద్యుని వద్దకు తీసుకెళ్లాలని వైద్య,ఆరోగ్యశాఖ సూచించింది.
- వైరల్‌ ఫీవర్‌ నుంచి దూరంగా ఉండాలంటే ఫ్రైడే ను డ్రై డేగా పాటించాలి.
- దోమలు కుట్టకుండా జాగ్రత్త తీసుకోవాలి. రాత్రి మాత్రమే కాకుండా పగటిపూట కూడా దోమల మందులు వాడాలి.
- స్కూల్‌ పిల్లలకు దోమలు కుట్టకుండా పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలి.
- కాచి వడగాచిన నీటిని తాగాలి. వైరల్‌ ఫీవర్‌ వస్తే విపరీతంగా మంచినీరు తాగాలి. పండ్ల రసాలు తీసుకోవాలి. దీనివల్ల ప్లేట్‌లెట్లు పడిపోకుండా ఉంటుంది.

డెంగీ లక్షణాలు

- డెంగీతో ఉన్నట్టుండి తీవ్రజ్వరం, భరించలేని తలనొప్పి వస్తుంది.
- కళ్ల తెరవడం కూడా కష్టంగా ఉంటుంది. కదిపితే నొప్పి వస్తుంది.
- చర్మంపై దద్దుర్లు అయినట్టు కనిపించడం, కండరాలు, కీళ్ల నొప్పులు ఉంటాయి.
- అధిక దాహం, రక్తపోటు పడిపోవడం ఉంటుంది.

ముందుగా గుర్తిస్తే ప్రమాదమేమీ ఉండదు



ఇక డెంగీని ముందుగా గుర్తిస్తే 80 శాతం వరకు ఎటువంటి ప్రమాదం లేకుండా వైద్యుల చికిత్స పొందవచ్చని డాక్టర్లు అంటున్నారు. కానీ కొందరికి తీవ్రమైన రక్తస్రావం అవుతుంది. ముక్కు నుంచి కానీ, మలం ద్వారాగానీ, బ్రష్‌ చేసేటప్పుడు పళ్ల మధ్య నుంచి రక్తస్రావం అవుతుంది. ఇలా అధికంగా రక్తస్రావం అయితేనే ప్రమాదకరమని చెబుతున్నారు. మహిళలకు పీరియడ్స్‌ సమయంలో సాధారణ రక్తస్రావం కంటే అధికంగా అయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. దాన్ని వారు గుర్తించాలని సూచిస్తున్నారు.

ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో డెంగీ దోపిడీ...

ఏటా డెంగీ జ్వరాలతో బాధపడేవారిని ప్రైవేట్‌ ఆస్పత్రులు దోపిడీ చేస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. డెంగీ విషయంలో సాధారణంగా ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకపోతే 20 వేల వరకు ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గినా నష్టంలేదని, అనారోగ్య సమస్యలు ఉన్నప్పుడు 50 వేల వరకు ప్లేట్‌లెట్లు తగ్గినా ఇబ్బంది లేదని వైద్య నిపుణులు అంటున్నారు. చాలా కేసుల్లో సాధారణ జ్వరానికి చేసే వైద్యమే సరిపోతుందని అంటున్నారు. కానీ అనేక ప్రైవేటు ఆస్పత్రులు 50 వేలకు పైగా ప్లేట్‌లెట్లు ఉన్నా ఐసీయూలో ఉంచి అదనంగా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. నాలుగైదు రోజులు ఉంచుకొని రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు కూడా ఫీజులు వసూలు చేసిన సంఘటనలు ఉన్నాయి. సాధారణ విష జ్వరాలకు కూడా నాలుగైదు రోజులు ఆస్పత్రుల్లో ఉంచుకొని రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. డెంగీ ఉన్నా లేకపోయినా కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నస్టిక్‌ సెంటర్లు తప్పుడు రిపోర్టులు ఇస్తున్నాయని, ప్లేట్‌లెట్లు ఎక్కువున్నా తక్కువ చూపిస్తున్నాయన్న ఫిర్యాదులు సర్కారుకు చేరాయి.



చనిపోయాడనుకున్న వ్యక్తి.. బతికొచ్చాడు!

- రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి
- సెల్‌ఫోన్‌ ఆధారంగా కుటుంబీకులకు రైల్వే పోలీసుల సమాచారం
- పుట్టుమచ్చలు నిర్ధారించుకుని అంత్యక్రియలకు ఏర్పాట్లు
- అంతలోనే ఆటోలో దిగిన చనిపోయాడనుకున్న వ్యక్తి
- ఆనందంలో కుటుంబీకులు, బంధువులు

బషీరాబాద్‌: చనిపోయాడని ఓ వ్యక్తి అంత్యక్రియలకు బంధువులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. మృతదేహాన్ని పొలంలో ఖననం చేసేందుకు సిద్ధమయ్యారు. చివరకు పాడె ఎత్తే సమయానికి చనిపోయాడనుకున్న వ్యక్తి ఇంటి దగ్గర ఆటోలో దిగాడు. దీంతో అక్కడున్నవారంతా ఆశ్చర్యపోయారు. ఈ విచిత్ర ఘటన వికారాబాద్‌ జిల్లా బషీరాబాద్‌ మండలం నావంద్గీ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది.

సెల్‌ఫోన్‌ చోరీ చేసిన వ్యక్తి మరణించడంతో...

గ్రామానికి చెందిన పిట్టల ఎల్లప్ప (40) బషీరాబాద్‌లో ఓ నాయకుడి దగ్గర పశువుల



కాపరిగా పనిచేస్తుండేవాడు. మూడు రోజులుగా పనికి వెళ్లలేదు. ఇంట్లోనూ చెప్పకుండా తాండూరు వెళ్లాడు. అక్కడ అడ్డకూలీ పనికి వెళ్లి రాత్రికి తాండూరు రైల్వే స్టేషన్‌లో పడుకునేవాడు. శుక్రవారం అతడి సెల్‌ఫోన్‌ను రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి దొంగిలించాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి వికారాబాద్‌ రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. మృతుడి దగ్గర లభించిన సెల్‌ఫోన్‌ ఆధారంగా రైల్వే పోలీసులు ఎల్లప్ప కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో భార్య ఎములమ్మ, బంధువులు, గ్రామస్తులు ఆదివారం ఉదయం వికారాబాద్‌ ఆస్పత్రికి చేరుకున్నారు. తలలేని శరీరంపై పుట్టుమచ్చలు గుర్తుపట్టి తమకు సంబంధించిన వ్యక్తి అని చెప్పడంతో శవాన్ని అప్పగించారు. అంబులెన్సులో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. కుటుంబీకులు, బంధువుల రోదనలతో ఇంట్లో విషాదం నెలకొంది. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగానే ఎల్లప్ప తాపీగా ఆటోలో వచ్చి ఇంటి వద్ద దిగాడు. దీంతో ఎల్లప్ప సెల్‌ఫోన్‌ చోరీ చేసిన వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు గుర్తించి మృతదేహాన్ని తిరిగి రైల్వే పోలీసులకు అప్పగించారు.


ఏఐతో పార్కింగ్‌ సమస్యకు పరిష్కారం

- స్థలాల కొరతతో మల్టీలెవెల్‌ పార్కింగ్‌కు ప్రాధాన్యం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్‌: హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని నగరాల్లో ఐటీ, కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించి వాహనాల పార్కింగ్‌ సమస్యను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఐటీ విభాగం ఇంజనీర్లను ఆదేశించారు. ఆదివారం సచివాలయంలోని తన చాంబర్‌లో 'ఈజీ పార్క్‌ ఏఐ'అనే సంస్థ ప్రదర్శించిన డిజిటల్‌ ప్రెజెంటేషన్‌ను మంత్రి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు పార్కింగ్‌ సమస్య పరిష్కారానికి ఐటీని వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ నిర్వహణ, వాహనాల పార్కింగ్‌ ఇబ్బందులకు తక్షణ పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని అన్నారు. దీనికి ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ అనేక పరిష్కారాలు సూచిస్తుందని తెలిపారు. స్థలాలకు కొరత ఉన్నందున మల్టీలెవెల్‌ పార్కింగ్‌ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రోజురోజుకీ వ్యక్తిగత వాహనాల సంఖ్య పెరుగుతోందని, ఒక్క హైదరాబాద్‌లోనే 14 లక్షల కార్లు, 70 వేల క్యాబ్‌లు, లక్ష ఆటోలు ఉన్నాయని చెప్పారు. వీటికి అవసరమైన పార్కింగ్‌ ఏర్పాట్లు చేయడానికి రోడ్ల పక్కన, షాపింగ్‌ ఏరియాల్లో స్థలాల సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. కత్రిమ మేధను వినియోగించి వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. పార్కింగ్‌ స్లాట్‌ను ముందే బుక్‌ చేసుకునే విధంగా 'యాప్‌'లు రూపొందించాలని సూచించారు. పార్కింగ్‌ ఏర్పాట్ల కోసం ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలు ఏఐని విస్తృతంగా వినియోగిస్తున్నాయని, వాటిని అధ్యయనం చేసి స్థానిక అవసరాలకు తగినట్టు వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

టుడేస్‌ గ్రాఫిక్‌



కొట్టుకుపోయిన 'అందవెల్లి' తాత్కాలిక రోడ్డు

50 గ్రామాలకు నిలిచిన రాకపోకలు



పెద్దవాగులో కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

కాగజ్‌నగర్‌రూరల్‌/ దహెగాం: కాగజ్‌నగర్‌ మండలం అందవెల్లి వద్ద పెద్దవాగులో ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు వరదకు తెగిపోయింది. శనివారం కురిసిన వర్షానికి పెద్దవాగులో వరద ఉధృతి పెరగడంతో రాత్రి పైపులు కొట్టుకుపోయాయి. దీంతో కాగజ్‌నగర్‌, దహెగాం మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దహెగాం, భీమిని మండలాల్లోని 50కి పైగా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దవాగులో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో దహెగాం మండలం వైపు ప్రయాణికులు అప్రోచ్‌ వింగ్‌ వాల్‌ వద్ద నిచ్చెన సాయంతో వంతెన ఎక్కి రాకపోకలు సాగించారు.



నిచ్చెన సాయంతో వంతెన ఎక్కుతున్న ప్రజలు

వంతెనను పరిశీలించిన ఎమ్మెల్యే హరీశ్‌బాబు

వరదలకు కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డును ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఆదివారం పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లు చెల్లించకపోవడంతోనే పనుల్లో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. సోమవారం ఉదయం 9 గంటల్లోగా అప్రోచ్‌ రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోతే వంతెన వద్ద నిరవధిక నిరాహార దీక్షకు దిగుతానని స్పష్టం చేశారు. వంతెన గురించి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి పలుమార్లు తీసుకెళ్లామని, అయినా సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.